

'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 సంచిక: 22

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

SUNDAY Special

ఆదివారం 14-4-2024

మురారీ లాల్ కన్నుమూత



ప్రముఖ సామాజిక కార్యకర్త, సర్వోదయ, చిప్కో ఉద్యమాల నేత మురారీ లాల్ (91) కన్నుమూశారు.

- వివరాలు 6లో

నేడే బీజేపీ మేనిఫెస్టో విడుదల



లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పార్టీ మేనిఫెస్టోను బీజేపీ అగ్ర నాయకత్వం ఆదివారం విడుదల చేయనుంది.

- వివరాలు 6లో

శనివారం చేవెళ్ల బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద బహిరంగసభకు హాజరైన ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న కేసీఆర్. చిత్రంలో చేవెళ్ల అభ్యర్థి కాసాని





- ప్రజలపక్షాన ఆయుధమై కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడుతాం..
- కాంగ్రెస్‌ది అసమర్థ పాలన.. మళ్లీ కరెంటు కోతలు మొదలయ్యాయి
- ఆడబిడ్డలకు స్కూటీలు లేవు కానీ రాష్ట్రంలో లూటీలు మొదలయ్యాయి
- దళితబంధు పథకాన్ని పక్కన పెట్టారంటూ కాంగ్రెస్‌కు చురకలు
- కేంద్రంలోని పదేళ్ల బీజేపీ పాలనలో తెలంగాణకు ఒరిగిందేమీ లేదు
- ధాన్యం కొనాలంటే నూకలు తినుమన్నరు.. బీజేపీకే నూకలు తినిపిద్దాం
- చేవెళ్ల బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో మాజీ సీఎం కేసీఆర్

అంకుశమై నిలుస్తాం!

సాక్షి, రంగారెడ్డి జిల్లా: రాష్ట్ర ప్రజల పక్షాన ఆయుధమై కాంగ్రెస్ ప్రభుత్వంతో పోరాడుతామని.. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసే దాకా ప్రజలకు అండగా నిలుస్తామని బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు చెప్పారు. ప్రభుత్వం మెడలు వంచాలన్నా.. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, కార్మికులు, బడుగు, బలహీన వర్గాలకు మేలు జరగాలన్నా.. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చా రు. అప్పుడే ప్రభుత్వం దిగొస్తుందని.. హామీలను నెరవేరుస్తుందని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం చేవెళ్లలో నిర్వహించిన తొలి ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''అంబేడ్కర్, జ్యోతిబా పూలే స్ఫూర్తితో పదిహేనేళ్లపాటు పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఆ మహనుభావులకు బీఆర్‌ఎస్ సముచిత స్థానం కల్పించింది. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతోపాటు దేశంలో ఎక్కడా లేనివిధంగా సచివాలయానికి ఆయన పేరు పెట్టాం.

సచివాలయం ముందు ధర్నాకు దిగుతా..

ఎన్నికలు వస్తుంటాయి.. పోతుంటాయి. ప్రజానీకానికి ప్రభుత్వంపై నమ్మకం, విశ్వాసం, గౌరవం ఉండాలి. కానీ

మిగతా 2వ పేజీలో ▶

బలమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తాం

➤ తెలంగాణలో బీఆర్‌ఎస్ బలమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తోంది. అన్ని స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించి అంకుశం లాంటి ఆయుధాన్ని బీఆర్‌ఎస్ చేతికి ఇవ్వాలి. అప్పుడే ప్రభుత్వ మెడలు వంచగలుగుతాం. బీఆర్‌ఎస్ గెలవాలి.. అంకుశంలా పనిచేయాలి. లేదంటే మోసం చేసిన వాళ్ల చేతిలోనే మళ్లీ మోసపోతాం. బీఆర్‌ఎస్ పుట్టిందే అణగారిన వర్గాల కోసం. అనేక మందిని కాపాడుకున్నాం. కేసీఆర్ బతికున్నంత కాలం పోరాటం చేస్తూనే ఉంటడు.

అడుగడుగునా నీరాజనాలతో సాగుతున్న అపూర్వ యాత్రను చూసి ఓర్వలేక

ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై

హత్యాయత్నం!

సాయంత్రం 5 నుంచి విజయవాడలో సాగిన అపూర్వ యాత్ర

వారధి దాటిన దగ్గర్నుంచీ అడుగడుగునా జనం నీరాజనాలు

రాత్రి 8:10 సమయంలో సింగ్ నగర్లో జగన్ టార్గెట్‌గా దుశ్చర్య..



ఆగంతకుడి హత్యాయత్నంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కనుబొమ్మపై అయిన తీవ్ర గాయం

- పథకం ప్రకారం ఒక స్కూల్ రెండో అంతస్తులో దాక్కున్న ఆగంతకుడు
- అక్కడి నుంచి జగన్ కణతకు గురిచూసి పదునైన వస్తువుతో దాడి
- ప్రజలకు అభివాదం చేస్తూ జగన్ పక్కకు తిరగటంతో.. తప్పిన గురి
- కనుబొమ్మపై తీవ్ర గాయం; పక్కకు తూలి... కంటిని అదిమి పట్టుకున్న జగన్
- జనానికి అభివాదం చేస్తూనే బస్సులోకి.. ఆ వెంటనే ప్రథమ చికిత్స
- అనంతరం గాయంతోనే యాత్రను కొనసాగించిన ముఖ్యమంత్రి
- జగన్ కనుబొమ్మ పైన తగిలాక.. పక్కనున్న వెలంపల్లికీ గాయం
- ఆ వస్తువు పదును, వేగాన్ని బట్టి... పలు రకాలుగా నిపుణుల వ్యాఖ్యలు
- రాయి, గ్రానైట్ పలక, పెల్లెట్, ఎయిర్ బుల్లెట్... ఏదైనా కావచ్చని వ్యాఖ్యలు
- ఆ వేగాన్ని బట్టి చూస్తే.. అది కచ్చితంగా హత్యాయత్నమేనన్న వెలంపల్లి
- ఈ దురాగతానికి పాల్పడింది చంద్రబాబు నాయుడేనంటూ విమర్శలు
- 'టప్'మనే శబ్దాన్ని తాను స్పష్టంగా విన్నానన్న ఎంపీ కేశినేని నాని
- షెడ్యూల్ ప్రకారం రాత్రి 10:38 వరకూ సాగి... ముగిసిన యాత్ర
- అనంతరం నేరుగా ప్రభుత్వాసుపత్రికి వెళ్లిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- లోకల్ అనస్తీషియా ఇచ్చి... కుట్లు వేసి పంపించిన వైద్యులు
- విశ్రాంతి తీసుకోవాలని జగన్‌కు సూచన.. నేడు యాత్రకు విరామం
- దాడిని.. బాబు వైఖరిని మూకుమ్మడిగా ఖండించిన వైఎస్సార్‌సీపీ నేతలు
- ప్లాన్ చేసి చేయాల్సిన అవసరం రాజకీయ ప్రత్యర్థులదేనని వ్యాఖ్యలు..
- జగన్ త్వరగా కోలుకోవాలంటూ ప్రధాని నరేంద్రమోదీ ఆకాంక్ష

'సిద్ధం' అంటూ నగారా మోగించి.. జన క్షేత్రంలో అడుగడుగునా నీరాజనాలు అందుకుంటూ బస్సు యాత్రను కొనసాగిస్తున్న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి రాజకీయ ప్రత్యర్థులు తట్టుకోలేక పోయారు. విజయవాడ నగరంలో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి కనీవినీ ఎరుగని జన స్పందనతో అడుగడుగునా నీరాజనాలు అందుకుంటూ సాగిన యాత్రలో... సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని లక్ష్యించి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఏ దారిలో వెళతారు? ఎక్కడెక్కడ ఆగుతారు? యాత్ర వెళ్లేటప్పుడు కరెంటు వైర్లు తగలకుండా కరెంటు తీసేస్తారు కనక చీకటిగా ఉన్నప్పుడు ఎక్కడైతే బాగుంటుంది? అనే అంశాలన్నిటినీ అధ్యయనం చేసి... విజయవాడ సింగ్ నగర్లో ఓ పాఠశాల కేంద్రంగా పక్కా ప్లాన్‌తో ఆయన్ను అంతమొందించడానికి ప్రయత్నం చేశారు. స్కూల్లో నక్కి ఉండి.. ఆయన బస్సుపై నుంచి అభివాదం చేస్తున్నపుడు... కరెంటు లేని

మిగతా 3వ పేజీలో ▶



బొగ్గు కార్మికులకు కనీస పెన్షన్ ఇకపై రూ. వెయ్యి

- కేంద్ర బొగ్గు శాఖ నోటిఫికేషన్
- ఇప్పటి వరకు రూ. 250/350 మాత్రమే
- పెంచింది వెయ్యేనా.. అంటూ రిటైర్డ్ కార్మికుల అసంతృప్తి
- పెరిగిన ధరలకు అనుగుణంగా పెన్షన్ పెంచాలని కేంద్రానికి వినతి

- వివరాలు 15లో

'క్విక్' డెలివరీతో పోటీ

కిరాణా హైరానా..!

వేగం పుంజుకోకుంటే పచారీకొట్లకు గడ్డుకాలమే

సాక్షి, హైదరాబాద్: బస్తీలు, కాలనీలు, సందుల్లో ఉండే కిరాణా దుకాణాలు తెరుచుకోకముందే పొద్దుపొద్దునే అవసరమయ్యే టూత్ పేస్ట్‌లు, సబ్బులు, ఇతర చిన్నాచితకా సరుకులు మొదలు నిత్యావసరాలు సైతం నిమిషాల్లోనే ఇళ్లకు చేరిపోతున్నాయి. టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో ఈ-కామర్స్, క్విక్ (క్యూ)-కామర్స్ ద్వారా 'ఆన్-డిమాండ్ డెలివరీ''ఇ-కిరాణా' వంటి వాటితో నిమిషాల వ్యవధిలోనే వేగంగా సరుకులు వచ్చి పడుతున్నాయి. చిల్లర సామాన్లు మొదలు అన్నీ ఈ-కామర్స్ వ్యాప్తితో జెప్టో, బీబీ(బిగ్ బాస్కెట్),

మిగతా 16వ పేజీలో ▶

కచ్చితమైన డిమాండ్ అంచనా

క్యూ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు వినియోగదారు ప్రవర్తనను అంచనా వేయడానికి మెషీన్ లెర్నింగ్ అల్గారిథమ్‌లను ఉపయోగిస్తాయి. క్యూ-కామర్స్ డిమాండ్ రాబోయే రోజుల్లో మరింత వేగంగా పుంజుకుంటుందని మెకన్సీ 2020 నివేదిక వెల్లడించింది. దీని ప్రకారం మొత్తం వినియోగదారుల రిటైల్ వ్యయంలో 10% వాటాను ఇది సాధించే అవకాశాలున్నాయని, ఈ మార్కెట్ 2025 నాటికి 5 బిలియన్ల విలువకు చేరుకుంటుందని అంచనా. ఆన్-డిమాండ్ ఎకానమీ పెరుగుదలతో సంప్రదాయ సరఫరా గొలుసు విధానాన్ని అనుసరించే బదులు, క్విక్ కామర్స్ కంపెనీలు సాంకేతికతను ఉపయోగించుకుంటున్నాయి. క్విక్ కామర్స్ ఇప్పటికే ఉన్న పరిశ్రమలను విజయవంతంగా ఏకీకృతం చేశాయి. జనసాంద్రత అధికంగా ఉన్న నగరాల్లో వ్యూహాత్మక హైపర్-లోకల్ మైక్రో-ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌ల నెట్‌వర్క్‌ను పెంచడం ద్వారా క్విక్ కామర్స్ సంప్రదాయ కిరాణా వ్యాపారాన్ని అధిగమిస్తోంది.



ఇక 'హస్తం' ప్రచారం షురూ!

రేపు నారాయణపేట సభతో సీఎం రేవంత్ ప్రచారం మొదలు

ప్రతి పార్లమెంటు పరిధిలో 3 చోట్ల ప్రచారానికి వెళ్లే అవకాశం

నేడు హైదరాబాద్‌కు కేసీ.. లోక్‌సభ ఎన్నికల ప్రచార సరళిపై సమీక్ష



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ వడివడిగా సిద్ధమవుతోంది. ప్రధాన పార్టీలతో పోలిస్తే అభ్యర్థుల ఎంపికలో కొంత వెనుకబడినట్టు కనిపించినా ప్రచారంలో మాత్రం ముందంజలో ఉండేందుకు ప్రయత్నిస్తోంది. అందులో భాగంగానే రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సన్నాహక భేటీలు నిర్వహిస్తోంది. లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకున్న రాష్ట్ర మంత్రులు, ఇతర ముఖ్య నేతల నేతృత్వంలో అసెంబ్లీ స్థాయి సమావేశాలు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నాయి. ఈ సమావేశాలను ఈనెల 20లోపు ముగించాలని టీపీసీసీ నిర్ణయించింది. ఈ సమావేశాల అనంతరం రాష్ట్ర, జాతీయ స్థాయి నేతల రాకతో ప్రచారాన్ని మరింత ఉధృతం చేయనుంది. సీఎం రేవంత్ రెడ్డి కూడా లోక్‌సభ ఎన్నికల కోసం తన ప్రచార షెడ్యూల్‌ను రూపొందించుకుంటున్నారు. ప్రతి పార్లమెంటు

మిగతా 2వ పేజీలో ▶

కమలం కార్యాచరణ జోరు

- 10 నుంచి 12 సీట్లు గెలవాలనే లక్ష్యంతో ముందుకెళ్లాలని నిర్ణయం
- అత్యధిక ఎంపీ సీట్లు గెలిచి రాష్ట్రంలో నంబర్ వన్‌గా నిలవాలనే వ్యూహం
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి ఇది బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు దోహదపడుతుందనే ధీమా
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లను సమానంగా టార్గెట్ చేసి రాజకీయంగా లబ్ధి పొందేలా కసరత్తు

2లో

దోచుకున్న పార్టీ బీఆర్‌ఎస్



- వెన్నుపోటు పార్టీ కాంగ్రెస్
- ప్రజల పరిస్థితి పెనం మీంచి పొయ్యిలో పడ్డట్టుగా ఉంది
- ఎన్నికల ప్రచారంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

10లో

వారిద్దరిదీ అసూయ, ద్వేషం

షర్మిల, సునీతపై వైఎస్సార్ సోదరి విమలమ్మ



- వైఎస్సార్ శత్రువుల చేతుల్లో వాళ్లు కీలుబొమ్మలు అయ్యారు
- వైఎస్ కుటుంబ పరువును రోడ్డుకీడుస్తున్నారు
- వైఎస్ ఇంటి ఆడపడుచుల తీరు అన్యాయంగా ఉంది
- వారిద్దరూ నోరుమూసుకోవాలి.. ఇంటి ఆడపడుచుగా చెబుతున్నా
- వివేకానందరెడ్డి హత్యతో అవినాశ్, భాస్కర్‌రెడ్డిలకు సంబంధంలేదు
- మీడియాతో వైఎస్సార్ సోదరి విమలమ్మ

- 5లో

మీ అందరినీ చంపేస్తాం

చర్లపల్లి జైలులో ఖైదీల హల్‌చల్



➤ చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఖైదీలు హల్‌చల్ చేశారు. ఓ బ్యారక్‌లో ఉండే ఖైదీలు వారికి వారే గాయపరుచుకొని తమను ఆసుపత్రికి తరలించాలని డిమాండ్ చేస్తూ జైలు సిబ్బందిపై బెదిరింపులకు పాల్పడ్డారు. శుక్రవారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది.

- వివరాలు 16లో

లీకు.. ఫేకు వార్తలు రాయిస్తున్నారు



- హామీలు అమలు చేయలేక బీఆర్‌ఎస్‌పై గోబెల్స్ ప్రచారం
- ఈ ఎన్నికల్లో బీజేపీకి కాంగ్రెస్ సహకరిస్తోంది
- హరీశ్‌రావు ఆరోపణ

10లో

ఇదండీ సంగతి



మాటిమాటికి సారును ఎందుకు భయపెడుతున్నారు!



రైతన్నకు అకాల నష్టం

కామారెడ్డి జిల్లా బీర్కూర్‌లో ధాన్యం రాశుల్లో నిల్వ ఉన్న వర్షపు నీటిని మోటారు సాయంతో తొలగిస్తున్న రైతులు

- 5లో

వ్యవసాయ మార్కెట్లలో రైతుల పడిగాపులు..

- సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో పోటెత్తిన ధాన్యం
- కొనుగోళ్ల జాప్యంతో అన్నదాతలకు ఇబ్బందులు

5లో

కొనుగోళ్లలో అక్రమాలకు తావులేదు

పౌర సరఫరాల శాఖ కమిషనర్

శనివారం తెల్లవారుజామున రోడ్డుపై బారులుదీరిన ధాన్యం ట్రాక్టర్లు



క్లుప్తంగా...

సీతారాముల కల్యాణానికి రండి

కేసీఆర్‌కు చింతమడక గ్రామస్తుల ఆహ్వానం



కేసీఆర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న చింతమడక గ్రామస్తులు

సిద్దిపేట రూరల్ (సిద్దిపేట జిల్లా): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్వగ్రామమైన చింతమడకలో ఈనెల 17న నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవ కార్యక్రమానికి రావాలంటూ గ్రామస్తులు ఆహ్వాన పత్రికను అందజేశారు. శనివారం గ్రామానికి చెందిన కుల సంఘాల పెద్దలు, నాయకులు నగరంలోని కేసీఆర్‌ను కలిశారు. చింతమడకలో నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవానికి కుటుంబ సభ్యులతో హాజరుకావాలని కోరారు. కేసీఆర్‌ను కలిసినవారిలో కల్వకుంట్ల వంశీధర్‌రావు, మాజీ సర్పంచ్ హంసకేతన్‌రెడ్డి, పలువురు నాయకులు ఉన్నారు.

లై డిటెక్టర్ టెస్టుకు కేటీఆర్ సిద్ధమా?

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిజంగానే లై డిటెక్టర్ టెస్టుకు సిద్ధంగా ఉంటే ఏర్పాట్లు చేస్తామని, సమయం, స్థలం చెబితే చాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆయన శనివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ డ్రగ్స్ విషయంలో రేవంత్ సవాల్ విసిరి గన్‌పార్కుకు వస్తే.. కేటీఆర్ పత్తా లేకుండా పారిపోయారని ఎద్దేవా చేశారు. ఫోన్ ట్యాపింగ్‌లో నిజాలు బయటపడుతుంటే మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని, కేటీఆర్‌కు పిచ్చి తారస్థాయికి చేరిందని ధ్వజమెత్తారు. తన ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారని రేవంత్‌రెడ్డికి ఎన్నికలకు ఎనిమిది నెలల ముందే చెప్పానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీలోకి వెళ్తారని కేటీఆర్ ఇంకోసారి మాట్లాడితే బాగుండదని హెచ్చరించారు. బీజేపీతో పొత్తు కోసం బీఆర్‌ఎస్ వెంపర్లాడింది నిజం కాదా? అని శ్రీనివాస్ ప్రశ్నించారు.

చెరువులో మునిగి ముగ్గురు విద్యార్థుల మృతి



నరేశ్, తిరుపతి, మహేశ్ (ఫైల్)

మాక్లూర్: చెరువులో ఈతకు వెళ్లిన ముగ్గురు విద్యార్థులు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం ఒడ్డేట్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మహేశ్ (20), తిరుపతి(19), నరేశ్ (20), సాయితేజ, వినోద్‌లు శనివారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని చెరువులో ఈత కొట్టేందుకు వెళ్లారు. అయితే చెరువులో మొరం కోసం తవ్విన లోతైన గుంతలు ఉన్నాయి. ఈ విషయం తెలియని మహేశ్, తిరుపతి, నరేశ్ చెరువులోకి దిగిన వెంటనే గుంతల్లోకి జారి మునిగి పోయారు. ఒడ్డునే ఉన్న సాయితేజ, వినోద్ వెంటనే తేరుకుని గ్రామంలోనికి వెళ్లి సమాచారం ఇచ్చారు. పెద్దఎత్తున గ్రామస్తులు, పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. అయితే అప్పటికే ముగ్గురూ మృతిచెందడంతో గజ ఈతగాళ్లతో ముగ్గురి మృత దేహాలను బయటకు తీయించారు. మృతుల తల్లిదండ్రులకు వారు ఒక్కొక్కరే సంతానం కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుల్లో తిరుపతి 10వ తరగతి, నరేశ్, మహేశ్‌లు ఇంటర్మీడియట్ చదువుతున్నారు. మాక్లూర్ ఎస్సై సుధీర్‌రావు పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఘటన స్థలాన్ని ట్రెయినీ ఐపీఎస్ అధికారి చైతన్యరెడ్డి, నార్త్‌జోన్ సీఐ సతీశ్ పరిశీలించారు.



చేవెళ్ల సభలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో అరికెపూడి గాంధీ, సురభి వాణీదేవి, సబిత, కాలె యాదయ్య, కాసాని, ప్రకాశ్‌గౌడ్, పొన్నాల తదితరులు

అంకుశమై నిలుస్తాం!

▶ మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు సాధ్యంకాని హామీలిచ్చింది. ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు కావస్తోంది. కానీ గత ప్రభుత్వం సృష్టించిన వనరులను వాడుకునే నైపుణ్యం వారికి లేకుండా పోయింది. మళ్లీ కరెంటు కోతలు మొదలయ్యాయి. మంచినీరు దొరకడం లేదు. సాగునీరు అందడం లేదు. రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, విదేశాల్లో చదువుకునే విద్యార్థులకు ఉపకార వేతనాలు నిలిచిపోయాయి. దళితవాడలు ధనిక వాడలు కావాలనే సదుద్దేశంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. కాంగ్రెస్ రూ.12 లక్షల చొప్పున ఇస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చింది. అది ఇవ్వకపోగా.. 1.36 లక్షల మందికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసింది. కలెక్టర్ల అకౌంట్లలో జమ చేసిన నగదును వాపస్ తీసుకుంది. అర్హులైన దళితులందరికీ వెంటనే దళితబంధు ఇవ్వాలి. లేదంటే 1.36 లక్షల మంది లబ్ధిదారులతో కలసి సచివాలయం ముందు ధర్నాకు దిగుతా.

మార్కెట్‌లో తులం బంగారం దొరకడం లేదా?

మౌనంగా ఉంటే సమస్యలు తీరవు. ఎన్నికల ప్రచారం కోసం గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్ నేతలను దళితబంధుపై నిలదీయండి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డల పెళ్లి కోసం ఆర్థిక సాయం చేసే కల్యాణలక్ష్మి పథకాన్ని అమలు చేసింది. కాంగ్రెస్ దానికి అదనంగా తులం బంగారం చొప్పున ఇస్తామని మాయమాటలు చెప్పింది. ఏమైంది? ఆడబిడ్డలకు ఇవ్వడానికి కాంగ్రెస్ సర్కారుకు మార్కెట్లో తులం బంగారం దొరకడంలేదా?

కేసీఆర్ వెళ్లగానే కరెంటు పోతుందా?

తెలంగాణలో 11 ఏళ్ల క్రితం దారుణ పరిస్థితి ఉండేది. మేం ఏడాదిన్నర వ్యవధిలో బాగుచేశాం. రైతులు, పరిశ్రమలు, గృహాలకు 24 గంటల విద్యుత్ సరఫరా చేశాం. కేసీఆర్ వెళ్లగానే కరెంటు ఎందుకు రావట్లేదు? ఇది కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం కాదా? మిషన్ భగీరథ పథకాన్ని ఐక్యరాజ్యసమితి కూడా అభినందించింది. మరి ఎవరి తెలివి తక్కువతనం వల్ల మంచి నీటి కొరత ఏర్పడింది? ప్రభుత్వ వాగ్దానాలు నెరవేరాలంటే బలమైన ప్రతిపక్షం ఉండాలి.

వరికి బోనస్ ఇవ్వకుంటే ఊరుకోబోం..

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు 420 వాగ్దానాలు ఇచ్చింది. వాటిలో ఏ ఒక్కటీ నెరవేర్చలేదు. ఆడబిడ్డలకు స్కూటీలు ఇస్తామని చెప్పింది. స్కూటీలు ఇవ్వకపోగా.. రాష్ట్రంలో లూటీలు మొదలుపెట్టింది. రియల్ ఎస్టేట్‌ను దెబ్బతీసింది. అనుమతులు నిలిపివేసింది. ఆ రంగంపై ఆధారపడి బతుకుతున్నవారిని రోడ్డు పాలు చేసింది. ప్రభుత్వం యాసంగి పంటను పూర్తిగా కొనుగోలు చేయాలి. వరికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాల్సిందే.. లేదంటే ఊరుకోబోం.

దేశాన్ని ముందుకు తీసుకెళ్లే పద్ధతి ఇదేనా?

కేంద్రంలో బీజేపీ పదేళ్లుగా అధికారంలో ఉంది. ప్రజల మధ్య భావోద్వేగాలు రెచ్చగొట్టడం, మత పిచ్చి పెంచడం తప్ప చేసిందేమీ లేదు. పెట్రోల్, డీజిల్ ధరలు అమాంతం పెంచేసింది. మోదీ, ఈడీ.. ఇదేనా దేశాన్ని ముందుకు తీసుకెళ్లే పద్ధతి? గుడ్డిగా ఓటేయొద్దు. బీజేపీ సర్కారు దేశవ్యాప్తంగా 150 మెడికల్ కాలేజీలు మంజూరు చేసింది. తెలంగాణకు మెడికల్ కాలేజీలు మంజూరు చేయాలని కోరుతూ నేను వంద ఉత్తరాలు రాసిన.. కానీ ఒక్క కాలేజీ ఇవ్వలేదు. ఒక్క నవోదయ స్కూల్ కూడా ఇవ్వలేదు. రైతుల మోటర్లకు మీటర్లు పెట్టాలని మోదీ నా మెడపై కత్తిపెట్టాడు. కానీ నేను మీటర్లు పెట్టలేదు. దాంతో ఏటా రూ.5 వేల కోట్లు కోత కోసిండు. తెలంగాణకు రూ.30 వేల కోట్ల నష్టం వచ్చింది.

బీజేపీకి నూకలు తినిపించాలి

వికారాబాద్, చేవెళ్లలో ధాన్యం బాగా పండింది. పండిన ధాన్యాన్ని కొనుమంటే.. యాసంగి ధాన్యం నూకలు అయితయి. తెలంగాణ ప్రజలకు నూకలు అలవాటు చేయండి అని కేంద్ర మంత్రి ఒకరు ఉచిత సలహా ఇచ్చిండు. నూకలు తిందామా? బీజేపీకి నూకలు తినిపిద్దామా? తెలంగాణ ఇచ్చినప్పుడు 7 మండలాలను, సీలేరు ప్రాజెక్టును ఆంధ్రాలో కలిపారు. ఐటీఐఆర్ ప్రాజెక్టును, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీని రద్దు చేశారు. బీజేపీ ప్రభుత్వంలో ఏ వర్గానికీ మేలు జరగలేదు. పదేళ్లలో చేవెళ్లను పారిశ్రామిక కేంద్రంగా, రియల్ ఎస్టేట్ జోన్‌గా అభివృద్ధి చేశాం.

రంజిత్‌రెడ్డి ఏమైనా పొద్దుతిరుగుడు పువ్వా?

ఎంపీ రంజిత్‌రెడ్డికి ఏం ఏం తక్కువ చేశాం? ఎందుకు పార్టీ మారాల్సి వచ్చింది? రంజిత్‌రెడ్డి ఏమైనా పొద్దుతిరుగుడు పువ్వా? అధికారం ఎటుంటే అటు తిరుగుతడా? ఆయన పార్టీ ఎందుకు మారాడు.. అధికారం కోసమా? పైరవీల కోసమా. రంజిత్‌కు పార్లమెంటు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలి. కాంగ్రెస్ నేతలు సవాల్ విసిరినట్టు బీసీ అయిన కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాలి. కాసాని గెలుపు బీసీల అభివృద్ధికి మలుపు..'' అని కేసీఆర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ, కాలె యాదయ్య, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, ఎగ్గె మల్లేశం, దయానంద్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కమల దళం కార్యాచరణ జోరు

10 నుంచి 12 సీట్లు గెలవాలనే లక్ష్యంతో ముందుకెళ్లాలని నిర్ణయం

- అత్యధిక ఎంపీ సీట్లు గెలిచి రాష్ట్రంలో నంబర్ వన్‌గా నిలవాలనే వ్యూహం
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి ఇది బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు దోహదపడుతుందనే ధీమా



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కమలదళం ఎన్నికల ప్రణాళిక అమలు ఊపందుకుంది. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక ఎంపీ స్థానాల్లో విజయం సాధించి సత్తా చాటాలని భావిస్తోంది. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్‌ను వెనక్కు తోసేలా ఎక్కువ సీట్లు గెలుపొందాలనే లక్ష్యసాధనకు అనుగుణంగా రోజురోజుకు వేగాన్ని పెంచుతోంది. రాష్ట్ర రాజకీయాల్లో నంబర్ వన్ స్థానం తనదేనని చాటాలని ఉవ్విళ్లూరుతోంది. వరుసగా రెండు పర్యాయాలు కేంద్రంలో అధికారంలో ఉంటూ, మూడోసారి గెలిచి మోదీ ప్రభుత్వం హ్యాట్రిక్ విజయాన్ని సాధించబోతోందనే సానుకూల ప్రచారంతో ఏర్పడిన వాతావరణాన్ని ఇక్కడా పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం నిర్ణయించింది. ఇందుకనుగుణంగా ఎన్నికల ప్రచారం, ఇతర విషయాల్లో మిగతా పార్టీల కంటే జోరుగా అడుగులు వేస్తోంది. బీజేపీపాలిత రాష్ట్రాలతోపాటు దక్షిణాది రాష్ట్రాల్లోనూ సానుకూల ప్రచారాన్ని విస్తృతస్థాయిలో తీసుకెళ్లి అధిక సీట్లు గెలవాలన్న జాతీయ నాయకత్వం వ్యూహాలను ఇక్కడా పక్కాగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటోంది.

మరింత కష్టపడితే...

రాష్ట్రంలో ప్రస్తుతమున్న పరిస్థితుల్లో 10 సీట్లు గెలిచే అవకాశాలున్నాయన్న అంచనాల్లో ఉన్న బీజేపీ నాయకత్వం ఇంకా కొంచెం కష్టపడితే మరో రెండు స్థానాల్లోనూ విజయం సాధ్యమని గట్టిగా విశ్వసిస్తోంది. మిగతా పార్టీల కంటే ముందుగా అభ్యర్థుల ఖరారు, ముందుగానే తొలివిడత ఎన్నికల ప్రచారాన్ని ముగించడం, పార్టీకి స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్న ప్రధాని మోదీ ఇప్పటికే ఒక విడత ప్రచారాన్ని (ఐదు బహిరంగసభల్లో పాల్గొన్నారు) పూర్తిచేయడం, బూత్‌స్థాయిల్లో పార్టీ అభ్యర్థులకు మద్దతు కూడగట్టడంపై అగ్రనేత అమిత్‌షా దిశానిర్దేశం వంటివి రాష్ట్రంలోని పార్టీ శ్రేణుల్లో గెలుపుపై ధీమా పెంచేందుకు దోహదపడతాయని అంచనా వేస్తున్నారు. అలాగే, 'సారా కే సారే సత్రాయ్ హమారే' (అన్నింటికి అన్ని సీట్లు మావే) అనే నినాదాన్ని విస్తృతంగా జనసామాన్యంలోకి తీసుకెళ్లేలా ప్రచార కార్యక్రమాలను సిద్ధం చేసుకుని ముందుకు సాగుతోంది.

వచ్చే అసెంబ్లీ ఎన్నికలపై దృష్టితో...

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కంటే ఎక్కువ సీట్లు గెలుపొందడం ద్వారా రాష్ట్రంలో తన రాజకీయ ప్రస్థానాన్ని సుస్థిరం చేసుకోవాలని బీజేపీ నిర్ణయించింది. ఈవిధంగా తెలంగాణలో బీజేపీ బలమైన రాజకీయ శక్తిగా ఎదిగిందనే సందేశం ప్రజల్లోకి వెళితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమకు అధికారం తథ్యమనే సంకేతాలు వెళ్తాయనే ధీమా రాష్ట్ర నాయకత్వంలో వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లను సమానంగా టార్గెట్ చేసి రాజకీయంగా లబ్ధి పొందాలని నిర్ణయించినట్టు పార్టీ ముఖ్యనేతల సమాచారం.

పిట్టపడా ఎన్‌కౌంటర్‌కు సీఎందే బాధ్యత

కాంగ్రెస్ ప్రభుత్వ హత్యాకాండను ప్రజలు ఖండించాలి

- ఈ నెల 15న బంద్‌కు పిలుపు
- లేఖ విడుదల చేసిన మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్



మావోయిస్టు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ విడుదల చేసిన లేఖ

సాక్షి, హైదరాబాద్/చర్ల: విప్లవ పోరాటాలపై తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్న హత్యాకాండను ప్రజలంతా ఖండించాలని మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో పిట్టపడా వద్ద గ్రేహౌండ్స్ పోలీసులు చేసిన ఎన్‌కౌంటర్‌కు కాంగ్రెస్ పార్టీతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డినే బాధ్యత వహించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ శనివారం ఓ లేఖను విడుదల చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తెలంగాణలోకి కూలీ పనుల కోసం వస్తున్న ఆదివాసీలను ఎస్‌ఐబీ పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి మావోయిస్టుల సమాచారం చెప్పాలని వేధిస్తున్నారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకే గ్రేహౌండ్స్ బలగాలు ఏప్రిల్ 6న మధ్య రీజనల్ కంపెనీ–2కి చెందిన కమాండర్ అన్నె సంతోష్ శ్రీధర్, సాగర్, అదే కంపెనీకి చెందిన ప్లటూన్ పార్టీ కమిటీ సభ్యుడు ఆస్మా మణిరామ్, సభ్యుడు పూనెం లక్ష్మణ్ అమరులయ్యారని పేర్కొన్నారు. నిరాయుధులైన వారిని శారీరకంగా ఎంతో హింసించి చంపి మృగాల మాదిరిగా ప్రవర్తించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా ఈ నెల 15న బంద్‌కు పిలుపు ఇచ్చినట్లు వెల్లడించారు.

కేటీఆర్ నన్ను బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేస్తా

కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ఇచ్చిన నోటీస్ చట్టవిరుద్ధంగా ఉందని కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్‌లోకి రమ్మని తనను ఇబ్బంది పెట్టారని, ఈమేరకు తానూ ఫిర్యాదు చేస్తానని తెలిపారు. శనివారం గాంధీభవన్‌లో మహేందర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబంలో ఒకరిపై ఒకరికి నమ్మకం లేదని, దీనిపై అనుమానం ఉందని ఫిర్యాదు చేస్తే కేటీఆర్ పరువునష్టం నోటీసు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కు ప్రకారం తాను ఫిర్యాదు చేస్తే పరువునష్టం ఎలా అవుతుంది? అని మహేందర్‌రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలపై అనుమానం ఉందని కేటీఆర్ అంటే తప్పులేదు గానీ.. తాము అంటే మాత్రం తప్పు అయిందా? అని నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్ అయిందని ఫిర్యాదు ఇవ్వగానే కేటీఆర్‌కు పూనకం వచ్చిందని, కేటీఆర్ అభినవ గోబెల్స్ లాగా అయ్యారని ధ్వజమెత్తారు. ఇంకా బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అధికారంలో ఉందని కేటీఆర్ అనుకుంటున్నారని మహేందర్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

ధాన్యం సేకరణ కాదు.. ధన సేకరణ

బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ధాన్యం సేకరణకు బదులుగా ధన సేకరణ జరుగుతోందని బీఆర్‌ఎస్ ఆర్మూరు మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆరోపించారు. గోదాముల్లో నిలువ ఉన్న ధాన్యాన్ని గ్లోబల్ టెండర్ల ద్వారా క్వింటాలుకు రూ.1,600 చొప్పున కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మకాలు సాగించిందన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో రూ.1,450 కోట్ల కుంభకోణం జరిగిందని, ఈ అంశంపై విచారణ జరపాలని కోరుతూ రెండు రోజుల్లో ఈడీ, సీబీఐకి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. శనివారం తెలంగాణ భవన్‌లో జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, వరి కొనుగోలులోనూ కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న కమిషన్ డబ్బులు ఎవరి చేతుల్లోకి వెళుతున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ధాన్యం సేకరణలో జరుగుతున్న అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని విచారణ జరపాలన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ధాన్యం ఎగుమతి జరిగితే కాంగ్రెస్ పాలనలో కరెన్సీ ఎగుమతి అవుతోందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ చేతులు కలిపినందునే కాంగ్రెస్ సర్కార్ అవినీతిపై బీజేపీ నేతలు మౌనం పాటిస్తున్నారన్నారు. రాష్ట్రంలో డబుల్‌ఆర్ (రేవంత్ - రాహుల్) ట్యాక్స్ అమలవుతోందని, కాంగ్రెస్ పార్టీ అవినీతికి చిరునామాగా మారిందని విమర్శించారు.

రేవంత్ రిమోట్ చంద్రబాబు వద్ద

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నియంత్రించే రిమోట్ భీమవరంలోని ఆయన అల్లుడి వద్ద, అలాగే చంద్రబాబు వద్ద ఉందని జీవన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కడియం శ్రీహరి, రేవంత్‌రెడ్డి విశ్వాస ఘాతకులుగా మారారని, పార్టీ మారిన ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద చావు డప్పు కొడతామని అన్నారు. రాష్ట్రంలో అప్రజాస్వామిక ప్రభుత్వం నడుస్తోందని, ఏం మాట్లాడినా తనపై కేసులు పెడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇక 'హస్తం' ప్రచారం షురూ!

▶ మొదటి పేజీ తరువాయి

నియోజకవర్గం పరిధిలో మూడు చోట్ల ప్రచారం నిర్వహించేలా ఆయన సభల షెడ్యూల్ తయారవుతోంది. తన స్వంత నియోజక వర్గమైన మహబూబ్‌నగర్ పార్లమెంటు పరిధిలోని నారాయణపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయన ప్రచారం ప్రారంభం కానుంది. ఇక్కడ సోమవారం నిర్వహించే సభకు రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు.

నేడు కేసీ రాక..

రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ప్రచార సరళిని సమీక్షించేందుకుగాను ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ ఆదివారం హైదరాబాద్‌కు వస్తున్నారు. ఆయన లోక్‌సభ నియోజకవర్గాల ఇంచార్జులు, పార్టీ ముఖ్య నేతలతో సమావేశమై లోక్‌సభ ఎన్నికల ప్రచార కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్నారు. దీంతో పాటు ఏఐసీసీ అగ్రనేతల ప్రచార షెడ్యూల్, సభల నిర్వహణ ఎక్కడన్న దానిపై కూడా టీపీసీసీ నేతలతో చర్చించనున్నారు.

టార్గెట్ బీజేపీ: రాష్ట్రంలోని పలు లోక్‌సభ స్థానాల్లో బీజేపీ నేతలను ఆకర్షించే పనిలో కాంగ్రెస్ పార్టీ పడింది. ముఖ్యంగా బీజేపీ నుంచి గట్టి పోటీ ఎదురవుతుందని భావిస్తోన్న నియోజకవర్గాల నుంచి కమలనాథులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా శనివారం సంగారెడ్డి అసెంబ్లీ బీజేపీ ఇంచార్జి పులిమామిడి రాజు, మక్తల్ నేత జలంధర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వీరికి స్వయంగా కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. త్వరలోనే మరింత మంది అసెంబ్లీ స్థాయి బీజేపీ నేతలకు కాంగ్రెస్ గాలం వేయనుందని సమాచారం.



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లోకి చేరిన జలంధర్‌రెడ్డి, పులిమామిడి రాజు

ఆ మూడింటిపై నేడు చర్చ: రాష్ట్రంలో ఇప్పటికే 14 సీట్లకు కాంగ్రెస్ అభ్యర్థులను ఖరారు చేయగా, మిగిలిన ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ పార్లమెంటు స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై ఆదివారం సీఎం ఎ.రేవంత్ రెడ్డితో పాటు పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో వేణుగోపాల్ భేటీ కానున్నారు. నేతల అభిప్రాయాలు, సూచనలను తీసుకున్న తర్వాత ఆదివారం సాయంత్రానికల్లా ఈ సమాచారాన్ని ఏఐసీసీకి చేరవేస్తారు. ఈ నేపథ్యంలో ఆ మూడు స్థానాలకు అభ్యర్థుల పేర్లను సోమ లేదా మంగళవారాల్లో అధిష్టానం ప్రకటించే అవకాశం ఉంది.

సీఎం రేవంత్‌కు కేసీఆర్ గతే పడుతుంది

గతంలో ఆయన మాట్లాడినట్లే రేవంత్ కూడా మాట్లాడుతున్నారు: బీజేపీ జాతీయ నేత మురళీధర్‌రావు



ఆదిలాబాద్ బీజేపీ సమావేశంలో మాట్లాడుతున్న మురళీధర్‌రావు, పక్కన ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేశ్

సాక్షి, ఆదిలాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేసీఆర్ గతే పడుతుందని బీజేపీ జాతీయ నాయకుడు పార్టీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి పి.మురళీధర్‌రావు హెచ్చరించారు. గతంలో కేసీఆర్ మాట్లాడినట్లే ఇప్పుడు రేవంత్‌రెడ్డి కూడా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి చాలా తక్కువ సమయంలోనే సీఎం పదవిని కోల్పోతారన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన బీజేపీ ఆదిలాబాద్ పార్లమెంట్ పోలింగ్ బూత్ ఎన్నికల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎం సెంటర్ అయిందని, ఇక్కడి నుంచి పంపించిన 2 వేల కోట్ల రూపాయలనే పార్టీ ప్రచారం కోసం వినియోగిస్తోందని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో గెలిచి పార్లమెంట్‌లో ప్రవేశించేందుకు హస్తం పార్టీకి గ్యారంటీ లేదన్నారు. బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే పనికి రాకుండా పోతుందని చెప్పారు. దేశం నడవాలంటే స్థిరమైన, బలమైన ప్రభుత్వం ఉండాలని అందుకు మూడోసారి మోదీని ప్రధాని చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో 14 సీట్లు గెలుస్తుందంటున్న సీఎం రేవంత్‌రెడ్డి ఒక వేళ గెలుచుకోకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటావా అని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సవాల్ విసిరారు. సీఎం రేవంత్‌రెడ్డి సెటిల్మెంట్ల కోసమే పదవిలో కూర్చున్నారని వాటికి సంబంధించి ఆధారాలతో నిరూపిస్తానని..బహిరంగ చర్చకు సిద్ధమేనా అని సవాల్ విసిరారు. ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పార్టీ అభ్యర్థి గోడం నగేశ్, ఎమ్మెల్యేలు రామారావు పటేల్, పాల్వాయి హరీశ్‌బాబు ఇతర నేతలు పాల్గొన్నారు.



శనివారం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి సత్తి, కుటుంబ సభ్యులు

కాంగ్రెస్‌లోకి మాజీ ఎమ్మెల్సీ రవీందర్



పూల రవీందర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, పీఆర్‌టీయూటీఎస్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు పేరి వెంకటరెడ్డి శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీఎం తన నివాసంలో వారికి పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పార్టీలో చేరామని, ప్రభుత్వానికి అండగా ఉంటామని వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది సుపారీ పాలన.. బీజేపీది సుపరిపాలన

బీజేపీ అధికార ప్రతినిధి రాణీ రుద్రమ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీది పాకిస్తాన్ డీఎన్‌ఏ అని.. సుపారీ పార్టీ కాంగ్రెస్ ఐతే సుపరిపాలన చేస్తోంది తమ పార్టీ అని బీజేపీ అధికార ప్రతినిధి రాణీ రుద్రమ వ్యాఖ్యానించారు. సుపారీ ఇచ్చి ఓటుకు కోట్లు కేసులో దొరికిన వారు నేడు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం దురదృష్టకరమన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ...ఎన్నికల వేళ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టును ప్రశ్నిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, లిక్కర్ స్కాం కేసులో కవిత అరెస్టుపై మాట్లాడరే అని ప్రశ్నించారు. జాతీయ రాజకీయాలపై రేవంత్ రెడ్డికి పూర్తిస్థాయి అవగాహన ఉన్నట్లు కనిపించడం లేదన్నారు. అందుకే బీఆర్‌ఎస్‌కు ఐదు గెలిచేందుకు బీజేపీ సుపారీ ఇచ్చిందని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం స్కాంలో అసలు దోషులపై ఎఫ్‌ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదో చెప్పాలన్నారు. తెలంగాణ ప్రజలను తెలివితక్కువ వాళ్లన్న బీఆర్‌ఎస్ నేతలకు తెలివైనవారెవరూ ఓటువేయవద్దని కోరారు.

అవకాశవాద రాజకీయాలు మానుకో


మంద కృష్ణకు మాజీ మంత్రి పుష్పలీల హితవు



సాక్షి, హైదరాబాద్: మాదిగల పేరుతో అవకాశ వాద రాజకీయాలకు పాల్పడుతున్న మంద కృష్ణ మాదిగ తన వైఖరిని ఇప్పటికైనా మార్చుకోవాలని మాజీమంత్రి కొండ్రు పుష్పలీల హితవు పలికారు. తాను చేసింది సరైందో కాదో మంద కృష్ణ ఆత్మవిమర్శ చేసుకోవాలని, తన జాతి బిడ్డలపై ప్రమాణం చేసి మాదిగలకు ఆయన ఏం చేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం గాంధీభవన్‌లో పుష్పలీల విలేకరులతో మాట్లాడుతూ మంద కృష్ణ వెనుక మాదిగలు లేరని, నిజంగా మంద కృష్ణ ఉద్యమంలో ఉంటే నెత్తిన పెట్టుకునే వాళ్లమన్నారు. తన వెంట తిరిగి కేసులు ఎదుర్కొంటున్న మాదిగ యువకులపై కేసులు ఎత్తివేయాలని ఏనాడైనా మంద కృష్ణ అడిగారా? అని ఆమె ప్రశ్నించారు. ఇక్కడ బీజేపీ పక్షాన మాట్లాడుతున్న మంద కృష్ణ తాను చేవెళ్ల టికెట్ కోసం ఢిల్లీ వెళ్లినప్పుడు కాంగ్రెస్ నేతలు కొప్పుల రాజు, మల్లు రవిలతో కలిసి ఉన్నాడని, అప్పుడే ఆయన వైఖరిని తాను ఎత్తిచూపానని పుష్పలీల తెలిపారు. కేసీఆర్‌ను ఫామ్‌హౌజ్‌కు పంపుతామని చెప్పి పంపించామని, తమ తదుపరి లక్ష్యం బీజేపీ అని, బీజేపీని కూడా ఇంటికి పంపిస్తామన్నారు.

బీఆర్‌ఎస్ నేతలను ప్రజలు నమ్మరు

టీపీసీసీ నేత గజ్జెల కాంతం



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల తర్వాత జైలుకు పోతాడని తెలిసి కేటీఆర్ మతిస్థిమితం కోల్పోయాడని టీపీసీసీ నేత గజ్జెల కాంతం అన్నారు. తండ్రీకొడుకులిద్దరూ రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. శనివారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేత ఊట్ల వరప్రసాద్‌తో గజ్జెల కాంతం విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నేతలు ఎన్ని ప్రయత్నాలు చేసినా వారిని నమ్మే స్థితిలో తెలంగాణ ప్రజలు లేరని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలన్నింటినీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందన్నారు.

శ్రీపాదరావుకు నివాళి: ఉమ్మడి ఏపీ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేసిన దుద్దిళ్ల శ్రీపాదరావు వర్ధంతి సందర్భంగా గాంధీభవన్‌లో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. టీపీసీసీ నేతలు గజ్జెల కాంతం, ఊట్ల వరప్రసాద్ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రీపాదరావు చేసిన సేవలను స్మరించుకున్నారు.

జగన్ త్వరగా కోలుకోవాలి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.

– 'ఎక్స్'లో ప్రధాని మోదీ

ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదు

రాజకీయ విభేదాలు ఎప్పుడూ హింసాత్మకంగా మారకూడదు. మనం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నాం, పరస్పర గౌరవాన్ని కాపాడుకుందాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను.

– స్టాలిన్, తమిళనాడు ముఖ్యమంత్రి

సీఎం జగన్‌పై దాడి గురించి విని షాక్ అయ్యా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై జరిగిన దాడి గురించి విని షాక్ అయ్యా. ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా.

– మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ సీఎం

హింసకు తావు లేదు

ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదు. కేంద్ర ఎన్నికల సంఘం అత్యంత కఠినమైన ముందస్తు చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నాను. మీరు క్షేమంగా ఉండాలని కోరుకుంటున్నా. జగనన్నా.. జాగ్రత్తగా ఉండండి

– కేటీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

ఓటమి భయంతోనే సీఎం జగన్‌పై దాడి

ఓటమి భయంతోనే సీఎం వైఎస్ జగన్ పైన టీడీపీ దాడులకు తెగబడుతోంది. సిద్ధం బస్సు యాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తుండటాన్ని తట్టుకోలేక ప్రతిపక్షాలు ఎన్నో కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నాయి. ఇలాంటి దాడులకు, ఉడత ఊపులకు సీఎం భయపడరు. రాజకీయంగా జగన్‌ను ఒంటరిగా ఢీకొట్టలేని టీడీపీ.. జనసేనను, బీజేపీని వెంట తెచ్చుకుంది.

– తానేటి వనిత, హోం శాఖ మంత్రి

నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలి

సీఎం వైఎస్ జగన్‌పై జరిగిన దాడిపై ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలి. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. బాధ్యులైన వారిని శిక్షించాలి.

– చంద్రబాబు, టీడీపీ అధ్యక్షుడు

సీఎం జగన్‌పై దాడి దురదృష్టకరం

సీఎం జగన్‌పై దాడి దురదృష్టకరం. దాడిలో సీఎం జగన్ ఎడమ కంటిపైన గాయం కావటం బాధాకరం. ఇది ప్రమాదవశాత్తు అయిందని అనుకుంటున్నాం. అలా కాకుండా ఎవరైనా కావాలని చేసి ఉంటే ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా ఖండించాల్సిందే. సీఎం త్వరగా కోలుకోవాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నా.

– షర్మిల, ఏపీసీసీ అధ్యక్షురాలు



'మేమంతా సిద్ధం' యాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన దాడిని వ్యతిరేకిస్తూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నిరసనలు వెల్లువెత్తాయి.

సీఎం జగన్‌పై హత్యాయత్నం

▶ మొదటి పేజీ తరువాయి

సమయాన్ని ఆసరాగా చేసుకుని... బస్సుపై ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో ఉన్న జగన్‌ను గురుచూసి పదునైన వస్తువుతో కొట్టారు. జగన్ కణతకు గురిపెట్టి సంధించిన ఆ వస్తువు గనక ఆయనకు అదే ప్రాంతంలో తగిలి ఉంటే ఏమయ్యేదోననేది ఊహించడానికే భయంవేసే పరిణామం. అదృష్టవశాత్తూ ప్రజలకు అభివాదం చేస్తూ ఆయన పక్కకు తిరగటంతో... ఆ వస్తువు ఆయన కణతకు బదులు ఆయన ఎడమ కనుబొమపై తగిలింది. లోపలికంటా చర్మం చీలిపోయి బలమైన గాయం తగిలింది. అంతేకాక... ఆయనకు గాయం చేశాక... అదే వస్తువు ఆయన పక్కనే నిల్చున్న మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ ఎడమ కంటికి కూడా తగిలింది. ఆయన కన్ను వాచింది. వైఎస్ జగన్‌కు వస్తువు బలంగా తగలటంతో... ఆయన ఒక్కసారిగా ఉలిక్కి పడి పక్కకు ఒరిగారు. తరవాత తమాయించుకుని నిలబడి కంటిని గట్టిగా చేత్తో అదిమి పట్టుకున్నారు. అలాగే చుట్టూ ఉన్న జనానికి అభివాదం చేస్తూ... సెక్యూరిటీ సిబ్బంది తోడురాగా బస్సులోపలికి వెళ్లారు. కనుబొమ వాచిపోవటంతో... గాయాన్ని శుభ్రం చేసి, రక్తాన్ని తుడిచి బస్సులో ఆయనకు వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. కాసేపు ఆగిన తరవాత వైఎస్ జగన్ యథా ప్రకారం యాత్ర కొనసాగించారు. దాదాపుగా రాత్రి 8.10 సమయంలో ఈ దుర్ఘటన జరగ్గా... కాసేపు ఆగాక యాత్రను రాత్రి 10.39 వరకూ షెడ్యూలు ప్రకారం కొనసాగించాక... నైట్ హాల్టు ప్రాంతమైన కేసరపల్లికి చేరుకున్నారు సీఎం వైఎస్ జగన్.

నేడు యాత్రకు విరామం: యాత్ర ముగిశాక గాయానికి చికిత్స చేయించుకోవటం కోసం సీఎం జగన్ నేరుగా విజయవాడ ప్రభుత్వాసు పత్రికి వెళ్లారు. అక్కడకు ఆయన సతీమణి వైఎస్ భారతి కూడా చేరుకుని ఆసుపత్రిలో ఆయనకు తోడుగా ఉన్నారు. వైద్యులు గాయాన్ని పరీక్షించాక, వైఎస్ జగన్‌కు లోకల్ అనస్తీషియా ఇచ్చి... కుట్లు వేశారు. కొంత విశ్రాంతి అవసరమని సూచించారు. చికిత్స అనంతరం జగన్ తిరిగి తన నైట్ హాల్టు ప్రాంతానికి వెళ్లారు. ఆదివారం బస్సు యాత్రకు విరామం ప్రకటించారు. తదుపరి షెడ్యూలు ఆదివారం రాత్రి ప్రకటించే అవకాశముంది.

సాక్షి, అమరావతి: మేమంతా సిద్ధం బస్సు యాత్రలో ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఒక ఆగంతకుడు హత్యాయత్నానికి తెగబడ్డాడు. యాత్రలో భాగంగా శనివారం రాత్రి 8.10 గంటలకు సీఎం వైఎస్ జగన్ విజయవాడ సింగ్ నగర్ డాబా కొట్ల సెంటర్‌కు చేరుకోగానే హత్యకు ప్రయత్నించాడు. సీఎం జగన్ కణతకు గురిచూసి పదునైన వస్తువుతో దాడి చేశాడు. అయితే ప్రజలకు అభివాదం చేస్తూ సీఎం జగన్ పక్కకు తిరగడంతో ఆయన ఎడమ కంటి కనుబొమ పై భాగాన బలమైన గాయమైంది. దీంతో సీఎం పక్కకు తూలి.. ఎడమ కంటిని బలంగా అదిమి పట్టుకున్నారు. ఆయన ఎడమ కన్ను పైభాగం వాచిపోయింది. బలమైన గాయం కావడంతో రక్తం కారింది. అయినప్పటికీ బాధను పంటి బిగువన భరిస్తూనే సీఎం వైఎస్ జగన్ ప్రజలకు అభివాదం చేసి.. బస్సుపై నుంచి దిగి లోపలికి వెళ్లారు. డాక్టర్ హరికృష్ణ ఆయనకు ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం సీఎం జగన్ యథావిధిగా బస్సు యాత్రను కొనసాగించారు. కాగా ఆ వస్తువు పదును, వేగాన్ని బట్టి అది రాయి, గ్రానైట్ పలక, పెల్లెట్, ఎయిర్ బుల్లెట్ ఏదైనా కావచ్చని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. సీఎం జగన్ ఎడమ కంటి పై భాగాన గాయమయ్యాక.. ఆ పదునైన వస్తువు మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్‌కూ తగలడంతో ఆయనకు కూడా గాయమైంది.

ముందస్తు కుట్ర, పక్కా ప్రణాళికతోనే..

సీఎం వైఎస్ జగన్ షెడ్యూల్ ప్రకారం శనివారం రాత్రి విజయవాడ చేరుకుంటారని ముందే తెలుసుకున్న ఆగంతకుడు ఇందుకు తగ్గట్టే ముందస్తు కుట్ర, ప్రణాళికను సిద్ధం చేసుకున్నాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బస్సు యాత్ర విజయవాడలోకి శనివారం సాయంత్రం 5 గంటలకు ప్రవేశించింది. బస్సు యాత్ర సాగే మార్గంలో విద్యుత్ సరఫరాను నిలిపేస్తుండటాన్ని ఆగంతకుడు ఆసరాగా చేసుకున్నాడు. సీఎం జగన్‌ను హత్య చేయాలనే ముందస్తు వ్యూహంలో భాగంగానే సింగ్‌నగర్ డాబా కొట్ల సెంటర్‌లోని వివేకానంద స్కూల్ రెండో అంతస్తులో ఓ గదిలో నక్కాడు. తాము ఉన్న గది కిటికీ తలుపులను తెరిచే ఉంచాడు. రోడ్ షో అక్కడికి చేరుకోగానే సీఎం జగన్ లక్ష్యంగా హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అత్యంత వేగంగా దూసుకొచ్చిన పదునైన వస్తువు సీఎం జగన్ ఎడమ కంటి కనుబొమ పైభాగాన తగలడంతో ఆయనకు తీవ్ర గాయమైంది. ఎడమ కన్ను వాచిపోయింది. ఎడమ కంటి కనుబొమ పైభాగాన బలమైన గాయం నుంచి రక్తం కారిపోతున్నా చలించక సీఎం జగన్ ప్రజలకు అభివాదం చేసి బస్సుపై నుంచి కిందకు దిగి లోపలికి వెళ్లారు.

ఎయిర్ గన్ వినియోగించారా..

సీఎం జగన్‌పై ఎయిర్ గన్ తో హత్యాయత్నం చేసి ఉండొచ్చని అంటున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని నాని సౌండ్ విన్నానని చెబుతుండటంతో సీఎంపై హత్యాయత్నానికి ఎయిర్ గన్‌నే వినియోగించి ఉండవచ్చని బలంగా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనలో గాయపడ్డ విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు కూడా సీఎం వైపు దూసుకొచ్చిన పదునైన వస్తువు వేగాన్ని బట్టి ఇది హత్యాప్రయత్నమేనన్నారు. చంద్రబాబు నాయుడే ఈ దురాగతానికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో 175కి 175 అసెంబ్లీ స్థానాలు, 25కి 25 పార్లమెంటు స్థానాలు సాధించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్ నిర్వహించిన సిద్ధం సభలు చరిత్రలో కనీవినీ ఎరుగని స్థాయిలో జరిగాయి. ఈ సభలకు లక్షల సంఖ్యలో ప్రజలు పోటెత్తారు. సిద్ధం సభల తర్వాత మేమంతా సిద్ధం పేరుతో ముఖ్యమంత్రి జగన్ బస్సు యాత్రను నిర్వహిస్తున్నారు. దీనికి సైతం రాష్ట్ర ప్రజలు హారతులు పడుతున్నారు. చిన్నా పెద్ద, యువత, మహిళలు అనే తేడా లేకుండా వెల్లువలా సీఎం జగన్‌కు సంఘీభావం ప్రకటిస్తున్నారు. దీంతో ఈ ఆదరణను తట్టుకోలేక.. ముందస్తు కుట్రలో భాగంగానే ముఖ్యమంత్రిపైన హత్యాయత్నం జరిగిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చంద్రబాబు, లోకేష్‌ల ప్రోద్బలంతోనే..

కాగా టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్ ప్రోద్బలంతోనే సీఎం వైఎస్ జగన్‌పై హత్యాయత్నం జరిగిందని వైఎస్సార్‌సీపీ వర్గాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచే వీరిద్దరూ తమ మాటల ద్వారా, సోషల్ మీడియా పోస్టుల ద్వారా సీఎం వైఎస్ జగన్‌పై తీవ్ర వ్యతిరేకతను వెళ్లగక్కుతున్నారని గుర్తు చేస్తున్నాయి. ఐదేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్ నవరత్న పథకాలతోపాటు ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చారు. దీంతో ఒంటరిగా సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కోలేమని టీడీపీ.. జనసేన, బీజేపీలతో పొత్తు పెట్టుకుందని వైఎస్సార్‌సీపీ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. జనసేన, బీజేపీలతో పొత్తు పెట్టుకున్నప్పటికీ టీడీపీకి ఆశాజనకమైన పరిస్థితులు కనిపించకపోవడం, కూటమి నేతలతో కలిసి నిర్వహించిన సభలు విఫలం కావడం, మరోవైపు సీఎం జగన్ సభలకు ప్రజలు లక్షల సంఖ్యలో పోటెత్తడం తట్టుకోలేకే ఇలా హత్యాయత్నాలకు చంద్రబాబు, లోకేశ్ పురమాయిస్తున్నారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి.

భయోత్పాతంతో బస్సు యాత్ర ఆపాలనే..

సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్రకు ప్రజలు హారతులు పడుతున్నారు. లక్షలో ప్రజలు ఆయన సభలకు హాజరవుతున్నారు. ఇదే చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్‌ల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. జైత్రయాత్రలా సాగుతున్న బస్సు యాత్రను ఆపడం ద్వారా రాజకీయ ఉనికి చాటుకోవడానికే చంద్రబాబు, లోకేష్‌లు ఆపార్టీ శ్రేణులను సీఎం జగన్‌పై హత్యాయత్నం చేసేందుకు పురిగొలిపారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. భయోత్పాతం సృష్టించడం ద్వారా సీఎం జగన్ బస్సు యాత్రను ఆపేయడానికే ఈ దారుణం చేయించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స..





కాగా సీఎం జగన్‌పై హత్యాయత్నం ఘటన తెలిసిన వెంటనే ఆయన సతీమణి వైఎస్ భారతి కేసరపల్లిలోని రాత్రి బస కేంద్రానికి చేరుకున్నారు. వైద్యుల సూచనల మేరకు చికిత్స కోసం సీఎం జగన్ తన సతీమణి భారతితో కలిసి విజయవాడ ప్రభుత్వాస్పతికి వెళ్లారు. ప్లాస్టిక్ సర్జరీ, అనస్తీషియా, ఇతర వైద్యుల బృందం పలు వైద్య పరీక్షలు చేసి సీఎం జగన్‌కు చికిత్స అందించారు. ఎడమ కంటి కనుబొమ పైభాగాన లోతైన గాయానికి కుట్లు వేశారు. అనంతరం గాయం మానేంత వరకూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి, మందులను ప్రిస్కైబ్ చేశారు. సీఎం వద్దకు చేరుకున్న నర్సులు, ఇతర సిబ్బంది 'మీరు జాగ్రత్తగా ఉండండి అన్నా' అంటూ పలకరించారు. ఈ క్రమంలో వారందరినీ సీఎం జగన్ ఆప్యాయంగా పలకరించారు. ఇక సీఎం జగన్‌తో పాటు దాడిలో గాయపడిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్‌కు కూడా వైద్యులు చికిత్స చేశారు. సీఎం జగన్‌కు కనుబొమ పైభాగాన లోతైన గాయమైనట్టు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్ వివరించారు. ఆది, సోమవారాల్లో గాయం తగిలిన ప్రాంతంలో వాపు ఉంటే అందుకనుగుణంగా చికిత్స చేయాల్సి ఉంటుందన్నారు. కాగా ఆస్పత్రిలో సీఎం జగన్ వెంట ఎంపీలు కేశినేని నాని, అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీ, కైలే అనిల్‌కుమార్, మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీలు తలశీల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి, రుహుల్లా, విజయవాడ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి దేవినేని అవినాశ్ ఉన్నారు. కాగా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకున్న అనంతరం సీఎం వైఎస్ జగన్ రాత్రి బసకు తిరిగి కేసరపల్లికి చేరుకున్నారు.

అది హత్యాయత్నమే: వెలంపల్లి



వైఎస్ జగన్‌కు తగిలిన వస్తువు తనకూ తగలటంతో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ కంటికి గాయమైంది. సంఘటన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఇది ఖచ్చితంగా హత్యాయత్నమేనని, ఆ వస్తువు తాలూకు పదును, వేగం చూస్తే ఇదే అర్థమవుతోందని వ్యాఖ్యానించారు. సీఎం వైఎస్ జగన్‌కు తగిలాక... పక్కనున్న తనకు అదే వస్తువు తగిలిందని, తనకూ గాయమైందంటేనే దాని వేగాన్ని అర్థం చేసుకోవచ్చునని చెప్పారు. బస్సు యాత్ర మొదలుపెట్టిన దగ్గర్నుంచీ ముఖ్యమంత్రి జగన్‌కు అపూర్వమైన ఆదరణ లభిస్తోందని, దాన్ని తట్టుకోలేక తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడే ఈ దారుణానికి పురమాయించి ఉంటాడని వ్యాఖ్యానించారు. హత్యా రాజకీయాలు చంద్రబాబుకు కొత్త కాదంటూ వంగవీటి రంగా హత్యను ఉదహరించారు. ఎన్ని కూటములు కట్టినా, ఎందరితో కలిసి వచ్చినా జగన్ ముందు తాను నిలవలేకపోతున్నానన్న అక్కసుతోనే బాబు ఈ దారుణానికి ఒడిగట్టాడని చెప్పారాయన. వైఎస్ జగన్‌కు తగిలిన వస్తువు చాలా పదునైనదని, అదేమిటనేది తేలాల్సి ఉందని పోలీసు అధికారులు చెప్పారు. ఈ దిశగా తాము అన్ని కోణాల్లోనూ దర్యాప్తు సాగిస్తున్నట్లు చెప్పారు. అది పదునైన రాయి, చెక్కిన గ్రానైట్ పలక, పెల్లెట్, ఎయిర్ బుల్లెట్.. ఏదైనా కావచ్చునని వ్యాఖ్యానించారు. అయితే ఆ వస్తువు వైఎస్ జగన్‌కు తగిలే సమయంలో 'టప్' మనే శబ్దాన్ని తాను స్పష్టంగా విన్నానని, అది రాయి కాకపోవచ్చునని విజయవాడ ఎంపీ కేశినేని నాని వ్యాఖ్యానించారు. ఆయన ఆ సమయంలో వైఎస్ జగన్‌కు వెనకనే అడుగు దూరంలో ఉన్నారు. స్కూలు భవనానికి చేరుకున్న పోలీసు బృందాలు పూర్తిస్థాయి దర్యాప్తు మొదలుపెట్టాయి.

సీఎం జగన్‌పై జరిగింది హత్యాయత్నమే

ఎయిర్ గన్‌తో గురి చూసి షూట్ చేశారు

- వారి లక్ష్యం సీఎం జగన్ కన్ను కాదు
- కణతకు గురి చూసి షూట్ చేశారు
- గురి తప్పి ఎడమ కంటి పై భాగంలో తీవ్ర గాయం
- కణతకు తగిలితే ప్రాణాలకే ప్రమాదం
- క్యాటర్‌బాల్‌తో అంత దూరం నుంచి కొట్టలేరు
- గాయం చేసింది రాయి కూడా కాదు.. పెల్లెట్
- పోలీసు అధికారులు, వైద్య నిపుణుల విశ్లేషణ



దాడి అనంతరం బస్సులోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రథమ చికిత్స

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై శనివారం రాత్రి విజయవాడలో జరిగిన దాడి పక్కా ఎయిర్ గన్ ఉపయోగించి చేసిన హత్యాయత్నమేనని పోలీసు అధికారులు, వైద్య నిపుణులు స్పష్టంగా చెబుతున్నారు. ఎయిర్ గన్‌తో కణతకు గురిచూసి షూట్ చేశారని స్పష్టం చేస్తున్నారు. ఒకవేళ ఎయిర్ గన్ పెల్లెట్ కణతకు తగిలి ఉంటే ప్రాణాలకే ప్రమాదం సంభవించి ఉండేదని చెబుతున్నారు. అది గురితప్పి ఎడమ కంటి పై భాగంలో తగిలిందని విశ్లేషిస్తున్నారు. సీఎం జగన్‌పై జరిగింది క్యాటర్‌బాల్‌తో దాడి కాదని, ఆయనకు ఎడమ కంటి పై భాగంలో తగిలింది రాయి కాదని కూడా చెబుతున్నారు. సీఎం జగన్‌పై విజయవాడలో దాడి జరిగిన ప్రదేశం, ఆయనకు అయిన గాయం తీవ్రత, గాయం తీరును పరిశీలించిన పలువురు పోలీసు అధికారులు, రిటైర్డ్ పోలీసు అధికారులు, వైద్య నిపుణులు ఈ దాడికి ఎలా పాల్పడి ఉండొచ్చనే అంశంపై విశ్లేషిస్తున్నారు. వారి అభిప్రాయం ప్రకారం..

విజయవాడ సింగ్ నగర్‌లోని వివేకానంద స్కూల్ నుంచే దుండగులు సీఎం జగన్‌పై దాడికి పాల్పడ్డారన్నది దాదాపు నిర్ధారణ అయ్యింది. ఆయనపై కచ్చితంగా ఎయిర్ గన్‌తోనే గురి చూసి షూట్ చేశారు. వాహనం నుంచి దాదాపు 20 అడుగుల దూరంలో ఉన్న భవనం నుంచి క్యాటర్ బాల్‌తో దాడి చేసినా అంత వేగంగా వచ్చి తగిలే అవకాశం ఉండదు. అంత కచ్చితంగా వ్యక్తిని గురి చూసి కొట్టడం కూడా సాధ్యం కాదు. ఎయిర్ గన్‌తో 30 అడుగుల దూరం వరకు లక్ష్యాన్ని గురి చూసి కొట్టొచ్చు. ఎయిర్ గన్‌లో వాడే పెల్లెట్ అత్యంత వేగంగా దూసుకువచ్చి తీవ్రమైన గాయం చేస్తుంది. సీఎం జగన్ ఎడమ కంటిపై భాగంలో రెండు సెంటీమీటర్ల వెడల్పుతో దాదాపు అర సెంటి మీటరు లోతులో వై ఆకారంలో గాయమైంది. ఆయనకు రెండు కుట్లు కూడా వేశారు. అంటే పెల్లెట్ అత్యంత వేగంగా వచ్చి తగిలి రాసుకుని వెళ్లి ఉంటేనే అంతటి తీవ్రమైన గాయమవుతంది. అత్యంత వేగంగా వచ్చిన 'ఆబ్జెక్ట్' తగలడంతోనే అంతటి గాయమైందని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. దాంతోనే రెండు కుట్లు వేయాల్సి వచ్చిందంటే అది రాయితో చేసిన దాడి కాకపోవచ్చని కూడా చెబుతున్నారు.

ఇది సాధారణ దాడి కాదు

సీఎం జగన్‌పై జరిగినది సాధారణ దాడి కాదని, కచ్చితంగా హత్యాయత్నమేనన్న అనుమా నాలు బలపడుతున్నాయి. ఎందుకంటే ఎయిర్‌గన్‌తో గురి చూసి మరీ షూట్‌చేశారు. పెల్లెట్ ఎడమ కంటి పైభాగంలో తగిలింది. కానీ దుండగుల లక్ష్యం ఆయన కంటి భాగం కాదని, కణతకు గురి పెట్టి షూట్ చేశారని భావిస్తున్నారు. ఎయిన్ గన్‌తో కణతపై షూట్ చేస్తే కచ్చితంగా పెల్లెట్ శరీరాన్ని ఛిద్రం చేసుకుంటూ లోపలికి దూసుకుపోతుంది. దాంతో ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. చెవికి, కంటికి మధ్య ఓ నరం ఉంటుంది. సున్నితంగా ఉండే ఆ ప్రదేశంలో షూట్ చేస్తే ప్రాణాలు కోల్పోయే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఈ పరిణామాలన్నీ పరిశీలిస్తే ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌పై జరిగిన దాడి కచ్చితంగా హత్యాయత్నమేనని పోలీసు అధికారులు తేల్చి చెబుతున్నారు.

అన్ని కోణాల్లో దర్యాప్తు

సీఎం వైఎస్ జగన్‌పై జరిగిన హత్యాయత్నం ఘటనపై సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నాం. దాడి జరిగిన ప్రదేశాన్ని, అక్కడ ఉన్న స్కూల్ భవనం, పరిసర ప్రాంతాలను పరిశీలించాం. యాత్ర నిర్వహిస్తున్న సమయంలో కరెంట్ వైర్లు తగులుతాయనే ఉద్దేశంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో చీకటిగా ఉన్న పరిస్థితిని ఆసరాగా చేసుకుని దుండగులు దాడికి పాల్పడ్డారని తెలుస్తోంది. ఆ ప్రదేశంలో సీసీ టీవీ కెమెరాలను పరిశీలిస్తున్నాం. అనుమానితుల కదలికలపై ఆరా తీస్తున్నాం. ప్రత్యేక బృందాలను నియమించాం. దుండగులను త్వరలోనే గుర్తించి అరెస్ట్ చేస్తాం. –కాంతి రాణా టాటా, విజయవాడ పోలీస్ కమిషనర్

పాఠశాల నుంచే దాడి?



సాక్షి ప్రతినిధి, విజయవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై విజయవాడ సింగ్‌నగర్ డాబాకొట్ల సెంటర్‌లో వివేకానంద సెంటినరీ హైస్కూల్ నుంచే ఎయిర్‌గన్‌తో దాడికి పాల్పడి ఉంటారని పోలీసు అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. దాడి సమయంలో ఈ పాఠశాల వెనుక వైపున రోడ్డులోనే సీఎం జగన్ యాత్ర సాగుతోంది. సీఎం జగన్ ఉన్న బస్సుకు, పాఠశాల కేవలం 20 అడుగుల దూరంలోనే ఉంది. పాఠశాల ఉన్న రామకృష్ణ సమితికి చెందిన ఈ జీ+2 భవనం మొదటి అంతస్తులో 6వ కిటికీ, రెండో అంతస్తులో 4వ కిటికీ తెరిచి ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. పాఠశాలకు వాచ్‌మెన్ భద్రత లేదు. దీంతో గేటు దూకి ఎవరైనా సులభంగా లోపలికి ప్రవేశించే అవకాశం ఉంది. అక్కడి నుంచే దాడికి పాల్పడి, సులభంగా తప్పించుకొని పోయే అవకాశం ఉంది. ఈ పాఠశాలకు 200 మీటర్ల దూరంలోనే విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం టీడీపీ ఆఫీసు ఉండటం కూడా అనుమానాలకు బలం చేకూరుస్తోంది. 59వ డివిజన్‌కు చెందిన ఓ టీడీపీ నాయకుడి అనుచరుల్లో బ్లేడ్ బ్యాచ్, ఎయిర్‌గన్‌లు, క్యాటర్‌బాల్, ఇతర మారణాయుధాలు వాడేవాళ్లు ఉన్నట్టు తెలుస్తోంది. దాడి జరిగిన సమయంలో సీఎం జగన్ రోడ్‌షోను చిత్రీకరించిన స్థానికుల నుంచి వీడియోలు సేకరించి పోలీసులు పరిశీలిస్తున్నారు.

ధ్వంస రచనే కూటమి కుతంత్రం

- సీఎం జగన్‌పై దాడి వెనుక చంద్రబాబు ముఠా భారీ కుట్ర
- ముందస్తు పన్నాగంతోనే పోలీసు అధికారులపై ఫిర్యాదులు
- పోలీసు వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకొనే లక్ష్యం... తద్వారా ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడేందుకు వ్యూహ రచన
- అందులో భాగంగానే ఐపీఎస్‌లపై పురందేశ్వరి ద్వారా బాబు ఫిర్యాదు.. ఎవర్ని నియమించాలో కూడా చెప్పిన పచ్చ ముఠా
- తీవ్రంగా స్పందించిన అధికారులు.. పారని బాబు పాచిక
- దాంతో సీఎం యాత్రలో దాడులకు కుతంత్రం
- తద్వారా శాంతిభద్రతల సమస్య సృష్టించే కుట్ర

వివరాలు, వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



ప్రజల మధ్య భారతమ్మ..

బస్సుయాత్రలో అరుదైన దృశ్యం

భోజన విరామం అనంతరం తాడేపల్లి జంక్షన్‌కు చేరుకున్న బస్సుయాత్రలో అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతమ్మ బస్సుయాత్రగా వస్తున్న సీఎం జగన్‌కు రోడ్డుపై నిలబడి అభివాదం చేశారు. ప్రజలు, అభిమానుల మధ్య తానూ ఓ సామాన్యురాలిగా చిరునవ్వుతో జగన్‌కు చేతులు ఊపారు. ప్రతిగా సీఎం జగన్ కూడా బస్సులో నుంచే భారతికి అభివాదం చేశారు. మహిళలు గుమ్మడికాయలతో దిష్టితీసి, హారతులిచ్చారు. అనంతరం మణిపాల్ ఆసుపత్రి జంక్షన్‌కు భారీగా చేరుకున్న అభిమానులు మళ్లీ రా.. అన్నా అంటూ వీడ్కోలు పలికారు.



తాడేపల్లి: జనం మధ్యలో నిలబడి సీఎం జగన్‌ను చూసిన ఆనందంలో ఆయన సతీమణి వైఎస్ భారతీరెడ్డి

కృష్ణా తీరం.. పోటెత్తిన జనప్రవాహం

విజయవాడలో 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రకు జననీరాజనం

(మేమంతా సిద్ధం బస్సుయాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

ఆకాశం నిప్పులు చిమ్మినా.. మేఘాలకు చిల్లులు పడినా.. నీపై మా అభిమానం తగ్గదు అన్నా.. నింగి నేల ఉన్నంతకాలం నీతోనే మేమంతా జగనన్నా.. అంటూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. గుంటూరు ప్రజల ఘాటైన ప్రేమాభిమానాలను గుండెల నిండా నింపుకుని.. ఎన్టీఆర్ జిల్లా వాసుల ఆప్యాయతలను పంచుకోవడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్ర శనివారం ఎన్టీఆర్ జిల్లాలోకి ప్రవేశించింది. ఈ రెండు జిల్లాలనూ కలిపే కనకదుర్గ వారధి జన ప్రవాహంతో పోటెత్తింది. అడుగుతీసి అడుగువేయలేనంతగా ప్రజలతో నిండిపోయింది. వారిని చూసిన జగన్ బస్సు పైకెక్కి అందరికీ అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. భారీ గజమాలలతో, సంప్రదాయ డప్పు వాయిద్యాల నడుమ పూలవర్షం కురిపిస్తూ నేతలు, కార్యకర్తలు, అభిమానులు జగన్‌కు ఘనస్వాగతం పలికారు.

రక్తమోడినా సడలని సంకల్పం..

ఇక 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రకు వస్తున్న జనాదరణను చూసి కొందరి కళ్లు 'పచ్చ'బడ్డాయి. జగన్‌ను జనం నుంచి దూరం చేయాలనే కుట్రతో బస్సుయాత్ర సింగ్‌నగర్, డాబాకొట్లు సెంటర్ దాటగానే గుర్తుతెలియని ఆగంతకులు ఆయనపై రాయి విసిరారు. రాయి తగిలి ఎడమ కంటిపై గాయమైంది. రక్తం కారుతుంటే వైద్యులు ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం యాత్రను ఆపకుండా పైకిలేచి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.



విజయవాడ కనకదుర్గ వారధి వద్ద సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న అశేష జనవాహినిలో ఓ భాగం



> దుష్కార్యము చేయు ప్రతివాడు వెలుగును ద్వేషించును, తన క్రియలు దుష్క్రియలుగా కనబడకుండునట్లు వెలుగునొద్దకు రాడు. సత్యవర్తనుడైతే తన క్రియలు దేవుని మూలముగా చేయబడియున్నవని ప్రత్యక్షపరచ బడునట్లు వెలుగునొద్దకు వచ్చును.
>
> – క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం
ఉత్తరాయణం, వసంత ఋతువు
చైత్ర మాసం, **తిథి:** శు.షష్ఠి ప.3.46 వరకు తదుపరి సప్తమి, **నక్షత్రం:** ఆరుద్ర తె.5.17 వరకు (తెల్లవారితే సోమవారం), తదుపరి పునర్వసు, **వర్జ్యం:** ప.1.23 నుండి 3.01 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.31 నుండి 5.20 వరకు, **అమృతఘడియలు:** రా.7.07 నుండి 8.06 వరకు.

సూర్యోదయం : 5.49
సూర్యాస్తమయం : 6.11
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

తేజస్వీ యాదవ్ (ఆర్జేడీ లీడర్)
రాయని డైరీ

మాధవ్ శింగరాజు

కోసీ నదీ ప్రాంతంలో దొరికే చేగ్రా రకం చేపల్ని తినే అదృష్టం ఈ దేశంలో కొద్దిమందికి మాత్రం లభించదు.

అంతటి ధారాళమైన అదృష్టాన్ని నాకు నా మిత్రుడు ముఖేష్ సహానీ.. సమృద్ధిగా ప్లేటులో అమర్చి నా చేతికి అందించాడు! ఆ సమయంలో మేము గాలిలో అవకతవగ్గా ఈత కొడుతున్నట్లు ఎగురుతున్న చాఫర్‌లో ఉన్నాం.

"ఇలా తినటం బాగుంది కదా తేజ్!" అన్నాడు ముఖేష్ నవ్వుతూ. వికాస్‌శీల్ పార్టీ అధ్యక్షుడు అతడు. ఐదేళ్ల క్రితమే పార్టీ పెట్టాడు. అంతకుముందు బాలీవుడ్ సెట్ డిజైనర్.

"ఎలా తినటం బాగుంది ముఖేష్? మోదీజీకి, బిహార్‌లోని ఆయన సంకీర్ణ 'దళానికి'... బాగా వేయించి, మసాలా దట్టించిన చేగ్రాను చూపించుకుంటూ తినటమా?" అని పెద్దగా నవ్వాన్నేను... సెల్ఫీలో ముఖేష్‌ను కూడా పట్టిస్తూ.

"తరిగిన ఉల్లి ముక్కల్ని, ఘాటైన పచ్చి మిరపను నంజుకుంటూ, చేగ్రా చేప వేపుడును తినడం బాగుంటుంది కదా అని తేజ్... నేను అనటం..." అని నవ్వాడు ముఖేష్.



చాఫర్ ఎగురుతూ ఉంది. చేగ్రాను మేము కొద్దికొద్దిగా కొరికి తింటూ ఉన్నాం. నిజానికి తినడం మా అదృష్టం కాదు. తినటానికి టైమ్ దొరకటం... అదీ అదృష్టం! ఎన్నికల ప్రచారం దేనికీ సందు ఇవ్వటం లేదు. ఆఖరికి చాఫర్‌ను ఒకచోట నిలిపి మోదీజీ గురించి ఒక మంచి మాట మాట్లాడుకోవటానికి కూడా!

ఒక విడతలో అయ్యే పనికి ఎలక్షన్ కమిషన్ బిహార్‌కు ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లతో పాటుగా ఏడు విడతల పోలింగ్ పెట్టింది. ఏప్రిల్ 19, 26 ; మే 7, 13, 20, 25 ; జూన్ 1. తర్వాత రెండు రోజులకు జూన్ 4న కౌంటింగ్. ఆ తర్వాత సరిగ్గా వారానికి జూన్ 11న నాన్నగారి పుట్టిన రోజు!

ఆర్జేడీకి లోక్‌సభలో ఇప్పుడున్న జీరో సీట్లను 20కి, లేదంటే కనీసం 10కి పెంచి నాన్నగారి పుట్టిన రోజుకు కానుకగా ఇవ్వాలి. అలా కాకపోయినా బిహార్‌లో బీజేపీకి ఇప్పుడున్న 17 సీట్ల కన్నా కనీసం ఒకటెక్కువగా, లేదంటే జేడీయూకి ఇప్పుడున్న 16 సీట్ల కన్నా ఒకటెక్కువగా సీట్లు గెలిచి నాన్నగారికి బహుమతిగా ఇవ్వగలిగినా బాగుంటుంది. ఆయనెంతో సంతోషిస్తారు. ఆయనతో పాటు అమ్మ కూడా!

ఆర్జేడీ, కాంగ్రెస్, లెఫ్టిస్టులు, వికాస్‌శీల్ పార్టీ ఒక జట్టుగా పోటీ చేస్తున్నాం కాబట్టి నాన్నగారి బర్త్ డే గిఫ్ట్ ఆల్రెడీ రెడీ అయినట్లే. మొత్తం 40 సీట్లలో ఆర్జేడీ 23, కాంగ్రెస్ 9, లెఫ్టిస్టులు 5, వికాస్‌శీల్ 3 సీట్లలో చేయీ చేయీ పట్టి నిలబడితే... బీజేపీకి, జేడీయూకి లోక్‌సభలో కూర్చోటానికి చోటు ఉంటుందా?

రెండో రోజు సాయంత్రం – నేలపై కాసేపు అడుగులు వేయటానికి జనం లేని చోటు చూసుకుని చాఫర్ నుంచి కిందికి దిగాం.

"తేజ్... మనం చెగ్రాను తింటున్న వీడియోను మీరెప్పుడు ట్వీట్ చేశారు!! కింద కామెంట్స్ చూశారా... ఎంత వైల్డ్‌గా ఉన్నాయో..." అని తన ఫోన్ నా చేతికి ఇచ్చాడు ముఖేష్ ఆశ్చర్యపోతూ.

నవ్వాను. అప్పటికి కొద్దిసేపటి క్రితమే ఆ వీడియోను అప్లోడ్ చేశాన్నేను. "సనాతనులమని చెప్పుకుంటున్న వారెవరైనా చైత్ర మాస నవరాత్రులలో నాన్-వెజ్ తింటారా?!!" అని బీజేపీ లీడర్లు అప్పుడే మొదలుపెట్టేశారు.

వాళ్లంతే! నిరుద్యోగంపై స్పందించరు. పేదరికం మీద స్పందించరు. విద్య, ఆరోగ్యంపై స్పందించరు. మతం, మాంసం అంటే చాలు... స్టేట్‌మెంట్‌లు ఇవ్వటానికి, కామెంట్లు పెట్టటానికి ఒక్క దుముకు దుముకుతారు.

నిజానికి చైత్ర మాస నవరాత్రులు ఏప్రిల్ 9న ప్రారంభమై, 17న శ్రీరామనవమికి ముగుస్తాయి. మేము చేగ్రాను తింటున్న వీడియో ఏప్రిల్ 8 నాటిది.

మాంసం తిన్నామని మెడలో ఎవరైనా ఎముకలు వేసుకుంటారా అన్నది కాదు... మాంసం తిన్నారని ఆరోపించటానికి ఎవరైనా మెడలో ఎముకలు వేసుకుంటారా అన్నదే ప్రశ్న ఇప్పుడు!!

రాజ్యాంగ స్ఫూర్తే రణ దుందుభి

జనతంత్రం



వర్ధెల్లి మురళి

అంబేడ్కర్‌ను తలుచుకునే ప్రతి సందర్భంలోనూ మనకు భారత రాజ్యాంగం తలపునకొస్తూనే ఉంటుంది. నాలుగు వేదాల్లోని సారమెల్లా మహాభారతంలో ఉన్నదని ప్రతీతి. మానవ హక్కులకు పట్టం కట్టిన ప్రతి చారిత్రక పత్రంలోని సారాంశమంతా మన రాజ్యాంగంలో ఉన్నది. ఎనిమిది శతాబ్దాల కిందటి 'మాగ్నాకార్టా' దగ్గరి నుంచి ఎనిమిది దశాబ్దాల నాటి 'విశ్వజనీన మానవ హక్కుల ప్రకటన' (యుఎస్) వరకు ఆ యా కాలాల్లోని డిక్లరేషన్లు ప్రజాస్వామ్య వ్యవస్థలకు ప్రాణ ప్రతిష్ఠ చేశాయి. ఈ డిక్లరేషన్లన్నిటిలోకి నిస్సందేహంగా అగ్రగణ్యమైనది, అత్యున్నతమైనది భారత రాజ్యాంగం. మానవ హక్కుల కథా గమనంలో పంచమవేదంలా పుట్టిన మహాకావ్యం భారత రాజ్యాంగం.

దేశంలో సాధారణ ఎన్నికల వడగాడ్పుల సందర్భం కూడా ఇది. రాజ్యాంగాన్ని మార్చడం అనే అంశంపై చెలరేగుతున్న వాదోపవాదాలు కూడా ఈ సందర్భాన్ని మరింత వేడెక్కిస్తున్నాయి. రెండేళ్ల కిందట కావచ్చు, అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా రాజ్యాంగాన్ని మార్చవలసిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ప్రజలు ఆయనకా అవకాశం ఇవ్వలేదు. ఆయన్నే మార్చేశారు. కాలపరిస్థితులను బట్టి రాజ్యాంగంలో స్వల్ప సవరణలు సహజమే. కానీ దాని మౌలిక స్వరూపాన్ని మార్చే అధికారం ఎవ్వరికీ లేదని ఇప్పటికే భారత సర్వోత్తమ న్యాయస్థానం ఘంటాపథంగా చాటిచెప్పింది. మౌలిక స్వరూపం అంటే ఏమిటో దాని పీఠికలో ఉన్న ఆరు వాక్యాలు చదివితే అర్థమవుతుంది.

బీజేపీ నాయత్వంలోని ఎన్డీఏ కూటమి మరోమారు గెలిస్తే రాజ్యాంగం మౌలిక స్వరూపాన్ని మార్చేస్తుందని ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు చేస్తున్నారు. ఈ ఆరోపణల్ని బీజేపీ వాళ్లు మొక్కుబడిగా మాత్రమే ఖండిస్తున్నారు. అనంత హెగ్డే వంటి కొందరు నాయకులు బహిరంగంగానే రాజ్యాంగం మార్పుకు అనుకూలంగా మాట్లాడుతున్నారు. బీజేపీ అనే రాజకీయ వేదికకు సొంతదారైన ఆరెస్సెస్‌కు మన రాజ్యాంగం పట్ల మొదటి నుంచీ సదభిప్రాయం లేదన్నది సత్యదూరం కాదు. పైగా ఈసారి బీజేపీ వాళ్లు 400 సీట్లలో తమ కూటమి గెలవాలని తెగ ఆరాటపడుతున్నారు. ఈ ఆరాటం వెనుక ఉన్న మహాత్కార్యం రాజ్యాంగ మౌలిక మార్పులేనన్నది విమర్శకుల అభిప్రాయం.

భారత రాజ్యాంగంలో ధ్వనించే సమతా నినాదం సంఘ్ పరివార్‌కు ఏమాత్రం కర్ణపేయం కాదు. ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వపు పదేళ్ల పదవీకాలంలో 40 శాతం దేశ సంపద ఒక్క శాతం కుబేరుల గుప్పెట్లోకి చేరిపోవడమే ఇందుకు ఉదాహరణ. వ్యవసాయరంగం నుంచి రైతు కూలీలను తరిమికొట్టి చీప్ లేబర్‌తో మార్కెట్లను నింపడం ఈ కూటమి విధానం. అందుకోసం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాల ప్రహసనం తెలిసిందే. బీజేపీకి భారీ మెజారిటీ వస్తే పీఠికలోని సెక్యులర్, సోషలిస్టు పదాలు గ్యారంటీగా ఎగిరిపోతాయని చాలామంది భావన. 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఇందిరాగాంధీ ఈ పదాలను జొప్పించారు. ఈ పదాలను తొలగించినప్పటికీ ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల్లోని 39 అధికరణాల రూపంలో వాటి పునాదులు బలంగానే ఉంటాయి. అయితే ఆ పునాదులనే పెకిలించే అవకాశాలుండవచ్చని దేశంలోని బుద్ధిజీవులు భయపడుతున్నారు.

ఏ గూటి పక్షులు ఆ గూటికే చేరుతాయని సామెత. పెత్తందారీ వర్గాల తాబేదారు పాత్రలో జీవితాన్ని తరింపజేసుకుంటున్న చంద్రబాబు నాయుడు బీజేపీకి సహజ మిత్రుడు. ప్రస్తుత ఎన్నికలతో కలిసి గడిచిన ఆరు సాధారణ ఎన్నికల్లో నాలుగుసార్లు ఆయన బీజేపీ కూటమిలోనే ఉన్నారు. రెండుసార్లు మాత్రమే దూరంగా ఉన్నారు. బీజేపీపై జనంలో వ్యతిరేకత ఉందన్న అభిప్రాయంతో మాత్రమే ఆయన రెండుసార్లు దూరం జరిగారు. కాకుల్ని కొట్టి గద్దలకు వేసే ఆర్థిక విధానాల్లో ఆయన బీజేపీ కంటే నాలుగు ఆకులు ఎక్కువే చదివారు. పేద ప్రజల పట్ల, బలహీన వర్గాల పట్ల తన ఏహ్యభావాన్నీ, అసహ్యాన్నీ దాచుకునే ప్రయత్నం కూడా చంద్రబాబు పార్టీ చేయదు. పేద ప్రజలకు రాజధాని ప్రాంతాల్లో ఇళ్ల కేటాయిస్తే సామాజిక సమతుల్యత దెబ్బతింటుందని కేసులు వేసి గుడ్డలూడదీసుకున్న వారి గురించి ఇంకేం మాట్లాడాలి?

> బీజేపీ నాయత్వంలోని ఎన్డీఏ కూటమి మరోమారు గెలిస్తే రాజ్యాంగం మౌలిక స్వరూపాన్ని మార్చేస్తుందని ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు చేస్తున్నారు. ఈ ఆరోపణల్ని బీజేపీ వాళ్లు మొక్కుబడిగా మాత్రమే ఖండిస్తున్నారు. అనంత హెగ్డే వంటి కొందరు నాయకులు బహిరంగంగానే రాజ్యాంగం మార్పునకు అనుకూలంగా మాట్లాడుతున్నారు. బీజేపీ అనే రాజకీయ వేదికకు సొంతదారైన ఆరెస్సెస్‌కు మన రాజ్యాంగం పట్ల మొదటి నుంచీ సదభిప్రాయం లేదన్నది సత్యదూరం కాదు. పైగా ఈసారి బీజేపీ వాళ్లు 400 సీట్లలో తమ కూటమి గెలవాలని తెగ ఆరాటపడుతున్నారు. ఈ ఆరాటం వెనుక ఉన్న మహాత్కార్యం రాజ్యాంగ మౌలిక మార్పులేనన్నది విమర్శకుల అభిప్రాయం.
>
> భారత రాజ్యాంగంలో ధ్వనించే సమతా నినాదం సంఘ్ పరివార్‌కు ఏమాత్రం కర్ణపేయం కాదు. ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వపు పదేళ్ల పదవీ కాలంలో 40 శాతం దేశ సంపద ఒక్క శాతం కుబేరుల గుప్పెట్లోకి చేరి పోవడమే ఇందుకు ఉదాహరణ. వ్యవసాయరంగం నుంచి రైతు కూలీలను తరిమి కొట్టి చీప్ లేబర్‌తో మార్కెట్లను నింపడం ఈ కూటమి విధానం. అందుకోసం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాల ప్రహసనం తెలిసిందే. బీజేపీకి భారీ మెజారిటీ వస్తే పీఠికలోని సెక్యులర్, సోషలిస్టు పదాలు గ్యారంటీగా ఎగిరిపోతాయని చాలా మంది భావన.



కుల, మత, ప్రాంత, రాజకీయ, లింగ వివక్షలేవీ లేకుండా నాణ్యమైన అంతర్జాతీయ స్థాయి విద్యను ప్రజలందరికీ అందజేయాలనే ఒక బృహత్తరమైన యజ్ఞాన్ని జగన్ ప్రభుత్వం ప్రారంభించింది. చంద్రబాబు కూటమి ఈ యజ్ఞాన్ని చూసి కళ్లలో నిప్పులు పోసుకోవడం తెలిసిందే. ఇంగ్లిషు మీడియం విద్యకు వ్యతిరేకంగా, అంతర్జాతీయ స్థాయి బోధనా పద్ధతులకు వ్యతిరేకంగా, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు వ్యతిరేకంగా యెల్లో పెత్తందార్లు నడిపిన కుట్రల సంగతి కూడా తెలిసిందే. అన్ని రంగాల్లోనూ ఇదే తంతు. పేద వర్గాలను, మహిళలను వారి కాళ్లపై నిలబెట్టడానికి జగన్ సర్కార్ చేస్తున్న ప్రతి ప్రయత్నాన్నీ యెల్లో పెత్తందార్లు వ్యతిరేకిస్తున్నారు. పరిపాలనా వికేంద్రీకరణ ఎంత పెరిగితే అంతగా పారదర్శకత పెరుగుతుంది. అచ్చమైన ప్రజాస్వామ్యానికి ఇది సిసలైన లక్షణం. జగన్ ప్రభుత్వం పారదర్శకతకు పెద్ద పీట వేసింది. ప్రభుత్వ పాలనను ప్రజల ఇంటి గడప వద్దకు చేర్చింది.

వికేంద్రీకరణకు పెత్తందార్లు ఎప్పుడూ వ్యతిరేకమే. పాలనా వ్యవహారాలన్నీ వారి గుప్పెట్లోనే ఉండాలి. పారదర్శకత అనే పదం వారి డిక్షనరీలోనే ఉండదు. మాదాపూర్‌లో ఐటీ పార్క్ రాబోతున్నదనే రహస్యం వారికి మాత్రమే తెలియాలి. చుట్టూరా భూములన్నీ వారి వర్గం వారే కొనుగోలు చేయాలి. ఆ తర్వాతనే పార్క్ ప్రకటన రావాలి. రాజధాని ఎక్కడ వస్తుందో వారికి మాత్రమే తెలియాలి. వారి వర్గం అక్కడి భూములన్నీ కొనుగోలు చేయాలి. ఆ తర్వాతనే రాజధాని ప్రకటన చేయాలి. ఈలోగా ఇతర వర్గం ఔత్సాహికులను తప్పుదారి పట్టించడానికి తప్పుడు లీకులు వదలాలి. చంద్రబాబు నాయకత్వంలోని పెత్తందార్ల కూటమి అనుసరిస్తున్న ఈ తరహా రియల్ ఎస్టేట్ వ్యాపారానికే వారు అభివృద్ధి అనే ముద్దు పేరు పెట్టుకున్నారు.

భారత రాజ్యాంగం ప్రవచించిన ఆదేశిక సూత్రాలను శిరసావహించినందుకు జగన్ పాలన విధ్వంసకర పాలనని మన తోలుమందం పెత్తందార్లు ప్రచారం చేస్తున్నారు. యావత్తు ప్రపంచం వాంఛిస్తున్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ఆదర్శంగా పెట్టుకున్నందుకు జగన్ పరిపాలన వారికి వినాశకరమైనదిగా కనిపిస్తున్నదట! దశాబ్దాలు గడిచిపోతున్నా అధికార పదవుల్లో ఆవగింజంత వాటా కూడా దొరకని వర్గాలను సమీకరించి సామాజిక న్యాయం బాట పట్టినందుకు జగన్ సర్కార్‌కు కొమ్ములు మొలిచాయట! కొవ్వు బలిసిన పెత్తందారీ వర్గాల ప్రచారం తీరు ఇది.

ఎన్డీఏ పదేళ్ల ఏలుబడిలో నిరుద్యోగ సమస్య జడలు విప్పి నర్తిస్తున్నది. మన తెలుగు పెత్తందార్లకు ఆ జడల దయ్యం ముద్దొస్తున్నది. ఐదేళ్ల కింద రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు నాలుగు లక్షల మంది ఉంటే జగన్ సర్కార్ హయాంలో వారి సంఖ్య ఆరున్నర లక్షలకు పెరిగింది. ఏకాయెకిన యాభై శాతం ఉద్యోగాలు అదనంగా కల్పించిన జగన్ ప్రభుత్వం వారికి విలన్‌గా కనిపిస్తున్నది. ఈ సంఖ్యలో వలంటీర్లను చేర్చలేదు సుమా! పరిశ్రమల స్థాపనలోగానీ, మౌలిక వసతుల కల్పనలోగానీ, ఉపాధి కల్పనలోగానీ, సంక్షేమ కార్యక్రమాల అమలులోగానీ గణాంకాల ఆధారంగా జగన్ సర్కార్‌తో పోల్చడానికి ఈ పెత్తందార్లు ముందుకు రావడం లేదు. కేవలం విధ్వంసం, వినాశనం, సర్వనాశనం అనే పడికట్టు మాటలతో శాపనార్థాలు పెడుతూ పూట గడుపుకొస్తున్నారు.

యెల్లో మీడియా అనుసరిస్తున్న ఈ తరహా ఊకదంపుడు గోబెల్స్ ప్రచారం కాలం చెల్లిన చీప్ ట్రిక్. ప్రజల చైతన్యస్థాయి పెరిగింది. సమాచార మాధ్యమాలు పెరిగాయి. ఎవరు మిత్రుడో, ఎవరు శత్రువో గుర్తించగలిగే వివేచనా శక్తి జనంలో పెరిగింది. రాజ్యాంగబద్ధమైన తమ హక్కులను రక్షించుకోవడానికి ప్రజలు సంఘటితమవుతున్నారు. కేంద్రంలో ఒక విశ్వసనీయమైన ప్రతిపక్షం, విశ్వసనీయ ప్రతిపక్షనేత అందుబాటులో లేకపోవడం అనే ఒకే ఒక్క కారణం మరోసారి ఎన్డీఏను గద్దెనెక్కించవచ్చు. అదీ బొటాబొటీ మెజారిటీతో మాత్రమే! కూటమి ఆశిస్తున్నన్ని సీట్లు గెలవడం అసంభవం. పెత్తందారీ వర్గాలకు వ్యతిరేకంగా గట్టిగా నిలబడి రాజ్యాంగ లక్ష్యాల అమలుకు ప్రయత్నిస్తున్న జగన్ సర్కార్ బలంగా ఉన్నందువల్ల ఆంధ్రప్రదేశ్‌లో పేదవర్గాల జైత్రయాత్ర కొనసాగుతుందని అంచనాలు వెలువడుతున్నాయి. మొత్తం 25 లోక్‌సభ స్థానాలతో పాటు నూటాయాభైకి పైగా అసెంబ్లీ స్థానాలను వైసీపీ గెలుచుకున్నా ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు.

vardhelli1959@gmail.com

రాజ్యాంగ రక్షణ పండుగ

సందర్భం



మాడభూషి శ్రీధర్

రాజ్యాంగం మనం రచించుకున్న అద్భుత వ్యవస్థ. రాజ్యాంగం ఒక సజీవమైన వ్యవస్థ. అందులో కొన్ని విలువలు ఉన్నాయి. మనం నమ్ముకోవలసిన ప్రజాస్వామ్యం, స్వతంత్రం, సమానత సౌభ్రాతృత్వం, ఆలోచనా స్వేచ్ఛ, భావ ప్రకటన, బాధ్యతలు, అన్ని మతాలనూ గౌరవించడం, సామాజిక స్నేహం, జాతీయ సమైక్యత, సమగ్రత – ఇవీ ఆ విలువలు.

ఆ విలువల రాజ్యాంగాన్ని రచించుకోవడానికి 'రాజ్యాంగ సభ' ఏర్పాటయింది. ఎన్నికల్లో గెలిచిన ప్రతినిధులు మాత్రమే రాజ్యాంగ సభలో సభ్యులయ్యారు. రాజ్యాంగ రచనలో కీలక పాత్ర వహించిన అంబేడ్కర్‌ను బొంబాయి గెలిపించలేదు. బెంగాల్ నుంచి ముస్లింలీగ్ మద్దతుతో రాజ్యాంగ సభ సభ్యులైనారు. దళితులకు, మైనారిటీలకు సమాన హక్కులు సాధించడానికే వస్తున్నానన్నారు. కాని, దేశవిభజనతో ఆయన స్థానం పాకిస్తాన్‌లోకి వెళ్లిపోయింది. బొంబాయి రాష్ట్ర ప్రధాన మంత్రి (స్వాతంత్ర్యానికి ముందు ఆ యా రాజ్యాలకు ప్రధానమంత్రులు ఉండేవారు) బీఎస్ ఖేర్‌కు రాసిన ఒక ఉత్తరంలో అంబేడ్కర్‌ను బొంబాయి నుంచి గెలిపించాలని రాజేంద్ర ప్రసాద్ కోరారు. ఎంఆర్ జయకర్‌తో రాజీనామా చేయించి, అంబేడ్కర్‌ను గెలిపించుకుని రాజ్యాంగ సభకు పంపారాయన. అంబేడ్కర్ మహోన్నత విద్యావంతుడు, అటు ఆర్థిక శాస్త్రం, ఇటు న్యాయశాస్త్రం ఆపోశన పట్టినవారు. పాలనా వ్యవస్థల నిర్మాణం గురించే అధ్యయనం చేసిన వ్యక్తి. కనుక రజ్యాంగ రచనా ఉప సంఘంలో ఆయన ఉండాలని రాజేంద్రప్రసాద్ సూచించారు. ఈ డ్రాఫ్టింగ్ కమిటీలో అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, ఎన్. గోపాలస్వామి అయ్యంగార్, కేఎం మున్షీ, మహ్మద్ సాదుల్లా, బీఎల్ మిట్టర్ (వీరు అనారోగ్యంతో రాజీనామా చేస్తే ఎన్. మాధవరావు సభ్యులైనారు), డీపీ ఖైతాన్ (వీరు 1948లో మరణిస్తే టీటీ కృష్ణమాచారి చేరారు)లు ఇతర సభ్యులు. ఈ సంఘం సభ్యులు 1947 ఆగస్టు చివర తొలి సమావేశంలో అంబేడ్కర్‌ను తమ కమిటీ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. గోపాలస్వామి అయ్యంగార్ రాజ్య వ్యవహారాల్లో తలమునకలై ఉన్నారు. సాదుల్లా, మాధవరావులకు ఢిల్లీ వాతావరణం సరిపడలేదు. పాలన, న్యాయ, రాజ్యాంగ రంగాలలో నిపుణుడైన బీఎస్ రావ్, ఆ యా దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి మన దేశంలో



అప్పుడున్న భారత ప్రభుత్వ చట్టం 1935ను విస్తరిస్తూ రాజ్యాంగం మొదటి చిత్తు ప్రతిని రూపొందించారు. ఆ తరువాత అందులో సూత్రాలను పునర్నిర్మించడంలో కీలకమైన కృషి చేశారు. ఆయన కూడా తరువాత విదేశాల్లో ఉండిపోవడం వల్ల అందుబాటులో లేరు. ఒకరిద్దరి పాత్ర లేనే లేదు. మరికొందరి పాత్ర స్వల్పం. దీంతో మొత్తం భారం అంబేడ్కర్ పైన పడిందని టీటీ కృష్ణమాచారి చెప్పారు.

అంబేడ్కర్ ఆ బాధ్యతను నిర్వహించి 'రాజ్యాంగ పిత' అయ్యారు. మరికొన్ని ఉపసంఘాలు కూడా చాలా సహకరించాయి. కేంద్ర అధికారాల కమిటీకి నెహ్రూ, రాష్ట్రాల అధికారాల కమిటీ నేతగా వల్లభాయ్ పటేల్, ప్రాథమిక హక్కుల కమిటీకి జేబీ కృపలానీ, ఇంకా అనేకానేక అంశాలపై ఎన్నో ఉపసంఘాలూ పనిని పంచుకున్నాయి. ప్రాథమిక హక్కుల కమిటీకి అంబేడ్కర్ ఇచ్చిన వివరమైన పత్రం చాలా కీలకమైంది.

భారత రాజ్యాంగం గురించి చర్చించుకునేటప్పుడు మనం 'గ్రాన్విల్ ఆస్టిన్' అనే అమెరికా పౌరుని గురించీ మాట్లాడుకోవాలి. ఈ భారత రాజ్యాంగ చరిత్రను అధ్యయనం చేసి, అర్థం చేసుకుని జీర్ణం చేసుకున్న వ్యక్తి ఆస్టిన్. 1940 నుంచి 2013 దాకా భారత రాజ్యాంగాన్ని చదువుకుని, పాఠాలు చెప్పుకుంటూ, ఒక్కో పదాన్ని రిసర్చ్ చేసిన వ్యక్తి ఆయన. నెహ్రూ, గాంధీ, అంబేడ్కర్ వంటివారు ఎందరితోనో మాట్లాడి, ప్రతి విషయాన్నీ డాక్యుమెంట్ చేసుకుని, ఫైళ్లు స్వయంగా చూసి, చదువుకుని, రాసిన వారితో మాట్లాడి, ఏమాట ఎందుకన్నారో, దాని వెనుక ఉద్దేశం ఏమిటో సవివరంగా రాసిన పుస్తకాలు రెండు ఉన్నాయి. చదువుకున్న ప్రతి వ్యక్తీ, న్యాయవాదీ, న్యాయశాస్త్ర విద్యార్థీ చదవవలసిన పుస్తకాలు ఇవి. వందేళ్లు బతికి మన రాజ్యాంగాన్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకున్న ఆస్టిన్ 1966లో రాసిన 'ది ఇండియన్ కాన్‌స్టిట్యూషన్: కార్నర్ స్టోన్ ఆఫ్ ఎ నేషన్' చదివి తీరవలసిన పుస్తకం.

మన రాజ్యాంగం 'ఆబ్జెక్టివ్స్ రిసొల్యూషన్' (లక్ష్యాల నిర్దేశం)తో ప్రారంభమయ్యిందని అంటూ ఉంటారు. 1946 డిసెంబర్ 9న చరిత్రాత్మకమైన రాజ్యాంగ నిర్మాణ (రచన అని అన్నా, అనాల్సింది మాత్రం నిర్మాణం అని) కార్యక్రమం ఆరంభమైంది. ప్రముఖ రచయిత సుధీంద్ర కులకర్ణి రాజ్యాంగ పీఠికకు ముందున్న 'లక్ష్య నిర్ధారణ' అనేది రాజ్యాంగానికి ప్రాణం అనీ, ప్రాణప్రతిష్ఠ అనే మాట కూడా వాడారు.

లక్ష్య నిర్ధారణ మనం చేయదలచుకున్న మంచిపనులేమిటో నిర్ణయిస్తుంది. తత్వభూమికను వివరిస్తుంది. అయోధ్య భాషలో అయితే రాజ్యాంగానికి ప్రాణప్రతిష్ఠ లక్ష్య తీర్మానం 1947 జనవరి 22న ఏకగ్రీవంగా స్వీకరించారు. ఆ రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి. రాబోయే ఓట్ల పండుగను తిట్ల పండగగా కాకుండా, ఈ దేశాన్నీ, రాజ్యాంగాన్నీ రక్షించడానికి ఉపయోగించాలి. రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును వినియోగించుకోవాలి. సరైన వ్యక్తులకు ఓటు వేయాలి.

వ్యాసకర్త మహేంద్ర యూనివర్సిటీ 'స్కూల్ ఆఫ్ లా'లో ప్రొఫెసర్

దేశ భవిష్యత్తుకు దిక్సూచి!

సందర్భం




డా॥ కత్తి పద్మారావు

ప్రపంచ మేధావి, ఆలోచనాపరుడు, తత్వవేత్త, భారత రాజ్యాంగ నిర్మాణ కర్త డా॥ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతి ప్రపంచవ్యాప్తంగా స్ఫూర్తిని నింపుతున్న ఒక చారిత్రక ఉత్సవం. అంబేడ్కర్ నిరంతర అధ్యయనం, విశ్లేషణ, తర్కం, హేతువాదం, మానవతావాదం; ఆర్థిక, సాంఘిక, రాజకీయవాదాలు; బౌద్ధ విప్లవ ప్రస్థానం... ఆయన విస్తృతినీ, వ్యాప్తినీ, ప్రాపంచిక తాత్విక దృక్పథాన్నీ మనకు సాక్షాత్కరింపజేస్తున్నాయి.

ఆయన ఒక వాల్టేర్ లాగా, రూసో లాగా ప్రపంచానికి ఒక నూతన దర్శనాన్ని అందించారు. ఆయన వ్యక్తిత్వంలో విద్యాజ్ఞానం, పరిశోధన, నైతికత, విమోచన కలిసి నడుస్తాయి. ఆయన బహుభాషా నిష్ణాతులు. మరాఠా భాష ఎంత బలంగా వచ్చో ఇంగ్లీషు, జర్మనీ కూడా అంతే నిశితంగా వచ్చు. ఆయన ఒక భాషా నిఘంటువు. ఆయన విద్యాభ్యాసంలో ఒక యుద్ధ ప్రక్రియ ఉంది. ఆయన ఆర్థిక శాస్త్ర నిపుణులు. అంబేడ్కర్ అపారమైన జ్ఞాపక శక్తి కలవారు. రాజ్యాంగ సభ డిబేట్స్‌లో కొన్ని వందల అంశాలు చూడకుండా చెప్పగలిగే వారు. ఆయన వాక్చాతుర్యానికీ, వాదనా పటిమకూ, విషయ పరిజ్ఞానానికీ బాబు రాజేంద్ర ప్రసాద్, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, రాజాజీ వంటి వారు అచ్చెరువొందేవారు.

అంబేడ్కర్ సున్నితమైన హాస్య చతురుడు. చక్కని చిరునవ్వుతో ఆయన కళ్ళు మెరుస్తూ ఉండేవి. ఆయన చూపుడు వేలు ప్రపంచానికి ఓ ప్రశ్నోపనిషత్తు వంటిది. అంబేడ్కర్ 1913లో న్యూయార్క్‌లోని కొలంబియా విశ్వవిద్యాలయంలో విద్యార్థిగా, పరిశోధకుడిగా 'బ్రిటిష్ ఇండియాలో ప్రావెన్షియల్ ఫైనాన్స్ పరిణామం' అనే థీసిస్ రాసి ఎందరి మెప్పునో పొందారు. 1916లో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో డాక్టరేట్ పట్టా పుచ్చుకోవడం కోసం రాత్రింబవళ్లు శరీరం శుష్కించే వరకూ చదివారు.

విద్య పట్ల అంబేడ్కర్ దృక్పథాన్ని గమనిస్తే ఆయన విద్య అంటే కేవలం అక్షరాస్యత అనో, చదువనో అనుకోలేదని స్పష్టమవుతుంది. విద్య మనిషిని సంపూర్ణంగా మార్చగలిగే సాధనమన్నది అంబేడ్కర్ నమ్మకం. ఈ విషయంలో ఆయనపై బౌద్ధ ధర్మ ప్రభావం ఉన్నట్లు అనిపిస్తుంది. బుద్ధుడి బోధనలు, తాత్విక చింతన కేంద్రంగానే అంబేడ్కర్ విద్యను అభ్యసించారు. విద్య పరమార్థం ప్రజ్ఞ, కరుణ, సమత అనీ, ఈ త్రిగుణాలు పెంపొందించినప్పుడే విద్యకు పరిపూర్ణత చేకూరుతుందనీ అంబేడ్కర్ భావించారు. సమాజంలో విద్య ద్వారా చైతన్యం వస్తుందన్న ఉద్దేశంతో ఆయన విద్యా వ్యాప్తి కోసం 1945 నుంచి ఒక ఉద్యమం ప్రారంభించారు.



'పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ' పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేసి, అనేక విద్యాలయాలు, కళాశాలల ఏర్పాటుకు కృషి చేశారు. జ్ఞానం, కరుణ అనేవి తాను స్థాపించిన సొసైటీ ప్రధాన లక్ష్యాలుగా పేర్కొన్న అంబేడ్కర్ 'హక్కుల సాధన కోసం చదువుకోండి! సంఘటితం కండి! పోరాడండి! మీపైన మీరు విశ్వాసం పెంచుకోండి! ఏ రకంగా కూడా మనకు ఓటమి ఉండదు. ఇది విజయం కోసం చేస్తున్న పోరాటం, స్వేచ్ఛ కోసం సాగిస్తోన్న యుద్ధం, ఈ యుద్ధం మనం కోల్పోయిన వ్యక్తిత్వాన్ని తిరిగి పొందడానికి చేస్తున్నది' అని ఉద్బోధించారు. సామాజిక మార్పు పోరాటాల ద్వారా, పోరాటాలు విజ్ఞానం ద్వారా, విజ్ఞానం విద్య ద్వారా అందుతాయన్నది అంబేడ్కర్ మార్గం. అలాగే దళితులు చదువు కోవడం ద్వారా సంప్రదాయ వృత్తుల్లో స్థిరపడే అవకాశం ఉండదనీ, తద్వారా తమ తరతరాల కులవృత్తులు చేస్తున్నందువల్ల ఎదురవుతున్న చిన్నచూపు తప్పుతుందనీ అంబేడ్కర్ ఆలోచన.

అంబేడ్కర్ మనుస్మృతి భావజాలానికి ప్రత్యామ్నాయంగా భారత రాజ్యాంగాన్ని రూపొందించారు. ఆయన పాండిత్యం, విజ్ఞత, మానవతా దృష్టి, బౌద్ధనీతి, సమ సమాజ భావన, భారత రాజ్యాంగంలో సముచితంగా సమన్వయించబడ్డాయి. అంబేడ్కర్‌లో కుల నిర్మూలనా భావం, దార్శనికత, అహింసాతత్వం, భారతదేశాన్ని రక్తపాతం లేని దేశంగా సృష్టించగలిగింది. రాజ్యాంగంలో స్త్రీలందరికీ చదువుకునే హక్కు ఇవ్వటం ద్వారానూ, అస్పృశ్యులందరికీ రిజర్వేషన్ కల్పించడం ద్వారానూ, శూద్రులందరికీ హక్కులు కల్పించడం ద్వారానూ ఆయన సమ సమాజ నిర్మాణానికి పునాదులు వేశారు.

అంబేడ్కర్ విద్యా విప్లవంతో పాటు రాజకీయోద్యమాన్నీ నడిపారు. 1936 ఆగస్టులో దళిత జాతుల సముద్ధరణకు 'ఇండిపెండెంట్ లేబర్ పార్టీ'(ఐఎల్‌పీ)ని ఆయన స్థాపించారు. ఈ పార్టీ బొంబాయిలో షెడ్యూల్డ్ కులాలకు కేటాయించిన పదిహేను సీట్లలో పదమూడింటిని కైవసం చేసుకుంది. జనరల్ సీట్లను కూడా రెండింటిని కైవసం చేసుకుంది. ఆయన 'లేబర్' అనే పదానికి 'అణగదొక్కబడిన' అనే అర్థాన్ని రూపొందించారు. ఆర్థికంగా, సాంఘికంగా అణగదొక్కబడిన వారందరినీ ఈ పార్టీలోనికి తేవడానికి ప్రయత్నించారు. రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సుల్లో కాంగ్రెస్ వ్యవహరించిన తీరును బట్టి ఆ పార్టీ దళితులకు ప్రాతినిధ్యం వహించడం లేదని డా॥ అంబేడ్కర్ స్పష్టం చేశారు. ఆ పార్టీని విస్తృత పరచాలనే ఉద్దేశ్యంతో అంబేడ్కర్ 1942 జూలైలో ఆలిండియా షెడ్యూల్డ్ క్యాస్ట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్‌సీఎఫ్)ను స్థాపించారు. ఆ సందర్భంగా దళితుల సాంఘిక, ఆర్థిక హక్కులను సాధించడానికి వారికి రాజకీయ అధికారం కావాలని ప్రబోధించారు.

1962లో విడుదల చేసిన ప్రణాళికలో ఆయన తన వామపక్షాల భావాలను ప్రకటించారు. భారతీయుడైన ప్రతివాడూ ఆర్థిక, సాంఘిక స్వాతంత్ర్యాలను పొందాలని నొక్కి వక్కాణించారు. ప్రతి మనిషికీ నిర్భయంతో కూడిన స్వేచ్ఛను సాధించడం ప్రభుత్వ బాధ్యత అని ప్రతిపాదించారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ ప్రణాళిక అణగదొక్కబడ్డ వారి సాంఘిక సమానత్వాన్ని నొక్కి చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగస్తులకు బీమా పథకాన్ని తప్పనిసరిగా అమలు జరపాలని కోరారు. ఏఐఎస్‌సీఎఫ్ నుండి రిపబ్లికన్ పార్టీ వరకు నడిచిన దారిలో దళితుల కోసం ఆర్థిక, సాంఘిక, రాజకీయ సమానతల కోసం తన శక్తిని ధారపోశారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియాను పార్టీగా ప్రకటించక ముందే ఆయన పరి నిర్వాణం చెందారు.

ఈ విధంగా అంబేడ్కర్ సామాజికంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా, తాత్వికంగా, భారతీయ సమాజాన్ని పునః నిర్మించటానికి కృషి చేశారు. ఆయన ప్రపంచ మానవునిగా ఎదిగారు, ప్రపంచ తత్వవేత్తలలో ఒకరిగా నిలిచారు. భారతదేశానికి ఎనలేని కీర్తి తెచ్చారు. ఆయన నిర్మించిన రాజ్యాంగమే మన దేశ భవిష్యత్తుకు దిక్సూచి. ఆయన మార్గంలో నడుద్దాం.

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు । 98497 41695

(నేడు డా॥ బీఆర్ అంబేడ్కర్ జయంతి)

షర్మిల, సునీతపై వైఎస్సార్ సోదరి విమలమ్మ

- వైఎస్సార్ శత్రువుల చేతుల్లో వాళ్లు కీలుబొమ్మలయ్యారు... వైఎస్ కుటుంబ పరువును రోడ్డుకీడుస్తున్నారు
- వైఎస్ ఇంటి ఆడపడుచుల తీరు అన్యాయంగా ఉంది
- వారిద్దరూ నోరుమూసుకోవాలి.. ఇంటి ఆడపడుచుగా నేను చెబుతున్నా
- వివేకానందరెడ్డి హత్యతో అవినాశ్, భాస్కర్‌రెడ్డిలకు సంబంధంలేదు
- హత్య చేసిన దస్తగిరి మాత్రం దర్జాగా తిరుగుతున్నాడు
- అతని మాటలు విని అవినాశ్‌ను వేధిస్తారా
- షర్మిల, సునీత ఇప్పటికైనా తమ తీరు మార్చుకోవాలి
- ప్రజలకు మంచిచేసే జగన్ మళ్లీ సీఎం కావాలి
- మీడియాతో వైఎస్సార్ సోదరి విమలమ్మ

వారిద్దరిదీ అసూయ, ద్వేషం

సాక్షి, అమరావతి: 'వైఎస్ కుటుంబ ఆడపడుచులు షర్మిల, సునీత అన్యాయంగా మాట్లాడుతున్నారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబ గౌరవానికి భంగం కలిగిస్తున్నారు. నేనూ వైఎస్ కుటుంబ ఆడపడుచునే. వివేకానందరెడ్డి అందరికంటే నాకే ఎక్కువ సన్నిహితుడు. ఆ కుటుంబ ఆడపడుచుగా చెబుతున్నా.. మా అన్నయ్య వైఎస్ వివేకానందరెడ్డి హత్యతో ఎంపీ అవినాశ్‌రెడ్డికిగానీ వైఎస్ భాస్కర్‌రెడ్డికిగానీ ఎలాంటి సంబంధంలేదు'.. అని వైఎస్ రాజశేఖర్ రెడ్డి సోదరి విమలమ్మ విస్పష్టంగా ప్రకటించారు. 'కొంగు పట్టుకుని షర్మిల ఓట్లు అడుగుతున్న వీడియో చూసి చాలా బాధపడ్డాను. వైఎస్ కుటుంబ


వైఎస్ విమలమ్మ

పరువును ఆమె రోడ్డుకీడుస్తున్నారు. ఆమెలో నాయకత్వ లక్షణాల్లేవు. నిత్యం వైఎస్ అవినాశ్‌ను విమర్శిస్తున్నారు. అతను హత్య చేయడంగానీ చేయించడంగానీ వాళ్లు చూశారా? సీఎం జగన్‌పై కూడా దుష్ప్రచారం చేస్తున్నారు. ఎవరు హత్యచేశారో షర్మిల, సునీతే నిర్ణయించేస్తే ఇక కోర్టులు, జడ్జీలు ఎందుకు?' అని ఆమె సూటిగా ప్రశ్నించారు. విజయవాడలో శనివారం విమలమ్మ మీడియా సమావేశంలో మాట్లాడుతూ పలు కీలక అంశాలపై ఇలా సూటిగా స్పందించారు. ఆమె ఇంకా ఏమన్నారంటే..

వైఎస్సార్ శత్రువుల చేతుల్లో కీలుబొమ్మలుగా షర్మిల, సునీత..

వైఎస్ రాజశేఖరరెడ్డి శత్రువులంతా ఒక్కటయ్యారు. ఈ తరుణంలో వైఎస్ కుటుంబం అంతా కలిసికట్టుగా ఉండాలి. కానీ, వైఎస్ శత్రువుల చేతుల్లో షర్మిల, సునీత కీలుబొమ్మలయ్యారు. వాళ్లిద్దరి చుట్టూ ప్రస్తుతం వైఎస్ కుటుంబ శత్రువులే ఉన్నారు. షర్మిల, సునీతలకు చెబుతున్నా.. వారు నోరు మూసుకోవాలి. పేద ప్రజలకు మంచి చేస్తున్న జగన్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూడటం సరికాదు. వారిద్దరూ ఎందుకిలా చేస్తున్నారో అర్థంకావడం లేదు. డబ్బు కోసమో పదవి కోసమే తెలీడం లేదుగానీ అసూయ, ద్వేషంతో వ్యవహరిస్తున్నారు. ఏదో ఆశించే ఇదంతా చేస్తున్నారు. జగన్ సీఎం అయ్యాక బంధువులు ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని దూరం పెట్టారు. వాళ్ల పనులు కావడంలేదనే ఇలా ప్రవర్తిస్తున్నారనిపిస్తోంది. వారికి మంచి చెప్పాలని చూశాను. అప్పటి నుంచి నాతో మాట్లాడటం మానేశారు.

హంతకుడు దస్తగిరి దర్జాగా తిరుగుతున్నాడు..

షర్మిల, సునీత తామేది మాట్లాడినా చెల్లుతుందని అనుకుంటున్నారు. మా ఇంట్లో అమ్మాయిలు ఇలా అన్యాయంగా మాట్లాడుతుంటే బాధ కలుగుతోంది. వివేకానందరెడ్డిని కిరాతకంగా హత్యచేశాను అని చెప్పిన దస్తగిరి మాత్రం బయట దర్జాగా తిరుగుతున్నాడు. అతని మాటలు నమ్మి అవినాష్‌రెడ్డిని విమర్శిస్తారా? ఏ తప్పూ చేయని వైఎస్ భాస్కర్‌రెడ్డి ఏడాదిగా జైల్లో ఉన్నారు. అవినాశ్ బెయిల్ రద్దుచేయాలని షర్మిల, సునీత కోర్టులో కేసులు వేశారు. కానీ, వివేకాను హత్యచేశాను అని చెప్పిన దస్తగిరి బెయిల్‌పై ఉన్నా వారెందుకు పట్టించుకోవడంలేదు? షర్మిల, సునీత ఎన్ని మాటలంటున్నా అవినాశ్ ఒక్క మాటా కూడా అనడంలేదు.

వైఎస్‌కు వివేక ఎలాగో.. జగన్‌కు అవినాశ్ అలా..

వైఎస్ రాజశేఖరరెడ్డి, వివేకానందరెడ్డి ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. రాజశేఖరరెడ్డి రాష్ట్రవ్యాప్తంగా పార్టీ బాధ్యతలు చూసేవారు. అందుకే పులివెందుల, కడప జిల్లాలో పార్టీ బాధ్యతలను వివేకాకు అప్పగించారు. వారిద్దరిలో ఒకరు ఎంపీగా పోటీచేస్తే మరొకరు ఎమ్మెల్యేగా పోటీచేసేవారు. అలా ఓటమి అన్నది లేకుండా గెలుస్తూ వచ్చారు. నాడు వైఎస్ రాజశేఖరరెడ్డికి వివేకానందరెడ్డి ఎలానో ప్రస్తుతం వైఎస్ జగన్‌కు వైఎస్ అవినాశ్ అలా అండగా ఉన్నారు. కానీ, వైఎస్ హఠాన్మరణం తర్వాత మారిన పరిస్థితుల్లో వైఎస్ జగన్ తన తండ్రి ఆశయ సాధన కోసం పార్టీ పెట్టారు. దురదృష్టవశాత్తూ ఆనాడు వివేకానందరెడ్డి కాంగ్రెస్ వైపు ఉండిపోయారు. ఆ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా జగన్ రాష్ట్రవ్యాప్తంగా పార్టీ బాధ్యతలు చూసుకోవాల్సి వచ్చింది. అందుకే పులివెందుల, కడప జిల్లాల్లో పార్టీ బాధ్యతలను చూసుకునేందుకు అవినాశ్‌రెడ్డిని ఎంపిక చేసుకున్నారు. దీంతో అవినాశ్ తనపై పెట్టిన బాధ్యతను ఎంతో చక్కగా నిర్వహిస్తున్నారు. పులివెందులను, కడప జిల్లాను అభివృద్ధి చేస్తున్నారు. అసలు అవినాశ్‌ను ఎంపీగా గెలిపించాలనే వివేకానందరెడ్డి చివరివరకూ ప్రచారం చేశారు కదా. ఈ విషయాన్ని గుర్తించయినా షర్మిల, సునీత అవినాశ్ మీద దుష్ప్రచారాన్ని మానుకోవాలి. ప్రజలకు మంచి చేస్తున్న జగన్‌కు అండగా నిలవాలి. వారిద్దరూ మరోసారి కూర్చుని చర్చించి జగన్‌కు అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నా. ఎందుకంటే జగన్ శత్రువులంతా ఒక్కటయ్యారు. బయట శత్రువులంతా ఒక్కటైతే కుటుంబం అంతా కలిసికట్టుగా ఉండి ఎదుర్కోవాలి. ఆ కుటుంబ ధర్మాన్ని పాటించాలని షర్మిల, సునీతలకు సూచిస్తున్నా.

జగన్‌ను మళ్లీ సీఎంను చేయండి..

ఇక వైఎస్ రాజశేఖరరెడ్డి కోట్లాది మంది ప్రజల గుండెల్లో దేవుడిగా ఉన్నారు. వైఎస్, వివేకా ఇద్దరూ ఫ్యాక్షన్ రాజకీయాలకు వ్యతిరేకం. మా నాన్నను హత్యచేసిన తరువాత కూడా ఎలాంటి ప్రతీకార రాజకీయాలకు పాల్పడకుండా వారు ఫ్యాక్షన్‌ను అంతంచేశారు. కానీ, ప్రశాంతంగా ఉన్న పులివెందులలో ప్రస్తుతం కొందరు అల్లర్లు రేకెత్తించేందుకు యత్నిస్తుండటం బాధ కలిగిస్తోంది. తండ్రి రాజశేఖరరెడ్డి ఆశయాలను సాధించేందుకు జగన్ ప్రజలకు ఎన్నో మంచి పనులు చేస్తున్నారు. పేద ప్రజలకు అంత మంచి చేస్తున్న జగన్ మరోసారి సీఎం కావాలి. అందుకోసం రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు అందరినీ గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా.

రైతన్నకు అకాల నష్టం

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో వర్షానికి తడిసిన ధాన్యం

నిజామాబాద్/కామారెడ్డి నెట్‌వర్క్: నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం 10 గంటల వరకు కురిసిన అకాల వర్షానికి కల్లాలు, రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. పలుచోట్ల వర్షపు నీటి ప్రవాహంలో వడ్లు కొట్టుకుపోయాయి. చేతికందిన పంటను అమ్ముకునే సమయంలో వర్షం దెబ్బతీయడంతో రైతులు కంటతడి పెడుతున్నారు. ఆర్మూరు, ఆలూర్, ఎడపల్లి, వర్ని, చందూర్, మోస్రా, సాలూర, రుద్రూర్, కోటగిరి, పొతంగల్, రెంజల్, మాక్లూర్, డొంకేశ్వర్ మండలాల్లో రైతుల కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసింది. కామారెడ్డి జిల్లాలోని బిచ్కుంద, లింగంపేట, పిట్లం, బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల్లో రోడ్లపై ఉన్న ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయింది. ధాన్యం రాశుల్లో నిలిచిన వర్షపు నీటిని తొలగించేందుకు రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బీర్కూర్ మండల కేంద్రంలో పోలీసుస్టేషన్ సమీపంలో రోడ్లపై ఉన్న ధాన్యం రాశుల మధ్య నీరు భారీగా చేరడంతో మోటార్ల సహాయంతో తొలగించారు. వర్షాలతో అంతటా వరి కోతలకు బ్రేక్ పడింది.

కొనుగోళ్లలో అక్రమాలకు తావులేదు

- ఇప్పటివరకు 1.87 లక్షల టన్నుల ధాన్యం కొన్నాం..
- పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ వెల్లడి


డీఎస్ చౌహాన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతుల ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు తావులేదని.. కొందరు పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత నెల 25 నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించామని.. ఇప్పటివరకు 7,149 కేంద్రాల్లో కలిపి 1.87 లక్షల టన్నులు కొన్నామని వివరించారు. అత్యధికంగా నిజామాబాద్‌లో లక్ష టన్నులు, కామారెడ్డిలో 11 వేల టన్నుల కొనుగోళ్లు జరిగాయన్నారు. రూ.2,350 నుంచి రూ.2,900 ధరతో ఈ కొనుగోళ్లు జరుగుతున్నాయని.. మద్దతు ధర కంటే ఎక్కువ ధర రైతుల కు అందుతోందని పేర్కొన్నారు. రెండు రోజుల్లోనే రైతులకు చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. మార్కెట్ యార్డులలో సమస్యలు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. 75 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు టార్గెట్ పెట్టుకున్నామని చెప్పారు. త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తామన్నారు. రైతులు ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టిన తర్వాత విక్రయిస్తే మద్దతు ధర వస్తుందని చెప్పారు.

బకాయిల వసూలుపై ఫోకస్

రైస్ మిల్లర్ల నుంచి బకాయిల వసూలు మొదలుపెట్టామని.. దీంతో కొందరు మిల్లర్లు భయపడి ఇతర దేశాలకు పారిపోయారని డీఎస్ చౌహాన్ చెప్పారు. నిబంధనలు పాటించని మిల్లర్లపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. అధికారుల నిర్లక్ష్యం ఉన్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రవాణా బకాయిలు రూ.900 కోట్లను క్లియర్ చేశామన్నారు.

వ్యవసాయ మార్కెట్లలో రైతుల పడిగాపులు

- సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో పోటెత్తిన ధాన్యం
- కొనుగోళ్ల జాప్యంతో అన్నదాతలకు ఇబ్బందులు
- కేసుల నేపథ్యంలో జనగామ మార్కెట్లో కొనుగోళ్లు నిలిపేసిన వ్యాపారులు
- మద్దతు ధరకు కొనుగోలు చేయలేమని స్పష్టీకరణ
- పంటలు తెచ్చిన రైతుల్లో ఆందోళన


తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం రాశులు

తిరుమలగిరి (తుంగతుర్తి)/జనగామ: వానల్లేక, సాగునీరు అందక చాలా చోట్ల వరి పంట దెబ్బతిన్నది. మిగిలిన చోట రైతులు వరికోతలు పూర్తి చేసి.. వ్యవసాయ మార్కెట్లకు తెస్తున్నారు. కానీ మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోళ్లు చేస్తుండటం, అదీ సరిగా సాగకపోవడంతో.. పడిగాపులు పడుతున్నారు. శనివారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి, జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ఇదే పరిస్థితి కనిపించింది.

భారీగా పోటెత్తిన ధాన్యం

శనివారం తిరుమ లగిరి వ్యవసాయ మార్కెట్ యార్డుకు 47,660 బస్తాల ధాన్యం వచ్చింది. యాసంగి సీజన్ మొదలై నప్పటి నుంచి ఇంత భారీగా ధాన్యం రావడం ఇదే మొదటిసారి. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నా.. వాతావరణంలో మార్పులతో రైతులు యార్డుకే ధాన్యాన్ని తీసుకొస్తున్నారని మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచే మార్కెట్‌లోకి ధాన్యం ట్రాక్టర్లను అనుమతించాల్సి ఉండగా.. శనివారం తెల్లవారు జాము వరకు పంపలేదు. దీనితో రోడ్డు పైనే వందలకొద్దీ ట్రాక్టర్లు నిలిచిపోయి ట్రాఫిక్ సమస్య తలెత్తింది. కాగా ట్రేడర్లు ధాన్యానికి క్వింటాల్‌కు కనిష్టంగా రూ.1,700, గరిష్టంగా రూ.1,980 ధర చెల్లించారు.

జనగామలో కొనుగోళ్లు నిలిపేసిన ట్రేడర్లు

తక్కువ ధరకు ధాన్యం కొనుగోళ్లపై రైతుల ఆందోళన, ముగ్గురు ట్రేడర్లపై కేసుల నమోదు నేపథ్యంలో.. జనగామ వ్యవసాయ మార్కెట్లో ట్రేడర్లు కొనుగోళ్లు నిలిపివేశారు. దీనితో మార్కెట్‌కు వరి ధాన్యం, మక్కలు, చింతపండు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువచ్చిన రైతులు వాటిని అమ్ముకోవడానికి పడిగాపులు పడుతున్నారు. ఇక మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ రాజునాయక్ శనివారం జనగామ మార్కెట్ కార్యాలయంలో.. ట్రేడర్లు, అడ్తిదారులతో రెండు గంటల పాటు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. ప్రైవేట్ మార్కెట్‌లోనూ మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేయాలని రాజునాయక్ కోరగా.. అది సాధ్యం కాదని ట్రేడర్లు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా లేని నిబంధనలను జనగామ మార్కెట్‌పై ఎందుకు రుద్దుతున్నారని ప్రశ్నించారు. తమపై అన్యాయంగా కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. మరోవైపు ఈ మార్కెట్లో కొనుగోళ్లు ఎప్పుడు ప్రారంభమవుతాయా? అని రైతులు ఎదురు చూస్తున్నారు.

గురుకులంలో 25 మంది విద్యార్థులకు అస్వస్థత


భువనగిరి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని శనివారం 25 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఇందులో ఆరో తరగతి చదువుతున్న సీహెచ్.ప్రశాంత్, కల్యాణ్ కృష్ణ అనే ఇద్దరు విద్యార్థులు వాంతులు, విరోచనాలతో బాధపడుతుండటంతో హైదరాబాద్‌కు తరలించారు. స్వల్ప అస్వస్థతకు గురైన ఎనిమిది మందికి భువనగిరి ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. మిగతా 15 మంది విద్యార్థులకు పాఠశాలలో ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేసి చికిత్స అందజేస్తున్నారు. వారి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

కార్మికుడి ఇంటి ఎదుట మహిళ బైఠాయింపు

- ఫేస్‌బుక్‌లో పరిచయం.. పెళ్లి
- ముఖం చాటేసి మళ్లీ పెళ్లికి సిద్ధం

మందమర్రిరూరల్: ఫేస్‌బుక్‌లో వారిద్దరికి పరిచయం ఏర్పడింది. కొంతకాలం సహజీవనం తర్వాత పెళ్లి చేసుకున్నారు. మళ్లీ పెళ్లికి భర్త సిద్ధమవుతున్నాడని తెలిసి భార్య అతడి ఇంటి ఎదుట బైఠాయించింది. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని లక్ష్మీభవానీ కాలనీలో శనివారం చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. మందమర్రి పట్టణంలోని లక్ష్మీ భవాని కాలనీలో నివాసం ఉంటున్న ఆడెపు సాయి కృష్ణ మందమర్రి ఏరియాలోని కేకే–5గనిలో జనరల్ మజ్దూర్‌గా పని చేస్తున్నాడు. శైలజ అనే మహిళ హైదరాబాద్‌లో తన భర్త విశ్వేశ్వర్‌రావుతో నివసిస్తుండేది. శైలజతో సాయికృష్ణకు ఫేస్‌బుక్‌లో పరిచయం ఏర్పడింది. వరుసకు మామ అవుతానని చుట్టరికం కలిపాడు. పలుమార్లు హైదరాబాద్‌లోని ఆమె ఇంటికి వెళ్లాడు. 2020లో కరోనాతో శైలజ భర్త మృతిచెందాడు. అప్పటి నుంచి ఆమెకు తోడుగా ఉంటానని గోదావరిఖనిలోని అన్నపూర్ణకాలనీలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని ఇద్దరు సహజీవనం చేశారు. 2022 ఆగస్టు 23న శైలజ చెల్లెలు, మరిది సమక్షంలో ఇంట్లోనే ఆమెను పెళ్లి చేసుకుని కాపురం సాగించారు. సాయికృష్ణ తన తల్లిదండ్రులకు మాత్రం శైలజను స్నేహితురాలిగా పరిచయం చేశాడు. గత డిసెంబర్‌లో తన ఇంటికి కూడా తీసుకెళ్లాడు. తర్వాత ఇంట్లో పెళ్లి ఒప్పుకోవడం లేదని చెప్పడంతో జనవరిలో శైలజ గోదావరిఖని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ప్రస్తుతం సాయికృష్ణ పెళ్లి సంబంధాలు చూస్తున్నాడని తెలియడంతో శనివారం మందమర్రిలోని అతడి ఇంటి ఎదుట బైఠాయించింది. అనంతరం సాయికృష్ణ మరో పెళ్లి చేసుకోకుండా తనతో కాపురం చేసే విధంగా న్యాయం చేయాలని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయమై ఎస్సై రాజశేఖర్‌ను సంప్రదించగా.. పెళ్లి విషయంలో సాయికృష్ణపై గోదావరిఖనిలో ఇదివరకే ఫిర్యాదు చేసిందని తెలిపారు. కాగా, సాయికృష్ణ గోదావరిఖనిలో తనపై కేసు ఉన్నప్పటికీ మందమర్రిలో తన ఇంటికి వచ్చి ఆందోళన చేసిందని శైలజపై ఫిర్యాదు చేశాడు.


ఇంటిముందు బైఠాయించిన శైలజ


శైలజ, సాయికృష్ణ పెళ్లి ఫొటో

చెదరని జ్ఞాపకం..
చెదిరిన మనసు


నాడు : ముర్మూర్‌లోని ప్రభుత్వ పాఠశాల


నేడు : శిథిలావస్థలో పాఠశాల భవనం

- ముర్మూర్, నీలోజిపల్లి ముంపు గ్రామాల చరిత్ర సజీవం

రామగుండం: పచ్చని చెట్లు.. స్వచ్ఛమైన గాలి.. సాయంత్రం వేళ ప్రధాన కూడళ్లలో రచ్చబండపై కూర్చొని మనసారా ముచ్చట్లు.. ఇంటింటి యోగక్షేమాల చర్చలు.. నిత్యం పండుగ వాతావరణం తలపించే పల్లె ప్రాంతం.. ఇంకా కళ్లముందే కదలాడుతోంది.. సుమారు 15ఏళ్ల క్రితం పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం ముర్మూర్ గ్రామ పరిస్థితి. ఇక్కడి శ్రీపాతాళేశ్వరాలయం, శ్రీకాశీవిశ్వేశ్వరాలయాలు అతిప్రాచీనమైనవి. ఆధ్యాత్మికతకు నిలయాలు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులు.. ఉత్తర వాహినిలో ప్రవహించే గోదావరినదిలో పుణ్యస్నానాలు చేసి తరించేవారు. అయితే, సుమారు 15ఏళ్ల క్రితం శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఊరుతో సహా కట్టడాలు, చెట్లు, చెమలు, గుడులు, బడులు, కార్యాలయాలు సహా పల్లె సంస్కృతి మునిగిపోయాయి. అయితే, కొద్దిరోజులుగా ప్రాజెక్టులో నీటి నిల్వలు భారీగా పడిపోతున్నాయి. ఫలితంగా ప్రాజెక్టులో ముంపునకు గురైన ఊరు వెలుగులోకి వస్తోంది. శిథిలమైన కట్టడాలు చరిత్రకు ఆనవాళ్లుగా కనిపిస్తున్నాయి. పునరావాసా ప్రాంతాలకు తరలివెళ్లిన ముర్మూర్ గ్రామస్తులు.. ఈ దృశ్యాలు చూసేందుకు కొద్దిరోజులుగా తరలివస్తున్నారు. నాటి జ్ఞాపకాలు నెమరువేసుకుంటున్నారు.


పాట పాడుతున్న నీలోజిపల్లి గ్రామ మహిళ, పక్కన గ్రామస్తులు

కన్నీటి పాటలు..

బోయినపల్లి(చొప్పదండి): 'అవ్వా.. మన ఊరు మిడ్‌మానేరులో మునిగి ఆగమైందే..' అని రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం నీలోజిపల్లివాసులు ప్రాజెక్టులో తేలిన పాత శిథిల కట్టడాలు చూసి బరువెక్కిన హృదయాలతో ఆశువుగా పాటలు పాడుతున్నారు. శ్రీరాజరాజేశ్వర(మిడ్‌మానేరు) ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గడంతో ముంపునకు గురైన గ్రామ ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఊరు తొవ్వలు.. మిగిలిన మొండి గోడలు.. కూలిన ఇళ్లు.. గుడులు.. బడులు కళ్లెదుటే కదలాడుతుంటే.. వాటిని చూస్తూ గుండెల్లో గుడి కట్టుకున్న జ్ఞాపకాలను నెమరు వేసుకుంటున్నారు. 'గిది బడి.. గిది గుడి.. ఇక్కడ కచ్చీర్ ఉండే.. ఈడ మర్రిచెట్టు ఉండేది' అని ఊరు యాదిని ఆశుకవిత్వంతో పాటలుగా పాడుతున్నారు. నీలోజిపల్లికి చెందిన ఓ మహిళ ఆశువుగా ×తొవ్వ చూపిన బాట.. నీడ నిచ్చిన చెట్టు.. కళ్లల్లో మనపల్లె కదలాడుతుందే.. గుండెల్లో ఈ బాధ దిగమింగుతుందే..' అంటూ పాడిన పాట ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఆనాటి ఆటలు గుర్తుకొస్తున్నయ్



నా చిన్నతనంలో చెట్లు, పుట్టలు తిరిగినం. ఫ్రెండ్స్‌తో కలిసి అనేక ఆటలు ఆడుకున్నం. ఐదేళ్ల క్రితం గిట్లనే ప్రాజెక్టులో నీళ్లు తగ్గితే వచ్చి మా ఊరును చూసిపోయినం. కానీ అప్పుడు ఇంతగా ఊరంతా తిరిగే పరిస్థితి లేకుండే. అక్కడక్కడ నీటి నిల్వలు ఉండేవి. ఇప్పుడు చుక్కనీరులేదు. రోడ్లపై పిచ్చిమొక్కలు, ముళ్లచెట్లు కనిపిస్తున్నయ్. తొవ్వలు చిందరవందరగా మారినయ్. కొన్ని ఇళ్లు కూలిపోగా, మరికొన్ని సజీవంగానే కనిపిస్తున్నయ్.

– యాదండ్ల రాకేశ్, ముర్మూర్ గ్రామస్తుడు

సినిమా షూటింగ్‌ను తలపిస్తుంది



రంజాన్ పండుగ కావడంతో మాకు స్కూల్‌కు సెలవు ఇచ్చిండ్రు. మా ఊరు చూసేందుకు పోయిన. ఊర్ల తిరుగుతూ ఉంటూ.. సినిమా షూటింగ్ లెక్క అనిపిస్తున్నది. నేను చదువుకున్న స్కూల్, పంచాయతీ ఆఫీసు, గుడిని చూస్తే చిన్నప్పటి జ్ఞాపకాలు గుర్తుకు వస్తున్నయ్. అప్పటి రోజులే మంచిగుండే. ఇప్పుడు పునరావాస కాలనీలో ఉంటే .. ఎవరింట్లో వాళ్లే ఉంటున్నరు.. ఎవరికి ఎవరు ఏమీకానట్లు ఉంటున్నరు.

– మగ్గిడి రవి, ముర్మూర్ గ్రామస్తుడు

గంజాయి మొక్కలు స్వాధీనం


అరెస్ట్ చూపిస్తున్న ఎస్‌హెచ్‌వో దేవయ్య

బెల్లంపల్లి: సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఓ యువకుడు గంజాయి సాగు చేసి శనివారం రాత్రి పోలీసులకు పట్టుబడ్డాడు. బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి మున్సిపాలిటీ కన్నాల బస్తీకి చెందిన దుర్గం రాజేష్ తన ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు సాగు చేశాడు. వన్‌టౌన్ ఎస్సై రమేష్ తనిఖీ చేసి 14 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేశారు.

పాముకాటుకు బాలిక మృతి

తలమడుగు: పాముకాటుతో బాలిక మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌లోని మావల గ్రామానికి చెందిన మజిలకర్ లక్ష్మణ్ కుటుంబ సభ్యులతో కలిసి ఉపాధి నిమిత్తం కజ్జర్లకు వచ్చాడు. మాజీ సర్పంచ్ పంటపొలంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్యాపిల్లలతో కలిసి పొలంలోని ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 9న రాత్రి పాము పెద్ద కుమార్తె ఆశ(16) చేతిపై కాటు వేసింది. తల్లిదండ్రులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె శనివారం రాత్రి మృతిచెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు.

'సంకల్ప ప్రాజెక్టు'లో ఆదిలాబాద్

- దేశవ్యాప్తంగా పది జిల్లాలు ఎంపిక
- శిశు మరణాలపై అధ్యయనం
- ఢిల్లీ వెళ్లనున్న డీఎంహెచ్‌వో నరేందర్

ఆదిలాబాద్‌టౌన్: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ వైద్య పరిశోధన విభాగం సంయుక్తంగా 'సంకల్ప ప్రాజెక్టు'ను పైలట్ బేస్డ్‌గా అమలు చేయనుంది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా పది జిల్లాలను ఎంపిక చేయగా తెలుగు రాష్ట్రాల నుంచి ఆదిలాబాద్ జిల్లాకు చోటు దక్కింది. ఈ నెల 15, 16వ తేదీల్లో ఢిల్లీలోని ఐసీఎంఆర్ కేంద్రంలో జరిగే సెమీనార్‌కు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్ హాజరుకానున్నారు. సదస్సులో నవజాత శిశువుల మరణాలు తగ్గించేందుకు క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు తీసుకోవాలి.. గర్భిణులు ఎలాంటి ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి.. శిశువు గర్భంలోనే మరణించే సందర్భాలేంటి.. పుట్టిన తర్వాత ఏ కారణంగా చనిపోతున్నారనే వాటిపై అధ్యయనం చేయనున్నారు. శిశు మరణాలను అరికట్టడమే లక్ష్యంగా అమలు చేస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో ఆదిలాబాద్ జిల్లా ఎంపిక కావడంతో వాటిని తగ్గించేదిశగా చర్యలు చేపట్టనున్నట్లుగా డీఎంహెచ్‌వో తెలిపారు.

16న సీఎంతో గల్ఫ్ సంఘాల ప్రతినిధుల సమావేశం


చైర్మన్ వినోద్‌కుమార్‌తో స్వదేశ్ పర్కిపండ్ల

నిర్మల్‌ఖిల్లా: గల్ఫ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సంక్షేమం కోసం గల్ఫ్ సంఘాల ప్రతినిధులతో ఈనెల 16న సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించనున్నట్లు ప్రవాసీమిత్ర కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల తెలిపారు. టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ చైర్మన్ డాక్టర్ బీఎం.వినోద్ కుమార్‌తో హైదరాబాదులో శనివారం జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా పనిచేయనున్నట్లు తెలిపారు. గల్ఫ్ కార్మికుల కుటుంబాల ప్రభావం అధికంగా ఉన్న ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, జహీరాబాద్, మెదక్, వరంగల్, పార్లమెంటు స్థానాలలో గల్ఫ్ ఓటు బ్యాంకు ప్రభావం గణనీయంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నారై విభాగం బృందం ప్రత్యేక ప్రచార కార్యచరణ చేపట్టనున్నట్లు తెలిపారు.

వారే వీరయ్యారు!

మిత్రులుగా మారిన ప్రత్యర్థులు ● ఎన్నికల వేళ మహారాష్ట్రలో ఆసక్తికరంగా రాజకీయం

ఎలక్షణీయం

రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరనే నానుడిని మహారాష్ట్ర రాజకీయాలు మరోసారి నిరూపించాయి. గతంలో ప్రత్యర్థులుగా ఒకరిపై ఒకరు మాటల తూటాలు పేల్చుకుని, ఎత్తుకు పై ఎత్తులు వేసిన నేతలు ఇప్పుడు హఠాత్తుగా మిత్రులైపోయారు. కొత్త మిత్రుల గెలుపు కోసం లోక్‌సభ సమరాంగణంలో సర్వశక్తులు ఒడ్డుతున్నారు. గతంలో స్నేహితులుగా ఉన్నవారు కాస్తా ఇప్పుడు శత్రువులుగా మారి రాజకీయ చదరంగంలో కొత్త గెలుపు ఎత్తులు వేస్తున్నారు.

అజిత్ వర్సెస్ కోల్హే

2019 లోక్‌సభ ఎన్నికల్లో శిరూర్ శివసేన సిట్టింగ్ ఎంపీ శివాజీరావ్ అథాల్‌రావ్ పాటిల్‌ను ఎలాగైనా ఓడించాలని అజిత్ కంకణం కట్టుకున్నారు. టీవీ, సినీ రంగ ప్రముఖుడు అమోల్ రాంసింగ్ కోల్హేను శివసేన నుంచి ఎన్సీపీలో చేర్చుకుని మరీ శివాజీరావ్‌పై పోటీకి దింపారు. విస్తృత ప్రచారం చేసి కోల్హేను గెలిపించారు. కానీ ఎన్సీపీ చీలిక ఎపిసోడ్‌లో కోల్హే అజిత్‌ను కాదని శరద్ పవార్‌కు మద్దతుగా నిలవడంతో వారిద్దరికీ చెడింది. బీజేపీ, శివసేనతో సీట్ల సర్దుబాటులో భాగంగా షిరూర్‌లో సొంత అభ్యర్థిని నిలబెట్టే అవకాశం అజిత్‌కు లభించింది. దాంతో కోల్హేను ఎలాగైనా ఓడించాలని పట్టుదలగా ఉన్నారు. అందుకోసం గత ఎన్నికల్లో తానోడించిన అథాల్‌రావ్ పాటిల్‌నే కోల్హేపై పోటీకి నిలబెట్టారు! ఆయన తరఫున విస్తృతంగా ప్రచారం కూడా చేస్తున్నారు.

వదినా మరదళ్ల వార్

బారామతిలో చాన్నాళ్లుగా శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలే పోటీచేస్తున్నారు. ఎన్సీపీలో చీలిక తర్వాత ఈ స్థానాన్ని ఎలాగైనా దక్కించుకునేందుకు అజిత్ తన భార్య సునేత్రను బరిలో దింపారు. దీంతో వదినా మరదళ్లు ప్రత్యర్థులుగా తలపడుతున్నారు. పైగా అజిత్ తమ్ముడు శ్రీనివాస్, ఆయన కుటుంబీకులు సూలేకు మద్దతుగా ప్రచారం చేస్తున్నారు! ఇది అజిత్ కుటుంబంలో మరో చీలికకు కారణమవుతోంది.

నాడు వేర్వేరు సభలు.. ఇప్పుడు ఒకే స్థానం కోసం పోరు

రాహుల్ రమేశ్ షేవలే, అనిల్ దేశాయ్ అవిభాజ్య శివసేనలో సన్నిహిత మిత్రులుగా మెలిగారు. రాహుల్ రెండుసార్లు సౌత్ సెంట్రల్ ముంబై ఎంపీగా గెలవగా అనిల్ రాజ్యసభ సభ్యునిగా ఉండేవారు. శివసేన చీలాక రాహుల్ షిండే వర్గంలో చేరగా అనిల్ ఉద్ధవ్ వర్గంలోనే కొనసాగారు. ఈసారి ఇద్దరూ సౌత్ సెంట్రల్ ముంబై నుంచి ప్రత్యర్థులుగా బరిలో దిగారు. అనిల్‌కు ముంబై కాంగ్రెస్ చీఫ్ వర్షా గైక్వాడ్ మద్దతు పలికారు. వర్ష తండ్రి ఏక్‌నాథ్‌ను 2014 లోక్‌సభ ఎన్నికల్లో షేవలే ఓడించడమే అందుకు కారణం. ''దేవేంద్ర ఫడ్నవిస్ చాణిక్యంతో చీలికలు తేనంతవరకూ శివసేన, ఎన్సీపీ కుటుంబ పార్టీలుగా నిక్షేపంగా ఉండేవి. వాటిలో చీలికతో లోక్‌సభ ఎన్నికలు మహాభారత యుద్ధాన్నే తలపిస్తున్నాయి. కుటుంబసభ్యులే పరస్పరం పోటీపడుతూ ప్రత్యర్థులకు సాయం చేస్తున్నారు'' అని సీనియర్ పాత్రికేయుడు, రాజకీయ విశ్లేషకులు ప్రకాశ్ అకోల్కర్ అభిప్రాయపడ్డారు. –సాక్షి, న్యూఢిల్లీ

చిక్లీకర్ కోసం చవాన్ ప్రచారం


ప్రతాప్ చిక్లీకర్ | అశోక్ చవాన్

గురువారం నాందేడ్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ర్యాలీలో మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్, బీజేపీ అభ్యర్థి ప్రతాప్ పాటిల్ చిక్లీకర్ ఒకే వేదికను పంచుకున్నారు. గత ఫిబ్రవరి దాకా వారిద్దరూ బద్ధ శత్రువులు. చిక్లీకర్ లోహా నుంచి శివసేన ఎమ్మెల్యేగా గెలిచారు. 2019లో బీజేపీలో చేరి లోక్‌సభ ఎన్నికల్లో నాందేడ్ కాంగ్రెస్ సిట్టింగ్ ఎంపీ అశోక్ చవాన్‌ను మట్టికరిపించారు. చవాన్ కూడా తాజాగా బీజేపీలో చేరడంతో వారి మధ్య వైరం మటుమాయమైంది. ఫిబ్రవరిలో బీజేపీలో చేరి రాజ్యసభకు ఎన్నికైన చవాన్ ఇప్పుడు చిక్లీకర్‌కు స్నేహహస్తం అందించారు. చిక్లీకర్ గెలుపు కోసం మరఠ్వాడాలో తెగ ప్రచారం చేస్తున్నారు.

బరనే కోసం అజిత్...


అజిత్ | బరనే

గత లోక్‌సభ ఎన్నికల్లో మావల్ నుంచి ఎన్సీపీ నేత అజిత్ పవార్ కుమారుడు పార్థ్‌పై శివసేన నేత శ్రీరంగ్ బరనే గెలిచారు. నాటినుంచి అజిత్, బరనే మధ్య వైరం పెరిగింది. కానీ తాజా పరిణామాలతో వారి మధ్య స్నేహం చిగురించింది. శివసేనను ఏక్‌నాథ్ షిండే, ఎన్సీపీని అజిత్ చీల్చి బీజేపీతో జట్టుకట్టడం తెలిసిందే. బరనే కూడా షిండే వెంట నడిచారు. దాంతో అజిత్‌తో ఆయన శత్రుత్వం సమసిపోయింది. ఈ నేపథ్యంలో అజిత్ ఈసారి బరనే కోసం ప్రచారం చేస్తున్నారు.

నాడు ఓడించి నేడు ప్రచారం చేస్తూ..

బీజేపీ అధిష్టానం ఈసారి బీడ్ నుంచి సిట్టింగ్ ఎంపీ ప్రీతం ముండే స్థానంలో ఆమె సోదరి, మాజీ మంత్రి పంకజా ముండేను ఎంపిక చేసింది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో పంకజ తన బంధువైన ఎన్సీపీ నేత ధనంజయ్ ముండే చేతిలో ఓడారు. ఇప్పుడాయన అజిత్ ఎన్సీపీలో ఉన్నారు. బీజేపీతో ఎన్సీపీ చెలిమి నేపథ్యంలో పంకజ తరఫున ధనంజయ్ ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు.


పంకజ | ధనంజయ్



ఎన్నికల విచిత్రం

ఆటో నడుపుతూ ఎన్నికల ప్రచారం చేస్తున్న ఈయన షానవాజ్ అలీ రైహాన్. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని సౌత్ మాల్దా లోక్‌సభ నియోజకవర్గం నుంచి తృణమూల్ కాంగ్రెస్ టికెట్‌పై ఈయన పోటీ చేస్తున్నారు.

ఎలక్షన్ బీట్

నేడే బీజేపీ మేనిఫెస్టో విడుదల

- సంకల్ప్ పత్రాన్ని విడుదల చేయనున్న ప్రధాని మోదీ, నడ్డా, అమిత్ షా
- 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా హామీలు ఉండే అవకాశం

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పార్టీ మేనిఫెస్టోను బీజేపీ అగ్ర నాయకత్వం ఆదివారం విడుదల చేయనుంది. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సంకల్ప్ పత్రాన్ని ప్రధాని మోదీ, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆవిష్కరిస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన అజెండాలుగా నిలిచిన అయోధ్యలో రామమందిర నిర్మాణం, ఆర్టికల్ 370 రద్దు వంటి హామీలను ఇప్పటికే నెరవేర్చిన తరుణంలో ఈసారి అలాంటి ఏఏ కీలకమైన హామీలకు మేనిఫెస్టోలో చోటుకల్పిస్తారని సర్వత్రా ఆసక్తి నెలకొంది. అయితే మేనిఫెస్టోలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తారని తెలుస్తోంది. ప్రధాని మోదీ తరచూ ప్రస్తావించే నాలుగు ప్రధాన కులాలు.. పేదలు, రైతులు, మహిళలు, యువత లక్ష్యంగా హామీలను ప్రస్తావించనున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. మేనిఫెస్టో రూపకల్పనపై కమిటీ ఛైర్మన్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని 27 మంది సభ్యులతో కూడిన కమిటీ ఇప్పటికే రెండుసార్లు భేటీ అయింది. మేనిఫెస్టోలో పొందుపరచాల్సిన అంశాలకోసం నమో యాప్ సహా 35 రోజుల ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. ఇలా లక్షలాది మంది పార్టీ మద్దతుదారుల నుంచి సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుని ముఖ్యాంశాలను రూపొందించినట్లు తెలుస్తోంది. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా మార్గసూచీని ప్రకటించడంతో పాటు మోదీ గ్యారెంటీలకు సంబంధించిన హామీలను మరోమారు ప్రకటించే అవకాశాలున్నాయి. మతపరమైన అంశాలతో పాటు జాతీయవాద అంశాలను ప్రధానంగా మేనిఫెస్టోలో పొందుపరిచే అవకాశాలున్నాయని కమలనాథులు చెబుతున్నారు.


మోదీ మాటల వలలో పడకండి

ప్రజలను హెచ్చరించిన ప్రియాంకా గాంధీ



రూర్కీ(ఉత్తరాఖండ్): ప్రధానమంత్రి మోదీ మాటల గారడీలో చిక్కుకుపోవద్దని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా ప్రజలను హెచ్చరించారు. గత పదేళ్లలో మోదీ పాలనలో తమ జీవితాల్లో ఏమైనా సానుకూల మార్పులు వచ్చాయా అని ఎవరికి వారు ప్రశ్నించుకోవాలన్నారు. మార్పు కోసం ఓటేయాలని పిలుపునిచ్చారు. ఉత్తరాఖండ్‌లోని రామ్‌నగర్, రూర్కీల్లో శనివారం జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. దశాబ్దకాలంలో బీజేపీ పాలన కారణంగా దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణంతోపాటు ప్రశ్నపత్రాల లీకేజీ ఉదంతాలు పెరిగిపోయాయని ప్రియాంక చెప్పారు. మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పట్టించుకోలేదని, ఓట్ల కోసం మతాన్ని వాడుకుంటోందని ఆరోపించారు. నారీశక్తి గురించి తరచూ మాట్లాడే మోదీ హయాంలోనే మహిళలు మరింత అభద్రతాభావంతో ఉన్నారన్నారు. రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ పార్టీ మతాన్ని ఎన్నడూ వాడుకోలేదని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే ప్రభుత్వానికే ఓటు వేయాలని అన్నారు.

రిజర్వేషన్లను రద్దు చేయం: అమిత్ షా



జైపూర్: రిజర్వేషన్లను తమ బీజేపీ ప్రభుత్వం రద్దు చేయబోదని, ఇతరులను రద్దు చేయనివ్వదని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. ఆ మాటకొస్తే..ప్రధాని మోదీయే రిజర్వేషన్లకు అతిపెద్ద మద్దతుదారని వెల్లడించారు. దళితులు, గిరిజనులు, వెనుకబడినవర్గాల రిజర్వేషన్లను అధికార బీజేపీ రద్దు చేయాలనుకుంటోందంటూ కాంగ్రెస్ పార్టీ అపోహను వ్యాప్తి చేస్తోందని అమిత్ షా ఆరోపించారు. అనేక ఏళ్లపాటు వెనుకబడిన కులాలకు అన్యాయం చేసిందన్నారు. గతంలో ఓబీసీ రిజర్వేషన్లపై వచ్చిన కాకా కలేల్కర్ నివేదిక, మండల్ కమిషన్ నివేదిక ముఖ్యమైన వాటిని కాంగ్రెస్ పార్టీ తొక్కిపట్టి ఉంచిందన్నారు. రాజస్తాన్‌లోని ఆల్వార్ జిల్లా హస్రోలీలో శనివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో కేంద్ర మంత్రి ప్రసంగించారు. మోదీ అధికారంలోకి వచ్చాకే ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ గుర్తింపు దక్కిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీసీ వర్గానికి 27 శాతం రిజర్వేషన్‌ను కల్పించిందని తెలిపారు. పదేళ్ల కాలంలో అసాధ్యమనుకున్న పలు లక్ష్యాలను సుసాధ్యం చేసి చూపామని చెప్పారు.

మండిలో కంగన ప్రత్యర్థి విక్రమాదిత్య




న్యూఢిల్లీ/సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లోని మండి లోక్‌సభ స్థానంలో బాలీవుడ్ నటి, బీజేపీ అభ్యర్థి కంగనా రనౌత్ ప్రధాన ప్రత్యర్థి ఎవరో తేలిపోయింది. మండి నుంచి తన కుమారుడు విక్రమాదిత్య సింగ్ పోటీ చేస్తారని రాష్ట్ర పీసీసీ చీఫ్ ప్రతిభా సింగ్ శనివారం వెల్లడించారు. మండి సిట్టింగ్ ఎంపీ అయిన ప్రతిభా సింగ్ ఇక్కడి నుంచి మూడు పర్యాయాలు ఎన్నికయ్యారు. నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడూ తమ వెంటే ఉంటారని ప్రతిభా సింగ్ ధీమా వ్యక్తం చేశారు. కష్ట సమయంలోనూ ఇక్కడ తాను విజయం సాధించినట్లు చెప్పుకున్నారు. తనపై విమర్శలు చేస్తున్న కంగనా ఓటమి ఖాయమని విక్రమాదిత్య సింగ్ చెప్పారు. ఇలా ఉండగా, కాంగ్రెస్ పార్టీ శనివారం సాయంత్రం విక్రమాదిత్య సింగ్ సహా 16 మంది పేర్లతో మరో జాబితా విడుదల చేసింది. ఇందులో కేంద్ర మాజీ మంత్రి మనీశ్ తివారీకి చండీగఢ్ టిక్కెట్ కేటాయించింది.

బీజేపీకి 200 సీట్లు కూడా రావు

పశ్చిమ బెంగాల్ సీఎం మమత

జల్పాయ్‌గురి: సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి కనీసం 200 సీట్లు కూడా రావని పశ్చిమ బెంగాల్ సీఎం, టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీ స్పష్టం చేశారు. ప్రధాని మోదీ ఇస్తున్న గ్యారంటీలన్నీ బూటకమని కొట్టిపారేశారు. శనివారం జల్పాయ్‌గురిలో ఎన్నికల ప్రచార సభలో ఆమె ప్రసంగించారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని బీజేపీ ప్రభుత్వం ధ్వంసం చేసిందని మండిపడ్డారు. దేశాన్ని అమ్మేసే కుట్రలు సాగించారన్నారు. ప్రధాని మోదీ చెబుతున్న కల్లబొల్లి మాటలు నమ్మొద్దని ప్రజలను కోరారు. ఆయన ఇస్తున్న గ్యారంటీల వలలో పడొద్దని సూచించారు. బెంగాల్‌లో 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 200కుపైగా సీట్లు గెలుచుకుంటామని బీజేపీ నేతలు గొప్పలు చెప్పారని, చివరకు 70 సీట్లే వచ్చాయని గుర్తుచేశారు.

పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు

- ఇజ్రాయెల్‌పై ఏ క్షణమైనా దాడి జరిగే అవకాశం ఉందన్న బైడెన్
- ఇజ్రాయెల్ నౌకను స్వాధీనం చేసుకున్న ఇరాన్ కమాండోలు

జెరూసలేం: పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. యూదు దేశం ఇజ్రాయెల్‌పై ఇస్లామిక్ దేశం ఇరాన్ ప్రతీకారంతో రగిలిపోతోంది. సిరియా రాజధాని డెమాస్కస్‌లో తమ దౌత్య కార్యాలయంపై దాడి చేసి, ఇద్దరు ఉన్నతస్థాయి సైనికాధికారులను పొట్టనబెట్టుకున్న ఇజ్రాయెల్‌కు తగిన బుద్ధి చెప్పాలన్న కృతనిశ్చయంతో ఇరాన్ ఉంది. ఇజ్రాయెల్‌పై ఇరాన్ సైన్యం ఏ క్షణమైనా దాడికి దిగొచ్చని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ స్వయంగా వెల్లడించారు. ఇజ్రాయెల్‌లోని కీలక నగరాలను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ అత్యాధునిక డ్రోన్లు, రాకెట్లు ప్రయోగించే అవకాశం ఉందని వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రిక పేర్కొంది. ఈ నేపథ్యంలో ఇరాన్ దాడులను ఎదుర్కొనేందుకు ఇజ్రాయెల్ సైన్యం సన్నాహాలు ప్రారంభించింది. సరిహద్దుల్లో నిఘాను పటిష్టం చేసింది. ఇజ్రాయెల్ దళాలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. యాంటీ మిస్సైల్ మొబైల్ లాంచర్లను రంగంలోకి దించారు. ఇజ్రాయెల్‌పై దాడికి దిగితే సహించబోమని అమెరికా ఇరాన్‌ను హెచ్చరించింది. ఇజ్రాయెల్‌కు రక్షణగా అమెరికా తన యుద్ధ నౌకలను పంపిస్తున్నట్లు తెలిసింది. టెహ్రాన్ నుంచి తమ విమానాల రాకపోకలను ఈ నెల 18వ తేదీ వరకూ రద్దు చేసినట్లు లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ తెలియజేసింది. ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల్లో ఉన్న తమ పౌరులకు కొన్ని దేశాలు ప్రయాణ అడ్వైజరీలు జారీ చేశాయి.


కంటైనర్‌ను ఇరాన్ కమాండోలు స్వాధీనం చేసుకుంటున్న దృశ్యం

ఆ నౌకలో భారతీయులు

17 మంది భారతీయ నావికులు ఉన్న ఇజ్రాయెల్ కంటైనర్ షిప్‌ను ఇరాన్ పారామిలటరీ రివల్యూషనరీ గార్డు కమాండోలు శనివారం స్వాధీనం చేసుకున్నారు. పర్షియన్ గల్ఫ్‌లోని హొర్ముజ్ జలసంధిలో ఈ సంఘటన జరిగింది. నౌకను ప్రస్తుతం ఇరాన్ జలాల వైపు మళ్లిస్తున్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఎంఎస్సీ ఏరీస్ అనే పేరున్న ఈ నౌకపై పోర్చుగీస్ జెండా ఉంది. ఇది ఇజ్రాయెల్‌లోని జొడియాక్ గ్రూప్‌నకు చెందిన నౌక. ఇరాన్ కమాండోలు సోవియట్ కాలం నాటి మిల్ ఎంఐ–17 హెలికాప్టర్ నుంచి తాడు సహాయంతో నౌకపై దిగిన దృశ్యాలు సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. ఇరాన్ కమాండోల దుశ్చర్యపై ఇజ్రాయెల్ తీవ్రంగా స్పందించింది. పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చవద్దని హెచ్చరించింది. ఇరాన్ కమాండోలు స్వాధీనం చేసుకున్న కంటైనర్ నౌకలో ఉన్న 17 మంది భారతీయ నావికుల భద్రతకు చర్యలు తీసుకుంటున్నామని భారత వర్గాలు తెలిపాయి. దౌత్యమార్గాల్లో ఇరాన్‌ను అధికారులను సంప్రదిస్తున్నామని పేర్కొన్నాయి.

వాళ్లది దాడి తంత్రం

మాది పరిరక్షణ మంత్రం

రాజ్యాంగం విషయంలో బీజేపీపై రాహుల్ విమర్శలు


బస్తర్‌లో జరిగిన ర్యాలీలో ప్రసంగిస్తున్న రాహుల్

జగ్దల్‌పూర్/భండారా: రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు కాంగ్రెస్ పాటుపడుతుంటే దానిని నచ్చినట్లు సవరించే కుట్రకు బీజేపీ బరితెగించిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపణలు చేశారు. లోక్‌సభ సమరంలో విజయం సాధించి అధికారం చేపట్టగానే దేశవ్యాప్త కులగణనకు శ్రీకారం చుడతామని రాహుల్ పునరుద్ఘాటించారు. శనివారం ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లాలోని బస్తర్ గ్రామంలో ఎన్నికల ప్రచార ర్యాలీలో రాహుల్ ప్రసంగించారు. ''ఈసారి జరుగుతున్న ఎన్నికలు రాజ్యాంగ పరిరక్షణ, రాజ్యాంగ విధ్వంసక సిద్ధాంతాల మధ్య పోరాటం. ఓవైపు కాంగ్రెస్, విపక్షాల 'ఇండియా'కూటమి రాజ్యాంగ పరిరక్షణకు ప్రయత్నం చేస్తుంటే మరోపక్క మోదీ, అదానీ రాజ్యాంగంపై దాడి చేస్తున్నారు. గిరిజన మహిళ అని కనీస గౌరవం కూడా ఇవ్వకుండా రాష్ట్రపతి ద్రౌపది ముర్మును అయోధ్య రామమందిరం ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి రాకుండా మోదీ ప్రభుత్వం అడ్డుకుంది. ఇది బీజేపీ ఆలోచనాధోరణికి అద్దంపడుతోంది'' అని రాహుల్ ఆరోపించారు. షెడ్యూల్ తెగలకు కేటాయించిన బస్తర్ ఎంపీ స్థానంలో బరిలో దిగిన కాంగ్రెస్ అభ్యర్థి కవాసీ లఖ్మాకు మద్దతుగా రాహుల్ ఈ సభకు వచ్చి మాట్లాడారు.

ఆదివాసీ.. వనవాసీ

''ఆదివాసీ పదాన్నే ప్రధాని వాడుక నుంచి తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. మేం ఆదివాసీ అంటే బీజేపీ వాళ్లు వనవాసీ అంటున్నారు. రెండు పదాల అర్థాల్లో చాలా బేధముంది. ఆదివాసీ అంటే అడవితో మమేకమైన వాళ్లు అని అర్థం. ఆ పదం మీకు జలం, జంగిల్(అడవి), జమీన్(భూమి)పై మీకున్న హక్కులను ఎలుగెత్తి చాటుతుంది. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు గిరిజనప్రాంతాల్లో స్వయం పాలనకు బాటలువేస్తూ గ్రామసభలకు అనుమతినిస్తూ పంచాయతీ చట్టాన్ని తెచ్చాయి. కానీ బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ గిరిజనుల మత విశ్వాసాలు, సిద్ధాంతాలు, చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు చేస్తున్నాయి. అటవీ భూములను అదానీ లాంటి వాళ్లకు బీజేపీ ధారాదత్తం చేస్తోంది. ఇప్పటికే దేశంలో అడవులు కుచించుకుపోతున్నాయి'' అని రాహుల్ అన్నారు.

మేమొస్తే రైతు రుణమాఫీ

మహారాష్ట్రలోని భండారా జిల్లా సకోలీ పట్టణంలో పార్టీ ర్యాలీలోనూ రాహుల్ ప్రసంగించారు. ''అధికారంలోకి రాగానే రైతుల రుణాలను మాఫీచేస్తాం. నిరుద్యోగం, అధిక ధరలతో ఇబ్బందులు పడుతున్న సాధారణ జనం జీఎస్టీ కడుతున్నారు. కోట్లు గడిస్తున్న వాళ్లూ అంతే జీఎస్టీ కడుతున్నారు. మోదీ హయాంలో 22 మంది బడా పారిశ్రామికవేత్తల వద్ద పోగుబడిన సంపద 70 కోట్ల మంది భారతీయుల ఆస్తితో సమానం. ఈ విషయం వదిలేసి మోదీ ఎప్పుడూ మతం గురించే మాట్లాడతారు'' అని రాహుల్ అన్నారు.

ఆస్ట్రేలియాలో కత్తిపోట్లకు ఆరుగురు బలి

- సిడ్నీ షాపింగ్ మాల్‌లో దుండగుడి ఘాతుకం
- 8 మందికి గాయాలు
- పోలీసుల కాల్పుల్లో నిందితుడు హతం

సిడ్నీ: షాపింగ్ కోసం వచ్చిన జనంపై ఓ దుండగుడు కత్తితో విచక్షణారహితంగా దాడికి దిగాడు. దీంతో కత్తిపోట్లకు ఆరుగురు బలైపోయారు. దుండగుడి కిరాతకానికి 9 నెలల చిన్నారి సహా 8 మంది గాయపడ్డారు. ఆస్ట్రేలియాలో సిడ్నీ నగర శివారులోని బొండీ జంక్షన్ సమీపంలో అత్యంత రద్దీగా ఉండే వెస్ట్‌ఫీల్డ్ షాపింగ్ సెంటర్‌లో శనివారం ఈ దారుణం జరిగింది. దుండగుడి దాడి గురించి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. కత్తి పట్టుకొని భయభ్రాంతులకు గురిచేస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకొనేందుకు ప్రయత్నించగా, పోలీసు లకు ఎదురుతిరిగాడు. కత్తి దూసేందుకు ముందుకు రాగా, ఓ మహిళా ఇన్‌స్పెక్టర్ కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో నిందితుడు అక్కడికక్కడే మరణించాడని న్యూ సౌత్‌వేల్స్ సహాయక పోలీసు కమిషనర్ ఆంథోనీ చెప్పారు. ఆరుగురిని పొట్టనపెట్టుకున్న గుర్తుతెలియని దుండగుడి వయసు 40 సంవత్సరాలు ఉంటుందని అన్నారు. అతడు ఎవరు? ఎందుకు ఈ దాడి చేశాడన్నదానిపై దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు. అయితే, ఇది ఉగ్రవాద దాడి కాదని పోలీసు కమిషనర్ కరెన్ వెబ్ స్పష్టం చేశారు. కాల్పులు జరిపి దుండగుడిని మట్టుబెట్టడం సరైన చర్య అని చెప్పారు. లేకపోతే మరికొన్ని ప్రాణాలు పోయేవని అన్నారు. దాడిలో గాయపడిన క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. 9 నెలల చిన్నారికి వైద్యులు శస్త్రచికిత్స చేసినట్లు పోలీసులు చెప్పారు. షాపింగ్ మాల్‌లో నిందితుడు కత్తితో దాడి చేస్తున్నప్పుడు తాము అక్కడే ఉన్నామని భారత సంతతి దంపతులు షోయి ఘోషాల్, దేవశీష్ చక్రవర్తి చెప్పారు. వెంటనే స్టోర్ రూమ్‌కు చేరుకొని, కార్డ్‌బోర్డు పెట్టెలను రక్షణకవచంగా మార్చుకొని ప్రాణాలు కాపాడుకున్నామని తెలిపారు.

మహిళా ఇన్‌స్పెక్టర్ సాహసం

కత్తి దూసిన నిందితుడిని అంతం చేయడంలో మహిళా ఇన్‌స్పెక్టర్ ప్రదర్శించిన ధైర్యసాహసాల పట్ల ప్రశంసల వర్షం కురుస్తోంది. ఆమె ఒంటరిగానే ఆ దుండగుడిని ఎదుర్కొన్నారు. కత్తి దాడి నుంచి చాకచక్యంగా తప్పించుకున్నారు. తుపాకీ ఎక్కుపెట్టి, ఒక తూటాతోనే అతడిని నేలకూల్చారు. మహిళా ఇన్‌స్పెక్టర్ పేల్చిన తూటా దుండగుడిని ఛాతీని చీల్చేసింది. ఇదంతా ఆమె ఏమాత్రం ఒత్తిడికి లోనుకాకుండా నింపాదిగా పూర్తిచేశారని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. నిజానికి ఆస్ట్రేలియాలో ఇలా కత్తితో పొడిచి చంపే సంఘటనలు చాలా అరుదు.

సర్వోదయ నేత మురారీ లాల్ కన్నుమూత



గోపేశ్వర్: సామాజిక కార్యకర్త, సర్వోదయ, చిప్కో ఉద్యమాల నేత మురారీ లాల్(91) కన్నుమూశారు. శ్వాసలో ఇబ్బందులు తలెత్తడంతో మూడు రోజుల క్రితం రిషికేశ్‌లోని ఎయిమ్స్‌లో చేర్పించారు. పరిస్థితి విషమించి శుక్రవారం మురారీ లాల్ తుదిశ్వాస విడిచారు. చమోలి జిల్లా గోపేశ్వర్‌కు సమీపంలోని పాప్డియానా గ్రామంలో 1933లో మురారీ లాల్ జన్మించారు. చిప్కో ఉద్యమ మాతృసంస్థ అయిన దశోలీ గ్రామ స్వరాజ్య మండల్‌కు మురారీ లాల్ అధ్యక్షుడిగా పనిచేశారు. మురారీ లాల్ తన స్వగ్రామంలోని బంజరు భూములను సస్యశ్యామలంగా మార్చడంతోపాటు సహజ వనరుల సంరక్షణ, వినియోగానికి సంబంధించి వినూత్న విధానాలను రూపొందించి గుర్తింపు పొందారు. చమోలీ జిల్లా మద్య నిషేధం కోసం ఉద్యమించారు. 1975–76 కాలంలో భూమి లేని పేదలకు లీజుపై భూమి దక్కేలా చేశారు. శ్రమదానంతో స్వగ్రామంలో పాఠశాలను ఏర్పాటు చేశారు.

సంక్షోభం వేళ ఎంపీల మౌనం!

- కేజ్రీవాల్ అరెస్ట్‌పై ఆప్ రాజ్యసభ ఎంపీల స్పందన అంతంతే
- నిరసనలు, ర్యాలీలకు దూరంగా రాఘవ్ చద్దా, స్వాతి మలివాల్

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల వేళ ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ కేజ్రీవాల్ అరెస్ట్‌తో ఆ పార్టీ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ సమయంలో ఆ పార్టీ ఎంపీలు మాత్రం మౌన వ్రతం పాటిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. పార్టీకి చెందిన 10 మంది రాజ్యసభ ఎంపీల్లో కేవలం ఇద్దరే కేజ్రీవాల్ అరెస్టును ఖండిస్తూ నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మిగతా వారి వ్యవహారంపై పార్టీ సమావేశంలో చర్చించాలనే డిమాండ్లు అంతర్గతంగా ఊపందుకున్నాయి.

ఎనిమిది మంది గాయబ్..

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కేజ్రీవాల్ గత నెల 21న అరెస్టయ్యారు. అప్పటి నుంచి ఆ పార్టీ ఢిల్లీసహా పలు రాష్ట్రాల్లో నిరసనలు, ర్యాలీలు చేపట్టింది. ఈ కార్యక్రమాల్లో ఇద్దరు ఆప్ రాజ్యసభ సభ్యులు సంజయ్‌సింగ్, సందీప్ పాఠక్‌లు మాత్రమే చురుగ్గా ఉంటున్నారు. మిగతా 8 మంది సభ్యులు అంటీముట్టనట్లుగా ఉంటున్నారు. సంజయ్ సింగ్ ఈ కేసులో బెయిల్‌పై బయటకు వచ్చిన మరునాటి నుంచే బీజేపీని, దర్యాప్తు సంస్థల పనితీరును తప్పుపడుతూ ప్రకటనలు చేస్తున్నారు. సందీప్ పాఠక్ సైతం సోషల్ మీడియాతో పాటు జాతీయ మీడియాలో ఆప్ గొంతుక వినిపిస్తున్నారు. పార్టీ కోశాధికారి, ఎంపీ ఎన్‌డీ గుప్తా అడపాదడపా మాత్రమే నిరసనల కార్యక్రమాల్లో కనిపిస్తున్నారు. పూర్తిస్థాయి కార్యక్రమాలకు మాత్రం ఆయన దూరంగానే ఉంటున్నారు. మీడియా భేటీల్లో, సభల్లో మోదీ ప్రభుత్వాన్ని గట్టిగా ఎదుర్కొంటున్న ఎంపీ రాఘవ్ చద్దా ఆచూకీ కనిపించడం లేదు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ఆయన ఢిల్లీలో లేరు. గత నెల మొదటి వారంలో లండన్ వెళ్లి కంటికి చికిత్స చేసుకున్నారని సన్నిహితులు చెబుతున్నారు. మార్చి చివరి వారంలోనే ఆయన ఢిల్లీ రావాల్సి ఉన్నా, వైద్యుల సూచన మేరకు అక్కడే ఉండిపోయారంటున్నారు. మరో కీలక నేత స్వాతి మలివాల్ సైతం అమెరికాలో ఉన్నారు. అక్కడి నుంచి కేజ్రీవాల్ అరెస్టును సామాజిక వేదికలపై ఖండిస్తున్నారు. ప్రత్యక్ష నిరసల్లో ఇంతవరకూ పాల్గొనలేదు. తన సోదరి అనారోగ్యం దృష్ట్యా అమెరికాలో ఉండాల్సి వస్తోందని, తిరిగి వచ్చాక ప్రజాస్వామ్య వ్యవస్థపై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా పోరాడుతానని అంటున్నారు. పంజాబ్‌కు చెందిన పార్టీ ఎంపీ సంజీవ్ అరోరా కేజ్రీవాల్ అరెస్ట్ తర్వాత ఆయన భార్య సునీతతో భేటీ అయ్యారు. అది మినహా రాంలీలా మైదానంలో జరిగిన ర్యాలీ, జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమాల్లోగానీ పాల్గొనలేదు. మరో ఇద్దరు ఎంపీలు అశోక్‌కుమార్ మిట్టల్, క్రికెటర్ హర్భజన్‌సింగ్‌లు కేజ్రీ అరెస్ట్ మినహా ఇతర అంశాలపై సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. పర్యావరణ వేత అయిన ఎంపీ బల్బీర్‌సింగ్ సీచేవాల్, మరో ఎంపీ విక్రమ్‌జీత్ సింగ్ చాహ్నీలు సైతం తమ వ్యక్తిగత వ్యవహారాల్లో బిజీగా ఉన్నారు. ఇలా..పార్టీ ఎంపీలు మౌనవ్రతం దాల్చడంపై సీనియర్ నేతలు గుర్రుగా ఉన్నారు. ఒకట్రెండు రోజుల్లో జరిగే కీలక భేటీలో ఎంపీల తీరుపైచర్చిస్తామని సంజయ్ సింగ్ చెప్పారు.

తీహార్ జైల్లో కేజ్రీవాల్ హక్కులకు భంగం

ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ ఆరోపణ

న్యూఢిల్లీ: తీహార్ జైలులో ఉన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు కుటుంబసభ్యులతో వ్యక్తిగతంగా భేటీ అయ్యేందుకు అధికారులు అనుతివ్వడం లేదని ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ ఆరోపించారు. కేజ్రీవాల్ హక్కులకు భంగం కలిగిస్తూ ఆయన్ను మానసికంగా దెబ్బకొట్టేందుకు జరుగుతున్న ప్రయత్నమిదని అన్నారు. సాధారణ 'ములాఖత్ జంగ్లా'లో భాగంగానే కుటుంబసభ్యులను కేజ్రీవాల్ కలుసుకునేందుకు అవకాశమిస్తున్నారన్నారు. కరడుగట్టిన నేరగాళ్లకూ వ్యక్తిగత సమావేశాలకు అనుమతులున్నాయన్నారు. సీఎంగా ఎన్నికైన వ్యక్తిని సాధారణ ఖైదీగా చూస్తున్నారన్నారు. ఇలా ఉద్దేశపూర్వకంగా అవమానించడం, అమానవీయమని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కనుసన్నల్లోనే ఇలా జరుగుతోందని ఆయన విమర్శించారు. జైలులోని ఓ గదిలో ఇనుప మెష్‌కు ఒక వైపు ఖైదీ, మరోవైపు సందర్శకులుంటారు. ఇలా ఇద్దరూ ఎదురెదురుగా ఉండి మాట్లాడుకునే ఏర్పాటు పేరే 'ములాఖత్ జంగ్లా'.

సాక్షి
కరీంనగర్
ఆదివారం 14 ఏప్రిల్ 2024



వడ్డీ వ్యాపారుల ఇళ్లపై దాడులు

జగిత్యాల క్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని వడ్డీ వ్యాపారులు, ఫైనాన్స్ సంస్థలపై పట్టణ సీఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. 8లో▸



ఓటరు చైతన్యమే లక్ష్యం

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్లకు అవగాహన కల్పిస్తోంది. ఓటింగ్ పెరిగేలా చైతన్యం కల్పిస్తోంది. 8లో▸

గరిష్టం/కనిష్టం
36.0/25.0

వాతావరణం

వాతావరణం ఎండగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. తీవ్ర ఉక్కపోతగా ఉంటుంది.

ఆఫర్‌తోనే సరి!

- పెద్ద ఎత్తున క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లు
- నియామక పత్రాలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్న కంపెనీలు
- సెక్యూరిటీ డిపాజిట్ పేరిట వసూళ్లు
- లేకుంటే వెయిటింగ్ లిస్ట్‌లోకి..
- ఆశల పల్లకి.. ఆపై ఆందోళనలో విద్యార్థులు



'జిల్లాలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ నిర్వహించారు. దీనికి వందల సంఖ్యలో విద్యార్థులు హాజరవగా.. కొందరు ఉద్యోగాలు పొందారు. కాగా రిక్రూట్‌మెంట్ సమయంలో ఇచ్చిన ఆఫర్ లెటర్లు పట్టుకుని ఆయా కంపెనీలకు వెళ్తే సెక్యూరిటీ డిపాజిట్ కింద కొంత డబ్బు వసూలు చేశారని తెలిసింది.'

'జిల్లాలో పేరున్న ఓ డిగ్రీ కళాశాలలో ప్రాంగణ నియామకాలు చేపట్టారు. దీనికి ఎన్నో పేరున్న కంపెనీలు వచ్చాయి. పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరై వారిసత్తాతో ఉద్యోగాలు పొందారు. ఆఫర్ లెటర్లు ఇచ్చి 6 నెలలు గడిచినా ఇంతవరకూ ఉద్యోగాలు ఇవ్వలేదు. దీంతో మరో కంపెనీకి ప్రయత్నం చేయాలా.. వేచి ఉండాలో అర్థంకాక విద్యార్థులు అయోమయంలో పడ్డారు'.

'ఓ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో పేరున్న ఐటీ, మెడికల్ కంపెనీలు వచ్చాయని పెద్దఎత్తున ప్రచారం చేశారు. వందల సంఖ్యలో విద్యార్థులు రాగా, వాటిలో ఎలాంటి ఉద్యోగ అవకాశాలు లేవని చెప్పడం కొసమెరుపు. చిన్నచిన్న ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించి కొంతమందిని ఎంపిక చేసుకుని పెద్దఎత్తున ప్రచారం కల్పించుకున్నారు. కాగా ఇంతవరకూ ఎవరికీ ఎలాంటి ఆఫర్ లేటర్లు ఇవ్వలేదని తెలిసింది'.

కరీంనగర్‌సిటీ:

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగం దొరకడం కష్టంగా మారింది. జీతం తక్కువైనా పర్లేదు కానీ.. అనుభవం ఉండాలనే ఆలోచనతో చాలా మంది ఉన్నత చదువు పూర్తయిన వెంటనే మంచి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తుంటారు. అందుకోసం అహర్నిషలు కష్టపడుతుంటారు. ఇటీవల కాలంలో కళాశాలల్లోనే ఫైనలియర్ విద్యార్థులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. అయితే జిల్లాలో ఈ మధ్యకాలంలో నిర్వహించిన పలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లలో ఉద్యోగాలు పొందిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పలు డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కాలేజీలు రిక్రూట్‌మెంట్‌లు చేపడుతుండగా, పలువురు విద్యార్థులను ఎంపిక చేసుకుని ఆఫర్ లెటర్లు ఇస్తున్నారు. వారు ఆయా కంపెనీలకు వెళ్తే వివిధ కారణాలు చూపుతూ వెయిటింగ్‌లో పెడుతున్నారు.

జిల్లాలో కాలేజీలు, విద్యార్థుల వివరాలు..

ఇంజినీరింగ్ కాలేజీలు	14
విద్యార్థులు	13,000
డిగ్రీ కాలేజీలు	104
విద్యార్థులు	73,000
రిక్రూట్‌మెంట్లలో ఎంపికైన విద్యార్థులు	
ఇంజినీరింగ్ విద్యార్థులు	4,800
డిగ్రీ విద్యార్థులు	9,600

డిపాజిట్ చెల్లిస్తేనే..

కొందరికి ఆఫర్ లెటర్లు ఇచ్చి ఆరు నెలలు దాటినా ఇంతవరకూ ఉద్యోగ అవకాశం కల్పించలేదని తెలిసింది. దీంతో వారు మరో ఉద్యోగానికి వెళ్లాలా.. లేక వేచిచూడాలో తేల్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఆఫర్ లెటర్లతో ఆయా కంపెనీలకు వెళ్తే సెక్యూరిటీ డిపాజిట్ చేయాలంటూ.. డబ్బులు కట్టనివారిని వివిధ కారణాలు చూపుతూ వెయిటింగ్‌లో పెడుతున్నారని తెలిసింది. కాగా, అప్పు చేసి డిపాజిట్ చెల్లించినా ఆరునెలలు తిరగముందే వివిధ లోపాలు చూపుతూ ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని పలువురు వాపోతున్నారు. డిపాజిట్ రాబట్టుకునేందుకు ఆయా కంపెనీల చుట్టూ తిరుగుతున్నామని పేర్కొంటున్నారు. పలు ఐటీ కంపెనీలు ప్రాజెక్టులు రాకముందే విద్యార్థులను ఎంపిక చేసుకుని వారిని సీనియర్ ఉద్యోగులుగా చూపిస్తూ ప్రాజెక్టులు తీసుకుంటున్నాయని, తర్వాత తొలగిస్తున్నారని తెలిపారు. రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్న చాలా కంపెనీలు బోగస్‌వే ఉంటున్నాయని పేర్కొంటున్నారు.

యాజమాన్యాలతో కంపెనీల డీల్..?

పలు ప్రైవేట్ కంపెనీలు ఉద్యోగాలు ఇచ్చేందుకు ఆయా కాలేజీల యాజమాన్యాలతో డీల్ చేసుకుంటున్నారని, ఎంపికైన వారి వేతనాల నుంచి ఆయా కాలేజీలు పర్సంటేజీలు వసూలు చేస్తున్నాయని విద్యార్థులు పేర్కొంటున్నారు. అనేక కంపెనీలు ప్రతిభ ఉన్నవారిని కాకుండా డబ్బుకు ఆశపడి ప్రతిభ లేనివారిని ఎంపిక చేసుకుని చేజేతుల కంపెనీలు దివాళా తీసేందుకు పరోక్షంగా కారణమవుతున్నారనే ఆరోపణలున్నాయి. కొన్ని కంపెనీలు పెద్ద ఎత్తున వేతనాలు ఇస్తామని ప్రచారం చేస్తూ దరఖాస్తులకు ఇంత అంటూ వసూళ్లకు పాల్పడుతున్నాయని తెలిసింది. కాగా క్యాంపస్ రిక్రూట్‌మెంట్ విషయంలో యాజమాన్యాలు కఠినంగా ఉండాల ని, విద్యార్థుల నుంచి డిపాజిట్లు వసూలు చేయొద్దని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థులూ జరభద్రం

క్యాంపస్ రిక్రూట్‌మెంట్ల విషయంలో విద్యార్థులు ఆయా కంపెనీలు చెప్పినవి కాకుండా సొంతంగా తెలుసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వీలుంటే ఆయా కంపెనీల్లో పని చేస్తున్న వారిని సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని పేర్కొటున్నారు.

రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు

- మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలి
- కలెక్టర్ పమేలా సత్పతి
- మల్కాపూర్, బద్దిపల్లిలో కొనుగోలు కేంద్రాల పరిశీలన



బద్దిపల్లిలో ధాన్యం పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి


కొత్తపల్లి(కరీంనగర్): రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా కొనుగోళ్లు జరగాలని లేనిపక్షంలో నిర్వాహకులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్తపల్లి మండలం మల్కాపూర్, బద్దిపల్లి గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యం కేంద్రాలకు వచ్చిందని, ఎన్ని క్వింటాళ్లు రావల్సి ఉందని, కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించారా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం తేమశాతాన్ని స్వయంగా పరిశీలించారు. సరైన తేమశాతం వచ్చేలా ధాన్యాన్ని ఆరబెట్టాలని రైతులకు సూచించారు. అధికారులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ కొనుగోలు చేయాలని అన్నారు. రైస్ మిల్లర్లు సైతం ధాన్యం విషయంలో ఎలాంటి ఇబ్బందులు పెట్టవద్దన్నారు. కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని ప్యాడీక్లీనర్లు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఒకవేళ వర్షం కురిస్తే ధాన్యం తడవకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆయా కేంద్రాల ఇంచార్జీలు, మిల్లర్లు ధాన్యాన్ని తక్కువ ధరకు కొనవద్దని సూచించారు. ఎక్కడ ఏ చిన్న పొరపాటు జరిగినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. మల్కాపూర్‌లో కొనుగోలు కేంద్రం వద్ద విశ్రాంతి తీసుకునేందుకు షెడ్డు నిర్మించాలని కలెక్టర్‌కు రైతులు వినతి పత్రం అందజేశారు. సివిల్ సప్లై డీఎం రజనీకాంత్, డిప్యూటీ తహసీల్దార్ సురేందర్, ఆర్ఐ అరుణ్, పలువురు అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వెంటనే చేపట్టాలి

కరీంనగర్‌రూరల్: కొనుగోలు కేంద్రాల్లో వెంటనే ధాన్యం తూకం వేయాలని జిల్లా సహకార అధికారి రామానుజచార్యులు అన్నారు. శనివారం కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్, ముగ్ధుంపూర్‌లోని ధాన్యం కొనుగోలుకేంద్రాలను డీసీవో పరిశీలించారు. కేంద్రాలను ప్రారంభించినప్పటికీ ఎందుకు కాంటా పెట్టడంలేదని కరీంనగర్, దుర్శేడ్ సహకార సంఘాల సీఈవోలు రమేశ్, వేణును ప్రశ్నించగా రైసుమిల్లుల్లో హమాలీలు లేకపోవడంతో ధాన్యం కాంటా పెట్టడంలేదని తెలిపారు. సోమవారం నుంచి ధాన్యం కాంటా పెట్టాలని ఆదేశించారు. దుర్శేడ్ సింగిల్‌విండో చైర్మన్ తోట తిరుపతి, డైరెక్టర్లు కందుల రమేశ్‌గౌడ్, దాడి లచ్చయ్య, మాజీ ఉప సర్పంచ్ తొగరు మల్లారెడ్డి పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్‌క్రైం: అగ్నిమాపక నివారణ చర్యల్లో భాగంగా ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను శనివారం కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరించారు. అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అగ్నిమాపక అధికారులకు సూచించారు. డివిజన్ ఫైర్ అధికారి తగరం వెంకన్న, ఫైర్ అధికారులు పరమేశ్వర్, భూదయ్య పాల్గొన్నారు.



కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ



- నేడు పోటాపోటీ దీక్షలు
- కరీంనగర్‌లో మంత్రి పొన్నం
- హుస్నాబాద్‌లో బీజేపీ నేతలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్, బీజేపీ నేతలు ఆదివారం పోటాపోటీ దీక్షలు చేపడుతున్నారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బీజేపీ హామీల అమలులో వైఫల్యాలకు నిరసనగా కరీంనగర్ కాంగ్రెస్ కార్యాలయంలో దీక్ష చేపట్టాలని నిర్ణయించగా... ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ మంత్రి పొన్నం ప్రాతినిథ్యం వహిస్తున్న హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో బీజేపీ నిరసన దీక్ష చేపట్టాలని నిర్ణయించింది. అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ చేపట్టనున్న పోటాపోటీ దీక్షలతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గత కొద్ది రోజులుగా బండి సంజయ్‌కుమార్ తన ప్రచారంలో కాంగ్రెస్ గ్యారంటీలను ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్తున్నారు. ఈ క్రమంలోనే రైతుల మద్దతు కూడగట్టుకునేందుకు కొనుగోలు కేంద్రాల వద్దకు వెళ్లి తాలు, తప్ప, తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని, రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా మంత్రి పొన్నం ప్రభాకర్ సిట్టింగ్ ఎంపీపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. ఐదేళ్లుగా ఎంపీగా పనిచేసిన బండి సంజయ్‌కుమార్ నియోజకవర్గానికి చేసిందేమిలేదంటూ ఆరోపణలు చేస్తున్నారు. బీజేపీ హామీల అమలులోని వైఫల్యాలకు నిరసనగా దీక్షకు పూనుకున్నారు. దీంతో తామేమీ తక్కువ కాదన్నట్లు బీజేపీ సైతం గ్యారంటీల అమలు తీరుపై నిరసన దీక్షను చేపట్టింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత కీలకమైన కరీంనగర్‌లో పోటాపోటీ దీక్షలు ఎవరికి అనుకూలిస్తాయనే చర్చ జోరుగా సాగుతోంది. కాగా సిట్టింగ్ ఎంపీ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్, మాజీ ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రచారంలో దూసుకుపోతుండగా, లోక్‌సభ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ గడువు దగ్గరపడుతున్నప్పటికీ కాంగ్రెస్ అభ్యర్థిని ఖరారు కాకపోవడం ఇరు పార్టీలకు ప్రచారాస్త్రంగా మారింది. ఇదిలా ఉంటే మంత్రి పొన్నం ప్రభాకర్, బీజేపీ నేతల పోటీపోటీ దీక్షలు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో రాజకీయ వేడిని రగుల్చుతున్నాయి.

ఒక్కో ఇంటికి ఐదుసార్లు వెళ్లండి



శివప్రకాశ్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపీ బండి సంజయ్

- కేంద్ర పథకాలు వివరిస్తూ.. ఓట్లు అభ్యర్థించాలని కోరిన శివప్రకాశ్
- బండి గెలిచి కేంద్రమంత్రి అవుతారన్న దుగ్యాల ప్రదీప్
- బీజేపీ బూత్ విజయ సంకల్ప అభియాన్ సమావేశం సక్సెస్

కరీంనగర్‌టౌన్: భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని రాజశ్రీగార్డెన్‌లో శనివారం జరిగిన 'బూత్ విజయ సంకల్ప అభియాన్' సమావేశం సక్సెస్ అయ్యింది. పోలింగ్ బూత్‌స్థాయి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జాతీయ సంస్థాగత సహ ప్రధాన కార్యదర్శి శివ ప్రకాశ్ ఎన్నికల్లో పోలింగ్ బూత్‌స్థాయిలో చేయాల్సిన కార్యక్రమాలపై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఎన్నికలు జరిగే నాటికి ఒక్కో ఇంటికి ఐదుసార్లు వెళ్లి ఓట్లు అభ్యర్థించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. వీటితో పాటు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలను, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని కోరారు. అంతకుముందు మాట్లాడిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ 'ఈసారి బండి సంజయ్ గెలిచి కేంద్ర మంత్రి కాబోతున్నారు'అని అన్నారు. అనంతరం బండి సంజయ్ కరీంనగర్‌లోని 21వ డివిజన్ బాలాజీనగర్‌లో డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. తాగడానికి నీళ్లులేక, అస్తవ్యస్తమైన డ్రైనేజీతో ఇబ్బంది పడుతున్న బాలాజీనగర్ ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లోనే ఉన్న బాలాజీనగర్‌కే నీళ్లు రాకపోతే ఇక తండాల, గ్రామల పరిస్థితి ఎట్లుందో అర్థం చేసుకోవాలన్నారు.

హుస్నాబాద్‌లో నేడు 'బీజేపీ నిరసన దీక్ష'

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బీజేపీ మరో దీక్షకు సిద్ధమైంది. వందరోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని మోసం చేసిన కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ హుస్నాబాద్ వేదికగా ఆదివారం 'నిరసన దీక్ష' చేయబోతున్నారు. పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి శనివారం హుస్నాబాద్ నియోజకవర్గ నాయకులు కరీంనగర్‌లో సంజయ్‌తో సమావేశమై దీక్ష ఏర్పాట్లపై చర్చించారు. ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు హుస్నాబాద్‌లోని బొమ్మశ్రీరాం కార్యాలయంలో 'నిరసన దీక్ష' చేపడుతున్నట్లు ప్రకటించారు. దీక్ష చేసేందుకు సిద్ధమైన నాయకులను సంజయ్ ప్రత్యేకంగా అభినందించారు. నాయకులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, రాంగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అనుమతి లేని క్లినిక్‌ల తనిఖీ



ఆర్ఎంపీని ప్రశ్నిస్తున్న డాక్టర్ నరేశ్‌కుమార్

కరీంనగర్‌టౌన్: తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో టీఎస్ఎంపీ చైర్మన్ డాక్టర్ మహేశ్ ఆదేశాల మేరకు శనివారం నగరంలో అనుమతులు లేని పలు క్లినిక్‌ల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మెడికల్ కౌన్సిల్ మెంబర్, పబ్లిక్ రిలేషన్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేశ్‌కుమార్, ఈసీ మెంబర్ రాజ్‌కుమార్ నేతృత్వంలోని బృందం నకిలీ వైద్యులు, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న క్లినిక్‌ల్లో సోదాలు చేశారు. గోదాంగడ్డ, రాంనగర్, కశ్మీర్ గడ్డ, విద్యానగర్, చింతకుంట క్రాస్‌రోడ్‌లోని 11 క్లినిక్‌లలో తనిఖీలు చేయగా.. మూడింటిలో క్వాలిఫైడ్ వైద్యులు ఉన్నప్పటికీ అనుమతి లేకుండా నడుపుతున్నట్లు గుర్తించి నోటీలసులు జారీ చేశారు. మరో ఎనిమిది క్లినిక్‌లలో అవసరం లేకుండా పేయిన్‌కిల్లర్స్, స్టిరాయిడ్స్, యాంటిబయోటిక్ మందులు వాడుతున్నట్లు గుర్తించారు. నిల్వచేసిన మందులు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై ఎన్ఎంసీ చట్టం 34,54 ప్రకారం ఎఫ్ఐఆర్ ఫైల్ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

న్యూస్‌రీల్

మంచి పాలకులతోనే రాజ్యం సుభిక్షం

- చిన జీయర్‌స్వామి



కరీంనగర్‌కల్చరల్: పాలకులు మంచివారై, వారి ఆలోచనా సరళి బాగుంటే రాజ్యం సుభిక్షంగా ఉంటుందని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి అన్నారు. జెట్, వికాస తరంగిణి ఆధ్వర్యంలో పద్మనాయక కల్యాణ మండపంలో జరుగుతున్న వసంత నవరాత్రి ఉత్సవాల్లో శనివారం ఉదయం, సాయంత్రం స్వామిజీ ప్రవచనం చేశారు. వేదం, ధర్మం, సత్యం, నీతినియమాలతో పాటు ప్రజా సమస్యలపై పాలకులకు అవగాహన ఉండాలన్నారు. ఉదయం శ్రీమద్రామాయణ హవనం, తీర్థగోష్ఠి, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. అనంతరం జ్యోతినగర్‌లోని ఆండాళ్ గోష్ఠిని స్వామిజీ సందర్శించారు. కార్యక్రమంలో చల్మెడ లక్ష్మీనరసింహారావు, వీర్ల ప్రభాకర్‌రావు, కలకొండ గౌతమ్‌రావు, బీవీ రావు, యాద కిషన్, ఎల్.భూపతిరావు, ఎస్.వెంకటేశం, వరప్రసాదాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవడమే అసలైన నివాళి




కరీంనగర్‌కల్చరల్: పదేళ్ల కేంద్రంలో అధికారం చేపట్టిన బీజేపీ పాలకులు అంబేద్కర్ ఆశయాలను తొక్కేశారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి పేర్కొన్నారు. మహాత్మ జ్యోతిబాపూలే, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ముకుందలాల్ మిశ్రాభవన్‌లో 'రాజ్యాంగాన్ని రక్షించుకుందాం- ప్రజా స్వామ్యాన్ని కాపాడుకుందాం' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ముకుందరెడ్డి మా ట్లాడుతూ.. రాజ్యాంగంలోని నాలుగు మూల స్తంభాలైన ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, ఫె డరలిజం, సామాజిక న్యాయాలను సర్వనాశ నం చేస్తున్నారని అన్నారు. ఈడీ, సీబీఐలను తమజేబు సంస్థలుగా వాడుకొని పలువురు రాజకీయ నేతలను జైలుపాలు చేస్తున్నారని అన్నారు. బీజేపీ పాలన ఇలాగే సాగితే దేశం అధోగతి పాలవడం ఖాయమని పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్, జిల్లా కోశాధికారి ఏ.రాజేశం, జిల్లా ఉపాధ్యక్షుడు యూ.శ్రీనివాస్, జనగాం రాజమల్లు, జిల్లా సహాయ కార్యదర్శి మారేళ్ల శ్రీలత, పున్న రవి, కొప్పుల శంకర్, జిల్లా కమిటీ సభ్యులు కదిరె రమేశ్, గట్టు సతీశ్, రచ్చర్ల మల్లేశం, ముక్కెర బుజ్జమ్మ, చౌదరి సంపత్ పాల్గొన్నారు.

జార్జిరెడ్డి స్ఫూర్తితో పోరాటాలు



కరీంనగర్: జార్జిరెడ్డి స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని, జార్జిరెడ్డి జీవితచరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుతాటి రాణాప్రతాప్ అన్నారు. కరీంనగర్‌లోని బీసీ బాలికల హాస్టల్‌లో ఉస్మానియా అరుణతార జార్జిరెడ్డి వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించారు. రాణాప్రతాప్ మాట్లాడుతూ జార్జిరెడ్డి ఏ మతోన్మాదం కారణంగా చనిపోయాడో, నేడు అదే మతోన్మాదం కేంద్రంలోని బీజేపీ అధికారం చలాయిస్తూ, ప్రజల మధ్య కులమత విభజన రేఖలు గీస్తోందని అన్నారు. పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దం శ్రీకాంత్, కొయ్యడ రాకేశ్, మానస, మమత, శ్రీనిక, కావ్య, స్వప్న, దివ్య, మౌనిక పాల్గొన్నారు.

విదేశీ విద్యను సద్వినియోగం చేసుకోవాలి



విద్యానగర్(కరీంనగర్): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని విద్యార్థులు విదేశీ ఉన్నత విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర హజ్ కమిటీ మాజీ డైరెక్టర్ సయ్యద్ ఇర్ఫాన్ ఉల్‌హక్ అన్నారు. శనివారం కరీంనగర్‌లో విదేశాల్లో ఉన్నత విద్య అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విదేశీ యూనివర్సిటీల్లో చదవడం వల్ల ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని అన్నారు. నైపుణ్యం పెరుగుతుందని వివరించారు.

శ్రీపాదరావుకు నివాళి



శ్రీపాదరావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: మాజీ స్పీకర్, దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు అజాతశత్రువని, మారుమూల ప్రాంతమైన మంథని అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం శ్రీపాదరావు 25వ వర్ధంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయంతో పాటు, నగరంలోని శ్రీపాదరావు విగ్రహం వద్ద నివాళి అర్పించారు. నాయకులు ఆరెపల్లి మోహన్, పురుమల్ల శ్రీనివాస్, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, వైద్యుల అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖల్సా ఆవిర్భావ దినోత్సవం



నగరంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న సిక్కులు

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లోని గురుద్వార్ ప్రబంద్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఖల్సా(వైశాఖి) 325వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సిక్కులు నగరవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. మత గురువులతో పాటు గురుద్వార్ ప్రబంద్ కమిటీ బాధ్యులు సర్దుల్‌సింగ్, బిషన్‌సింగ్, రణబీర్‌సింగ్, బల్‌బీర్‌సింగ్ , సిక్కులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పత్తిపాక మోహన్‌కు బిహువన్ అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న మోహన్

సిరిసిల్ల కల్చరల్: జిల్లా కేంద్రానికి చెందిన బాల సాహిత్యకారుడు, నేషనల్ బుక్ ట్రస్టు ఉపసంపాదకుడు డాక్టర్ పత్తిపాక మోహన్‌ను మరో పురస్కారం వరించింది. బెంగళూర్‌లోని అస్సాం అసోసియేషన్ అస్సాం నూతన సంవత్సరం బిహు సందర్భంగా బిహువన్ అవార్డును శనివారం ప్రదానం చేసింది. అస్సాం, తెలంగాణ సాహిత్య స్నేహానికి గుర్తుగా పురస్కారం అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మణిదీప్‌దాస్, కార్యదర్శి బీభాష్ హాజరిక తెలిపారు. అస్సాం సంస్కృతికి చిహ్నమైన ఖడ్గమృగం చిహ్నంతోపాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. సంఘం ప్రతినిధి బిజత్‌శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

'మానేరు' విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్స్



విద్యార్థులతో మానేరు విద్యాసంస్థల చైర్మన్ అనంతరెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల విద్యార్థులకు హైదరాబాద్ టాపర్స్ ఐఐటీవారు శనివారం మెడల్స్, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. 2023–24 విద్యాసంవత్సరంలో టాపర్స్ ఐఐటీలో తరగతుల వారీగా మొదటి మూడు స్థానాల్లో నిలిచినవారికి బంగారు, రజత, కాంస్య పతకాలతోపాటు సర్టిఫికెట్లు అందజేశారని మానేరు విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి తెలిపారు. శనివారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. ఉమ్మడి జిల్లాలో ఐఐటీ తరహా విద్యా విధానానికి మానేరు విద్యాసంస్థలు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇది పిల్లల ఉజ్వల భవిష్యత్‌కు ఎంతగానో దోహదపడుతుందన్నారు. పోటీ పరీక్షల్లో విజయానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతా రెడ్డి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మానేరు' సామగ్రి చోరీ ఘటనపై కేసు

ముత్తారం(మంథని): మండలంలోని ఓడెడ్ మానేరు బ్రిడ్జి నిర్మాణానికి ఉపయోగించే సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుసూదన్‌రావు తెలిపారు. 10 ఇనుప ప్లేట్లు, 2 స్టేజింగ్ క్రిబ్స్ ఎత్తుకెళ్లినట్లు బ్రిడ్జి నిర్మాణ ఇన్‌చార్జి సయ్యద్ బాబా శనివారం ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు.

పెద్దపల్లి జెడ్పీ చైర్మన్‌పై కోడ్ ఉల్లంఘన కేసు

మంథని: అనుమతి లేకుండా మంథనిలో నిరసన దీక్ష చేపట్టిన పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుతోపాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులపై పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు నమోదైంది. మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం జెడ్పీ చైర్మన్ నివాసానికి వెళ్లి, నోటీసులు అందించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి కట్టుబడి వ్యవహరించాలని, ఎవరు ఉల్లంఘించినా చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించొద్దని పేర్కొన్నారు.

వడ్డీ వ్యాపారుల ఇళ్లపై దాడులు

- జగిత్యాల జిల్లాలోని పలుచోట్ల నగదు, ప్రామిసరీ నోట్లు స్వాధీనం
- నిందితులపై కేసు నమోదు చేసిన పోలీసులు

జగిత్యాల క్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని వడ్డీ వ్యాపారులు, ఫైనాన్స్ సంస్థలపై పట్టణ సీఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. కాసారపు రాజయ్య వద్ద రూ.56.35 లక్షల విలువైన ప్రామిసరీ నోట్లు, రూ.4 లక్షలు, లవంగ రాజేందర్ వద్ద రూ.70 వేలు, రూ.1.58 లక్షల విలువైన ప్రామిసరీ నోట్లు, రమేశ్ వద్ద 28 ప్రామిసరీ నోట్లు, రెండు ఖాళీ చెక్కులు, అరవింద్ వద్ద 29 ఖాళీ చెక్కులు, రూ.2.50 లక్షల విలువైన మార్టిగేషన్ పేపర్లు, కడెం వెంకవ్వ వద్ద రూ.21.43 లక్షల విలువైన 56 ప్రామిసరీ నోట్లు, రూ.85 వేలు పట్టుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సైలు నరేశ్‌కుమార్, మన్మధరావు, ఏఎస్సై వేణురావు, సిబ్బంది పాల్గొన్నారు. జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోతె, టీఆర్‌నగర్ గ్రామాల్లోని నలుగురు వడ్డీ వ్యాపారుల ఇళ్లపై శనివారం దాడులు నిర్వహించినట్లు ఎస్సై సదాకర్ తెలిపారు. టీఆర్‌నగర్‌కు చెందిన పెద్ద సారయ్య ఇంట్లో రూ.1.19 లక్షలు, 129 ప్రామిసరీ నోట్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అతనిపై కేసు నమోదు చేశామన్నారు.

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండలంలోని గోధూర్, సత్తక్కపల్లి గ్రామాల్లో శనివారం ఎస్సై అనిల్ ఆధ్వర్యంలో పోలీసులు వడ్డీ వ్యాపారుల ఇళ్లపై దాడులు నిర్వహించారు. గోధూర్‌లో బండి పురుషోత్తం ఇంట్లో రూ.8.33 లక్షల విలువైన 17 ప్రామిసరీ నోట్లు, రూ.3 వేల విలువైన బ్లాంక్ చెక్, 23 చిన్న నోటు పుస్తకాలు, 2 మీడియం నోటు పుస్తకాలు స్వాధీనం చేసుకున్నారు. సత్తక్కపల్లిలో ఆరెళ్ల రాజగౌడ్ ఇంట్లో రూ.36.45 లక్షల విలువైన 18 ప్రామిసరీ నోట్లు, చిన్న బుక్స్ 18, మీడియం బుక్ 1, లాంగ్‌నోట్ బుక్ 1, రూ.1.69 లక్షలు పట్టుకున్నారు. వాటిని సీజ్ చేసి, ఆ ఇదరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



మెట్‌పల్లిలో పోలీసులతో వడ్డీ వ్యాపారి వాగ్వాదం

రాయికల్(జగిత్యాల): మండలంలోని ఇటిక్యాల, అల్లీపూర్ గ్రామాలకు చెందిన వడ్డీ వ్యాపారుల ఇళ్లలో పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. అల్లీపూర్‌లోని రాజు ఇంట్లో రూ.1.80 లక్షలు, ఇటిక్యాలలోని శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో రూ.18 లక్షల విలువైన ప్రామిసరీ నోట్లు లభ్యమైనట్లు తెలిపారు.

ధర్మపురి: స్థానిక 9 మంది వడ్డీ వ్యాపారుల ఇళ్లలో శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. రూ.6.23 లక్షలు, 65 ప్రామిసరీ నోట్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకొని, విచారణ చేపడుతున్నామని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వడ్డీ వ్యాపారం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని రేగుంట, మొగిలిపేట గ్రామాలకు చెందిన పలువురి ఇళ్లలో పోలీసులు శనివారం తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వ అనుమతి, లైసెన్స్ లేకుండా వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో సోదాలు చేశామని ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. అయితే, పోలీసులకు నగదు, ఎలాంటి అప్పు పత్రాలు లభించలేదని తెలిసింది.

కోరుట్ల: కోరుట్లకు చెందిన 12 మంది వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. అరిసెల్లి రాజేశం ఇంట్లో రూ.1.28 లక్షలు, రూ.69 లక్షల విలువైన ప్రామిసరీ నోట్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సురేశ్‌బాబు, ఎస్సై కిరణ్ తెలిపారు.

మెట్‌పల్లి: పట్టణానికి చెందిన పలువురు వడ్డీ వ్యాపారుల ఇళ్లలో పోలీసులు శనివారం తనిఖీలు చేపట్టారు. సీఐ నవీన్, ఎస్సై చిరంజీవి, పోలీసు సిబ్బంది ర్యాగల్ల వెలయేశ్వర్, వేముగంటి భూమేశ్వర్, ధ్యావనపల్లి రాజారాం ఇళ్లల్లో రూ.5 లక్షలు, రూ.87 లక్షల విలువైన ప్రామిసరీ నోట్లు, 26 చెక్కులు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేశారు. అలాగే, కట్కం రమేశ్ ఇంట్లో సోదాలకు వెళ్లగా అతను పోలీసులను అడ్డుకొని, వాగ్వాదానికి దిగాడు. ఒక దశలో ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. అయినప్పటికీ పోలీసులు రమేశ్ ఇంట్లోకి వెళ్లి, తనిఖీలు చేపట్టారు. బంగారం తాకట్టు పెట్టుకొని, అప్పులు ఇచ్చే ఇతను గతంలో పోలీసులకు పట్టుబడ్డాడు. ఆ సమయంలో అతని వద్ద నుంచి పెద్ద ఎత్తున బంగారం స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం జరిపిన సోదాల్లో కూడా భారీగా బంగారం పట్టుబడినట్లు తెలిసింది. ఈ తనిఖీలను ఎస్‌బీ డీఎస్పీ రవీందర్ పర్యవేక్షించారు.

బుగ్గారం(ధర్మపురి): మండలంలోని వెల్గొండ, శెకెల్ల గ్రామాలకు చెందిన వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. అప్పు పత్రాలు, నగదు స్వాధీనం చేసుకున్నామని, శెకెల్లకు చెందిన బంక వెంకటేశం, వెల్గొండకు చెందిన వెంకటరాజంలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు.



జగిత్యాల: తనిఖీ చేస్తున్న సీఐ వేణుగోపాల్



ధర్మపురిలో నగదు, ప్రామిసరీ నోట్లు చూపుతున్న సీఐ రాంనర్సింహారెడ్డి



సత్తక్కపల్లిలో ఎస్సై అనిల్..



కోరుట్లలో సోదాలు చేస్తున్న పోలీసులు

అనుమతులు మీరి.. రోడ్డును ఆనుకొని

- కరీంనగర్ నగరంలోని కాపువాడలో వివాదాస్పదంగా ఇంటి నిర్మాణం



కాపువాడలో వివాదాస్పదంగా మారిన ఇంటి నిర్మాణం

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని కాపువాడలో అనుమతులు మీరి, రోడ్డును ఆనుకొని చేపడుతున్న ఇంటి నిర్మాణం వివాదాస్పదమవుతోంది. పాత ఇంటిని తొలగించి కొత్తగా ఇంటి నిర్మాణం చేపడుతున్నప్పటికీ, నగరపాలకసంస్థ అనుమతి ప్రకారం కాకుండా నిర్మాణం రోడ్డుపైకి వస్తుండడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నగర పాలకసంస్థ 6వ డివిజన్ పరిధిలోని మారుతినగర్ చౌరస్తా నుంచి శివాలయం చౌరస్తా వరకు వెళ్లే ఈ రోడ్డు నిత్యం రద్దీగానే ఉంటుంది. నగరంలోనే పురాతనకాలనీ అయిన ఈ కాపువాడలో పాత ఇండ్లు తొలగించి నూతన గృహాల నిర్మాణం చేపట్టడం ఇటీవల పెరిగిపోయింది. అయితే కొత్త ఇండ్ల నిర్మాణాల సమయంలో నిబంధనలు పాటించడంతో ఈ రోడ్డు మున్సిపల్ నిబంధనల ప్రకారం 30 ఫీట్ల వెడల్పుగా మారింది. కానీ, తాజాగా చేపట్టిన ఓ ఇంటి నిర్మాణం రోడ్డు వైపు ఎక్కువగా రావడంతో, రోడ్డు పరిధి తగ్గే పరిస్థితి నెలకొంది. దీంతో ఈ విషయాన్ని స్థానికులు నగరపాలకసంస్థ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బల్దియా అనుమతి మేరకు నిర్మాణం చేపట్టేలా చూడాలన్నారు.

2 కిలోల గంజాయి పట్టివేత



అరెస్టు చూపుతున్న డీఎస్పీ నాగేంద్రచారి

- ఐదుగురు విక్రేతల అరెస్టు
- వివరాలు వెల్లడించిన వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి

వేములవాడరూరల్: 2 కిలోల గంజాయి పట్టుకొని, ఐదుగురు విక్రేతలను అరెస్టు చేసినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. వేములవాడ రూరల్ సర్కిల్ కార్యాలయంలో శనివారం సంబంధిత వివరాలను వెల్లడించారు. మంచిర్యాల జిల్లా అల్లూరి సీతారాంనగర్‌కు చెందిన పరిగిపండ్ల అన్వేశ్ అలియాస్ బన్నీ ప్రస్తుతం వేములవాడ పట్టణంలోని శాస్త్రీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇతనితోపాటు పట్టణంలోని సుభాష్‌నగర్‌కి చెందిన మత్రిపల్లి సురేశ్ శుక్రవారం సాయంత్రం వేములవాడ రూరల్ మండలంలోని నాగాయపల్లి రైతు వేదిక వెనకాల గంజాయి విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఎస్సై మారుతి తన సిబ్బందితో వెళ్లి, వారిని పట్టుకున్నారు. 1.270 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని, ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. నిందితులు వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్‌లో ఐస్‌క్రీం బండి నడిపే శ్యాం దివాకర్(యూపీ), కుమ్మరి మల్లికార్జున్(వేములవాడ), కట్కూరి భాను(కామారెడ్డి)ల వద్ద గంజాయి కొనుగోలు చేశారు. దాన్ని విక్రయించగా వచ్చే డబ్బులతో జల్సాలు చేయాలనుకున్నారు. గంజాయికి అలవాటు పడిన యువతకు అమ్మేవారు. శ్యాం దివాకర్, మల్లికార్జున్, భానులను వేములవాడ పట్టణంలోని అయ్యప్ప గుడి సమీపంలో పట్టుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. వీరి వద్ద నుంచి 620 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని అన్నారు. మొత్తం ఐదుగురిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. నిందితులను పట్టుకున్న కానిస్టేబుళ్లు రాజశేఖర్, తిరుపతి, శంకర్, గోపాల్, సతీశ్‌లకు రివార్డులు అందజేసి, అభినందించారు. సమావేశంలో రూరల్, పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్, టౌన్ ఎస్సై అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు చైతన్యమే లక్ష్యం

- పలు కార్యక్రమాలు అమలు చేస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం
- కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల భాగస్వామ్యం
- ఐవోసీ, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్‌లతో ఒప్పందం

కరీంనగర్ లోక్‌సభ పరిధిలో..

పెట్రోల్ బంకులు	: 93
రైల్వేస్టేషన్లు	: 2
రోజువారీ ప్రయాణికులు	: 5,000–8,000
మొత్తం పోస్టాఫీసులు	: 523
ఖాతాదారులు	: 4,23,450మంది



కరీంనగర్ అర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటర్ల నిర్ణయమే అంతిమం. దేశ భవిష్యత్తు కోసం ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) ఓటరు చైతన్యమే లక్ష్యంగా పలు కార్యక్రమాలు అమలు చేస్తోంది. గత సార్వత్రిక పోరులో కరీంనగర్ జిల్లాలో నమోదైన ఓటింగ్ 65.57 శాతం మాత్రమే. ఈసారి పోలింగ్ శాతం మెరుగయ్యేలా సీఈసీ కొత్త పంథా అనుసరిస్తోంది. ఓటరు చైతన్య కార్యక్రమాల్లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, శాఖలను భాగస్వామ్యం చేయాలని తాజాగా నిర్ణయించింది. ఇందులో భాగంగా పోస్టల్, రైల్వే, పెట్రోలియం మంత్రిత్వ శాఖకు చెందిన ఐవోసీ, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్‌లతో ఒప్పందం కుదుర్చుకుంది.

ఒప్పందం ప్రకారం..

- ఈసీతో కుదిరిన అవగాహన ఒప్పందం ప్రకారం.. సంబంధిత కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు తమ పరిధిలోని ఖాతాదారులు, ప్రజలకు అత్యంత చేరువగా ఓటు ప్రాధాన్యంపై ప్రచారం చేస్తాయి.
- కేంద్ర ప్రభుత్వ సంస్థలు, వాటి అనుబంధ సంస్థల వెబ్‌సైట్‌లలో ఓటరు చైతన్య కార్యక్రమాలను ప్రముఖంగా ప్రదర్శిస్తారు. ఎన్నికల ప్రక్రియపై లోతైన అవగాహన కోసం యూజర్లకు అవకాశం కల్పిస్తారు.
- గోడపత్రాలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను ఆయా సంస్థల కార్యాలయాలు, భవనాలు, ఇతర ముఖ్య ప్రదేశాల్లో ప్రదర్శిస్తారు. ఎక్కువ మంది సందర్శించే ప్రాంతాలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు.
- పోస్టాఫీసుల వేదికగా ఓటు చైతన్య చర్చలు నిర్వహిస్తారు. ఉద్యోగులు, ఖాతాదారులు అధిక సంఖ్యలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తారు. ఇప్పటికే అమలవుతున్న స్వీప్ వంటి కార్యక్రమాలపై సిబ్బందికి ముందుగానే శిక్షణ ఇస్తారు.
- ఆయా సంస్థల సోషల్ మీడియా, కస్టమర్ ఔట్ రీచ్ వేదికల ద్వారా ప్రచారం చేస్తారు.
- కరీంనగర్ డివిజన్‌లోని ప్రధాన పోస్టాఫీసుల పరిధిలో 70 ఉప, 453 గ్రామీణ తపాలా కార్యాలయాలున్నాయి. వీటికి ఇప్పటికే ఎన్నికల ప్రచార సామగ్రి చేరినట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం వాటిని ప్రచారానికి వినియోగించనున్నారు.

స్వీప్ కార్యక్రమం..

పోలింగ్ రోజు ఓటర్లందరూ పోలింగ్ కేంద్రాలకు వచ్చేలా చైతన్యం కల్పించాలన్న ఉద్దేశంతో సీఈసీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నదే స్వీప్(సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్, ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమం. ఈ విభాగం విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. లక్షిత ఓటర్లు గల ప్రాంతాలు, జన బాహుళ్య కూడళ్లలో మొబైల్ వాహనాల ద్వారా ఓటు విలువ, పోలింగ్ సమాచారం, ఇతర వివరాలను ప్రచారం చేస్తున్నారు. దీనికితోడు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను భాగస్వామ్యం చేయడం వల్ల పోలింగ్ శాతం పెరుగుతుందని ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు.

కొండగట్టు ఆలయ అధికారులపై చర్యలకు ఆదేశాలు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానానికి సంబంధించిన పలు దుకాణాల వేలం డబ్బులను ఆలయ అధికారి శ్రీనివాసాచారి సొంతానికి వాడుకున్నారని అప్పటి ఈవో వెంకటేశ్ ఆయనను సస్పెండ్ చేశారు. ఆ వెంటనే దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.జ్యోతి ఆలయానికి వచ్చి, రికార్డులను పరిశీలించారు. వాటిని హైదరాబాద్‌లోని దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి తీసుకెళ్లారు. విధుల్లో నిర్లక్ష్యం వహించారని ఆలయ ఈవోను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. కాగా, టెండర్లు నిర్వహించాక లావాదేవీలను సరిచూసుకునే క్రమంలో నిర్లక్ష్యం చేసిన మిగతా అధికారులపై చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ కమిషనర్ ఆలయ ఈవోకు 23.03.2024న ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయం శనివారం తెలియడంతో ఈవో చంద్రశేఖర్‌ను వివరణ కోరగా త్వరలోనే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటానని 'సాక్షి'కి తెలిపారు.



కొండగట్టు అంజన్న ఆలయం

నకిలీ నియామక పత్రాల కలకలం

- పదుల సంఖ్యలో బాధితుల గుర్తింపు
- హైదరాబాద్‌కు పరారైన నిందితుడు
- పోలీసుల గాలింపు

కోరుట్ల: కథలాపూర్ మండలంలోని సిరికొండకు చెందిన ఓ వ్యక్తి ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ డబ్బులు తీసుకొని, నకిలీ నియామక పత్రాలు ఇవ్వడం కలకలం రేపుతోంది. ఇలా మోసపోయినవారు పదుల సంఖ్యలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడు హైదరాబాద్‌కు పరారైనట్లు సమాచారం. శనివారం కొంతమంది బాధితులు సిరికొండలోని అతని ఇంటికి వెళ్లినట్లు తెలిసింది. ఉద్యోగాలు ఇప్పిస్తానని గతంలోనూ కొంతమంది వద్ద డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి.

రూ.లక్ష వరకు వసూలు..

ఓ యువతి శుక్రవారం నకిలీ నియామక పత్రంతో కోరుట్ల పట్టణంలోని బస్తీ దవాఖానాకు వెళ్లడం.. తనను ల్యాబ్ టెక్నీషియన్‌గా విధుల్లో చేర్చుకోవాలని కోరగా వైద్య సిబ్బంది ఉన్నతాధికారులు, పోలీసులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పోలీసులు నకిలీ నియామక పత్రాలు తయారు చేసి, ఇస్తున్న వ్యక్తి వివరాలు సేకరించినట్లు సమాచారం. ప్రభుత్వ ఉద్యోగాల పేరిట కోరుట్ల, మెట్‌పల్లి, కథలాపూర్, మేడిపల్లి పరిసర ప్రాంతాల్లో అతను కొంతమంది యువత వద్ద రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేసి, నకిలీ నియామక పత్రాలు ఇచ్చినట్లు తెలిసింది. నిందితుని ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం.



నకిలీ నియామక పత్రం

సంతకం, రిజిస్ట్రేషన్, రిఫరెన్స్ నంబర్లు..

కోరుట్ల బస్తీ దవాఖానాలో ల్యాబ్ టెక్నీషియన్‌గా అపాయింట్ చేస్తూ జారీ చేసిన నకిలీ నియామక పత్రం పకడ్బందీగా ఉండటం చర్చనీయంగా మారింది. డీఎంహెచ్‌వో సంతకంతోపాటు రిజిస్ట్రేషన్, రిఫరెన్స్ నంబర్లు ఉండటం గమనార్హం. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొత్త పోస్టులు ఇచ్చే అవకాశం లేకపోవడం, బస్తీ దవాఖానాలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు లేకపోవడంతో వైద్య సిబ్బందికి అనుమానం వచ్చింది. తర్వాత అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, నిజాలు నిగ్గు తేల్చడానికి పోలీసు అధికారులు లోతుగా విచారణ చేపడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- మృతుడి భార్య 9 నెలల గర్భిణి..
- ఆమెకు, కుమారుడికి తప్పిన ప్రాణాపాయం
- విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొట్టడంతో ఘటన

ధర్మారం/ధర్మపురి: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. అతని భార్య గర్భిణి. ఆమెకు, కుమారుడికి ప్రాణాపాయం తప్పింది. ధర్మారం ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మపురి మండలంలోని దోనూరు గ్రామానికి చెందిన పందిరి మహేశ్(35)కు భార్య పూజిత, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. ఆమె ప్రస్తుతం 9 నెలల గర్భిణి. మహేశ్ అన్న కుమారుడికి శుక్రవారం సాయంత్రం గుండెనొప్పి రావడంతో భార్య, కొడుకుతో కలిసి కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి కారులో తీసుకెళ్లాడు. రాత్రి అక్కడే ఉండి, శనివారం తెల్లవారుజామున స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో ధర్మారం మండలంలోని ఎర్రగుంటపల్లి వద్దకు రాగానే మహేశ్ నిద్రమత్తులో ఉండటంతో వాహనం అదుపుతప్పి, రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య, కుమారుడికి ఎలాంటి గాయాలు కాలేదు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



మహేశ్ (ఫైల్)

బస్సును ఓవర్‌టేక్ చేయబోయి..

- విలేకరి దుర్మరణం

రామగుండం: ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేయబోయిన ఓ విలేకరి అదే బస్సు టైరు పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకుర్తి మండలం బసంత్‌నగర్ సమీపంలోని కుర్మపల్లికి చెందిన సొప్పరి ఓదెలు అలియాస్ ఉదయ్(40) కెమెరామెన్‌గా, ఓ చానల్‌కు పాలకుర్తి మండల విలేకరిగా పని చేస్తున్నాడు. శనివారం బైక్‌పై బసంత్‌నగర్ నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్నాడు. మల్యాలపల్లి బస్టాప్ వద్ద ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి కింద పడ్డాడు. బస్సు వెనక టైరు ఆయన తల పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. మృతుడి భార్య స్వరూప అంగన్‌వాడీ టీచర్. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఓదెలు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు రామగుండం ఎస్సై సతీశ్ తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



ఓదెలు (ఫైల్)

క్లుప్తంగా

సీతారాముల కల్యాణానికి ఆహ్వానం


కరపత్రం ఆవిష్కరిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌కల్చరల్: భగత్‌నగర్ అంజనాద్రి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 17న జరిగే సీతారామ కల్యాణానికి హాజరుకావాలిసిందిగా మేయర్ సునీల్‌రావుకు ఆలయ కమిటీ సభ్యుడు శనివారం ఆహ్వానం తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ క్యాంపు కార్యాలయంలో కరపత్రం ఆవిష్కరించారు. ఆలయ కమిటీ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

చాలీసా, విష్ణుసహస్రనామ పారాయణం



కరీంనగర్‌కల్చరల్: వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత గుడి ప్రక్కన గల ఆంజనేయస్వామి ఆలయంలో వాసవీ వాగ్దేవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా, విష్ణు సహస్రనామ పారాయణాలు చేశారు. అర్చకుడు రామశర్మను సన్మానించారు. కోలాటం ఆడుతూ పాటలు పాడుతూ భక్తి ప్రపత్తులతో గడిపారు. అధ్యక్ష, కార్యదర్శులు మాడిశెట్టి ఉమ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



కరీంనగర్‌కల్చరల్: నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ గాయత్రీనగర్‌లో గల బాలకుటీర్‌లో ఉంటూ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఐదురోజులుగా నిర్వహించిన వివిధ రకాల ఇండోర్ గేమ్స్‌లో గెలుపొందిన విద్యార్థులకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్, ధనపురి సత్యమ్మ, బాలకుటీర్ ప్రెసిడెంట్ కరుణాకర్‌రావు, రాజారెడ్డి, కనకయ్య, నయన్‌పటేల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప ఆలయంలో విషు పూజ

కరీంనగర్‌కల్చరల్: కేరళ నూతన సంవత్సరాది పురస్కరించుకొని నగరంలోని జెడ్పీ క్వార్టర్స్ ఆవరణలో గల అయ్యప్ప ఆలయంలో ఆదివారం విషు పూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కాంతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం గణపతి హోమం, అయ్యప్ప స్వామికి ఫలరస పంచామృతాభిషేకం, సాయంత్రం పడి పూజ, అల్పాహారం రాచకొండ చక్రధర్‌రావు ఆధ్వర్యంలో జరుగుతాయని పేర్కొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో 33/11కేవీ సబ్‌స్టేషన్ల నిర్వహణ పనులతో పాటు విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు 11కేవీ గంజ్, టవర్‌సర్కిల్, డీఎఫ్‌ఓ, డాక్టర్స్ స్ట్రీట్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు.

నియామకం

కరీంనగర్‌కల్చరల్: జర్నలిస్ట్ యూనియన్ ఆఫ్ స్టేట్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా కన్వీనర్‌గా రావుల సత్యనారాయణను నియమిస్తున్నట్లు రాష్ట్ర కన్వీనర్ ఎంపీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి , జగిత్యాల, సిరిసిల్లా జిల్లాలకు త్వరలో మహాసభలు నిర్వహించి పూర్తిస్థాయి కమిటీలు వేస్తామని పేర్కొన్నారు.

డ్రైవర్ పరివార్



- ఆర్థిక ప్రయోజనం కన్నా అనురాగమే మిన్న
- ఇప్పటికీ ఉమ్మడి కుటుంబం.. అన్నింటా ఆదర్శం

కరీంనగర్ అర్బన్: అవును.. ఆ కుటుంబంలో అందరూ ఆర్టీసీ ఉద్యోగులే.. ఆపై వాహన చోదకులే. సాధారణంగా సోదరులు వివిధ రంగాల్లో రాణిస్తుండటం పరిపాటి. కానీ వీరు మాత్రం చోదకాన్నే ఉపాధిగా మలచుకుని ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. తండ్రి అభిరుచినే ఔపోసాన పట్టి ఒకరివెంట మరొకరు రోడ్డు రవాణా సంస్థలో ఉద్యోగులుగా మారడం అభిరుచికి తార్కాణం. ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే లక్ష్యంగా విధులు నిర్వహిస్తూ ఉన్నతాధికారుల మన్ననలు పొందుతున్నారు. ఉమ్మడి కుటుంబంలా ఉంటూ ఒకరి కష్టాలను మరొకరు భరిస్తూ అనుబంధ ఆప్యాయతలకు చిరునామాగా నిలుస్తున్నారు.

డ్రైవింగ్‌పై మక్కువతో..

నగరంలోని గణేశ్‌నగర్‌లో స్థిరపడిన పెరుక రాజయ్య–లక్ష్మీదేవి స్వస్థలం తిమ్మాపూర్ మండలం పొలంపల్లి గ్రామం. నలుగురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు సంతానం. వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. 20 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా వరి, మొక్కజొన్న, పత్తి సాగు చేస్తూ వచ్చే ఆదాయంతో కుటుంబ నావ సాగేది. పుష్పలత, నర్సయ్య, సత్యనారాయణ, రవీందర్, విజయ, సంతోష్‌లు సంతానం కాగా అందరినీ ఉన్నంతలో అల్లారుముద్దుగా పెంచారు. రాజయ్యకు వాహనాలంటే మక్కువ ఉండడంతో ట్రాక్టర్ ద్వారా వ్యవసాయం చేసేవారు. ఈ నేపథ్యంలో తీరిక వేళలో పొలానికి వెళ్లే సోదరులు అనుకోకుండా డ్రైవింగ్ వైపు దృష్టి మళ్లింది. ఈ క్రమంలో డిగ్రీ, పీజీలు పూర్తి చేసిన నర్సయ్య, సత్యనారాయణ, రవీందర్, సంతోష్ సదరు వ్యాపకాన్నే ఉద్యోగంగా మలచుకోవాలని భావించగా మొదట నర్సయ్య అగ్నిమాపక శాఖలో డ్రైవర్ ఉద్యోగం సాధించారు. స్నేహితుల ప్రభావం, కుటుంబ బాధ్యతల క్రమంలో డీఎస్సీతో టీచర్ ఉద్యోగం సాధించారు. ఇక మిగిలిన ముగ్గురు సోదరులు మాత్రం తండ్రి నేర్పిన డ్రైవర్ వృత్తినే ఉద్యోగంగా మలచుకున్నారు. రెండేళ్ల వ్యవధిలో ఒక్కొక్కరుగా ఆర్టీసీలో చేరారు. సత్యనారాయణ కరీంనగర్–1 డిపోలో విధులు నిర్వహిస్తుండగా రవీందర్ ఆర్‌ఎం కార్యాలయం, సంతోష్ కరీంనగర్–2 డిపోలో ఉద్యోగం చేస్తున్నారు.

ఇప్పటికీ ఉమ్మడి కుటుంబమే

ప్రతీ వ్యక్తి సమాజం మారాలనుకుంటాడు. వ్యక్తిగా తాను మాత్రం మారడానికి ఇష్టపడడు. మనతోనే మార్పు ప్రారంభం కాకుంటే సమాజం ఎలా మారుతుందున్నది వీరి అభిప్రాయం. మార్పులో ఉన్న మంచితనాన్ని జీవనశైలితో చాటుతున్నారు. సదరు సోదరులంతా తల్లిదండ్రులతో ఉమ్మడిగా ఉండటం విశేషం. నలుగురు సోదరులు వారి కుటుంబం మొత్తం కలిపి 16 మంది కాగా తల్లిదండ్రులతో కలిసి ఉంటూ ఆనందంగా గడుపుతున్నారు. పిల్లల చదువులు, ఇతరత్రా ఉమ్మడిగానే ఖర్చు చేయడం ఆదర్శమే మరి. తండ్రి రాజయ్య, పెద్దన్న నర్సన్న మాటే వారికి వేదం. ఏం చేసినా నాలుగు కుటుంబాల ప్రయోజనం కోరి పనులు చేస్తుంటారు. వ్యవసాయం ద్వారా వచ్చే ఆదాయాన్ని ఎవరికెంతని కాకుండా అవసరాలను బట్టి వ్యయం చేస్తుంటారు. వంటలైనా, పండగలైనా అందరూ కలిసే నిర్వహించుకోవడం ఆనవాయితీ. ఎవరికి ఏ కష్టమొచ్చినా అంతా కలిసి ఎదురీదడం స్ఫూర్తిదాయకం.

కలిసుంటేనే సుఖం



ఎక్కడెక్కడో ఉండి కలుసుకుని మళ్లీ వెళ్లేటప్పుడు బాధపడే కన్న ఒకే చోట ఉండటం ఉత్తమం. అప్పుడప్పుడు అక్కాచెల్లెళ్లు వస్తున్నా సోదరులు మాత్రం కలిసి ఉండాలని మా కోరిక. కాలగమనంలో వస్తున్న మార్పులకనుగుణంగా మారాల్సిందే కానీ కుటుంబాలను వదులుకోవడం సరికాదు.

– పెరుక నర్సయ్య, హెచ్‌ఎం

డబ్బు కన్నా వ్యక్తిత్వం ముఖ్యం



జీవితంలో బతకడానికి డబ్బు కావాలి. కానీ డబ్బే శాశ్వతం అనుకుంటే మానసిక ప్రశాంతత ఎండమావే. నా అనుకునే వారితో కలిసి ఆనందంగా గడపడం కోట్లకు మించిన సంతృప్తి. కుటుంబానికి ప్రాధాన్యతనిస్తే అన్ని రకాలుగా వృద్ధి చెందినట్లే. నాన్న, అన్నలు చెప్పే మాటలు మార్గదర్శకత్వం.

– రవీందర్, ఆర్టీసీ డ్రైవర్

ఎక్కడికెళ్లినా కలిసే ప్రయాణం



ఏవైనా పర్యటనలకు వెళ్లినా, శుభకార్యాలకైనా కలిసే వెళ్తుంటాం. ఎప్పుడైనా ఎవరు మిస్సయినా ఆ బాధ వర్ణనాతీతం. అంతా కలిసే తినాలి. అమ్మానాన్నతో ఆప్యాయంగా మాట్లాడాలి. ఇది చాలు జీవితానికి.

– సత్యనారాయణ, ఆర్టీసీ డ్రైవర్

అన్నయ్యలను చూసి ఆర్టీసీలో చేరా



అన్నయ్యలు ఆర్టీసీలో ఉద్యోగం చేయడంతో నాకు అదే రంగంలో వెళ్లాలనిపించింది. చిన్న వయసులో ఉన్నప్పుడు నాన్న ట్రాక్టర్ నేర్పడం అదే ఉపాధిగా మలచుకున్నా. కుటుంబంతో పాటు అన్నలందరితో కలిసి ఉండటం సంతోషంగా ఉంది.

– సంతోష్, ఆర్టీసీ డ్రైవర్

ఈద్గా స్థలం వెనక్కి తీసుకున్న సర్కార్

- కొత్తపల్లిలో గత ప్రభుత్వం 8 ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు
- వ్యతిరేకిస్తూ ప్రభుత్వంపై రైతులు, బీజేపీ శ్రేణుల ఒత్తిడి
- చివరకు ప్రస్తుత ప్రభుత్వం వెనక్కి తీసుకుంటూ ఉత్తర్వులు

కొత్తపల్లి: కొత్తపల్లి పట్టణ పరిధిలోని తెలంగాణ సీడ్ ఫాంలోని వ్యవసాయ శాఖకు చెందిన 8 ఎకరాల స్థలాన్ని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ శాఖకు కేటాయిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కు తీసుకుంటూ ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ సీడ్ ఫాం పరిధిలోని 127, 128 సర్వే నంబర్లలోని 8 ఎకరాల స్థలం కేటాయిస్తూ అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే అప్పటికే సీడ్ ఫాంలో కరీంనగర్ ప్రభుత్వ వైద్య కళాశాలకు కేటాయించగా..దాని పక్కనే మైనారిటీ సంక్షేమ శాఖకు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ రైతులు, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పలుమార్లు కలెక్టర్, ప్రభుత్వానికి విన్నవించారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడం, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సైతం స్థానిక రైతులు, కౌన్సిలర్లు వాసాల రమేశ్, స్వర్గం వజ్రాదేవి, వేముల కవిత, బీజేపీ శ్రేణుల విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయడంతో పాటు న్యాయస్థానంలో కేటాయింపును సవాల్ చేస్తూ వాజ్యం వేశారు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ శాఖ కేటాయించిన 8 ఎకరాల స్థలాన్ని వాపసు తీసుకుంటూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఐకేపీ కేంద్రానికి కేటాయించాలి

తెలంగాణ సీడ్ ఫాంలోని స్థలం వ్యవసాయ శాఖకు సంబంధించింది కనుక రైతులకు ఉపయోగపడే ఐకేపీ కేంద్రానికి కేటాయించాలని చిలుకూరి శ్రీనివాస్, బండ కిషన్ రెడ్డి, ఉమ్మెంతల లక్ష్మారెడ్డి, చింతల ప్రతాప్‌రెడ్డి తదితరులు విజ్ఞప్తి చేశారు. ఐకేపీ కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

డంపింగ్ యార్డ్‌ను తరలించాలి

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ ఆటోనగర్‌లో ఉన్న డంపింగ్ యార్డును మరింత దూరంగా తరలించాలని సోసియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ ప్రధాన కార్యదర్శి మామిడాల మనోహర్ డిమాండ్ చేశారు. శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికంగా చెత్తను డంప్ చేయడం, నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగుతున్నాయని అన్నారు. చెత్త నుంచి వెలువడే పొగతో ఆ ప్రాంత ప్రజలు శ్వాస, ఆరోగ్య పరంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి ప్రజల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో సౌత్ ఇండియా చైర్మన్ జి.హన్మగౌడ్, రాష్ట్ర చైర్మన్ సోముల సంపత్‌గౌడ్, రాష్ట్ర మహిళా విభాగం చైర్‌పర్సన్ రాజేశ్వరి, కరీంనగర్ వైస్ చైర్మన్ వెంకట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో వసతులు కల్పించాలి

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం మల్కాపూర్‌లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో వసతులు కల్పించాలని రైతు సేవా సమితి సభ్యులు కోరారు. శనివారం కేంద్రం సందర్శనకు వచ్చిన కలెక్టర్ పమేలా సత్పతికి విజ్ఞప్తి చేశారు. వర్షానికి ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, తాగునీటి వసతి, విశ్రాంతి కోసం తాత్కాలిక షెడ్లు, రైతు విశ్రాంతి భవనం ఏర్పాటు చేయాలన్నారు. గతేడాది ఎస్సారెస్పీ నీరు రావడం వల్ల పంటలు పండగా, ప్రస్తుతం 150 ఎకరాల్లో పంట ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామరైతు సేవా సమితి అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి పండుగ లక్ష్మీపతి, గౌరవ అధ్యక్షుడు కాంతాల జగన్‌రెడ్డి, సభ్యులు పల్లె జితేందర్, జక్కు లచ్చయ్య, పల్లాటి శంకరయ్య, దావీదు, లక్ష్మీరాజు, మనోహర్ పాల్గొన్నారు.

శ్రీపాదరావుకు నివాళి


శ్రీపాదరావు విగ్రహానికి పూలమాల వేస్తున్న శంకర్

సప్తగిరికాలనీ(కరీంనగర్): బడుగు వర్గాల అభివృద్ధి కోసం బాటలు వేసిన దివంగత స్పీకర్ శ్రీపాదరావు 25వ వర్ధంతిని శనివారం తెలంగాణ రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి రాపాల శంకర్, లింగంపల్లి నాగరాజు, నంగునూరు ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

హమాలీ ధరల పెంపు

కరీంనగర్‌రూరల్: యాసంగి సీజన్ హమాలీ రేట్లను పెంచడంతో రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. ఏటా హమాలీ రేట్లను పెంచుకుంటూ పోతున్నారు. శనివారం దుర్శేడ్ సింగిల్‌విండో పరిధిలోని ఆరు కొనుగోలు కేంద్రాల్లో హమాలీ రేట్లను నిర్ణయించేందుకు సంఘం కార్యాలయంలో ఆయా గ్రామాలకు చెందిన హమాలీ నాయకులతో సమావేశం నిర్వహించారు. గతంలో క్వింటాల్‌కు రూ.45 ఉండగా ప్రస్తుతం రూ.48 రైతులు చెల్లించాలని సమావేశంలో నిర్ణయించారు. అదే విధంగా హమాలీ ధరలు మిగితా గ్రామాల్లో వేర్వేరుగా ఉన్నాయి. ఒక్కో గ్రామంలో రూ.40 నుంచి రూ.45 వరకు చెల్లిస్తున్నారు. అయితే హమాలీ ధరలను పెంచడంతో రైతులపై అదనంగా భారం పడుతుంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కాకముందు హమాలీ చార్జీల్లో కొంత రైతు చెల్లిస్తే మిగితా ప్రభుత్వం భరించేది. గతంలో క్వింటాల్‌కు రూ.28 ఉంటే రైతులు రూ.23 చెల్లించగా రూ.5 ప్రభుత్వం చెల్లించింది. అయితే పదేళ్ల నుంచి ప్రభుత్వం హమాలీ చార్జీలను చెల్లించకపోవడంతో రైతులే పూర్తి చార్జీలను భరిస్తున్నారు. ప్రతీ సీజన్‌లో హమాలీ చార్జీలను పెంచుతుండటంతో ఆందోళన చెందుతున్నారు.

నేడు సమాశ్రయణం

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని పద్మనాయక కల్యాణ మండలంలో జెట్, వికాస తరంగిణి ఆధ్వర్యంలో జరుగుతున్న వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చిన జీయర్‌స్వామి సమాశ్రయణం (మంత్రోపదేశం) నిర్వహిస్తున్నట్లు ఉత్సవ నిర్వహణ కమిటీ బాధ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. సమాశ్రయణం కావాల్సిన వారు కల్యాణమండపానికి వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

అకాల వర్షాలతో ఆందోళన

- కొనుగోలు కేంద్రాల్లోనే రైతుల పడిగాపులు
- ధాన్యం ఆరబెట్టేందుకు తిప్పలు

కరీంనగర్‌రూరల్: యాసంగి సీజన్‌లో వరిపంట సాగు చేసిన రైతాంగాన్ని ఆది నుంచి కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. శనివారం ఉదయం 8 గంటలకు కురిసిన తేలికపాటి జల్లులతో రైతులు ఆందోళనకు గురయ్యారు. కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని వెంటనే కుప్ప చేసి తడువకుండా టార్పాలిన్లు కప్పారు. వరినాట్ల నుంచి మొదలుకుని కోతల వరకు ప్రతికూల వాతావరణ పరిస్థితులు రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఇప్పటివరకు వివిధ తెగుళ్ల బెడద, సాగునీటి సమస్యతో సతమతమైన అన్నదాతలకు పంట చేతికొచ్చే దశలో కష్టాలు మరింత పెరిగాయి. రెండు రోజుల నుంచి ఆకాశంలో మబ్బులు పట్టడం, అకాల వర్షాలు కురిసే అవకాశముందనే వాతావరణ శాఖ సూచనలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పొద్దంతా ధాన్యం ఆరపోయడం రాత్రయితే కుప్ప చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.


మొగ్దుంపూర్‌లో ధాన్యం కుప్ప చేస్తున్న రైతులు


చెర్లభూత్కూర్‌లో ధాన్యంకుప్పలపై కప్పిన టార్పాలిన్లు

కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు

కరీంనగర్ మండలంలోని 17 గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటివరకు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించ లేదు. హార్వెస్టర్ల ద్వారా వరిపంటను కోసిన రైతులు నేరుగా ట్రాక్టర్లతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యతా ప్రమాణాలు ఉండేలా 17శాతం తేమ వచ్చేలా ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. అయితే శనివారం ఉదయం చిరుజల్లులు పడటంతో రైతులు ధాన్యాన్ని కాపాడుకునేందుకు పడరానీ పాట్లుపడ్డారు. కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో లేకపోవడంతో కొందరు రైతులు కిరాయికి పరదాలను తెచ్చి ధాన్యంకుప్పలపై కప్పారు. మరికొందరు రైతులు సొంతఖర్చులతో టార్పాలిన్లు కొనుగోలు చేశారు. అధికారులు స్పందించి కేంద్రాల్లో వసతులు కల్పించడంతో పాటు త్వరగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అలరించిన వీడ్కోలు వేడుక


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాశాల చైర్మన్ రవీందర్‌రావు

సప్తగిరికాలనీ(కరీంనగర్): నగరంలోని కిమ్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం నిర్వహించిన విద్యార్థుల వీడ్కోలు వేడుక అలరించింది. కళాశాల చైర్మన్ పెర్యాల రవీందర్‌రావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ సాకేత్ రామారావు, ప్రిన్సిపాల్ అర్జున్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.

ఆధ్యాత్మికం

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



కరీంనగర్‌రూరల్: తీగలగుట్టపల్లిలోని శ్రీకోదండ రామాలయం బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి విశ్వక్సేన విధి, వాసుదేవ పుణ్యహవచనం, అంకురారోహణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు జరిగిన ధ్వజారోహణం, గరుడబలి, నిత్యహోమం పూజల్లో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు వైద్యసేవలందించాలి


సెంటర్‌ను ప్రారంభిస్తున్న చినజీయర్ స్వామి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌లోని చల్మెడ ఆనందరావు ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన స్కిల్ అండ్ మెడికల్ సిమ్యులేషన్ సెంటర్‌ను త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి శనివారం ప్రారంభించారు. సెంటర్‌లోని వెంటిలేటర్, పీడియాట్రిక్స్, నియోనాటల్, క్రిటికల్ కేర్ యూనిట్లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైద్య విద్యార్థులు అనుకరణ కేంద్రాల్లో నైపుణ్యం పెంచుకుని పేదలకు మెరుగైన వైద్యసేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి చైర్మన్ చల్మెడ లక్ష్మీనర్సింహారావు, డైరెక్టర్ సూర్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్స్ ఆసీంఅలీ, అనిత, క్యాన్సర్ ఆస్పత్రి హెచ్‌వోడీ ఎజిలారస్‌తో పాటు పలువురు వైద్యులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో శనివారం రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ జి.సమతతో పాటు పలువురు అధ్యాపకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని ప్రిన్సిపాల్ అన్నారు. అనంతరం జాతీయస్థాయి క్యాట్‌పరీక్షలో ప్రతిభను ప్రదర్శించిన జె.రుచిత, ఎన్.రాణి, ఎస్‌కే పవిత్రల తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుష్మ, ఏసీవో లలితా అశ్విని, ఎస్‌ఎస్ఎస్ పీవో లావణ్య, కోఆర్డినేటర్ సుహాసినీతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

'చీకటిపువ్వు' నాటికకు ఉత్తమ ద్వితీయ బహుమతి


నటుడు తనికెళ్ల భరణి, దర్శకుడు వంశీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మంచాల రమేశ్

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్ చైతన్య కళాభారతి కళాకారులు రాజమండ్రిలోని రావులపాలెంలో ఈనెల 9 నుంచి 11 వరకు జరిగిన జాతీయస్థాయి నాటిక పోటీల్లో ప్రదర్శించిన 'చీకటిపువ్వు' నాటికకు ఉత్తమ ద్వితీయ బహుమతి, ఉత్తమ నటిగా లహరి బహుమతి పొందారని సంస్థ అధ్యక్షుడు తిప్పర్తి ప్రభాకర్ తెలిపారు. బహుమతిని సినీ నటుడు తనికెళ్ల భరణి, సినీ దర్శకుడు వంశీ చేతుల మీదుగా కళాకారులు శనివారం అందుకున్నారు. నాటికలో కొత్తకొండ సత్యనారాయణ, దేవులపల్లి గిరిబాబు, యేపూరి శ్రీనివాస్ నటించగా సంగీతం సురభి నాగరాజు, ఆహార్యం, లైటింగ్ కేదారి నాగు చేశారని దర్శకుడు మంచాల రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులకు పలు కళా సంస్థల బాధ్యులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు, కళాకారులు అభినందనలు తెలిపారు

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి


వాకర్స్‌కు గ్యారంటీ పత్రాలు పంపిణీ చేస్తున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి కోరారు. శనివారం నగరంలోని ఎస్సారార్ కళాశాల మైదానంలో వాకర్స్‌ను కలిసి, ఏఐసీసీ ప్రకటించిన ఐదు గ్యారంటీ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన ఏ విధంగా ఉందో, కేంద్రంలో కూడా రాహుల్‌గాంధీ నాయకత్వంలో ప్రజాపాలన రావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సుడా చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా నరేందర్‌రెడ్డిని వాకర్స్ సన్మానించారు. కార్యక్రమంలో కొరివి అరుణ్‌కుమార్, శ్రవణ్‌నాయక్, గన్ను మహేందర్‌రెడ్డి, కుర్ర పోచయ్య, బాబుల్‌వర్మ, రామ్మూర్తి, మల్లేశం, దేవేందర్‌పటేల్, ఊరడి లత, తిరుమల, రజితారెడ్డి, మహాలక్ష్మి, శేహెన్ష, కీర్తికుమార్, మాసుం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు


సుషీల్‌ను అభినందిస్తున్న ఫాతిమారెడ్డి

కొత్తపల్లి: కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల (సీబీఎస్‌ఈ)లో 5వ తరగతి చదువుతున్న సుషీల్ ఆవర్తన పట్టికలోని మూలకాలను అత్యంత వేగంగా 3.2 నిమిషాల్లో రాసి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్నట్లు పాఠశాల చైర్మన్ డా.పి.ఫాతిమారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని అభినందించి మాట్లాడారు. విద్యార్థులకు సరైన మార్గంలో శిక్షణ ఇవ్వడం ద్వారా అద్భుతాలు సృష్టించే అవకాశం ఉంటుందన్నారు. ప్రాథమిక దశ నుంచే విద్యార్థులకు చక్కని శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ బుక్ ఆఫ్‌రికార్డ్స్‌లో విద్యార్థి చోటు సంపాదించడం గర్వంగా ఉందని, అందుకు శిక్షణ ఇచ్చిన ఫాతిమాను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ భార్గవ్, నిరంజన్, కో ఆర్డినేటర్ వనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జానారెడ్డి కుమారులు రఘువీర్, జైవీర్‌లతో ముచ్చటిస్తున్న మంత్రి ఉత్తమ్

ఇండియా కూటమిదే గెలుపు

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

దేవరకొండ: లోక్‌సభ ఎన్నికల్లో దేశంలో ఇండియా కూటమి గెలవబోతోందని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జోస్యం చెప్పారు. శనివారం నల్లగొండ జిల్లా దేవరకొండలో జరిగిన కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లు కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తాను ఒక టీంగా పనిచేస్తూ రాష్ట్ర అభివృద్ధి కోసం పాటుపడుతున్నామని చెప్పారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదనీ, రాష్ట్రంలో ఇప్పటికే బీఆర్ఎస్ పని అయిపోయిందని అన్నారు. సమావేశంలో మాజీ మంత్రి జానారెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు.



దోచుకున్న పార్టీ బీఆర్ఎస్.. వెన్నుపోటు పార్టీ కాంగ్రెస్

ఎన్నికల ప్రచారంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బంజారాహిల్స్ (హైదరాబాద్): కుటుంబ పాలనలో రాష్ట్రాన్ని దోచుకున్న పార్టీ బీఆర్ఎస్ అయితే.. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వెన్నుపోటు పొడిచిన పార్టీ కాంగ్రెస్ అని కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయి, కాంగ్రెస్ అధికారం చేపట్టిన తరువాత తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు అయ్యిందని ఆయన దుయ్యబట్టారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో కలిసి బంజారాహిల్స్‌లోని ఎన్‌బీటీనగర్, నందినగర్, పంజాగుట్ట, ప్రతాప్‌నగర్, సర్వీ హోటల్ ప్రాంతాల్లో జీప్ యాత్ర నిర్వహించి కార్నర్ మీటింగ్‌లలో ప్రసంగించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, కాంగ్రెస్‌లపై ధ్వజమెత్తారు. కాంగ్రెస్ కరప్షన్ పార్టీ అని, ఆ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసగిస్తోందని ఆరోపించారు. మహిళలకు రూ.2,500, తెల్ల రేషన్‌కార్డులు, నిరుద్యోగులకు నెలకు రూ.4,000, రైతు రుణమాఫీ లాంటి హామీలేవీ నెరవేర్చలేదన్నారు. ప్రధాని మోదీ కరోనా సమయంలో పేదలను దృష్టిలో పెట్టుకుని ఒక్కొక్కరికి 5 కిలోల ఉచిత బియ్యం గత నాలుగేళ్లుగా పంపిణీ చేస్తున్నారని చెప్పారు. దేశం కోసం, దేశ భవిష్యత్తు, రక్షణ కోసం ప్రతిఒక్కరూ మోదీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలన్నారు. కుటుంబ పాలనతో బీఆర్ఎస్ రాష్ట్రాన్ని దోచుకుందని, ఆ పార్టీ మొత్తం కుంభకోణాలతో నిండిపోయిందన్నారు. ఎమ్మెల్సీ కవిత తెలంగాణలో దోచుకున్నది చాలదన్నట్లు ఢిల్లీకి వెళ్లి లిక్కర్ స్కాంలో ఇరుక్కుని కటకటాలపాలైందని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్‌తో పొత్తు లేదు: అసదుద్దీన్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్‌తో ఎలాంటి పొత్తు కానీ అవగాహనగానీ లేదని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. శనివారం ఫలక్‌నుమా ప్రాంతంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్, ఎంఐఎం మధ్య అవగాహన కుదిరిందన్న ఆరోపణలను తిప్పికొట్టారు. ఎన్నికల బరిలో ఒంటరిగా పోరాడతామని, మజ్లిస్ ఏ పార్టీకి కూడా 'బీ'టీమ్ కాదని పునరుద్ఘాటించారు. ఉత్తరప్రదేశ్‌లో పీడీఎం కూటమిలో భాగస్వామిగా ఉన్నామని తెలిపారు. హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో బోగస్ ఓట్లు ఉన్నాయన్న బీజేపీ నేతల ఆరోపణలను ఆయన ఖండించారు. బోగస్ ఓట్లు అంటే ఎన్నికల సంఘంతో పాటు పాతబస్తీ ప్రజలను అవమానించడమే అన్నారు. నియోజకవర్గంలో దళిత, వెనుకబడిన వర్గాలు, మైనార్టీ ముస్లిం, క్రిస్టియన్ ఓటర్లు ఉన్నారని, వారి ఓట్లతోనే తాము గెలుస్తున్నట్లు చెప్పారు.



మేకల కల్యాణ్ చక్రవర్తి

రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల పోరు మరింత వేడెక్కింది. నోటిఫికేషన్ రాకముందే ప్రధాన పార్టీల అభ్యర్థులంతా దాదాపు ఖరారు కావడం, వారంతా ఇప్పటికే ప్రచారం మొదలుపెట్టేయడంతో.. గెలుపోటములపై అంచనాలు మొదలయ్యాయి. ముఖ్యంగా ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి ఏయే స్థానాల పరిధిలో ఎన్ని ఓట్లు వచ్చాయనే లెక్కల ప్రాతిపదికగా రాజకీయ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి. ప్రధాన పార్టీల కేడర్ కూడా ఈ గణాంకాలను విశ్లేషించుకుంటూ.. తమదంటే తమదే విజయమనే లెక్కలు వేసుకుంటున్నాయి. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికల్లో పోలైన ఓట్ల తరహాలోనే ఫలితాలు ఉంటాయా? లేక లోక్‌సభ పోరులో ట్రెండ్ మారుతుందా? అన్నది హాట్‌టాపిక్‌గా మారింది. రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, అసెంబ్లీ ఎన్నికల్లో లోక్‌సభ సెగ్మెంట్ల వారీగా పోలైన ఓట్లను బట్టి కాంగ్రెస్ ముందు వరుసలో ఉంటే.. బీజేపీ, బీఆర్ఎస్ ఆ తర్వాత ఉన్నాయని రాజకీయ వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి.

పోల్ ట్రెండ్ మారేనా?

అసెంబ్లీ ఎన్నికల్లో పోలైన తరహాలోనే ఫలితాలు వస్తాయా?

- అభ్యర్థుల ఎంపిక కొలిక్కి వస్తున్న వేళ రాజకీయ పార్టీల్లో చర్చలు
- కొన్నిచోట్ల అసెంబ్లీ లెక్కలు తారుమారయ్యే చాన్స్
- మరికొన్ని చోట్ల కాంగ్రెస్‌ను ఓడించాలంటే వేవ్ రావాల్సిందేనన్న అభిప్రాయాలు
- ఇంకొన్ని స్థానాల్లో టగ్ ఆఫ్ వార్‌గా మారుతున్న రాజకీయం

కీలక స్థానాల్లో అసెంబ్లీ ఓట్ల తీరు ఆధారంగా విశ్లేషణ ఇదీ..

మహబూబ్‌నగర్

పాలమూరులో పోటీ ప్రధానంగా రెండు జాతీయ పార్టీల మధ్యేనన్న చర్చ జరుగుతోంది. అయితే బీజేపీ గెలుపు తీరాన్ని చేరాలంటే బ్యాలెట్ బాక్సులు దద్దరిల్లేలా ఆ పార్టీకి ఓట్లు పడాల్సిందేనని అంటున్నారు. ఎందుకంటే.. అసెంబ్లీ ఎన్నికల్లో ఈ లోక్‌సభ స్థానం పరిధిలో కాంగ్రెస్ పార్టీకి 6.11 లక్షలకుపైగా ఓట్లు వస్తే.. బీజేపీకి వచ్చింది 1.13 లక్షల ఓట్లే. అంటే తేడా చాలా ఎక్కువ. ఈ లెక్కన ఇక్కడ బీఆర్ఎస్‌కు వచ్చిన 5.11 లక్షల ఓట్లు గంపగుత్తగా బీజేపీకి బదిలీ కావాలన్నమాట.

ఆదిలాబాద్

బీజేపీకి రాష్ట్రంలో హైదరాబాద్ లోక్‌సభ పరిధి తర్వాత కాంగ్రెస్ కంటే ఎక్కువ ఓట్లు వచ్చింది ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోనే. అసెంబ్లీ పోల్స్‌లో ఇక్కడ బీఆర్ఎస్‌కు 4.65 లక్షల ఓట్లు వస్తే.. బీజేపీకి దాదాపు సమానంగా 4.48 లక్షల ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్‌కు వచ్చింది 2.52 లక్షల ఓట్లే. దీంతో ఈ రెండు పార్టీలను వెనక్కినెట్టి కాంగ్రెస్ ముందుకు రావడం కష్టమేనన్న భావన వ్యక్తమవుతోంది.

కరీంనగర్

రాష్ట్రంలో రసవత్తర పోరుకు అవకాశమున్న లోక్‌సభ స్థానం కరీంనగర్. ఇక్కడ బీజేపీ ఫైర్‌బ్రాండ్ బండి సంజయ్ మరోమారు బరిలో ఉన్నారు. ఇక్కడ పోటీ ఎవరెవరి మధ్య ఉంటుందన్నది ఇంకా స్పష్టత రాకున్నా.. అసెంబ్లీ ఎన్నికల్లో గట్టి పోటీ జరిగింది. కరీంనగర్ లోక్‌సభ స్థానం పరిధిలో కాంగ్రెస్‌కు 5,12,352 ఓట్లు, బీఆర్ఎస్‌కు ఓ ఐదువేలు ఎక్కువగా 5,17,601 ఓట్లు వచ్చాయి. బీజేపీకి వచ్చింది 2.50 లక్షల ఓట్లే. ఇది బీజేపీ సిట్టింగ్ ఎంపీ సీటు కావడంతో ఆసక్తి నెలకొంది.

భువనగిరి

ఇక్కడ బీజేపీతో తమకు ఎంత పోటీ ఉన్నా.. వచ్చే ఇబ్బందేమీ లేదని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. ఎందుకంటే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఈ లోక్‌సభ స్థానం పరిధిలో కాంగ్రెస్‌కు ఏకంగా 8.17లక్షల ఓట్లు వస్తే.. బీజేపీకి 74,782 ఓట్లు మాత్రమే వచ్చాయి. అంటే తేడా 7.5 లక్షల ఓట్లపైనే. ఇక్కడ బీఆర్ఎస్‌కు 5.60లక్షల ఓట్లు వచ్చాయి. ఆ ఓట్లన్నీ బీజేపీకి బదిలీ అయినా కాంగ్రెస్‌పై గెలుపు అంత సులువు కాదన్న అభిప్రాయముంది.

నిజామాబాద్

ఈ లోక్‌సభ సీటు పరిధిలో కాంగ్రెస్‌కు 4,08,135 ఓట్లు వస్తే బీఆర్ఎస్‌కు 9వేల ఓట్లు అదనంగా 4,17,045 ఓట్లు వచ్చాయి. బీజేపీ కూడా గట్టిగానే పోటీ పడింది. ఆ పార్టీకి 3.65 లక్షల ఓట్లు వచ్చాయి. అయితే ఇది బీజేపీ సిట్టింగ్ ఎంపీ సీటు కావడం, త్రిముఖ పోటీ ఉంటుందనే చర్చ నేపథ్యంలో.. ఏ పార్టీది పైచేయి అవుతుందన్నది ఉత్కంఠ రేపుతోంది.

చేవెళ్ల


గ్రేటర్ హైదరాబాద్‌తో సంబంధమున్న చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో ఫలితం ఎలా ఉంటుందన్నదీ ఆసక్తికరంగా మారింది. ఇక్కడ కూడా కాంగ్రెస్, బీజేపీ మధ్య పోరు జరుగుతుందనే అంచనాలు ఉన్నాయి. అసెంబ్లీ ఫలితాలు కూడా అదే సంకేతాలిస్తున్నాయి. బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ కంటే దాదాపు లక్ష ఓట్లు ఎక్కువ వచ్చినా... లోక్‌సభ పోటీకి బలమైన అభ్యర్థి లేకపోవడం, బీజేపీ నుంచి పాతకాపు బరిలో ఉండటం, బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ కాంగ్రెస్‌లోకి వెళ్లడం రాజకీయ పరిణామాలను మార్చేశాయి. ఇక్కడ బీజేపీకి 3.31 లక్షల ఓట్లు వస్తే.. కాంగ్రెస్‌కు 6.09 లక్షల ఓట్లు వచ్చాయి.

ఈ సీట్లలో వార్ వన్‌సైడేనా?

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న ఈ లోక్‌సభ ఎన్నికల్లో పెద్దపల్లి, నల్లగొండ, మహబూబాబాద్, ఖమ్మం, వరంగల్, నాగర్‌కర్నూల్ స్థానాల్లో వార్ వన్‌సైడేనని ఆ పార్టీ వర్గాలు చెప్తున్నాయి. జహీరాబాద్, చేవెళ్ల, సికింద్రాబాద్, మల్కాజిగిరి స్థానాల్లో గట్టి పోటీ ఇస్తామని, మెదక్, ఆదిలాబాద్‌లలో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నామని పేర్కొంటున్నాయి.

ఆ రెండు సీట్లలో ఏమయ్యేనో?

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్‌ను బట్టి మెదక్‌తోపాటు మల్కాజిగిరి లేదా ఆదిలాబాద్ స్థానాల్లో బీఆర్ఎస్ గెలిచే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. అయితే అసెంబ్లీ సమరం ముగిసిన తర్వాతి పరిణామాల ప్రభావం ఎంత ఉంటుందనేది తేలడం లేదని పేర్కొంటున్నారు. మరోవైపు ఈ మూడింటిలో రెండింటినైనా గెలుస్తామనే ధీమా గులాబీదళంలో వ్యక్తమవుతోంది.



బొల్లోజు రవి

కామ్రేడ్స్ షేక్..హ్యాండ్

లోక్‌సభ ఎన్నికల్లో పరస్పర పొత్తు విషయమై తెలంగాణలో 'ఇండియా' కూటమి పార్టీల మధ్య ఇంకా చర్చలే ప్రారంభం కాలేదు. ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలైన కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం మధ్య ఐక్యతారాగం వినిపించడంలేదు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్, లెఫ్ట్, ఇతర పార్టీల మధ్య పొత్తులు, చర్చలు జరుగుతుండగా, తెలంగాణలో ఒక్క అడుగు కూడా ముందుకు పడడం లేదని కామ్రేడ్లు వాపోతున్నారు. కాంగ్రెస్‌తో విసిగి వేసారిన సీపీఎం భువనగిరి లోక్‌సభ స్థానంలో తన అభ్యర్థిని ప్రకటించిన సంగతి తెలిసిందే. అక్కడితో ఆగకుండా ఈ నెల 19న తమ పార్టీ అభ్యర్థి జహంగీర్ నామినేషన్ కూడా వేస్తారని ఆ పార్టీ తెలిపింది. కాగా, ఇప్పటికే అక్కడ కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థిని కూడా ప్రకటించింది. పొత్తులు కుదరకుంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా సీపీఎం ప్రచారం చేయనుంది. అక్కడ సీపీఎంకు గణనీయమైన ఓట్లు ఉన్నందున అది కాంగ్రెస్‌కు నష్టం జరుగుతుందని అంటున్నారు. మరోవైపు సీపీఐ కూడా తనకు ఒక సీటు కావాలని కోరుతోంది.

- సీట్లు వద్దు.. ఓట్లు చాలు?
- కామ్రేడ్లకు సీట్లు కేటాయించకుండా బేషరతు పొత్తుకు కాంగ్రెస్ ప్రతిపాదన?
- రాష్ట్రంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం మధ్య పొత్తుపై గందరగోళం
- అసలు ఇంత వరకు పొత్తు దిశగా ఆ పార్టీల మధ్య చర్చల్లేవ్
- పొత్తున్నా లేకపోయినా భువనగిరిలో పోటీచేస్తామంటున్న సీపీఎం
- 19న నామినేషన్ వేసేందుకు పార్టీ సన్నాహాలు
- తెలంగాణలో ఐక్యత లేని 'ఇండియా' కూటమి



కామ్రేడ్లను కాంగ్రెస్ దూరం పెడుతోందా..?

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ మధ్య పొత్తు కుదిరింది. సీపీఐ ఒక సీటులో పోటీ చేసి, మిగిలిన సీట్లలో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చింది. అయితే అప్పుడు సీపీఎం, కాంగ్రెస్‌ల మధ్య పొత్తు కుదరని సంగతి తెలిసిందే. దీంతో సీపీఎం ఒంటరిగా 19 స్థానాల్లో బరిలో నిలిచి.. బీజేపీ అభ్యర్థులు గెలిచే అవకాశం ఉన్నచోట్ల కాంగ్రెస్‌కు, మరికొన్నిచోట్ల బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చింది. అయితే 19 స్థానాల్లోనూ సీపీఎం తన పరువు పోగొట్టుకుంది. ఒక్క సీట్లో కూడా డిపాజిట్ దక్కించుకోలేకపోయింది. పార్టీ నిర్ణయాన్ని అప్పట్లో కార్యకర్తలు పూర్తిస్థాయిలో ఆమోదించలేదన్న వాదన బలంగా వినిపించింది. తదనంతర పరిణామాల్లో బీజేపీని ఓడించే సత్తా హస్తం పార్టీకే ఉండటం... ఇండియా కూటమిలో భాగస్వామ్యులుగా ఉండటంతో కలిసి పని చేయాలని భావించారు. అయితే కాంగ్రెస్ మాత్రం వామపక్షాలను పెద్దగా పట్టించుకోవడంలేదన్న చర్చ జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీలకు పెద్దగా ఓట్లు పడలేదన్న భావన ఉండటమే కారణమని అంటున్నారు. అయితే పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం, నల్లగొండ, భువనగిరి, మహబూబాబాద్ వంటి చోట్ల వామపక్షాలకు వేలల్లోనే ఓట్లు ఉంటాయనీ, వాటిని పోగొట్టుకోవడం ఎందుకన్న భావన కాంగ్రెస్‌లోని కొందరు నేతల్లో ఉంది. దీంతో నామినేషన్ల నాటికి పొత్తులపై చర్చలు జరిగే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

బేషరతు పొత్తుకు కాంగ్రెస్ ప్రతిపాదన?

పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో 17 స్థానాల్లో సీపీఐ, సీపీఎంలకు చెరో సీటు ఇవ్వడం సాధ్యమయ్యే పనికాదన్న భావనలో కాంగ్రెస్ ఉన్నట్లు తెలుస్తోంది. సీట్ల కోసం భారీగానే పోటీ ఉన్నందున కేటాయించడం కుదరదని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఒకవేళ వామపక్షాలతో పొత్తులపై చర్చ జరిగితే, భేషరతు మద్దతు కోరాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు తెలిసింది. అంటే ఒక్క సీటు కూడా కేటాయించకుండా అన్ని సీట్లలోనూ కాంగ్రెస్ అభ్యర్థులకు వామపక్షాలు మద్దతు ఇవ్వాలన్నమాట. అలా మద్దతు ఇస్తే రాబోయే రోజుల్లో ఎమ్మెల్సీ పదవులు లేదా స్థానిక సంస్థల ఎన్నికల్లో పదవులు ఇచ్చేలా ప్రతిపాదనను కాంగ్రెస్ తెరపైకి తీసుకురానుంది. అయితే జాతీయ పార్టీ హోదాను కాపాడుకోవాలంటే దేశవ్యాప్తంగా ఓట్ల శాతం, సీట్లు వంటివి తెచ్చుకోవడం వామపక్షాలకు అవసరం. ఆ పార్టీ అగ్రనాయకత్వం తెలంగాణలో ఒక్క సీట్లోనైనా గట్టిగా పోటీ చేయాల్సిందేనని సూచించినట్లు నేతలు చెబుతున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

వందరోజుల్లోనే భ్రమలు తొలిగాయి: కేటీఆర్



- కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో ప్రజా వ్యతిరేకత
- పాలన చేతకాక దృష్టి మరల్చే ప్రయత్నాలు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న భ్రమలు కేవలం వంద రోజుల్లోనే తొలగిపోయాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. స్వల్ప కాలంలోనే కొత్త ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకుందన్నారు. మాటల గారడీ తప్ప చేతలు లేని సర్కారులా మారిందని విమర్శించారు. నాగర్‌కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ ముఖ్య నేతలతో కేటీ రామారావు శనివారం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క వర్గం సంతోషంగా లేదన్నారు. ఇటీవల కొడంగల్ లో జరిగిన ఓ సమావేశంలో సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు ఆయనలో ఓటమి భయాన్ని సూచిస్తున్నాయన్నారు. పాలన చేతకాక ప్రజల దృష్టి మరల్చేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వానికి పార్లమెంటు ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. గత పదేళ్లలో తెలంగాణకు ఏమీ చేయని బీజేపీకి ఈ రాష్ట్రంలో అసలు స్థానమే లేదని కేటీఆర్ తేల్చి చెప్పారు. నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి నాగర్‌కర్నూలులో బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కు మంచి మెజారిటీ సాధించాలని పిలుపునిచ్చారు.

నేడు బీఆర్ఎస్ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఆదివారం నిర్వహిస్తారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారు.

లీకు.. ఫేకు వార్తలు రాయిస్తున్నారు



- హామీలు అమలు చేయలేక బీఆర్ఎస్‌పై గోబెల్స్ ప్రచారం
- ఈ ఎన్నికల్లో బీజేపీకి కాంగ్రెస్ సహకరిస్తోంది
- మాజీ మంత్రి హరీశ్ ఆరోపణ

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/ దుబ్బాక: ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చలేక లీకు వార్తలు.. ఫేకు వార్తలు రాయిస్తూ కాంగ్రెస్ నాయకులు గోబెల్స్ ప్రచారానికి తెరలేపారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫేక్ సోషల్ మీడియాతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని ఆరోపించారు. వంద అబద్ధాలాడి కుర్చీనెక్కిన రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చాక కూడా నిజాయితీగా పాలన చేయలేకపోతున్నాడని దుయ్యబట్టారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సంగారెడ్డిలోని బీఆర్ఎస్ పార్టీ యువజన ఆత్మీయ సమ్మేళనంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రేవంత్‌రెడ్డి తీరుపై తీవ్ర విమర్శలు చేశారు.

బీజేపీ తీరుపైనా ఆగ్రహం..

పదేళ్ల కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఒక్క మంచి పనైనా చేసిందా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. చెప్పుకునేందుకు ఆ పార్టీకి పథకాలు లేకపోవడంతోనే చిత్రపటాలు, కేలండర్లు పంపిణీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు ఏకమై పనిచేస్తున్నాయని, అందుకోసమే కరీంనగర్, మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, చేవెళ్ల స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ బలహీన అభ్యర్థులను బరిలోకి దింపిందని ఆరోపించారు. కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవుడి పేరుతో రాజకీయాలు..

'భగవంతుడు అందరివాడు.. దేవుడి పేరుతో రాజకీయాలు చేస్తూ లబ్ధిపొందాలని చూడటం దారుణం' అని హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలో జరిగిన బీఆర్ఎస్ యువసమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రాముడి పేరుతో రాజకీయాలు చేయడం తప్ప పదేళ్ల బీజేపీ పాలనలో జరిగింది శూన్యమన్నారు. ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్, బీజేపీ దొందూదొందేనని చెప్పారు. రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా, వడ్లకు రూ.500 బోనస్ ఏమైందో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి కూడా ప్రసంగించారు.

ఇండియన్ పొలిటికల్ లీగ్ కప్ బీజేపీదే



- 400 స్థానాలతో మూడోసారి మోదీ సర్కార్ ఏర్పాటు తథ్యం
- బీజేపీ ఎంపీ బండి సంజయ్

కరీంనగర్‌టౌన్: ఐపీఎల్ క్రికెట్ మాదిరిగానే దేశ రాజకీయాల్లోనూ ఇండియన్ పొలిటికల్ లీగ్ (ఐపీఎల్) నడుస్తోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ అన్నారు. ఒకవైపు నరేంద్ర మోదీ కెప్టెన్సీలో బీజేపీ టీం బరిలో నిలవగా, మరోవైపు ఐఎన్డీ కూటమి పేరుతో గుంటనక్కల పార్టీలన్నీ ఒక టీంగా బరిలో ఉన్నాయని పేర్కొన్నారు. అయితే పొలిటికల్ లీగ్ కప్ బీజేపీదేనని పేర్కొన్నారు. ఐఎన్డీ కూటమిని చిత్తుగా ఓడించి 400 స్థానాలతో కేంద్రంలో మోదీ మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి హ్యాట్రిక్ కొట్టబోతున్నరని ధీమా వ్యక్తం చేశారు. శనివారం కరీంనగర్‌లోని రాజశ్రీ గార్డెన్‌లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని స్థానిక బీజేపీ నాయకులతో 'బూత్ విజయ సంకల్ప్ అభియాన్'భేటీని నిర్వహించారు. దీనికి బండి సంజయ్‌తోపాటు ముఖ్య అతిథిగా పార్టీ జాతీయ సంస్థాగత సహ ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ జాతీయ రాజకీయాలతోపాటు రాష్ట్ర రాజకీయాల్లోనూ తెలంగాణ పొలిటికల్ లీగ్ (టీపీఎల్) మొదలైందన్నారు. వేర్వేరుగా బీజేపీని ఓడించడం సాధ్యం కాదని, చీకటి ఒప్పందాలతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటయ్యాయని విమర్శించారు. అయినప్పటికీ ఆ పార్టీలను చిత్తుచిత్తుగా ఓడించి టీపీఎల్ కప్‌ను గెలిచి మోదీకి గిఫ్ట్ ఇవ్వబోతున్నామని అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద వడ్లరాశులు పోసినా కొనేనాథుడే లేరన్నారు.

తెలంగాణ ప్రజలను తెలివిలేనోళ్లంటావా?

తెలంగాణ ప్రజలకంటే ఏపీ వాసులు తెలివైన వాళ్లంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై బండి సంజయ్ మండిపడ్డారు. కొట్లాడి ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకున్న తెలంగాణ ప్రజలను తెలివిలేనోళ్లంటావా..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అమెరికాలో చిప్పలు కడిగిన నీకు అధికారం అప్పగిస్తే, తెలంగాణ ప్రజలు తెలివిలేని వాళ్లలాగా కనిపిస్తున్నారా?'అంటూ నిప్పులు చెరిగారు. ఫోన్ ట్యాపింగ్‌కు బాధ్యులైన నేతలను ఎందుకు అరెస్ట్ చేయరని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

పాత కత్తులు.. కొత్త పొత్తులు

స్టేట్ స్కాన్

బిహార్‌లో హోరాహోరీ

2019లో ఎన్డీఏ క్లీన్‌స్వీప్ ☛ ఈసారి చిక్కని ఓటరు నాడి ☛ ఇండియా కూటమి గట్టిపోటీ
మళ్లీ బీజేపీతో జట్టుకట్టిన నితీశ్ ☛ 'పల్టూరాం'పై జనస్పందనే కీలకం!



కులాల కుంపట్లు, పొత్తుల కత్తులు, కిచిడీ కూటములు, జంపింగ్ జపాంగ్‌లకు పెట్టింది పేరైన బిహార్‌లో రాజకీయాలు ఎప్పుడూ కాక పుట్టిస్తూనే ఉంటాయి. 40 సీట్లతో లోక్‌సభ నియోజకవర్గాల పరంగా దేశంలో నాలుగో స్థానంలో నిలుస్తున్న ఈ తూర్పు రాష్ట్రానిది జాతీయ రాజకీయాల్లో ఆది నుంచీ కీలక పాత్రే. తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ మొదలు జగ్జీవన్‌రాం, నుంచి లాలూ ప్రసాద్, నితీశ్‌కుమార్ దాకా దేశ, రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పిన ఉద్దండ నేతలకు పుట్టిల్లు బిహార్. అధికారం కోసం ప్రాంతీయ, జాతీయ పార్టీల మధ్య కుమ్ములాటలు, వర్గ పోరు, పవర్ పాలిటిక్స్ ఇక్కడ సర్వసాధారణం.

- సాక్షి, నేషనల్ డెస్క్

రాజకీయంగా చైతన్యవంతమైన బిహార్‌లో లోక్‌సభ ఎన్నికల ముంగిట కొత్త పొత్తులు పొడిచాయి. గత ఎన్నికల్లో బీజేపీ, జేడీ (యూ), లోక్ జనశక్తి పార్టీలతో కూడిన ఎన్డీఏ కూటమి ఏకంగా 39 సీట్లను ఒడిసిపట్టింది. బీజేపీ 17 సీట్లలో పోటీ చేసి అన్నీ గెలుచుకుంది. జేడీ(యూ) 17 సీట్లకు 16 చోట్ల, ఎల్జేపీ ఆరింటికి ఆరూ కైవసం చేసుకున్నాయి. కాంగ్రెస్, ఆర్జేడీ తదితర పార్టీల మహాకూటమి మహా ఓటమి చవిచూసింది. కాంగ్రెస్ 9 చోట్ల పోటీ చేసి ఒక్క సీటు గెల్చుకోగా ఆర్జేడీ 19 స్థానాల్లో తలపడినా సున్నా చుట్టింది. మిగతా పార్టీలదీ అదే పరిస్థితి. కేంద్రంలో మోదీ 2.0 బలమైన సర్కారు ఏర్పాటులో బిహార్ ఘనవిజయానిది ప్రధాన పాత్ర. ఈసారి పాత మిత్రులతో పూర్వ వైభవానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. బిహార్‌లో 40 స్థానాల్లో ఆరింటిని ఎస్సీలకు కేటాయించారు.

పట్టువదలని విక్రమార్కుడు

విజయ ప్రకాశ్ కొండేకర్. తెల్లగడ్డం, తెల్లని ధోతీ, భుజంపై కండువా, ఒంటిపై అంగి కూడా లేకుండా కనిపిస్తాడు. కానీ పట్టు వదలని విక్రమార్కుడనే పదబంధానికి నిలువెత్తు రూపం. మహారాష్ట్రలోని పుణేకు చెందిన ఈయన స్థానిక సంస్థల నుంచి లోక్‌సభ దాకా ఇప్పటికి ఏకంగా 25 సార్లు పోటీ చేశారు. దశాబ్దాలుగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తూనే ఉన్నారు. మహారాష్ట్ర రాష్ట్ర విద్యుత్ బోర్డు నుంచి 1980ల్లో రిటైరయ్యారు.



'బూటు గుర్తునే గెలిపించండి' అని రాసున్న ప్లకార్డును ఓ బండిపై పెట్టుకుని కాలి నడకన ప్రచారం చేస్తుంటారు. నగర వీధుల్లో అతడిని కొందరు పట్టించుకోకుండా వెళ్తే మరి కొందరు సెల్ఫీలు తీసుకుంటారు. సోషల్ మీడియాలో ఉచితంగా ప్రచారం దొరికిందంటూ సంతోషిస్తారాయన. గెలిచే అవకాశం లేదని తెలిసినా ప్రచారం కోసం పూర్వీకుల భూమి, ఇల్లు అమ్మేశాడు. ఎప్పటికైనా ప్రధాని కావాలన్నది ఆయన కలట. దాన్ని నిజం చేసుకోవడానికి ఎన్ని సార్లైనా పోటీ చేస్తూనే ఉంటానంటారు కొండేకర్.

ఆయన కంటే ఘనుడు మరొకరున్నారు. ఆయనే కె.పద్మరాజన్. గిన్నిస్ రికార్డు కోసం 170 కంటే ఎక్కువ ఎన్నికల్లో పోటీ చేశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్‌గాంధీపైనే బరిలో దిగారు! అలాగే యూపీలోని ఆగ్రా జిల్లాకు చెందిన 78 ఏళ్ల హస్నురామ్ అంబేద్కరి ఇప్పటిదాకా ఏకంగా 98సార్లు ఎన్నికల్లో తలపడ్డారు. ఈసారి కూడా ఆగ్రా, ఫతేపూర్‌సిక్రీ స్థానాల్లో నామినేషన్ వేస్తున్నారు. ఆ రెండింట్లోనూ ఓడి సెంచరీ కొడతారట! 'నీ భార్యే నీకు ఓటేయదు. ఇతరులెలా వేస్తారు' అంటూ ఓ బీఎస్పీ నేత అవమానించడంతో విజయం కోసం కాకుండా ఓట్ల కోసం ఆయన ఇలా పోటీ చేస్తూనే ఉన్నారు!!

నితీశ్ పిల్లిమొగ్గలు...




బిహార్ రాజకీయాల్లో వెలుగు వెలిగిన లాలు అవినీతి కేసుల్లో జైలుపాలైన నాటి నుంచీ రాష్ట్రంపై నితీశ్ కుమార్ పట్టుబిగించారు. ఏదో ఒక పార్టీతో పొత్తుతో 15 ఏళ్లుగా సీఎం పీఠాన్ని అంటిపెట్టుకున్నారు. జాతీయ రాజకీయాల్లోనూ చక్రం తిప్పుతున్నారు. 2015 అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ, సమాజ్‌వాదీ, జేడీ(ఎస్), కాంగ్రెస్ మహా కూటమిగా పోటీ చేశాయి. ఆర్జేడీ అతి పెద్ద పార్టీగా ఆవిర్భవించినా నితీశ్ సీఎం పదవి దక్కించుకున్నారు. రెండేళ్లు తిరిగేసరికి మహాకూటమికి గుడ్‌బై చెప్పి మళ్లీ బీజేపీతో జట్టుకట్టారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమితో సీట్ల సర్దుబాటు చేసుకుని అత్యధిక ఎంపీ సీట్లను దక్కించుకున్నారు. అదే జోరులో 2020 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎన్డీఏ భాగస్వామిగా పోటీ చేసి సీఎం పీఠమెక్కారు. జేడీ(యూ) (43) కంటే బీజేపీ (74)కే ఎక్కువ సీట్లు దక్కినా నితీశ్ మళ్లీ సీఎం పదవి దక్కించుకోవడం విశేషం. రెండేళ్లలోనే ఆయన మళ్లీ ప్లేటు ఫిరాయించారు. లోక్‌సభ ఎన్నికల్లో మోదీని ఢీకొట్టడమే లక్ష్యంగా విపక్ష పార్టీలతో కలిసి పోటీ చేస్తామంటూ ఎన్డీఏ కూటమి నుంచి బయటికొచ్చేశారు. మహా కూటమి దన్నుతో మళ్లీ సీఎం అయ్యారు! ఇండియా కూటమి ఏర్పాటు కీలక పాత్ర పోషించారు. తీరా గత జనవరిలో ఎన్డీఏలోకి గెంతి మహాకూటమికి, ఇండియా కూటమికీ కోలుకోలేని షాకిచ్చారు. బీజేపీ దన్నుతో సీఎం పదవిని కాపాడుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లోనూ ఆ పార్టీతో కలిసి పోటీ చేస్తున్నారు.

బీజేపీకి కలిసొస్తుందా...?

నితీశ్‌తో కలిసి 2019 ఫలితాలను రిపీట్ చేయాలని బీజేపీ ఉవ్విళ్లూరుతోంది. కానీ దీర్ఘకాలంగా అధికారంలో ఉన్న నితీశ్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఎన్డీఏ సీట్లకు గండి కొట్టవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రంలో కులగణన చేపట్టడాన్ని నితీశ్ సొమ్ము చేసుకోవాలనుకుంటున్నారు. అది తమ ఘనతేనని కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటోంది. దేశవ్యాప్తంగా ఆ హామీ ఇస్తున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తోంది. బీజేపీ అయోధ్య రామ మందిరంతో హిందుత్వ నినాదాన్ని మళ్లీ తెరపైకి తెచ్చింది. మోదీ ఫ్యాక్టర్, అభివృద్ధి నినాదంపై ఆశలు పెట్టుకుంది. ఈసారి బీజేపీ 17, జేడీయూ 16, చిరాగ్ పాశ్వాన్ సారథ్యంలోని ఎల్జేపీ 5, జితన్ రామ్ మాంఝీకి చెందిన హిందుస్థాన్ ఆవామ్ మోర్చా, రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ ఒక్కో స్థానంలో పోటీ చేయనున్నాయి.

కులగణన ఎవరికి ప్లస్!

బిహార్ రాజకీయాలు చిరకాలంగా కులాల చుట్టూనే తిరుగుతున్నాయి. నితీశ్ చేపట్టిన కులగణన మరోసారి రిజర్వేషన్ల తేనెతుట్టెను కదిపింది. రాష్ట్రంలో 94 లక్షల కుటుంబాలు (34.13%) నెలకు రూ.6,000 సంపాదన కూడా లేక పేదరికంలో మగ్గుతున్నాయని కులగణనలో వెల్లడైంది. రాష్ట్రంలో రిజర్వేషన్లను 65 శాతానికి పెంచాల్సిందేనని నితీశ్ పేర్కొన్నారు. రాష్ట్ర జనాభాలో 19.65 శాతం ఎస్సీలు, 1.68 శాతం ఎస్టీలున్నారు. వారిలో ఏకంగా 42.7 శాతం మంది నిరుపేదలని కులగణనలో తేలింది. 27.13 శాతం ఓబీసీలున్నారు. వీరిలో 14.26 శాతం యాదవులు. దాదాపు 17 శాతం మంది ముస్లింలున్నారు. మహాకూటమి యాదవులు, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ ఓట్లపై కాంగ్రెస్ గురిపెట్టింది. జనాభా ప్రాతిపదికన సామాజిక న్యాయం జరగాలని డిమాండ్ చేస్తోంది. అగ్రవర్ణాలతో పాటు ఓబీసీలు, ఎస్సీ, ఎస్టీలనూ ఆకర్షించేలా బీజేపీ, జేడీయూ పావులు కదుపుతున్నాయి. ప్రధాని మోదీ ప్రచారంతో హోరెత్తిస్తున్నారు.



సర్వేల సంగతేంటి...?

బిహార్‌లో ఎన్నికల సర్వేల్లో భిన్నాభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. నితీశ్ చేరికతో ఎన్డీఏకు 32 నుంచి 35 సీట్లు రావచ్చని కొన్ని సర్వేలు అంచనా వేశాయి. ఇండియా కూటమికి 5–8 సీట్లే వస్తాయని చెప్పాయి. అయితే నితీశ్‌పై ప్రజా వ్యతిరేకత ఇండియా కూటమికి కలిసొస్తుందని ఇండియా కూటమి 15 నుంచి 20 పై చిలుకు దాకా చేజిక్కించుకోవచ్చని మరికొన్ని సర్వేల అంచనా.



యూపీఏ హయాంలో భారత్‌ను బలహీన దేశంగా చూసేవారు. చిన్నాచితకా దేశాల నుంచి కూడా ఉగ్రవాదులు మనపై దాడులకు తెగబడేవారు. కాంగ్రెసేమో చేతకానితనంతో వేరే దేశాలకు ఫిర్యాదు చేస్తుండేది. నేటి భారత్ అలా కాదు. అవసరమైతే ఉగ్రవాదుల ఇళ్లలో దూరి మరీ అంతం చేస్తుంది.

- బిహార్ ఎన్నికల సభలో ప్రధాని మోదీ

మహాకూటమి దెబ్బకు బీజేపీ, ఎన్డీఏ కంగుతిన్నాయి. అందుకే మోదీతో సహా అగ్ర నేతలంతా బిహార్‌లోనే తిరుగుతున్నారు. విపక్షాలపై కత్తిగట్టి ఈడీ, సీబీఐ కూడా ఇక్కడే మరింత ఫోకస్ చేస్తున్నాయి. పేదరికం, ఉపాధి, బిహార్ చిరకాల కోరికైన ప్రత్యేక హోదా గురించి మోదీ మాట్లాడాలి.

- ఎన్నికల ప్రచారంలో ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్

ఇండియా కూటమి పైచేయి సాధిస్తుందా?



ఎన్నికల వేళ వెన్నుపోటు పొడిచిన నితీశ్‌కు గుణపాఠం నేర్పాలని కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమి పట్టుదలగా ఉంది. ఆయనది పచ్చి అవకాశవాదమంటూ కాంగ్రెస్, ఆర్జేడీ దుమ్మెత్తిపోస్తున్నాయి. రాష్ట్రంలో కులగణన తమ సంకీర్ణ సర్కారు ఘనతేనని ప్రచారం చేస్తున్నాయి. ఇది దేశానికి ఎక్స్‌రే వంటిదని, కేంద్రంలో అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కులగణన చేపడతామని రాహుల్ గాంధీ పదేపదే చెబుతున్నారు. మోదీ హయాంలో నిరుద్యోగం, నిత్యావసరాల ధరల పెరుగుదల, కార్పొరేట్ దోపిడీ తదితరాలను ప్రచారాస్త్రాలుగా మలచుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా 30 లక్షల ప్రభుత్వోద్యోగాలతో పాటు పలు సంక్షేమ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. 6 న్యాయాలు 25 గ్యారంటీలతో విడుదల చేసిన జాతీయ మ్యానిఫెస్టోను కాంగ్రెస్ ఊరూవాడా ప్రచారం చేస్తోంది. పొత్తులో భాగంగా ఆర్జేడీకి 26, కాంగ్రెస్ 9కి, లెఫ్ట్ పార్టీలకు 5 సీట్లు దక్కాయి. ఆర్జేడీ తమ 26 సీట్లలో మూడింటిని మాజీ మంత్రి ముకేశ్ సాహ్ని సారథ్యంలోని వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ)కి కేటాయించింది.


అబ్బాయ్-బాబాయ్ పోరు



బిహార్‌లో అబ్బాయ్–బాబాయ్ అమీతుమీ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఎల్జేపీ వ్యవస్థాపకుడు రామ్ విలాస్ పాశ్వాన్ మరణం తర్వాత ఆయన వారసత్వం కోసం కుమారుడు చిరాగ్, సోదరుడు పశుపతి పరాస్ హోరాహోరీ తలపడ్డారు. చివరికి పార్టీని పరాస్ చేజిక్కించుకున్నారు. చిరాగ్‌కు ఎల్జేపీ (రాం విలాస్), పశుపతికి రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ (ఆర్ఎల్జేపీ) పేర్లను ఎన్నికల సంఘం కేటాయించింది. పశుపతి పార్టీకి బీజేపీ ఒక్క సీటూ ఇవ్వకపోవడంతో ఆయన కేంద్ర మంత్రివర్గం నుంచి వైదొలిగారు. సొంతంగా పోటీ చేస్తామని ప్రకటించారు. చిరాగ్‌కు బీజేపీ ఐదు సీట్లు ఇవ్వగా పట్టుబట్టి పాశ్వాన్ల కంచుకోట అయిన హాజీపూర్‌ను సాధించుకున్నారు. అక్కడ బాబాయ్ పశుపతిపై చిరాగ్ నేరుగా తలపడుతుండటం విశేషం!



నెహ్రూ హవా



1957 కల్లా మరింత బలపడ్డ కాంగ్రెస్

రెండో లోక్‌సభ ఎన్నికల్లో ఘనవిజయం

బలమైన ప్రతిపక్షం లేకపోవడమే కారణం

27 సీట్లతో రెండో అతి పెద్ద పార్టీగా సీపీఐ

స్వాతంత్య్రం సిద్ధించి అప్పటికి దశాబ్దం గడిచింది. నెహ్రూ పాలనే సాగుతోంది. ముప్పిరిగొన్న సమస్యల నడుమే రెండో లోక్‌సభ ఎన్నికలు ముంచుకొచ్చాయి. ప్రజలకు ఓటు విలువ తెలియజెప్పి ఓటేసేలా చేయడం ఎన్నికల సంఘానికి కీలక సవాలుగా నిలిచింది. అయితే 1952 తొలి ఎన్నికల నిర్వహణ తాలూకు అనుభవం ఈసారి బాగా పనికొచ్చింది. పాకిస్తాన్ రాజ్యాంగ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతూ ఉండగానే మనం రెండో ఎన్నికలు కూడా విజయవంతంగా నిర్వహించుకున్నాం. దేశంలో ప్రజాస్వామ్యం గట్టిగా వేళ్లూనుకుందని ప్రపంచానికి చాటాం.

గతం

దేశాన్ని ఎన్నో సమస్యలు వేధిస్తున్నప్పటికీ రెండో లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు మరోసారి నెహ్రూకే పట్టం కట్టారు. బలమైన ప్రతిపక్షం లేకపోవడమే దీనికి కారణం. 1952లో తొలి ఎన్నికల్లో 364 లోక్‌సభ సీట్లు గెలిచిన కాంగ్రెస్ బలం ఈసారి 371 స్థానాలకు పెరిగింది. ఓట్ల శాతం కూడా 45 శాతం నుంచి 47.8 శాతానికి పెరిగింది. సీపీఐ 27 స్థానాల్లో విజయకేతనం ఎగురవేసింది. 1952తో పోలిస్తే 11 స్థానాలు పెరిగినా ఓట్ల శాతం మాత్రం 32.65 నుంచి 24.55కు క్షీణించింది. కాంగ్రెస్ తర్వాత అధిక స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులే నెగ్గడం విశేషం! వారు 19.3 శాతం ఓటింగ్‌తో 42 స్థానాలు గెలుచుకున్నారు. రాష్ట్రాల స్థాయిలో జనతా, ఫార్వార్డ్ బ్లాక్, గణతంత్ర పరిషత్, అఖిల భారతీయ హిందూ మహాసభ, జార్ఖండ్ పార్టీ, పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్, ప్రజాపార్టీ, పీసెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ, అఖిల భారతీయ రామ్ రాజ్య పరిషత్, రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ, ఆల్ ఇండియా షెడ్యూల్డ్ క్యాస్ట్ ఫెడరేషన్ పోటీ చేశాయి.


సమస్యలు ఎన్నున్నా...

నిరుద్యోగం, ఆహార కొరత, నిత్యావసరాల ధరల పెరుగుదల, రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ విషయంలో ప్రజల్లో అసంతృప్తి, అవినీతి, ఆశ్రిత పక్షపాతం, ఆశించిన అభివృద్ధి లేకపోవడం, భూసంస్కరణల నత్తనడక, రాష్ట్రాల్లో పాలనా సామర్థ్యం లోపించడం, ఉత్తరాది ఆధిపత్యంపై దక్షిణ భారతీయుల్లో ఆగ్రహం... ఇలాంటి పలు సమస్యలను రెండో లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పార్టీలు బలంగా ప్రజల ముందుకు తీసుకెళ్లాయి. ఇన్ని సమస్యలున్నా కాంగ్రెస్‌ను ఢీకొట్టే బలమైన ప్రతిపక్షం లేకపోవడంతో పోటీ ఏకపక్షమేనని ముందే తేలిపోయింది. నెహ్రూ సర్కారుకు ఎన్ని స్థానాలొస్తాయన్నదే కాస్త ఆసక్తి కలిగించిన అంశం. అయితే ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చిన సీట్లలో మూడింట రెండొంతులు ఉత్తరాది చలవే! ఒక్క యూపీయే కాంగ్రెస్‌కు ఏకంగా 70 సీట్లు కట్టబెట్టింది!

ఒక స్థానం.. ఇద్దరు ప్రజాప్రతినిధులు

బహుళ అభ్యర్థుల నియోజకవర్గాలకు చివరి ఎన్నికలుగా 1957 లోక్‌సభ ఎన్నికలు చరిత్రలో గుర్తుండిపోతాయి. 1957లో 91 స్థానాలు ద్వంద్వ నియోజకవర్గాలున్నాయి. జనరల్ కోటా నుంచి ఒకరు, ఎస్సీ/ఎస్టీ కోటా నుంచి ఒకరు చొప్పున ఆ స్థానాల్లో ఇద్దరు విజేతలుండేవారు. ఆ తర్వాత ఈ విధానాన్ని తొలగించారు. 1952 తొలి ఎన్నికల్లోనైతే పశ్చిమబెంగాల్‌లో ముగ్గురు అభ్యర్థులు ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం కూడా ఉంది...!

వాజ్‌పేయి అరంగేట్రం...



దిగ్గజ నాయకుడు అటల్ బిహారీ వాజ్‌పేయి 1957 ఎన్నికల్లో నెగ్గి తొలిసారి లోక్‌సభలో అడుగుపెట్టారు. ఆయనను గొప్ప వక్తగా నెహ్రూ కొనియాడారు. అంతే కాదు, 'ఏదో ఒక రోజు ప్రధాని అవుతాడు' అంటూ కచ్చితంగా భవిష్యద్దర్శనం కూడా చేశారు! ఇక, సీఈసీగా వరుసగా రెండు సార్లు సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన సుకుమార్ సేన్ 1958 డిసెంబర్ 19న కన్నుమూశారు.

రెండో లోక్‌సభలో పార్టీల బలాబలాలు

(మొత్తం స్థానాలు 494)

పార్టీ	స్థానాలు
కాంగ్రెస్	371
సీపీఐ	27
ప్రజా సోషలిస్ట్ పార్టీ	19
ఆలిండియా గణతంత్ర పరిషత్	7
ఇతరులు	28
స్వతంత్రులు	42

విశేషాలు ఎన్నెన్నో...

- 1957లో రెండో లోక్‌సభ ఎన్నికలు మొత్తం 14 రాష్ట్రాలు, 6 కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలో జరిగాయి.
- ఆంధ్రప్రదేశ్, అసోం, బిహార్, బాంబే, కేరళ, మధ్యప్రదేశ్, మద్రాస్, మైసూరు, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, జమ్మూ అండ్ కశ్మీర్‌తో పాటు కేంద్రపాలిత ప్రాంతాలైన ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, మణిపూర్, త్రిపుర, అండమాన్ నికోబార్, లక్షద్వీప్–మినీకాయ్–మినిందివిల్లో పోలింగ్ జరిగింది.
- మొత్తం 494 లోక్‌సభ స్థానాలకు గాను ఒక్కో చోట సగటు ముగ్గురు అభ్యర్థుల కంటే బరిలో లేరు.
- కాంగ్రెస్ మినహా మరో బలమైన జాతీయ పార్టీ లేనే లేదు. ప్రాంతీయ పార్టీలు అప్పుడప్పుడే మొగ్గ తొడుగుతున్నాయి.
- జాతీయ స్థాయిలో నాలుగే పార్టీలు ఎన్నికల్లో పాల్గొన్నాయి. రాష్ట్రాల్లో మరో 15 పార్టీలు అదృష్టాన్ని పరీక్షించుకున్నాయి.
- 1957 ఫిబ్రవరి 24 నుంచి జూన్ 9 దాకా మూడున్నర నెలల పాటు ఎన్నికల నిర్వహణ క్రతువు సాగింది.
- ఓటు ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఈసీ ఎంతో కృషి చేసినా పెద్దగా ఫలితం కనిపించలేదు.
- 1952 తొలి ఎన్నికల్లో 44.87 శాతం ఓటింగ్ నమోదవగా 1957లో 45.44 శాతానికి పెరిగింది. 19,36,52,179 మంది ఓటేశారు.
- ఈ ఎన్నికలూ తొలి ఎన్నికల ప్రధాన కమిషనర్ సుకుమార్ సేన్ సారథ్యంలోనే జరిగాయి.
- ఎన్నికల నిర్వహణ వ్యయాన్ని బాగా తగ్గించడంతో పాటు వాటిని మరింత సమర్థంగా నిర్వహించారాయన.
- దాంతో సుడాన్ తమ తొలి ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సేన్‌కే అప్పగించడం విశేషం...!
- పోలింగ్ బూత్‌లను ఆక్రమించే పెడ ధోరణి 1957 ఎన్నికల్లోనే తొలిసారిగా కనిపించింది!

● బీజేపీ ఫైర్ బ్రాండ్...

క్యోంకి స్మృతీ భీ కభీ అభినేత్రీ థీ



స్మృతి జుబిన్ ఇరానీ. ఇప్పుడు కేంద్ర మంత్రిగా సుపరిచితులు. ఒకప్పుడు హిందీ టీవీ సీరియల్ వీక్షకుల అభిమాన నటి. సంప్రదాయ కుటుంబం నుంచి వచ్చినా మోడల్‌గా, నటిగా రాణించారు. రాజకీయాల్లో స్వయంకృషితో ఎదిగారు. కాంగ్రెస్ కంచుకోట అమేథీలో రాహుల్‌గాంధీనే మట్టికరిపించారు. ఈసారి కూడా అమేథీలో కాంగ్రెస్‌కు సవాల్ విసురుతున్నారు...

పరిచయం

రాజకీయ ప్రయాణం..

నటనతో దేశవ్యాప్త గుర్తింపు తెచ్చుకున్న స్మృతీ 2003లో బీజేపీలో చేరారు. మహారాష్ట్ర బీజేపీ యువజన విభాగం ఉపాధ్యక్షురాలిగా చేశారు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నేత కపిల్ సిబల్‌పై ఢిల్లీలోని చాందినీ చౌక్ నుంచి పోటీ చేసి ఓడారు. 2011లో గుజరాత్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2014లో యూపీలోని అమేథీ నుంచి రాహుల్ గాంధీపై పోటీ చేసి ఓటమి చవిచూశారు. 2017లో రెండోసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. అమేథీపై బాగా దృష్టి పెట్టారు. నిత్యం స్థానికంగా ప్రజల్లో ఉన్నారు. కాంగ్రెస్‌పై, రాహుల్‌పై విమర్శలతో హోరెత్తించారు. 2019లో అమేథీలో రాహుల్‌ను ఓడించి తొలిసారి లోక్‌సభలో అడుగుపెట్టారు. అమేథీలో స్థిర నివాసం ఏర్పరుచుకుని అక్కడే ఉంటానని ప్రకటించారు. 2021లో మావాయి గ్రామంలో ఇల్లు కట్టుకున్నారు. ఇటీవలే గృహప్రవేశం చేశారు. 'దమ్ముంటే అమేథీ నుంచి పోటీ చేయండి' అంటూ మళ్లీ రాహుల్‌కు సవాలు విసురుతున్నారు. కేంద్రంలో మానవ వనరులు, సమాచార–ప్రసార, జౌళి శాఖ మంత్రిగా చేశారు. ప్రస్తుతం మహిళా సంక్షేమం, శిశు అభివృద్ధి, మైనారిటీ వ్యవహారాల మంత్రి.

వివాదాలకు కేరాఫ్

రకరకాల కారణాలతో స్మృతి తరచూ వివాదాల్లో పడుతుంటారు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో చాందినీచౌక్ నుంచి పోటీ చేసినప్పుడు ఎన్నికల అఫిడవిట్‌లో ఢిల్లీ యూనివర్సిటీ (స్కూల్ ఆఫ్ కరస్పాండెన్స్)లో 1996లో బీఏ చదివానని పేర్కొన్నారు. 2014, 2019ల్లో అమేథీ నుంచి పోటీ చేసినప్పుడేమో 1994లో ఢిల్లీ యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ కామర్స్‌లో చేరినట్టు వెల్లడించారు. దాంతో ఆమె డిగ్రీలో చేరింది 1994లోనా, 1996లోనా, చదివింది బీఏనా, కామర్సా అనే విమర్శలొచ్చాయి. 2014లో మానవ వనరుల మంత్రి కావడంతో కనీసం డిగ్రీ లేని వ్యక్తి దేశానికి విద్యా మంత్రా అంటూ నిరసనలు వ్యక్తమయ్యాయి. సమస్య కోర్టు దాకా వెళ్లింది. ఈ వివాదాల నేపథ్యంలో ఆమె మానవ వనరుల నుంచి జౌళి శాఖకు మారారు.

బహుభాషా ప్రావీణ్యం...

స్మృతి 1976 మార్చి 23న ఢిల్లీలోని పంజాబీ కుటుంబంలో జన్మించారు. తండ్రి అజయ్ కుమార్ మల్హోత్రా వ్యాపారి. తల్లి శిబానీ నే బాగ్చీ బెంగాలీ. ఢిల్లీలోని హోలీ చైల్డ్ ఆగ్జిలియమ్ స్కూల్లో చదివారు. తండ్రి ఇష్టానికి వ్యతిరేకంగా పాఠశాల విద్య కాగానే మోడలింగ్ వైపు వెళ్లారు. తర్వాత నటనలో అదృష్టం పరీక్షించుకునేందుకు ముంబైలో అడుగుపెట్టారు. పలు ఉత్పత్తులకు మోడల్‌గా చేస్తూనే నటిగా ప్రయత్నించారు. ఆ క్రమంలో సినిమా కష్టాలు పడ్డారు. పెద్ద కూతురుగా ఇంటి బాధ్యతలను తలకెత్తుకున్నారు. పలు సీరియళ్లలో నటించారు. క్యోం కీ సాస్ భీ కభీ బహు థీ సీరియల్‌తో ఎందరో అభిమానులను సంపాదించుకున్నారు. ఒక టీవీ సీరియల్‌కు సహదర్శకత్వంతో పాటు పలు టీవీ షోలకు హోస్ట్‌గా చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో 'జై బోలో తెలంగాణ' సినిమాతో తెలుగు ప్రజలకూ పరిచయమయ్యారు. 2001లో జుబిన్ ఇరానీని పెళ్లాడారు. వీరికి కొడుకు జోహర్, కూతురు జోయిష్ ఉన్నారు. వైవిధ్యమైన కుటుంబ, సినీ నేపథ్యం కారణంగా ఆమె హిందీ, బెంగాలీ, మరాఠీ, గుజరాతీ, పంజాబీ భాషల్లో అనర్గళంగా మాట్లాడతారు.

వ్యూహం కాదిది.. ద్రోహం!



కూటమిలో త్యాగం చేయాల్సి వస్తే బలవుతున్నది బీజేపీ, జనసేనే

- చంద్రబాబు, ఆయన బంధువర్గంలో మాత్రం అందరికీ టికెట్లు
- రాత్రికి రాత్రి వచ్చేవారిని కూడా.. అటూ ఇటూ పంపిస్తున్న బాబు
- 'పచ్చ' నేతలకు టికెట్లిచ్చి సొంత నేతలకు బీజేపీ, జనసేన ద్రోహం
- ప్రకటించిన వారిని కూడా బాబు ఆదేశాలతో మార్చేస్తున్న తీరు
- ఆఖరికి మాజీ సైనికుడికి ఇచ్చామంటున్న అనపర్తిపైనా బాబు కన్ను
- ఆ సీటును బీజేపీ నుంచి తీసుకోవటానికి ఎత్తుగడ.. వదినమ్మ ఓకే!
- బాలకృష్ణ వియ్యంకుడి కోసం విశాఖ నుంచి బీజేపీని పంపేసిన వైనం
- అనకాపల్లి ఇచ్చి.. అది తన బంటు సీఎం రమేశ్‌కే వచ్చేలా ఎత్తుగడ
- మొదటి నుంచీ బీజేపీని నమ్ముకున్న అగ్రనేతలకూ మొండిచెయ్యి
- జనసేనకు ఇచ్చిన సీట్లలో 70 శాతం టీడీపీ, ఇతర పార్టీల వారికే
- ఆరణి శ్రీనివాసులను బాబే పంపినట్లు తిరుపతిలో చెప్పిన పవన్
- బాబు మార్కు రాజకీయాలతో కుదేలవుతున్న బీజేపీ, జనసేన శ్రేణులు
- అందుకే ఆగ్రహంతో వరసగా రాజీనామాలు

ఎన్నికల వ్యూహమంటే..? పొత్తుల్లో రాజీ పడటమా? ఏళ్లకేళ్లు తమ పార్టీ జెండా మోసిన వారికి ద్రోహం చెయ్యటమా? ఒకవైపు కొత్త తరం రాజకీయాల్లోకి రావాలని చెప్పే పవన్ కళ్యాణ్.. చంద్రబాబు నాయుడు చెప్పిన వాళ్లకే.. ఆ పాత తరం నాయకులకే జనసేన టికెట్లు కూడా ఇచ్చుకుంటూ పోతుంటే కొత్త తరం ఎలా వస్తుంది? మాజీ సైనికుడికి టికెట్టిచ్చామని ఘనంగా చెప్పుకుంటున్న బీజేపీ ఆ ఒక్క సీటును కూడా రాత్రికి రాత్రి వచ్చే తెలుగుదేశం నాయకులకే ఇచ్చేయాలని చూస్తూ.. దానికి్కూడా వ్యూహమని పేరు పెడుతుంటే అంతకన్నా ద్రోహం మరొకటి ఉంటుందా? ఇక్కడ చంద్రబాబు వ్యూహం మేరకు జనసేన, బీజేపీ జెండా మోసిన నాయకులకు ద్రోహం జరుగుతోంది.

చంద్రబాబు కోరిక మేరకు.. ఇప్పటికే కేటాయించిన సీట్లను కూడా బీజేపీ, జనసేన మార్చేస్తున్నాయంటే అర్థమేంటి? చంద్రబాబు చెబితేనే ఆరణి శ్రీనివాసులకు సీటిచ్చానని సాక్షాత్తూ పవన్ కళ్యాణే చెప్పారంటే ఏమనుకోవాలి? అనపర్తి సీటు మార్చాలని బాబు చెబితే.. దానికి్కూడా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు తలూపారంటే అక్కడ సీటు దక్కించుకున్న మాజీ సైనికుడిని మోసం చేసినట్లు కాదా? వాస్తవానికి జెండా మోసిన నాయకులు, కార్యకర్తలు అడుగుతున్న ఈ ప్రశ్నల్లో వేటికీ అటు పవన్ దగ్గర కానీ, ఇటు పురందేశ్వరి దగ్గర కానీ సమాధానాలు లేవు. 'వ్యూహంలో భాగంగా' అని తమకిచ్చిన స్క్రిప్టును చదువుతున్నారంతే!

సాక్షి, అమరావతి : టీడీపీ– బీజేపీ– జనసేన కూటమిలో ఏ త్యాగం చేయాల్సి వచ్చినా బీజేపీ, జనసేన పార్టీల నాయకులే బలి అవుతున్న పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. మూడు పార్టీల పొత్తులో ఒక్క చంద్రబాబు కుటుంబం, వారి బంధువులే ఏకంగా ఐదుగురు పోటీ చేస్తూ.. వారెవరూ తమ సీట్లను వదులుకోకుండా.. పైపెచ్చు వారి కోసం పార్టీని నమ్ముకున్న మిగిలిన నాయకులను ఒక్కొక్కరినీ బలి చేసుకుంటూ పోతున్నారని బీజేపీ, జనసేన పార్టీ శ్రేణుల్లో చర్చ సాగుతోంది. ఒకే కుటుంబం, బంధువర్గానికి చెందిన చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్, నందమూరి బాలకృష్ణ, బాలకృష్ణ రెండో అల్లుడు భరత్‌తో పాటు దగ్గుబాటి పురందేశ్వరిలు ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులుగా పోటీ చేయబోతున్నారు. ఈ పొత్తులో ఆ కుటుంబం, వాళ్ల బంధువర్గం మాత్రం ఒక్క సీటు వదులుకోవడానికి కనీసం ఆలోచన కూడా చేయడం లేదు. అయితే బీజేపీ, జనసేనలోని సాదాసీదా నాయకుల సీట్లకు మాత్రం వారందరూ కలిసి ఎసరు పెడుతున్నారు. చంద్రబాబు నేతృత్వంలో కూటమి నాయకుల సమావేశం జరిగిందంటే బీజేపీ, జనసేన పార్టీలనే నమ్ముకున్న నాయకులకు, శ్రేణులకు ఏదో అన్యాయం జరిగినట్లేనని.. పొత్తులు కుదిరిన నాటి నుంచి తాము ఇలాంటి ముళ్లబాటలోనే ముందుకు సాగుతున్నామని ఆయా పార్టీ నాయకులు శ్రేణులు వాపోతున్నారు.

సమావేశం అంటేనే ఎవరికో ఎసరు పెట్టినట్టే..

టీడీపీ – బీజేపీ – జనసేన పొత్తులో తొలి నుంచి పార్టీనే నమ్ముకొని బీజేపీలో కొనసాగుతున్న వందలాది మంది నాయకుల్లో రాష్ట్రమంతటా కలిపి కేవలం ముగ్గురంటే ముగ్గురు నాయకులకే సీట్లు దక్కితే.. అందులో ఇద్దరు సీట్లకు చంద్రబాబు శుక్రవారం జరిగిన సమావేశంలో ఎసరుపెట్టేశారు. ఈ పొత్తులో బీజేపీకి ఆరు లోక్‌సభ, పది అసెంబ్లీ స్థానాలు కేటాయించగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా కొనసాగుతున్న పురందేశ్వరిని చెప్పు చేతల్లో పెట్టుకొని ఆ పార్టీకి కేటాయించిన సీట్లలో కూడా చంద్రబాబు.. తమ మనుషులకే సీట్లు దక్కించుకున్న పరిస్థితి. అరకు, అనపర్తి అసెంబ్లీ స్థానాలతో పాటు నరసాపురం లోక్‌సభ స్థానంలో మాత్రమే తొలి నుంచి బీజేపీని నమ్ముకున్న నాయకులకు సీట్లు దక్కాయని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. అందులో అనపర్తి అసెంబ్లీ, నరసాపురం లోక్‌సభ స్థానాలకు పార్టీ జాతీయ నాయకత్వం అభ్యర్థులను ప్రకటించిన తర్వాత ఇప్పుడు ఆ స్థానాలను తిరిగి టీడీపీకి అప్పగించేందుకు పురందేశ్వరి సూత్రప్రాయంగా అంగీకారం తెలుపుతూ తిరిగి జాతీయ నాయకత్వానికి ప్రతిపాదనలు పంపడంపై బీజేపీ నేతలు మండిపడుతున్నారు.

జనసేనకు సైతం ఇదే అన్యాయం

టీడీపీతో పొత్తు పెట్టుకున్న జనసేనది సైతం బీజేపీ లాంటి పరిస్థితే. చంద్రబాబు అవినీతి ఆరోపణల కేసులో అరెస్టయి జైలులో ఉన్న సమయంలో పవన్ కళ్యాణ్ రాజమండ్రి జైలుకు వెళ్లి పరామర్శ అనంతరం అధికారికంగా రెండు పార్టీల మధ్య పొత్తు పొడిచిందని ప్రకటించారు. రాష్ట్రంలో దాదాపు మూడో వంతు సీట్లు జనసేనకే కేటాయిస్తామని టీడీపీ హామీ ఇచ్చినట్టు పవన్ తమతో చెప్పినట్టు ఆ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. అయితే ఆచరణలో జరిగింది వేరు. చంద్రబాబుతో మూడు నాలుగు విడతలుగా పవన్ భేటీల తర్వాత కేవలం 24 అసెంబ్లీ, మూడు లోక్‌సభ స్థానాలకు పరిమితం చేశారు. ఆ తర్వాత అందులో ఒక లోక్‌సభ, మూడు అసెంబ్లీ స్థానాలకు కోతలు పెట్టారు. తుదకు మిగిలిన 21 అసెంబ్లీ స్థానాల్లో ఎక్కువ చోట్ల ఆ నియోజకవర్గ టీడీపీ నాయకులనే పార్టీలో చేర్చుకొని టికెట్లు కట్టబెట్టారు. ఈ వ్యవహారంపై జనసేన నేతలు కొద్ది రోజులుగా బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు.

నరసాపురం లోక్‌సభ, అనపర్తి అసెంబ్లీ స్థానాలకు బీజేపీ నాయకత్వం ప్రకటించిన అభ్యర్థులకు ఆయా స్థానాల్లో పట్టులేదని చంద్రబాబు కొత్త వాదనను తీసుకొచ్చినట్టు బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎందుకంటే అక్కడ తన వాళ్లు లేరన్నది బాబు అంతరంగం. 'బీజేపీకి కేటాయించిన అనకాపల్లి నుంచి పోటీ చేస్తున్న సీఎం రమేశ్‌కు ఆ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏమైనా పట్టు ఉందా..? 'పురందేశ్వరి పోటీ చేస్తున్న రాజమండ్రి లోక్‌సభ స్థానంలో ఆమెకు పట్టు ఉందా? సుజనా చౌదరి పోటీ చేస్తున్న విజయవాడ పశ్చిమ అసెంబ్లీ స్థానంలో అతనికి ఏమన్నా పట్టు ఉందా? ధర్మవరంలో పోటీ చేస్తున్న సత్యకుమార్‌కు అక్కడ పట్టు ఉందా?' అని బీజేపీలో చర్చ సాగుతోంది. చంద్రబాబు, పురందేశ్వరిలు కలిసి తాము అనుకున్నట్టు జాతీయ నాయకత్వానికి ప్రతిపాదనలు పంపి కుట్ర చేశారని బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు.

రాజమండ్రిలో పురందేశ్వరికి పట్టుందా?

అనకాపల్లిలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ పోటీకి ఎంతగానో ఆసక్తి చూపినా, ఆయన్ను కాదని రాయలసీమ ప్రాంతానికి చెందిన సీఎం రమేశ్‌కు అనకాపల్లి, రాజమండ్రిలో స్థానికంగా మాజీ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు సోము వీర్రాజును కాదని పురందేశ్వరికి సీట్లు ఇచ్చారు. ఉత్తర భారత దేశానికి చెందిన రాష్ట్రాల వారు ఎక్కు వగా ఉండడం తదితర కారణాలతో విశాఖ లోక్‌సభ పరిధిలో బీజేపీకి సొంతంగా కాస్తో కూస్తో బలం ఉంది. అలాంటి ఈ సీటును బాలకృష్ణ రెండో అల్లుడు, లోకేశ్ తోడల్లుడు భరత్‌కు ఏ లెక్కన కేటాయించారని కమలం నేతలు, కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. దీని వెనుక చంద్రబాబు, పురందేశ్వరి చక్రం తిప్పడమేనని స్పష్టం చేస్తున్నారు.

రాజధానిని మింగేసిన బాబు భూదందా

అదిగో రాజధాని అంటూ లీకులిచ్చి అరచేతిలో వైకుంఠం

అమరావతిలో బాబు బినామీల భూ మాఫియా వ్యవస్థీకృతం

అంతర్జాతీయ స్థాయి రాజధాని.. ఆకాశ హర్మ్యాల నగరం అంటూ గాలిలో మేడలు

రైతుల కాళ్ల కిందున్న భూమి కంపించేలా ఎత్తులు పైఎత్తులు


బరితెగించి ప్రపంచ చరిత్రలోనే అతి పెద్ద భూ దోపిడీ.. రాజధాని ప్రచారం పేరిట భూ మాయాజాలం

భూసమీకరణ ముసుగులో అసైన్డ్, ప్రభుత్వ, ప్రైవేట్, లంక భూముల దురాక్రమణ ఇన్నర్ రింగ్ రోడ్డు పేరిట అవినీతి మలుపులు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

బొండాగిరి

బెజవాడ సెంట్రల్లో కాల్‌కేయుడు



కాల్ మనీ, సెక్స్ రాకెట్ కింగ్ | భూ కబ్జాలకు కేరాఫ్ అడ్రస్ | రౌడీషీటర్లతో సత్సంబంధాలు | బెజవాడలో చీకటి సామ్రాజ్యం

ఇదీ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత బొండా ఉమామహేశ్వరరావు అరాచకాల చిట్టా | ఇటీవల గీతాంజలి ఆత్మహత్య కేసులోనూ బొండా అనుచరుడి అరెస్ట్

సాక్షి ప్రతినిధి, విజయవాడ:

టీడీపీ ప్రభుత్వ హయాంలో బెజవాడలో బొండా ఉమామహేశ్వరరావు ఆయన అనుచరుల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. భూకబ్జాలు, దౌర్జన్యాలు, కాల్‌మనీ, సెక్స్ రాకెట్.. ఆయన చేయని దందా లేదు. ఫలితంగా 2019 ఎన్నికల్లో ప్రజలు గట్టిగానే బుద్ధి చెప్పారు. ఇప్పుడు మళ్లీ ఓటర్లను మభ్యపెట్టి గెలిచేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో గతంలో ఆయన ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన అరాచకాలను సెంట్రల్ నియోజకవర్గ ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు.

- 2014–19 మధ్య బెజవాడ సెంట్రల్ ఎమ్మెల్యేగా ఉన్న బొండా ఉమా ఏకంగా ఓ అవినీతి సామ్రాజ్యాన్నే నిర్మించారు. నియోజకవర్గం మొత్తాన్ని కనుసైగతో శాసించారు. భూకబ్జాలు, దందాలు, దౌర్జన్యాలతో పేట్రేగిపోయారు. అధికార యంత్రాంగం కూడా ఆయన అవినీతి దందాకు వంతపాడింది. నియోజకవర్గ వ్యాప్తంగా రూ.వందల కోట్లు విలువైన భూమిని బొండా కబ్జా చేశారు. సెటిల్‌మెంట్లతోపాటు ప్రభుత్వంలో జరగాల్సిన పనులకు కూడా కప్పం వసూలు చేశారు. ప్రజల నుంచి రూ.వందల కోట్లు కొల్లగొట్టారు.
- కాల్‌మనీ, సెక్స్ రాకెట్ వ్యవహారాల్లో బొండాపై అనేక ఆరోపణలు వచ్చాయి. కాల్‌మనీ కింగ్‌గా ఉమా పేరొందారు. ఎందరో బాధితులు బొండా కబంధ హస్తాల్లో చిక్కుకుని విలవిల్లాడారు.
- సత్యనారాయణపురంలోని భువనేశ్వరి పీఠానికి చెందిన సీతారామ కల్యాణ మండప కబ్జాకు బొండా వర్గీయులు యత్నించారు.
- న్యూ రాజరాజేశ్వరిపేటలోని అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా ఉన్న స్వాతంత్య్ర సమరయోధులకు సంబంధించిన స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించి బొండా భంగపడ్డారు.
- రామకృష్ణాపురం బుడమేరులో బొండా ఉమా అనుచరులు, టీడీపీ డివిజన్ అధ్యక్షుడు కలిసి వెంచర్ వేసి విక్రయించారు. స్థానిక టీడీపీ నేతలు కూడా బుడమేరు లోపలకు ఇళ్లు నిర్మించి విక్రయించారు.
- ముత్యాలంపాడులో ఇరిగేషన్ స్థలాన్ని టీడీపీ నేత కుమారుడి వ్యాయామశాలకు ధారాదత్తం చేశారు.
- అప్పటి 44వ డివిజన్ కార్పొరేటర్ రైల్వే, ప్రభుత్వ స్థలాలనూ విక్రయించారు.
- విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన రూ.30 కోట్లు భూదందాలో కూడా మాగంటి బాబు కీలక పాత్రధారి. ఈ వ్యవహారాన్ని అక్కడి ప్రజలు ఇప్పటికీ మరచిపోలేదు.
- కండ్రిక కాలనీలో జర్నలిస్టుల ఇళ్ల పేరిట ఎమ్మెల్యే అతని అనుచరులు కార్పొరేషన్‌కు చెందిన 1,720 గజాల స్థలాన్ని ఆక్రమించి, నిర్మాణాలు చేసేందుకు ప్రయత్నించారు. స్థానికుల ఆందోళనతో వెనక్కి తగ్గారు.
- పాయకాపురం బర్మాకాలనీ ప్రాంతంలో మూడు ఎకరాల వరకూ ఉన్న కాలనీ కామన్ సైట్‌ను తన అనుచరులతో ఆక్రమించి, వాటి కి ఇంటి పట్టాలను సృష్టించేందుకు తెగబడ్డారు. స్థానికులు అడ్డం తిరగడంతో తోకముడిచారు.

దుర్గాపురంలోని ఓ అపార్ట్‌మెంటులో క్యాన్సర్ బాధితురాలు మాదంశెట్టి సాయిశ్రీకి చెందిన ఫ్లాట్‌ను బొండా అనుచరులు కబ్జాకు యత్నించారు. ఆమె తన వైద్యం కోసం ఆ ఫ్లాట్ విక్రయానికి యత్నించగా జాలి లేకుండా బొండా అడ్డుకున్నారు. చివరకు వైద్యం అందక సాయిశ్రీ మరణించారు.

తెనాలికి చెందిన రౌడీషీటర్ సుబ్బుతో బొండాకు సత్సంబంధాలున్నాయి. సుబ్బు హైదరాబాద్‌లో తుపాకీ కొనుగోలు చేస్తూ పట్టుబడి బొండా, మరికొందరి టీడీపీ నేతల పేర్లు బయటపెట్టాడు. ఆ తర్వాత విజయవాడలోని మాచవరంలో పట్టపగలే సుబ్బు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ కేసులో అధికార పార్టీ నేతల పేర్లు బయటకు రాకుండా పాత కక్షల నేపథ్యంలో హత్య జరిగినట్లు కేసును తారుమారు చేశారు.

బొండా ఉమాకు మాగంటి బాబు అత్యంత సన్నిహితుడు. అప్పట్లో స్వాతంత్య్ర సమరయోధుడి భూమిని తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో బొండా ఉమా భార్య సుజాతతోపాటు మాగంటి బాబు కూడా ఉన్నారు. బొండా ఉమా అక్రమ దందాలన్నింటిలో మాగంటి బాబు కీలకంగా వ్యవహరించారనేది బహిరంగ రహస్యం.

కొడుకులదీ అదే తీరు

బొండా కుమారులు ఇద్దరూ దౌర్జన్యాలు చేయడంలో ఘనులే. బొండా కుమారుడు నిర్వహించిన కారు రేస్‌లో మనోరమ హోటల్‌లో పనిచేసే మేనేజర్ కుమారుడు మరణించాడు. అప్పట్లో ఈ విషయం సంచలనం సృష్టించింది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని కుక్క అడ్డురావడంతో కారు ప్రమాదం జరిగిందని కేసును తప్పుదారి పట్టించారు.

అకృత్యాలెన్నున్నా కేసులు మూడే..

బొండా ఉమా మూడు కేసుల్లో నిందితుడిగా ఉన్నారు. 2011 మార్చి1న సెక్షన్ 9, 9ఏఏ ఆఫ్ సెంట్రల్ ఎక్సైజ్ యాక్ట్ ప్రకారం బొండాపై కేసు నమోదైంది. కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో ఎఫ్ఐఆర్ నంబర్ 462/2006పై సెక్షన్ 143 కేసు ఉంది. విజయవాడ 2వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో సెక్షన్ 143 కింద కేసు ఉన్నట్టు బొండా అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

గీతాంజలి కేసులో బొండా అనుచరుడి అరెస్ట్

ఇటీవల తెనాలికి చెందిన వివాహిత గీతాంజలి ఆత్మహత్య కేసులో బొండా అనుచరుడు పసుమర్తి రాంబాబు అరెస్టయ్యాడు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ప్రశంసించిన గీతాంజలి వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాంబాబు ఆమెను అసభ్య పదజాలంతో దూషిస్తూ కామెంట్లు పెట్టాడు. అతడితో పాటు టీడీపీ కార్యకర్తల అనుచిత వ్యాఖ్యలకు మనస్తాపానికి గురైన గీతాంజలి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

కళసాకారం..

ప్రభుత్వ బడులకు పండుగొచ్చింది. స్కూళ్లు పిల్లలతో కళకళలాడుతున్నాయి. ఐదేళ్ల క్రితం ఎవరూ కలలో కూడా ఊహించనిదీ విప్లవాత్మక మార్పు.మార్పులో మేము సైతం అంటూ పాలుపంచుకుంది హైదరాబాద్ కు చెందిన యువ ఆర్టిస్ట్ విజయ్,స్వాతి జంట. పిల్లల నవ్వులతో మమేకమైంది.. బడి ప్రాంగణాలే కాన్వాసుగా వారి ఆటపాటలే కుంచెలుగా మలచి వర్ణచిత్రాలను 'రంగ'రించింది. పాఠశాలకు జీవం ఉట్టిపడే చిత్రాలతో కొత్త కళ తెచ్చింది. ఆ యువ ఆర్టిస్టు జంటతో 'సాక్షి' ముచ్చటించింది. వారి మాటల్లోనే..

అలా మొదలైంది: మేం ఇద్దరం ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నాం వాటితో అనుబంధం ఉంది. గత 2017లో ఒక ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకుని మాకు చేతనైన విధంగా రంగులద్దాం. ఆ సమయంలో ఎవరైనా చొరవ తీసుకుని అన్ని స్కూళ్లకు ఇలాగే రంగులద్దితే ఎంత బావుండో అనుకున్నాం. పూజారి కోరిందీ దేవుడు ఇచ్చిందీ ఒకటే అన్నట్టు ఆంధ్రప్రదేశ్ స్కూల్‌లో లార్జ్‌స్కేల్ ఆర్ట్ వర్క్స్ కోసం మమ్మల్ని చింతూరు ఐటీడీఏ పీవో అప్రోచ్ అయ్యారు. అలా 2020లో జులై నెలలో నాడు-నేడు కోసం మా వర్క్ స్టార్ట్ అయింది. అది కేవలం మా బొమ్మల వరకే కాదనీ, మొత్తం పాఠశాలల రూపు రేఖలే మార్చే కార్యక్రమం అనీ తెలిశాక మా ఆనందం రెట్టింపయింది. మా కల నిజం అవుతోందని సంబరపడ్డాం. ఆర్ట్ వర్క్ కోసం రోజుల తరబడి ఆయా స్కూళ్లలో గడిపాం. పిల్లలు చదువుకుంటున్నప్పుడు, ఆడుకుంటున్నప్పుడు.. హ్యాపీగా ఫీలైన జాయ్ మూమెంట్స్‌ని క్యాప్చర్ చేసి వాటినే ఆర్ట్ వర్క్స్‌గా మలిచాం. తద్వారా పిల్లలు మరింతగా వాటితో కనెక్ట్ అయ్యారు. వాళ్లని వాళ్లు 30–30 స్కేల్ ఆర్ట్ వర్క్‌లో చూసుకుని థ్రిల్ అయ్యేవారు. పదే పదే చూసుకోవడం, పేరెంట్స్‌కి, ఫ్రెండ్స్‌కీ చూపించే సమయంలో వాళ్ల ముఖంలో సంతోషం అమూల్యం. మాటల్లో వర్ణించలేం. అలా హెడ్ మాస్టర్, టీచర్లు, స్టాఫ్.. మా స్కూల్‌కు బెస్ట్ ఆర్ట్ వర్క్ చేయండి అంటూ అడిగి మరీ చేయించుకున్నారు. చాలా వరకూ ట్రైబల్ ఏరియా స్కూల్స్‌లో చేశాం. ప్రతీ స్కూల్‌లో వర్క్ ముగించుకుని వచ్చేటప్పుడు చుట్టాలను వదిలి వెళ్తున్న ఫీలింగ్ కలిగింది. ప్రభుత్వ పాఠశాలల పునర్వైభవ విజయంలో మాకు కూడా చిన్న పాత్ర ఉండడం జీవితంలో మేం మర్చిపోలేని మధుర జ్ఞాపకం.

– సత్యార్థ్







నాడు అలా..

ఇకపై ఎవరైనా ప్రభుత్వ పాఠశాలల గురించి మాట్లాడాలంటే నాడు-నేడుకు ముందు, ఆ తర్వాత అని విభజించి మాట్లాడాల్సిందే. సర్కారు బడులంటే టాయిలెట్స్ కనిపించవు, పైనా కిందా గచ్చు పెచ్చులూడుతూ ఉంటుంది. వానపడితే పుస్తకాలు బల్లల కింద దాచుకోవాలి. ఫ్యాన్లు శబ్దాలు చేస్తాయి తప్ప తిరగవు. బాగా పాఠాలు చెప్పే టీచర్లు కరువు. ప్రాంగణం పందులు, పశువులకు ఆలవాలం. అందువల్లే పిల్లలను చేర్చలేని దుస్థితి.

నేడు ఇలా..

బెస్ట్ బెంచీలు, గ్రీన్ బోర్డ్స్, ఫ్లోరింగ్, ఫ్యాన్స్, టాయిలెట్స్, క్రీడా పరికరాలతో సహా ప్లే గ్రౌండ్, పుస్తకాలు, బ్యాగ్స్, ట్యాబ్స్.. పూటకో మెనూతో మధ్యాహ్న భోజనం.. ఇలా కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా చక్కటి వసతులు సమకూరాయి. పిల్లలు, టీచర్లలో నవోత్సాహం కనిపిస్తోంది. ఇప్పుడు ఏ మాత్రం అవకాశం ఉన్నా ప్రభుత్వ పాఠశాలల్లోనే జాయిన్ చేయాలి అనే పరిస్థితి వచ్చింది.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
ఆదివారం ॥ 14-4-2024

వైరల్



ధైర్యమే వజ్రాయుధమై

సీమా పాటిల్ అంటే సంతోషాల సరిగమ. ఆనందాల చిరునామా. జెరోదా సీయివో నితిన్ కామత్ భార్య సీమా పాటిల్ సంతోషాన్ని మాయం చేసే రోజు ఒకటి వచ్చింది. రెగ్యులర్‌గా ఫుల్-బాడీ హెల్త్ చెకప్‌లు చేసుకునే సీమాకు బ్రెస్ట్ క్యాన్సర్ అనే విషయం ఆ రోజు తెలిసింది. ఈ సమయంలో చికిత్సతో పాటు తప్పనిసరిగా కావాల్సింది ధైర్యం. అయితే మొదట్లో కాస్త తడబడినా, ఆ తర్వాత మాత్రం ధైర్యం ఎప్పుడూ గుండె జారిపోకుండా జాగ్రత్త పడింది సీమ.

'కీమోథెరపీ సమయంలో చాలా బాధను అనుభవించాను. దీనికంటే చావు నయం అనిపించింది. ఆ తరువాత బాధను పక్కకు నెట్టి ధైర్యం తెచ్చుకున్నాను. ఆ ధైర్యమే నేను తొందరగా రికవరీ అయ్యేలా చేసింది. బలమైన ఔషధంలా పని చేసింది. జీవితం అనేది చాలా చిన్నది అనే సత్యం బోధ పడింది. ఈ నేపథ్యంలో నాకు నచ్చే విషయాలపై మరింతగా పనిచేయాలనుకున్నాను. ఏదైనా సాధించాలనుకున్నాను' అంటుంది సీమ.

సీమ రికవరీని దృష్టిలో పెట్టుకొని... 'సీమ హ్యాజ్ బౌన్స్‌డ్ బ్యాక్ ఇన్ జస్ట్ టెన్‌మంత్స్' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు సీమ భర్త నితిన్ కామత్.

'ఇన్వెస్ట్‌మెంట్ అనేది స్టాక్‌మార్కెట్‌లోనే కాదు హెల్త్‌కేర్ విషయంలోనూ అవసరం' అంటాడు కామత్.

క్యాన్సర్‌తో తాను చేసిన పోరాటాన్ని పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూలో పంచుకుంది సీమా పాటిల్. ఆమె చెప్పిన విషయాలు సోషల్ మీడియా దృష్టిని ఆకర్షించాయి.

డాన్స్ చేసింది టైటిల్ వెనక్కి వెళ్లింది



డ్యాన్స్ చేస్తే ఏమొస్తుంది? సంతోషం వస్తుంది. ఇంకా చెప్పాలంటే ఆయాసం కూడా వస్తుంది. మలేషియన్ బ్యూటీ క్వీన్ వీరూ నికా టెరిన్సిప్‌ను అడిగి చూడండి. 'అందాల కిరీటం హుష్ కాకి అవుతుంది' అని చెబుతుంది. గత సంవత్సరం మలేషియాలో జరిగిన అందాల పోటీలో వీరూ నికా విజేత.

అయితే తాజా వైరల్ వీడియో ఒకటి ఆమె కొంప ముంచింది.

కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి వీరూ నికా థాయిలాండ్ హాలిడే ట్రిప్‌కు వెళ్లింది. వీరూ నికా హాలిడే డ్యాన్సింగ్ వీడియో వైరల్ కావడమే కాదు వివాదాస్పదం అయింది. 'డ్యాన్స్ అభ్యంతరకరంగా ఉంది. వీరూ నికా తన టైటిల్‌ను వెనక్కి ఇవ్వాలి' అని కేడీసీఏ కల్చరల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జోసెఫ్ డిమాండ్ చేశాడు. టైటిల్ వెనక్కి ఇవ్వడానికి వినమ్రంగా ఒప్పుకుంది వీరూ నికా.

'ప్రతి ఒక్కరూ తప్పులు చేస్తారు' అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. వీరూ నికా వీడియోపై నెట్ లోకంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

'ఈ వీడియోకు ఇంత రాద్ధాంతమా' అని బ్యూటీక్వీన్‌ను సమర్థించిన వాళ్లతోపాటు... 'ఒక స్థాయికి చేరిన తరువాత హుందాగా ఉండాలి. ఇదేమిటీ!' అని విమర్శించిన వాళ్లు ఉన్నారు.



ఎందెందు వెదికినా కరివేపాక్ కలదు

'కరివేపాకులా తీసేయకు' అని అంటాంగానీ 'కరివేపాక్ మైసూర్‌పాక్ కంటే మహాగ్రేట్ సుమీ' అంటుంది సోషల్ మీడియా ఫేమ్ కుశల కపిల. ఫ్యాషన్ ఎడిటర్, ఎంటర్‌టైన్‌మెంట్ రైటర్, కామెడీ కంటెంట్ క్రియేటర్‌గా ప్రతిభ చాటుకున్న కుశల తాజాగా కరివేపాకుపై దృష్టి పెట్టింది. 'ఇందు గలదు. అందు లేదు అనే సందేహం వలదు' టైప్‌లో కపిల కరివేపాకు గురించి ఇన్‌స్టాగ్రామ్ 'రీల్' చేసింది. ఈ రీల్ 8 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకోవడమే కాదు 'కడి పత్త' ట్రెండ్‌గా వైరల్ అయింది.

కాల్చిన మునక్కాయల కూర

మునక్కాయలను ఇష్టపడని వారు ముల్లోకాల్లో వెదికినా దొరకరు. సాంబారులో ఎన్ని కూరగాయలు వేసినా మునగ వేస్తేనే గౌరవం. మునగను రకరకాలుగా వండటం చూశాం. కాని పల్లె వంటల్లో ప్రసిద్ధం అయిన ఈశ్వరి అవ్వ మునక్కాయలను కాల్చి చేసిన కూరను అందరూ నోరెళ్లబెట్టి చూస్తున్నారు. పొగడ్తలతో ఆమెను ముంచెత్తుతున్నారు.





తమిళనాడుకు చెందిన ఈశ్వరి అవ్వకు 'కంట్రీ ఫుడ్ కుకింగ్' అనే యూట్యూబ్ చానల్ ఉంది. సబ్‌స్క్రయిబర్స్ ఎంతమందో తెలుసా? పది లక్షల మంది. తమిళనాడు గ్రామీణ వంటలను ప్రయోగ వంటలను అద్భుతంగా చేయడంతో ఈశ్వరి అవ్వకు విపరీతంగా ఫ్యాన్స్ ఉన్నారు. పచ్చి బొప్పాయి పచ్చడి, ఆరిటాకుల హల్వా ఇలాంటి వాటితో పాటు నల్ల మాంసం కూర, అరటికాయతో వెజ్ ఫిష్ ఫ్రై లాంటివి నోరూరిస్తాయి. తాజాగా అవ్వ కాల్చిన మునక్కాయల కూర చేసి నెటిజన్ల మెచ్చుకోలు పొందింది. మునక్కాడలను మంట మీద కాల్చి వాటిని కడిగి, చీరి, లోపల గుజ్జును వొలిచి పక్కన పెట్టుకుందామె. తర్వాత చట్టిలో నూనె పోసి జిలుకర, వెల్లుల్లి, టొమాటో, ఉల్లిపాయలు, పసుపు, కారం, పచ్చిమిర్చి వేసి, ఆఖరున మునగగుజ్జును వేసి దోరగా వేయిస్తే మంచి ఫ్రై కూరలా తయారయ్యింది. దానిని తెల్లన్నంతో తింటూ మనకు వీడియో కనిపిస్తుంది అవ్వ. ఈ రెసిపీని చూసి నెటిజన్లు చాలా కొత్తగా ఉందంటున్నారు. మేమూ ట్రై చేస్తామని బజారుకు మునక్కాయల కోసం వెళుతున్నారు.

చల్లచల్లని కూల్ కూల్

ఈ వేసవిలో ఆకాశానికి ఏసీ బిగిస్తే? మనం నడుస్తూ ఉంటే గాలి గొడుగు పడితే? కూర్చున్న చోటు చల్లని మందిరంగా మారితే? అసలు వేసవి మొత్తం కూల్ కూల్‌గా అనిపిస్తే? నిజంగా ఎలాగూ జరగదు. ఘోరమైన ఎండల్లో మాడక తప్పదు. అందుకే ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను అడిగి ఇలాంటి ఊహలు చేసి ఆనందిస్తున్నారు జనం.





మార్తాండుడి ముందు ఎవరైనా మోకరిల్లాల్సిందే ఎండాకాలంలో. వట్టి వేర్లు కిటికీలకు కట్టుకునేవారు, కూల్ పెయింట్ చేయించుకునేవారు, గోతాం పట్టాలు కట్టుకుని నీళ్లు చల్లుకునేవారు, ఏసీలు కొనుక్కునేవారు, కూలర్లు రిపేర్లు చేయించుకునేవారు, కొబ్బరి మట్టలతో పందిరి వేసుకునేవారు... చల్లదనం కోసం ఎన్నో మార్గాలు. అయితే మన నెత్తి మీదే ఎప్పుడూ ఫ్యాన్ ఉండాలని, మనం ఎక్కడ కూచున్నా జిల్లు మనాలని అత్యాశ కూడా ఉండొచ్చు. 'ఇలాంటి ఆశలు మాకున్నాయి. అవి తీరినట్టుగా ఫొటోలు చేసి చూపించు' అని ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను అడిగితే అది తయారు చేసిన ఫొటోలు నెట్‌లో వైరల్ అయ్యాయి. నెత్తి మీద ఐసు గడ్డల హెల్మెట్ ఉన్న అవ్వ, ఐసు బల్ల మీద కూచుని టూరిస్టులు, ఐసు స్కూటర్ మీద రివ్వున దూసుకెళ్లే అమ్మాయి, ఒళ్లంతా ఫ్యాన్లు మొలిచిన గరీబు... ఇవన్నీ ఏ.ఐ చూపించి ఐసు వాటర్ తాగిన ఫీలింగ్ కలిగించింది.

కొరియన్ ఖవ్వాలీ... వహ్వా వహ్వా



పాపులర్ 'కె-పాప్' మనకు సుపరిచితం. మరి 'కె-ఖవ్వాలి అంటే?' అని అడిగితే 'అదేమిటీ!' అని మిక్కిలి ఆశ్చర్యపోయేవారితో పాటు 'ఎక్కడి ఖవ్వాలీ? ఎక్కడి కొరియా' అని దూరాభారాలను కూడా లెక్కవేసే వాళ్లు ఉంటారు. 'కొరియన్ సింగర్స్ సింగింగ్ ఖవ్వాలి' ట్యాగ్‌లైన్‌తో పోస్ట్ చేసిన ఈ 'కె-ఖవ్వాలి' వీడియో వైరల్ అయింది. కల్చరల్ ఎక్స్చేంజ్‌కు అద్దం పట్టే ఈ వీడియోలో కొరియన్ గాయకులు సంప్రదాయక ఖవ్వాలి మెలోడీలను అద్భుతంగా ఆలపించే దృశ్యం, హార్మోని సుమధుర శబ్దం నెటిజనుల చేత 'వహ్వా వహ్వా' అనిపిస్తోంది. 'బ్యూటీఫుల్ కల్చరల్ ఎక్స్చేంజ్'లాంటి ప్రశంసలు కామెంట్ సెక్షన్‌లో కనిపించాయి.

ఈ రెస్టారెంట్‌లో... పప్పులో కాలు వేయించబడును

పప్పులో కాలువేయడానికి అని ప్రత్యేకంగా పనిగట్టుకొని ఎవరూ రెస్టారెంట్‌కు వెళ్లరు. అయితే ఈ రెస్టారెంట్‌కి వెళ్లిన వారు మాత్రం పప్పులో కాలువేయకుండా ఉండడం శానా కష్టం!

సర్వింగ్ నుంచి ఫుడ్ ప్రిపరేషన్ వరకు ప్రపంచ వ్యాప్తంగా ఫుడ్ సర్వీస్ ఇండస్ట్రీలో హ్యూమనాయిడ్ రోబోట్‌లను ఉపయోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో చైనాలోని చోంగ్‌కింగ్ రెస్టారెంట్‌లో అందమైన రోబోటిక్ వెయిట్రెస్ కనిపించడం పెద్ద ఆశ్చర్యమేమీ కాదు.

ఈ వెయిట్రెస్ కస్టమర్‌లకు అందిస్తున్న సేవలను చూస్తూ....'అచ్చం అమ్మాయిలాగే ఉంది. టెక్నాలజీలో మనం ఎక్కడికో వెళ్లిపోయాం' అని కొందరు నెటిజనులు అదేపనిగా ఆకాశానికెత్తారు.

'గమనిక... మీరు పప్పులో కాలేశారు' అని ఆకాశవాణి వినిపించిందో లేదో గానీ ఈ వీడియోలో ఉన్నది 'రోబోటిక్ వెయిట్రెస్ కాదు అచ్చంగా అమ్మాయే' అనే అసలు నిజం బయటికి రావడానికి ఎంతో టైమ్ పట్టలేదు.



ఈ వెయిట్రెస్ 'ఆర్ట్ ఆఫ్ రోబోటిక్స్ మూవ్స్'లో మాస్టర్స్ చేసింది. రోబోటిక్-లైక్ మూమెంట్స్‌ను ఔపాసన పట్టింది. తన గొంతును ఏఐ వాయిస్‌గా మలుచుకోవడంలో ప్రావీణ్యం సాధించింది. తాను ప్రొఫెషనల్ డ్యాన్సర్ కూడా. మరో ఆశ్చర్యకరమైన విషయం ఈ అమ్మడు వెయిట్రెస్ కాదు రెస్టారెంట్ ఓనర్!

రోబోటిక్ డ్యాన్స్ మూవ్‌తో కస్టమర్‌లకు సర్వ్ చేస్తున్న ఈ రెస్టారెంట్ ఓనర్ వీడియో వైరల్ సెన్సేషన్‌గా మారింది.

హెల్త్



వయసు పెరుగుతున్నకొద్దీ వెంట్రుకలు తెల్లబడుతుంటే రంగు వేస్తాం. కానీ మార్పులకు లోనయ్యే చర్మాన్ని ఏం చేయగలం? ఎవరెంత రంగు వేసినప్పటికీ... చర్మం తీరును బట్టే ఎదుటివారి వయసును అంచనా వేస్తుంటారు. వయసు పెరుగుతున్న కొద్దీ చర్మానికి కొన్ని రకాల వ్యాధులు లేదా ఆరోగ్య సమస్యలు వస్తాయి. ఉదాహరణకు... చర్మాన్ని పొడిబార్చే జీరోసిస్ మొదలుకొని చర్మం కింద రక్తం పేరుకున్నట్లు కనిపించే పర్‌ప్యూరా వరకు అనేక సమస్యలు వచ్చే అవకాశాలుంటాయి. అవేమిటో, వాటి నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలు / నిర్వహణ పద్ధతులూ, చికిత్సలను తెలుసుకుంటే... పరుగులు తీసే వయసుకు స్పీడ్‌కు బ్రేకులు వేసి, యూత్‌ఫుల్‌గా కనిపించేందుకు తోడ్పడే కథనమిది.

పెరిగే వయసుతో వచ్చే కొన్ని చర్మ సమస్యలు!

చర్మంలో ప్రధానంగా మూడు పొరలు ఉంటాయి. బయటిపొరను ఎపిడెర్మిస్, మధ్యపొరను డెర్మిస్, దాని కింద సబ్‌క్యుటేనియస్ పొర అంటారు. వయసు పెరుగుతున్న కొద్దీ... ఎపిడెర్మిస్ పొర పలుచబారడం మొదలవుతుంది. ఈ పొరలోనే ఉంటూ మేనికి రంగునిచ్చే మెలనోసైట్స్ ఉత్పత్తి తగ్గడం మొదలవుతుంది. అందుకే వృద్ధుల చర్మం పారదర్శకంగా ఉండి, లోపలి రక్తనాళాలు కనిపిస్తూ ఉంటాయి. వయసు పెరుగుతున్నకొద్దీ చర్మం పాలిపోయినట్లుగా అవుతుంది. ఇక డెర్మిస్ పొరలో చర్మాన్ని బిగుతుగా ఉంచే కొలాజెన్, ఎలాస్టిన్ అనే కణజాలాలు ఉంటాయి. వీటివల్లనే చర్మం బిగుతుగా ఉంటుంది. ఈ బిగువు తగ్గడం వల్లనే వయసు పెరుగుతున్నకొద్దీ చర్మం సాగి, వదులవుతుంది. డర్మిస్‌లోని రక్తనాళాలూ బలహీనమవుతాయి. అందుకే వయసు పైబడినవారిలో చిన్న దెబ్బకైనా వెంటనే రక్తస్రావం అవుతుంది. ఇక సబ్‌క్యుటేనియస్ పొరలో కొవ్వు ఉంటుంది. వయసు పెరుగుతున్న కొద్దీ ఈ కొవ్వు తగ్గిపోవడం వల్ల చర్మం మునుపటిలా కాకుండా పలచబారిపోతుంది. ఈ పొరలోనే చెమట గ్రంథులు, నూనెలాంటి పదార్థాన్ని స్రవించే సెబేషియస్ గ్రంథులు ఉంటాయి. వయసు పెరుగుతున్న కొద్దీ ఈ గ్రంథుల పనితీరు తగ్గుతూ పోయి చర్మం పొడిబారినట్లుగా అవుతుంది. నునుపుదనాన్ని కోల్పోతుంది. వెరసి... ఈ సమస్యలన్నింటి వల్ల చర్మం పటుత్వాన్ని కోల్పోయి వేలాడుతున్నట్లుగా అవడంతోపాటు ముడతలు కూడా పడుతుంది.

వయసు పెరగడం వల్ల వచ్చే సమస్యలు...

- **జీరోసిస్ లేదా ఏస్టియోటిక్ డర్మటైటిస్:** దీన్నే వాడుకలో చర్మం పొడిబారిపోవడం అంటారు. ఈ సమస్య ముందుగా మోకాలి కింద భాగంలో ఉన్న చర్మంలో ఎక్కువగా కనిపిస్తుంది. ఆ తర్వాత దుస్తులు కప్పని ఇతర భాగాల్లోనూ కనిపిస్తుంది.
- **ఏజ్ స్పాట్స్ లేదా లివర్ స్పాట్స్:** చర్మానికి రంగును ఇచ్చే మెలనోసైట్స్ తగ్గడం వల్ల చర్మం పాలిపోయినట్లు అవుతుంది. ఆ తర్వాత నల్లటి మచ్చలు వస్తాయి. వాటిని ఏజ్ స్పాట్స్ లేదా లివర్‌స్పాట్స్ లేదా లెంటిజీన్స్ అంటారు. చర్మానికి బాగా ఎండ తగిలే ప్రదేశాలలో ఇవి ఎక్కువగా వస్తాయి.
- **చెర్రీ యాంజియోమాస్:** ఈ సమస్య ఉన్నవారిలో కొద్దిపాటి రాపిడికే రక్తనాళాలు చిట్లే ప్రమాదం ఉండడంతో పాటు చర్మంపై నుంచి రక్తనాళాలు ఎరుపు రంగులో పైకి కనిపిస్తూ ఉంటాయి. వాటిని 'చెర్రీ యాంజియోమాస్' అంటారు.
- **సెబోరిక్ కెరటోసిస్:** చర్మంపై ముఖ్యంగా చేతుల మీద, ముఖంపైన కందిగింజ సైజులో సెబోరిక్ కెరటోసిస్ అనే గోధుమరంగు మచ్చలు వస్తాయి.
- **స్కిన్ ట్యాగ్స్ లేదా యాక్రోకార్డాన్స్:** చర్మం వదులుగా.. ముడత పడినట్లుగా అయి... అదనపు చర్మంలా పొడుచుకు వచ్చి, పులిపిర్లలా కనిపిస్తాయి. ఇవి ఎక్కువగా మెడమీద, బాహుమూలాల వద్ద, తొడలపైన కనిపిస్తాయి.
- **పర్‌ప్యూరా అండ్ హిమటోమాస్:** చర్మం కింద ఉన్న రక్తనాళాలు పెళుసుబారి సులువుగా చిట్లుతాయి. దాంతో అక్కడ రక్తం చేరినట్లుగా కనిపిస్తుంది. దాన్ని సినైల్ పర్‌ప్యూరా అంటారు. ఒకవేళ రక్తం పేరుకుపోయి, చర్మం ఉబ్బుగా కనిపిస్తే దాన్ని హిమటోమా అంటారు.
- **ఎయిర్ బార్న్ కాంటాక్ట్ డర్మటైటిస్:** వయసు పైబడిన వారిలో చర్మానికి చాలా తేలికగా అలర్జీలు వస్తుంటాయి. పరిసరాల్లో ఉండే మొక్కల కారణంగా చర్మంపై అలర్జీలు వస్తే దాన్ని ఎయిర్ బార్న్ కాంటాక్ట్ డర్మటైటిస్ అని అంటారు.
- **కెరటో అకాంథోమా:** వయసు పైబడుతున్న వారిలో, ఎండలో ఎక్కువగా తిరిగే కొందరిలో కాయల్లా కనిపించే వాటిని నాన్ క్యాన్సరస్ స్కిన్ గ్రోత్స్‌గా చెబుతారు. అవి చాలా పెద్దగా, చుట్టూ ఎత్తుగా... మధ్యలో కొద్దిగా గుంటలా ఉంటాయి.

మరికొన్ని తీవ్ర సమస్యలు

వయసు పెరుగుతున్న కొద్దీ చర్మానికీ క్యాన్సర్ వచ్చే అవకాశం పెరుగుతుంది. వయసు మళ్లిన వారిలో బేసల్ సెల్ ఎపిథిలియోమా, స్క్వేమస్ సెల్ కార్సినోమా, మెలనోమా వంటి చర్మ క్యాన్సర్స్ కనిపించవచ్చు.

ఇన్ఫెక్షన్‌లు: వయసు పైబడుతున్న వారి చర్మం తేలిగ్గా ఇన్ఫెక్షన్స్‌కు గురవుతుంది. బాక్టీరియా వల్ల – ఫాలిక్యులైటిస్, సెల్యులైటిస్; ఫంగస్ వల్ల – క్యాండిడియాసిస్, డెర్మటోఫైట్ ఇన్ఫెక్షన్స్; వైరస్ వల్ల – జోస్టర్ వంటివి సోకుతాయి.

సోరియాసిస్: పెరిగే వయసుతో సోరియాసిస్ అనే చర్మ వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువ. మొదట పొడిగానూ ఆ తర్వాత వెండిరంగు పొట్టు రాలుతున్న లక్షణాలు కనిపిస్తాయి.

న్యూరోడర్మటైటిస్: ఇందులో ప్రధానంగా పాదాల మీద నల్లటి మచ్చలా వచ్చి, చాలా దురదగా ఉంటుంది.

జాగ్రత్తలు...

వయసు పైబడుతున్న వారు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే చాలాకాలం పాటు చర్మాన్ని సంరక్షించుకోవడమే కాదు... యూత్‌ఫుల్‌గా కనిపించేలా కూడా చూసుకోవచ్చు. అందుకోసం చేయాల్సినవి... ● చర్మం పొడిబారకుండా మాయిశ్చరైజర్లు వాడాలి. ● బాగా గాఢంగా ఉండి, ఎక్కువ సువాసనలు వెదజల్లే సబ్బులు వాడకూడదు. ● బాత్ ఆయిల్స్‌ను దూరం పెట్టాలి. ● పొగ తాగడం మానేయాలి. ● ఎండలోకి వెళ్లేటప్పుడు సన్‌స్క్రీన్ లోషన్స్ ఉపయోగించాలి. ● సౌకర్యంగా ఉండే దుస్తులు ధరించాలి. ● సమతులాహారం, ద్రవపదార్థాలు తీసుకోవాలి. ● గోరు వెచ్చటి నీటితోనే స్నానం చేయాలి. ● ఇన్ఫెక్షన్స్ వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చికిత్స తీసుకోవాలి.

ఆహారం: చర్మంపై వయసు ప్రభావం కనపడనివ్వకుండా చేసే యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ ఇ సమృద్ధిగా ఉండే ఆకు కూరలు, పండ్లతోబాటు బాదం, పిస్తా వంటి డ్రై ఫ్రూట్స్ తీసుకుంటూ ఉండాలి.

చికిత్స.. సమస్యను బట్టి చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది.



డా. ఎస్. సుష్మా సుకృతి
కన్సల్టెంట్ డర్మటాలజిస్ట్.

చిన్నారులు తగినంత బరువు పెరుగుతున్నారా?

మన దేశంలో అప్పుడే పుట్టిన ఆరోగ్యకరమైన పిల్లలు రెండున్నర కిలోల నుంచి 3 కిలోల వరకు బరువుంటారు. పిల్లల బరువు అనేక అంశాల మీద ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు... తల్లిదండ్రుల జీన్స్, తల్లి ఆహారపు అలవాట్లు, గర్భవతిగా ఉన్నప్పుడు తల్లికి వచ్చిన రుగ్మతలు, తల్లి బరువు వంటి అంశాలపై పిల్లల బరువు ఆధారపడి ఉంటుంది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే... ఎక్కువ తేడా లేకుండా... ఈ బరువుకు కాస్త అటు ఇటుగా ఉన్న పిల్లలూ ఆరోగ్యంగా పుట్టినట్టే.



కొన్ని సూచనలతో చిన్నారులు ఆరోగ్యంగా బరువు పెరుగుతున్నారో లేదో తెలుసుకోవచ్చు.

పిల్లలు పుట్టాక మొదటి వారంలో- పుట్టినప్పుడు ఉన్న బరువు కంటే మొదట్లో కాస్త తగ్గుతారు. నిర్దిష్టంగా చెప్పాలంటే మొదటి వారం పదిరోజుల్లో పుట్టిన నాటి బరువులో 5 శాతం నుంచి 10 శాతం బరువు తగ్గుతారు. ఇక రెండోవారం నుంచి క్రమేణా బరువు పెరుగుతూపోతారు. మొదటి మూడు నెలల్లో దాదాపు రోజుకు 20 నుంచి 30 గ్రాములు పెరుగుతూ పోతే... మూడు నెలల నుంచి ఆరు నెలల వరకు రోజుకు 10 నుంచి 15 గ్రాముల వరకు పిల్లలు బరువు పెరుగుతారు. ఇలా చూస్తే మొదటి ఐదునెలల్లో పుట్టినప్పటికంటే రెట్టింపు (డబుల్) బరువు, ఏడాదికి మూడు రెట్లు (ట్రిపుల్) బరువు పెరగాలి. కానీ పాపలందరూ ఇలాగే పెరగాలని లేదు. కాస్త అటు ఇటుగా ఉన్నా అది ఆరోగ్యకరమైన బరువే. అయితే ఈ లెక్కకు దూరంగా ఉంటే మాత్రం తగినంత బరువు పెరగడం లేదని అర్థం చేసుకోవాలి.

తల్లి నుంచి రెండు రకాల పాలు...

బిడ్డ పాలు తాగేప్పుడు తల్లి నుంచి రెండు రకాల పాలు వస్తాయి. మొదట వచ్చే పాలను ఫోర్ మిల్క్ అంటారు. రెండోసారి పాలను హైండ్ మిల్క్‌గా పేర్కొంటారు. అంటే ఈ హైండ్ మిల్క్ పాప కాసిన్ని పాలు తాగాక వస్తాయి. నిజానికి ఫోర్ మిల్క్ కంటే... హైండ్ మిల్క్ చాలా బలవర్ధకమైనవి. బరువు పెరగడానికి ఇవే ఎక్కువగా ఉపయోగపడతాయి. ఇక్కడ ఒక విషయం తెలుసుకోవాల్సి ఉంటుంది. ఫోర్ మిల్క్‌ను ప్రసవం కాగానే స్రవించే ముర్రుపాలతో పొరబాటు పడవద్దు. ముర్రుపాలు వేరు, ఫోర్ మిల్క్ వేరు. పుట్టగానే స్రవించే ముర్రుపాలు శిశువుకు చాలా మంచివి. రోగనిరోధకతను ఇస్తాయి. ఫోర్ మిల్క్ అంటే... పాలు పట్టడం మొదలు పెట్టగానే మొదట స్రవిస్తాయి. ఓ పది-పదిహేను గుటకల తర్వాత హైండ్ మిల్క్ స్రవిస్తాయి.

తగినంత బరువు పెరగడం లేదంటే...

- తల్లి పాలు సరిపోక పోవడం లేదా బిడ్డ సరిగా తాగకపోవడం, బిడ్డ పూర్తిగా తాగకుండా మధ్యలోనే నిద్రపోవడం, పాలు తాగకపోవడానికి కొన్నిసార్లు తల్లి వైపునుంచి, మరికొన్నిసార్లు బిడ్డ వైపు నుంచి కూడా కారణాలు ఉండవచ్చు.
- తల్లి బిడ్డకు పాలు సరిగా పట్టకపోవడం జరగవచ్చు.
- పాలు పడుతున్నప్పుడు చిన్నారి దృష్టి పాల నుంచి పక్కకు మళ్లవచ్చు.
- పాలపీక అలవాటు చేయడం వల్ల చిన్నారులు పాలు సరిగా తాగరు.
- ఎనీమియా, యూరినరీ ఇన్ఫెక్షన్స్, చెవిలో ఇన్ఫెక్షన్స్, అలర్జీల వంటి ఆరోగ్యపరమైన సమస్య ఉన్నా బరువు పెరగక పోవచ్చు.

బరువు పెరగడానికి...

● రెండు మూడు గంటలకు ఓమారు పాలు పట్టించాలి. ● ఓ రొమ్ము పట్టించాక ఆ రొమ్ము నుంచి పాలు పూర్తిగా తాగిందో లేదో నిర్ధారణ చేసుకోవాలి. ఇందుకు చేయాల్సింది... బిడ్డ పూర్తిగా పాలు తాగాక చిన్నారికి అదే రొమ్మును అందిస్తే ముఖం తిప్పుకోవడం, రొమ్ము అందుకోకపోవడం చేస్తుంది. ● ఓ రొమ్ములోని పాలు పూర్తిగా పట్టించాక రెండో రొమ్ము కూడా అందించాలి. అప్పుడు ఆ రెండో రొమ్ము పాలు తాగకపోయినా– బిడ్డ సంతృప్తిగా ఉంటే పూర్తిగా పాలు తాగినట్లే. ● బిడ్డకు పాలు సరిపోతున్నాయో లేదో తెలుసుకోడానికి రోజులో ఎన్నిసార్లు పక్క తడుపుతోందన్న అంశం కూడా ఓ సూచన. పాప పగటిపూట కనీసం నాలుగయిదుసార్లు పక్క తడుపుతుంటే... పాలు సరిపోతున్నాయని అనుకోవచ్చు.

చికిత్స ఎప్పుడంటే...

పైన పేర్కొన్న అంశాలను జాగ్రత్తగా గమనిస్తూ, పాప బరువును ప్రతివారం పరీక్షిస్తూ ఉండాలి. అప్పటికీ బిడ్డ బరువు వయసుకు తగినంతగా పెరగడం లేదంటే... ఏవైనా ఇన్ఫెక్షన్స్ ఉన్నాయేమో వైద్యపరీక్షల ద్వారా తెలుసుకుని, దానికి అనుగుణంగా చికిత్స అందించాల్సి ఉంటుంది.



డా. శివనారాయణరెడ్డి వెన్నపూస,
నియోనేటాలజిస్ట్ అండ్ పీడియాట్రిస్ట్

మెడి టిప్

క్యాన్సర్ రాకుండా...

చికిత్స కన్నా నివారణ మేలు అన్నట్లు చిన్న చిన్న జాగ్రత్తలతో క్యాన్సర్‌ను నివారించుకోవచ్చు. అదెలాగంటే... ● ఒకసారి వాడాక మిగిలిన నూనె మరోసారి వాడకూడదు. ● మాంసాహారులు కొవ్వులు ఎక్కువగా ఉండే రెడ్‌మీట్‌కు బదులు చేపలు తీసుకోవడం మేలు. ● మాంసాన్ని అత్యధిక ఉష్ణోగ్రత వద్ద ఉడికించి తయారు చేసే గ్రిల్డ్ మాంసం, వేపుళ్లకు సాధ్యమైనంత దూరంగా ఉండాలి. ఇక ఆహార పదార్థాలు ఎక్కువకాలం నిల్వ ఉంచేందుకు చేసే స్మోకింగ్ ప్రక్రియలో 'పాలీ సైక్లిక్ అరోమాటిక్ హైడ్రోకార్బన్స్' అనే క్యాన్సర్ కారకాలు ఉత్పన్నమవుతాయి. అందువల్ల ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద వండే గ్రిల్డ్ ఫుడ్, వేపుళ్ల కంటే... ఉడికించడం ద్వారా వండే పదార్థాలే మంచివి. ● ఆహారపదార్థాలు తొందరగా పాడవకుండా, చాలాకాలం నిల్వ ఉంచేందుకు ఉప్పులో ఊరబెడుతుంటారు. ఇలా ఊరిన పదార్థాలతో క్యాన్సర్ ముప్పు ఎక్కువ. అందుకే ఉప్పు మోతాదు ఎక్కువగా ఉండే ఊరగాయలు, చిప్స్, బేకరీ ఐటమ్స్, సాల్టెడ్ ఐటమ్స్ వంటి ఇతర తినుబండారాలకు దూరంగా ఉండటం మేలు.



సెమీఫైనల్లో రిత్విక్ జోడీ పరాజయం

మొరెలోస్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్–75 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మెక్సికోలో జరుగుతున్న ఈ టోర్నీ తొలి సెమీఫైనల్లో హైదరాబాద్‌కు చెందిన బొల్లిపల్లి రిత్విక్–నిక్కీ పునాచా జోడీ 4–6, 6–3, 7–10తో మత్సుజెవ్‌స్కీ (పోలాండ్)–మాథ్యూ రొమియోస్ (ఆస్ట్రేలియా) జంట చేతిలో ఓడిపోయింది. రెండో సెమీఫైనల్లో అర్జున్–జీవన్ (భారత్) ద్వయం 4–6, 7–6 (7/5), 10–8తో జాన్సన్ (బ్రిటన్)–మన్సూరి (ట్యూనిషియా) జంటపై నెగ్గి ఫైనల్ చేరింది.



జొకోవిచ్‌కు చుక్కెదురు

మోంటెకార్లో ఓపెన్ మాస్టర్స్ సిరీస్–1000 టెన్నిస్ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా) పోరాటం సెమీఫైనల్లో ముగిసింది. 2015 తర్వాత ఈ టోర్నీలో మళ్లీ సెమీఫైనల్ ఆడిన జొకోవిచ్ 4–6, 6–1, 4–6తో కాస్పర్ రూడ్ (నార్వే) చేతిలో ఓడిపోయాడు. జొకోవిచ్‌పై రూడ్‌కిదే తొలి విజయం కావడం విశేషం. గతంలో ఈ సెర్బియా స్టార్‌తో ఆడిన ఐదుసార్లూ రూడ్ ఓటమి చవిచూశాడు. మరో సెమీఫైనల్లో సిట్సిపాస్ (గ్రీస్) 6–4, 3–6, 6–4తో యానిక్ సినెర్ (ఇటలీ)పై గెలిచాడు.

రజతం నెగ్గిన రాధిక

శివాని, ప్రియాలకు కాంస్య పతకాలు



బిష్కెక్ (కిర్గిస్తాన్): ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ మహిళల ఫ్రీస్టయిల్ విభాగంలో భారత్‌కు మూడు పతకాలు లభించాయి. రాధిక (68 కేజీలు) రజత పతకం సొంతం చేసుకోగా... శివాని పవార్ (50 కేజీలు), ప్రియా (76 కేజీలు) కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. 68 కేజీల విభాగం ఫైనల్లో రాధిక 2–15తో నొనోకా ఒజాకి (జపాన్) చేతిలో ఓడిపోయింది. కాంస్య పతకాల బౌట్‌లలో శివాని 9–7తో ఒట్గాన్‌జర్గల్ డొల్గోర్‌జవ్ (మంగోలియా)పై, ప్రియా 4–2తో ఎల్మీరా సిద్దికోవా (కజకిస్తాన్)పై గెలుపొందారు. 59 కేజీల విభాగం కాంస్య పతక బౌట్‌లో భారత రెజ్లర్ పుష్పా యాదవ్ 8–11తో దయానా కయుమోవా (కజకిస్తాన్) చేతిలో ఓడిపోయారు.

ఆసియా గ్రూప్‌లోనే భారత్

చాంగ్షా (చైనా): బిల్లీ జీన్ కింగ్ కప్ మహిళల టీమ్ టెన్నిస్ టోర్నీలో భారత జట్టు వచ్చే ఏడాది కూడా ఆసియా ఓసియానియా గ్రూప్–1లోనే కొనసాగనుంది. వరల్డ్ గ్రూప్ ప్లే ఆఫ్స్ దశకు అర్హత సాధించాలంటే... తప్పనిసరిగా గెలవాల్సిన చివరి లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు 1–2తో న్యూజిలాండ్ చేతిలో ఓడిపోయింది.



తొలి మ్యాచ్‌లో రుతుజా భోస్లే 6–2, 7–6 (7/5)తో మోనిక్ బ్యారీపై నెగ్గింది. రెండో మ్యాచ్‌లో భారత నంబర్‌వన్ అంకిత రైనా 2–6, 0–6తో లులూ సన్ చేతిలో ఓడిపోయింది. నిర్ణాయక డబుల్స్ మ్యాచ్‌లో అంకిత–ప్రార్థన ద్వయం 1–6, 5–7తో పైగి హురిగాన్–ఎరిన్ రూట్లిఫ్ జోడీ చేతిలో పరాజయం పాలవ్వడంతో భారత్‌కు ఓటమి ఖరారైంది. తొలి రెండు స్థానాల్లో నిలిచిన చైనా, కొరియా ప్లే ఆఫ్స్‌కు అర్హత పొందాయి.

6,6,6,6,6,6

ఒకే ఓవర్లో 6 సిక్స్‌లు కొట్టిన నేపాల్ బ్యాటర్ దీపేంద్ర సింగ్



అల్ అమారత్ (ఒమన్): యువరాజ్ సింగ్, కీరన్ పొలార్డ్ తర్వాత అంతర్జాతీయ టి20 క్రికెట్‌లో ఒకే ఓవర్లో 6 సిక్స్‌లు కొట్టిన మూడో బ్యాటర్‌గా నేపాల్ ప్లేయర్ దీపేంద్ర సింగ్ ఘనత సాధించాడు. ఆసియా క్రికెట్ కౌన్సిల్ పురుషుల ప్రీమియర్ కప్ టి20 టోర్నీలో భాగంగా ఖతర్‌తో జరిగిన మ్యాచ్‌లో 24 ఏళ్ల దీపేంద్ర (21 బంతుల్లో 64; 3 ఫోర్లు, 7 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఖతర్ బౌలర్ కమ్రాన్ ఖాన్ వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్లో దీపేంద్ర ఆరు సిక్స్‌లు కొట్టాడు. ఈ మ్యాచ్‌లో మొదట నేపాల్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 210 పరుగులు చేసింది. ఖతర్ 9 వికెట్ల నష్టానికి 178 పరుగులకే పరిమితమైంది.

శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ జట్టుకు రెండో స్థానం

సాక్షి, హైదరాబాద్: ఐ–లీగ్ జాతీయ ఫుట్‌బాల్ లీగ్ చాంపియన్‌షిప్‌ను హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు విజయంతో ముగించింది. శనివారం ఇక్కడ జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ జట్టు 3–2 గోల్స్ తేడాతో షిల్లాంగ్ లాజోంగ్ ఎఫ్‌సీ జట్టును ఓడించింది. శ్రీనిధి జట్టు తరఫున విలియమ్ అల్వెస్ ఒలివీరా (4వ ని.లో), గేబ్రియల్ రోసెన్‌బర్గ్ (16వ ని.లో), డేవిడ్ కాస్టనెడా మునోజ్ (84వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. షిల్లాంగ్ జట్టుకు ఫ్రాంగీ బువామ్ (46వ, 87వ ని.లో) రెండు గోల్స్ అందించాడు. 13 జట్లు పోటీపడ్డ ఐ–లీగ్‌లో శ్రీనిధి జట్టు నిర్ణీత 24 మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. 14 మ్యాచ్‌ల్లో నెగ్గిన శ్రీనిధి జట్టు ఆరు మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొని, నాలుగు మ్యాచ్‌ల్లో ఓడిపోయి మొత్తం 48 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. గత సీజన్‌లోనూ శ్రీనిధి జట్టు రెండో స్థానంలోనే నిలిచింది. 52 పాయింట్లతో ఐ–లీగ్ చాంపియన్‌గా నిలిచిన మొహమ్మదాన్ స్పోర్టింగ్ క్లబ్ ఇండియన్ సూపర్ లీగ్‌కు అర్హత సాధించింది.



హై హై హెట్‌మైర్...

- రాజస్తాన్ రాయల్స్‌ను గెలిపించిన హిట్టర్
- 10 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లతో 27 నాటౌట్
- పంజాబ్ కింగ్స్‌కు మరో ఓటమి

ముల్లన్‌పూర్: ఇరుజట్ల బౌలర్లు శాసించిన మ్యాచ్‌లో... హెట్‌మైర్‌లాంటి హిట్టర్ చివరి ఓవర్ ఆడటంతో పంజాబ్ కింగ్స్‌పై రాజస్తాన్ రాయల్స్ పైచేయి సాధించింది. మొత్తమ్మీద కేశవ్ మహరాజ్ స్పిన్, అవేశ్ పేస్, హెట్‌మైర్ మెరుపులు వెరసి రాజస్తాన్ ఖాతాలో ఐదో విజయం చేరింది. శనివారం జరిగిన ఈ పోరులో రాజస్తాన్ రాయల్స్ 3 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై గట్టెక్కింది. మొదట పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 147 పరుగులు చేసింది. అశుతోష్ శర్మ (16 బంతుల్లో 31; 1 ఫోర్, 3 సిక్స్‌లు) ఇన్నింగ్స్ టాప్ స్కోరర్‌గా నిలిచాడు! కేశవ్ మహరాజ్, అవేశ్ ఖాన్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన రాజస్తాన్ 19.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 152 పరుగులు చేసి గెలిచింది. యశస్వి జైస్వాల్ (28 బంతుల్లో 39; 4 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హెట్‌మైర్ (10 బంతుల్లో 27 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు) మెరిపించారు.

బోర్ కొట్టించిన కింగ్స్ ఇన్నింగ్స్

అథర్వ (15), బెయిర్‌స్టో (15), ప్రభ్‌సిమ్రాన్ (10), తాత్కాలిక కెప్టెన్ స్యామ్ కరన్ (6)... పంజాబ్ ఇన్నింగ్స్‌లో టాప్–4 బ్యాటర్ల స్కోరు! 12.1 ఓవర్లలో 70/5 వద్ద కింగ్స్ ఆటతీరు! దీంతో పవర్ ప్లే సహా ఆఖరి దాకా పంజాబ్ ఇన్నింగ్స్‌లో అదరగొట్టింది... ఆకట్టుకుంది ఏ ఒక్కటీ లేదు. జితేశ్ 29 పరుగులు చేసినా... 24 బంతులు ఆడాడు. అశుతోష్ బాదిన ఆ మాత్రం మెరుపులే పంజాబ్ కొద్దోగొప్పో స్కోరుకు దోహదపడ్డాయి.

తడబడినా... ఉత్కంఠకు నిలబడి...

లక్ష్యం కష్టమైంది కాదు! ఓపెనర్లు తొలి వికెట్‌కు 56 పరుగుల శుభారంభం ఇచ్చారు. అయినా కూడా రాజస్తాన్ తడబడింది. యశస్వి జైస్వాల్ ఓపెనింగ్‌లో 'ఇంపాక్ట్' చూపగా, తనుష్ కొటియన్ (31 బంతుల్లో 24; 3 ఫోర్లు) మోస్తరు పరుగులు చేశాడు. రబడ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో యశస్వి, సంజు సామ్సన్ (18)లను అవుట్ చేసి ఒత్తిడి పెంచాడు. పడుతూ... లేస్తూ జట్టు వంద స్కోరు దాటాక హిట్టర్ రియాన్ పరాగ్ (18 బంతుల్లో 23; 1 ఫోర్, 1 సిక్స్), ధ్రువ్ జురెల్ (6)లు కూడా రెండు పరుగుల వ్యవధిలో పెవిలియన్ చేరడంతో 14 బంతుల్లో 30 పరుగుల సమీకరణం గుదిబండగా మారింది. ఈ దశలో హెట్‌మైర్ 17వ ఓవర్ చివరి రెండు బంతుల్లో 4, 6 కొట్టాడు. తర్వాత స్యామ్ కరన్ 2 బౌండరీలు ఇచ్చినా పావెల్ (11), కేశవ్ (1)లను అవుట్ చేశాడు. అర్ష్‌దీప్ ఆఖరి ఓవర్లో తొలి 2 బంతులకు పరుగే ఇవ్వలేదు. కానీ హెట్‌మైర్ 6,2,6లతో మరో బంతి మిగిలుండగానే మ్యాచ్‌ను ముగించాడు.



హెట్‌మైర్

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: అథర్వ (సి) కుల్దీప్ సేన్ (బి) అవేశ్ 15; బెయిర్‌స్టో (సి) హెట్‌మైర్ (బి) కేశవ్ 15; ప్రభ్‌సిమ్రాన్ (సి) జురెల్ (బి) చహల్ 10; స్యామ్ కరన్ (సి) జురెల్ (బి) కేశవ్ 6; జితేశ్ (సి) పరాగ్ (బి) అవేశ్ 29; శశాంక్ (సి) జురెల్ (బి) కుల్దీప్ సేన్ 9; లివింగ్‌స్టోన్ (రనౌట్(21; అశుతోష్ (సి) కేశవ్ (బి) బౌల్ట్ 31; హర్‌ప్రీత్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 8; మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 147. వికెట్ల పతనం: 1–27, 2–41, 3–47, 4–52, 5–70, 6–103, 7–122. బౌలింగ్: బౌల్ట్ 4–0–22–0, కుల్దీప్ సేన్ 4–0–35–1, అవేశ్ ఖాన్ 4–0–34–2, చహల్ 4–0–31–1, కేశవ్ మహరాజ్ 4–0–23–2.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (సి) హర్షల్ (బి) రబడ 39; తనుష్ (బి) లివింగ్‌స్టోన్ 24; సామ్సన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) రబడ 18; పరాగ్ (సి) రబడ (బి) అర్ష్‌దీప్ 23; జురెల్ (సి) శశాంక్ (బి) హర్షల్ 6; హెట్‌మైర్ (నాటౌట్) 27; పావెల్ (సి) జితేశ్ (బి) స్యామ్ కరన్ 11; కేశవ్ (సి) లివింగ్‌స్టోన్ (బి) స్యామ్ కరన్ 1; బౌల్ట్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 3; మొత్తం (19.5 ఓవర్లలో 7 వికెట్లకు) 152. వికెట్ల పతనం: 1–56, 2–82, 3–89, 4–113, 5–115, 6–136, 7–138. బౌలింగ్: అర్ష్‌దీప్ 3.5–0–45–1, రబడ 4–0–18–2, సామ్ కరన్ 4–0–25–2, లివింగ్‌స్టోన్ 3–0–21–1, హర్షల్ 2–0–21–1, హర్‌ప్రీత్ బ్రార్ 3–0–22–0.

ఐపీఎల్‌లో నేడు

కోల్‌కతా X లక్నో
వేదిక: కోల్‌కతా
మధ్యాహ్నం 3: 30 గంటల నుంచి

ముంబై X చెన్నై
వేదిక: ముంబై
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	6	5	1	10	0.767
కోల్‌కతా	4	3	1	6	1.528
చెన్నై	5	3	2	6	0.666
లక్నో	5	3	2	6	0.436
హైదరాబాద్	5	3	2	6	0.344
గుజరాత్	6	3	3	6	-0.637
ముంబై	5	2	3	4	-0.073
పంజాబ్	6	2	4	4	-0.218
ఢిల్లీ	6	2	4	4	-0.975
బెంగళూరు	6	1	5	2	-1.124

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు, నె.ర.రే–నెట్ రన్‌రేట్

అమిత్‌కు పిలుపు హుసాముద్దీన్‌పై వేటు

ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీకి భారత బాక్సింగ్ జట్టు ప్రకటన



అమిత్



హుసాముద్దీన్

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ వరల్డ్ క్వాలిఫయింగ్ బాక్సింగ్ చివరి టోర్నీలో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. గత నెలలో జరిగిన తొలి క్వాలిఫయింగ్ టోర్నీలో భారత బాక్సర్లు తొమ్మిది కేటగిరీల్లో బరిలోకి దిగినా ఒక్కరు కూడా ఒలింపిక్స్ బెర్త్‌ను దక్కించుకోలేకపోయారు. తొలి టోర్నీలో పాల్గొన్న ఐదుగురు బాక్సర్లపై (దీపక్ భోరియా, హుసాముద్దీన్, శివ థాపా, లక్ష్య చహర్, జాస్మిన్) వేటు పడింది. దీపక్ స్థానంలో 2022 కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణ పతక విజేత అమిత్ పంఘాల్‌కు మళ్లీ జాతీయ జట్టులో చోటు దక్కింది. తెలంగాణ బాక్సర్ హుసాముద్దీన్ స్థానంలో సచిన్ సివాచ్‌ను ఎంపిక చేశారు. చివరి క్వాలిఫయింగ్ టోర్నీ మే 25 నుంచి జూన్ 2 వరకు బ్యాంకాక్‌లో జరుగుతుంది. ఇప్పటి వరకు భారత్ నుంచి మహిళల విభాగంలో నలుగురు బాక్సర్లు (నిఖత్ జరీన్, ప్రీతి, పర్వీన్, లవ్లీనా) పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు.

భారత బాక్సింగ్ జట్టు: పురుషుల విభాగం: అమిత్ పంఘాల్ (51 కేజీలు), సచిన్ సివాచ్ (57 కేజీలు), అభినాష్ జమ్వాల్ (63.5 కేజీలు), నిశాంత్ దేవ్ (71 కేజీలు), అభిమన్యు (80 కేజీలు), సంజీత్ (92 కేజీలు), నరేందర్ (ప్లస్ 92 కేజీలు). మహిళల విభాగం: అంకుశిత (60 కేజీలు), అరుంధతి (66 కేజీలు).

విజయం లేకుండానే...



పెర్త్: ఆస్ట్రేలియాలో ఐదు మ్యాచ్‌ల హాకీ సిరీస్‌ను భారత జట్టు పరాజయంతో ముగించింది. శనివారం జరిగిన చివరి మ్యాచ్‌లో టీమిండియా 2–3 గోల్స్ తేడాతో ఓడిపోయింది. వరుసగా ఐదో విజయంతో ఈ సిరీస్‌ను ఆస్ట్రేలియా 5–0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఆఖరి మ్యాచ్‌లో భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (4వ ని.లో), బాబీసింగ్ ధామి (53వ ని.లో)... ఆస్ట్రేలియా తరఫున జెరెమి హేవార్డ్ (20వ ని.లో), కి విలోట్ (38వ ని.లో), టిమ్ బ్రాండ్ (39వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు.

సినిమా

చిన్నారి దేవత వచ్చింది




మంచు మనోజ్

''ఆ దేవతల ఆశీర్వాదంతో మా ఇంటికి చిన్నారి దేవత వచ్చింది. మనోజ్, మౌనికకు కుమార్తె పుట్టిందని చెప్పడం మాకెంతో హ్యాపీగా ఉంది'' అంటూ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు మంచు లక్ష్మి. మంచు మనోజ్ భార్య మౌనిక శనివారం కుమార్తెకు జన్మనిచ్చారు. ''మేం పాపను ఎమ్ఎమ్ పులి (మంచు మనోజ్ పులి అయ్యుండొచ్చు) అని ముద్దుగా పిలుస్తున్నాం'' అని కూడా లక్ష్మి పేర్కొన్నారు. ఇక సినిమాల విషయానికొస్తే.. మనోజ్ నటిస్తున్న తాజా యాక్షన్ చిత్రం షూటింగ్ జరుగుతోంది. ఈ చిత్రం గ్లింప్స్‌ని మనోజ్ పుట్టినరోజు సందర్భంగా మే 20న విడుదల చేయాలనుకుంటున్నారు.

ఆ సమాధానాలు మూడో భాగంలో చెబుతాం

– దర్శకుడు శివ తుర్లపాటి

హీరోయిన్ అంజలి నటించిన చిత్రం 'గీతాంజలి మళ్లీ వచ్చింది'. 'గీతాంజలి' సినిమాకు సీక్వెల్ ఇది. ఈ సీక్వెల్‌లో శ్రీనివాస రెడ్డి, సునీల్, సత్య, అలీ, 'సత్యం' రాజేశ్, 'షకలక' శంకర్, రాహుల్ మాధవ్ కీలక పాత్రలు పోషించారు. సినిమాటోగ్రాఫర్ శివ తుర్లపాటిని దర్శకుడిగా పరిచయం చేస్తూ, కోన వెంకట్, ఎంవీవీ సత్యనారాయణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదలైంది. ఈ సందర్భంగా శివ తుర్లపాటి మాట్లాడుతూ –''మా సినిమాలోని కొన్ని ప్రశ్నలకు సమాధానాలు లేవని కొందరు సినీ విమర్శకులు అభిప్రాయపడ్డారు. ఆ ప్రశ్నలకు సమాధానాలు 'గీతాంజలి' పార్టు 3లో ఉంటాయి. ఇక బ్యాక్‌గ్రౌండ్ డ్యాన్సర్‌గా కెరీర్ స్టార్ట్ చేసి, ఆ తర్వాత దర్శకుడు తేజగారి 'జై' సినిమాతో కొరియోగ్రాఫర్‌గా మారాను. వ్యక్తిగత కారణాల వల్ల అమెరికా వెళ్లి, అక్కడ డ్యాన్స్ స్కూల్ రన్ చేస్తున్నాను. నేను అమెరికాలో చేసిన ఓ కవర్ సాంగ్ ద్వారా కోన వెంకట్‌గారు నాకు పరిచయం అయ్యారు. ఇక దర్శకుడిగా నా తదుపరి సినిమా కోసం రెండు కథలు రెడీగా ఉన్నాయి'' అని చెప్పుకొచ్చారు.



సౌత్ డైరెక్షన్‌కి సై



సల్మాన్ ఖాన్ · రణ్‌వీర్ సింగ్ · షాహిద్ కపూర్ · వరుణ్ ధావన్ · అక్షయ్ కుమార్

బాహుబలి, ఆర్ఆర్ఆర్, కేజీఎఫ్ వంటి చిత్రాలతో దక్షిణాది సినిమా ప్రపంచవ్యాప్తంగా పాపులర్ అయింది. సౌత్ డైరెక్టర్ల క్రేజ్ కూడా బాగా పెరిగింది. అందుకే బాలీవుడ్ హీరోలు సౌత్ డైరెక్టర్లతో సినిమాలు చేయడానికి సై అంటున్నారు. ఈ మధ్యకాలంలో తెలుగు దర్శకుడు సందీప్ రెడ్డి వంగా, తమిళ దర్శకుడు అట్లీ వంటి వారు బాలీవుడ్‌లో సక్సెస్ అయ్యారు. ఈ నేపథ్యంలో దక్షిణాది దర్శకులతో ఉత్తరాది హీరోలు చేస్తున్న సినిమాల గురించి తెలుసుకుందాం.

సికందర్ సిద్ధం



మురుగదాస్

దాదాపు పదిహేనేళ్ల క్రితమే హిందీ 'గజిని' కోసం హిందీ హీరో సల్మాన్ ఖాన్, తమిళ దర్శకుడు ఏఆర్ మురుగదాస్ కలిసి పని చేయాల్సింది. అయితే ఆ చిత్రంలో ఆమిర్ ఖాన్ హీరోగా నటించగా మురుగదాస్ దర్శకత్వం వహించారు. 'గజిని' బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. కానీ మురుగదాస్ మాత్రం సల్మాన్ ఖాన్‌తో ఎలాగైనా ఓ సినిమా చేయాలని అనుకుంటూనే ఉన్నారు. ఈ క్రమంలో ఐదేళ్ల క్రితం సల్మాన్ ఖాన్‌కు ఓ కథ చెప్పారు మురుగదాస్. ఈ కథ సల్మాన్‌కు నచ్చలేదట. దీంతో సెట్ కాలేదు. కానీ తనతో సినిమా చేయాలనుకుంటున్న మురుగదాస్‌కు మరో నరేషన్ ఇచ్చే చాన్స్ ఇచ్చారు సల్మాన్. ఈసారి సల్మాన్‌కు కథ నచ్చడంతో సినిమా సెట్ అయ్యింది. ఈ సినిమాకు 'సికందర్' టైటిల్ పెట్టారు. ఈ చిత్రం షూటింగ్ ఈ వేసవిలో ఆరంభం కానుందట. వచ్చే ఏడాది ఈద్‌కి ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు. అలాగే సల్మాన్ ఖాన్ 'ది బుల్' అనే సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. హిందీ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాకు 'షేర్షా' వంటి హిట్ ఇచ్చిన తమిళ దర్శకుడు విష్ణువర్ధన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారని సమాచారం.

బాలీవుడ్ అపరిచితుడు

విక్రమ్ హీరోగా శంకర్ దర్శకత్వం వహించిన 'అన్నియన్' ('అపరిచితుడు') సినిమా బ్లాక్‌బస్టర్. ఈ సినిమాను రణ్‌వీర్ సింగ్‌తో హిందీలో రీమేక్ చేయాలనుకున్నారు శంకర్. దాదాపు మూడేళ్ల క్రితం ఈ సినిమా ప్రకటించినా ఇంకా సెట్స్‌పైకి వెళ్లలేదు. ప్రస్తుతం 'ఇండియన్ 2', 'ఇండియన్ 3' సినిమాల పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్, 'గేమ్ చేంజర్' సినిమాతో బిజీగా ఉన్నారు శంకర్. ఈ సినిమాలు విడుదలయ్యాక రణ్‌వీర్ సింగ్‌తో శంకర్ సినిమా ఉంటుందట. అయితే 'అన్నియన్' రీమేక్ రైట్స్ విషయంలో వివాదం నడుస్తున్న నేపథ్యంలో రణ్‌వీర్‌తో 'అన్నియన్' సినిమానే శంకర్ చేస్తారా? లేక కొత్త కథతో సెట్స్‌పైకి వెళ్తారా? అనే విషయం తెలియాల్సి ఉంది.



శంకర్

దసరాకు దేవా

ఈ దసరాకి షాహిద్ కపూర్‌ను 'దేవా'గా థియేటర్స్‌కు తీసుకురావాలనుకుంటున్నారు మలయాళ దర్శకుడు రోషన్ ఆండ్రూస్. షాహిద్ కపూర్ టైటిల్ రోల్ చేస్తున్న ఈ యాక్షన్ ఫిల్మ్‌లో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్నారు. హిందీలో రోషన్ ఆండ్రూస్‌కు 'దేవా' తొలి చిత్రం. కాగా షాహిద్ కపూర్ నెక్ట్స్ ఫిల్మ్ కూడా దక్షిణాది దర్శకుడుతోనే ఖరారైంది. కన్నడ దర్శకుడు సచిన్ రవితో 'అశ్వత్థామ: ది సాగా కంటిన్యూస్' ఫిల్మ్ కమిటయ్యారు షాహిద్. 'దేవా' పూర్తి కాగానే 'అశ్వత్థామ: ది సాగా...' షూటింగ్ ఆరంభం అవుతుందట.



సచిన్ రవి



రోషన్ ఆండ్రూస్

బేబీ జాన్ వస్తున్నాడు

వరుణ్ ధావన్‌ను 'బేబీ జాన్'గా మార్చేశారు తమిళ దర్శకుడు కాలిస్. వరుణ్ ధావన్ హీరోగా తమిళ దర్శకుడు అట్లీ నిర్మిస్తున్న సినిమా 'బేబీ జాన్'. కాలిస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో కీర్తీ సురేష్, వామికా గబ్బి హీరోయిన్లు. ఈ సినిమా మే 31న రిలీజ్ కానుంది.



కాలిస్

హిట్ రీమేక్‌తో...

తమిళ చిత్రం 'సూరరై పోట్రు' బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ మూవీ హిందీలో 'సర్ఫిరా'గా రీమేక్ అవుతుండగా, అక్షయ్ కుమార్ హీరోగా నటిస్తున్నారు. మాతృకకు దర్శకత్వం వహించిన సుధ కొంగరయే 'సర్ఫిరా'కు దర్శకత్వం వహిస్తున్నారు. అలాగే 'సూరరై పోట్రు'లో నటించిన సూర్య 'సర్ఫిరా'కు ఓ నిర్మాతగా ఉంటూ, గెస్ట్ రోల్ చేయడం విశేషం. ఈ చిత్రం జూన్‌లో విడుదల కానుంది.



సుధ కొంగర

ఇంకా తెలుగు దర్శకులు తేజ, గోపీచంద్ మలినేని, ప్రశాంత్ వర్మ, తమిళ దర్శకుడు పా. రంజిత్ తదితరులు చెప్పిన కథలను హిందీ హీరోలు విన్నారని సమాచారం.

అప్పుడు కన్నీళ్లొచ్చాయి

– 'సత్యం' రాజేశ్

'సత్యం' రాజేశ్ హీరోగా నటించిన ఫ్యామిలీ ఎమోషనల్ మూవీ 'టెనెంట్'. మేఘా చౌదరి హీరోయిన్‌గా, చందన పయావుల, భరత్ కాంత్ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు వై. యుగంధర్ దర్శకుడు. మోగుళ్ళ చంద్రశేఖర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో నటుడు ప్రియదర్శి అతిథిగా పాల్గొని ఈ సినిమా విజయం సాధించాలన్నారు. 'సత్యం' రాజేశ్ మాట్లాడుతూ – ''ఈ సినిమా క్లైమాక్స్‌కు డబ్బింగ్ చెబుతున్నప్పుడు కన్నీళ్లు వచ్చాయి'' అన్నారు. ''సహజత్వంతో కూడిన ఎమోషన్స్ ఉన్న సినిమా ఇది'' అన్నారు చంద్రశేఖర్ రెడ్డి. ''టెనెంట్' చూసిన మహిళలు ఈ చిత్రాన్ని చూడాల్సిందిగా అబ్బాయిలకు చెబుతారు'' అని వై. యుగంధర్ అన్నారు.



'సత్యం' రాజేశ్

జీరో బడ్జెట్‌తో...



నవీన్, లయ

ఓ సినిమాకు సంబంధించి, ఆ చిత్ర నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎవరి ఖర్చులు వారే సొంతంగా భరిస్తూ ఓ సినిమాను రూపొందిస్తే ఆ మూవీని 'జీరో బడ్జెట్' అంటుంటారు. ఈ కోవలో రూపొందిన తాజా చిత్రం 'శరపంజరం'. నవీన్‌కుమార్ గట్టు దర్శకత్వంలో రూపొందించి, హీరోగా నటించిన ఈ చిత్రంలో లయ హీరోయిన్. టి. గణపతిరెడ్డి సహకారంతో మామిడి హరికృష్ణ ఆశీస్సులతో షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ– ''ఇది మట్టిమనుషుల కథ. సామాజిక చైతన్యం కోసం పాటు పడే కథను ఎంచుకున్న చిత్రయూనిట్‌కు నా అభినందనలు'' అన్నారు. ''ఈ సినిమా లొకేషన్‌కు వెళితే ఎవరి టిఫిన్‌లు, భోజనాలు వారే తెచ్చుకోవడం చూశాను. ఇలాంటి చిత్రాలు మరిన్ని వస్తేనే అనేక వర్గాలు, జాతుల ప్రజల నిజ జీవితాలు ప్రపంచానికి తెలుస్తాయి'' అన్నారు టి. గణపతిరెడ్డి. ''జీరో బడ్జెట్‌తో, స్నేహితుల సహకారంతో మొదలు పెట్టిన ఈ సినిమా విడుదల వరకు రావడం హ్యాపీ'' అన్నారు నవీన్.



ఈ డాక్టరేట్ వారికే చెందుతుంది

– రామ్‌చరణ్

''నాపై ఇంత ప్రేమాభిమానాలు చూపించి గౌరవంతో డాక్టరేట్ బహుకరించిన వేల్స్ యూనివర్సిటీ వారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. నేను ఈరోజు ఈ వేదికపై ఉండటం సంతోషంగా ఉంది'' అని హీరో రామ్‌చరణ్ అన్నారు. చెన్నైకి చెందిన ప్రముఖ విశ్వ విద్యాలయం వేల్స్ ఇటీవల రామ్‌చరణ్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ విశ్వ విద్యాలయం చైర్మన్ ఐసరి గణేష్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం చెన్నై, పల్లావరంలోని వేల్స్ విశ్వ విద్యాలయంలో జరిగిన 34వ స్నాతకోత్సవంలో వివిధ రంగాలలోని స్థానికులకు గౌరవ డాక్టరేట్ పట్టం ప్రదానోత్సవం జరిగింది. ఢిల్లీకి చెందిన ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చైర్మన్ టీజీ సీతారామ్ ముఖ్య అతిథిగా హాజరై గౌరవ డాక్టరేట్ పట్టాలను ప్రదానం చేశారు. కాగా సినీ రంగంలో (నటుడిగా, నిర్మాతగా), లైన్స్ క్లబ్ ద్వారా విశేష సేవలు అందిస్తున్నందుకు గాను రామ్‌చరణ్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ – ''చెన్నై విజయా ఆస్పత్రిలో పుట్టాను. ఇక్కడే పద్మ శేషాద్రి పాఠశాలలో చదువుకున్నాను. ఇదే చెన్నైలో గౌరవ డాక్టరేట్ బిరుదును అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. చెన్నై నాకు ఎప్పుడూ ప్రత్యేకం. మా నాన్నగారు (హీరో చిరంజీవి) నటుడిగా తన ప్రయాణాన్ని ఇక్కడ్నుంచే ప్రారంభించారు. నా భార్య ఉపాసన తాత, అపోలో ఆస్పత్రి అధినేత ప్రతాప్ సి. రెడ్డి చెన్నైలోనే తన వ్యాపారాన్ని ప్రారంభించి, విస్తరింపజేశారు. కలలు కనేవారికి చెన్నై సాకారం చేస్తుంది. ఈ గౌరవ డాక్టరేట్ నాకన్నా నా దర్శక–నిర్మాతలు, సహ నటీనటులు, సాంకేతిక వర్గం, అభిమానులకే చెందుతుంది. సినిమాల విషయానికి వస్తే డైరెక్టర్ శంకర్‌గారితో 'గేమ్ ఛేంజర్' సినిమా చేస్తున్నాను. డిఫరెంట్ స్టోరీతో ఈ పొలిటికల్ థ్రిల్లర్ తెరకెక్కుతోంది. ఐదు భాషల్లో పాన్ ఇండియా మూవీగా సెప్టెంబర్ లేదా అక్టోబరులో విడుదల చేయాలని అనుకుంటున్నాం'' అన్నారు.

– 'సాక్షి' ప్రతినిధి, చెన్నై

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



SC హిందూ మాల/కట్నం ప్రసక్తి లేదు/ BE/ Govt.డివిజనల్ ఇంజనీర్/ఎలక్ట్రికల్ Dept/ 85000/-PM/5'11"ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-14272]

యాదవ/M.Tech / Govt. Asst. ఇంజనీర్ / R&B Dept/80000/-PM/ 6'ఎత్తు /29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-14272]

పద్మశాలి/M.Tech/Govt. కస్టమ్స్ & ఎక్సైజ్ ఆఫీసర్/20 Lakhs. PA/5'8" ఎత్తు/28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9989450693 [HA-14272]

వడ్డెర/కట్నం ప్రసక్తి లేదు / B.Tech / C. Govt. కస్టమ్స్ ఆఫీసర్/80,000/-PM/ 5'10" ఎత్తు /29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-14272]

క్రిస్టియన్ మాల/కట్నం ప్రసక్తి లేదు/ 28/ 5'8"/ B.Tech / C.Govt. కస్టమ్స్ ఇన్స్‌పెక్టర్/90,000/-PM అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-14275]

రెడ్డి/1992/5'8"/B.Tech/బిజినెస్/5 లక్షలు PM/టౌన్ హౌస్/4 కోట్ల ఆస్తి వరునికి ఆస్తి లేకపోయినా మంచి గుణము, ఓపెన్ మైండ్ గల OC/BC వధువు కావలెను. వెరి వెరి అర్జెంట్. వాట్సాప్ 8187053655, 6303293337 [HA-14275]

SC మాల & క్రిస్టియన్ /B.Tech(EEE)/ Govt. AEE/ట్రాన్స్‌కో/14 Lakhs PA/ 5'8"ఎత్తు/28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. కట్నం ప్రసక్తి లేదు. Ph: 9676995093 [HA-14275]

SC మాదిగ/B.Tech(EEE)/ C.Govt. కస్టమ్స్ ఇన్స్‌పెక్టర్/18 Lakhs PA/ 5'8" ఎత్తు/ 28 సం॥ల వరునికి వధువు కావలెను. కట్నం ప్రసక్తి లేదు. Ph: 6304407230 [HA-14275]

రెడ్డి/ హ్యాండ్సమ్/కట్నం ప్రసక్తి లేదు/29/5'10"/B.Tech, IIT/ సాఫ్ట్‌వేర్/ 3 Lakhs Pm/ కోట్ల ఆస్తి గల వరుడుకి వధువు కావలెను. 8367619529 [H-14276]

కులపట్టింపు లేదు, కట్నం ప్రసక్తి లేదు/ 37/5'9"/MBA/మేనేజర్/1 Lakh Pm/ వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ వరునికి వధువు కావలెను. 2వ పెళ్లి అయినా ఓకే. 8367619529 [H-14276]

దేవాంగ (CAST No bar)/40yrs, 5'5" fair. M.Tech, MCA, IRPM, 4 కోట్లు ఆస్తి గల వరునికి చదువుకున్న, దైవ భక్తి గల వధువు కావలెను. (డైరెక్ట్) సంప్ర: 7036361292 [H-14276]

క్రిస్టియన్ మాల: M.Tech/C.Govt/BHEL/ Asst Engineer/90,000 P.m/ 5'9"/ ఎత్తు/ 29 సం॥/ అందమైన వరునికి వధువు కావలెను. 7207233788 [H-801608]

హిందు మాదిగ: B.Tech/ Govt/Asst/ Executive Engineer/ Irrigation Dept/ 1 Lak P.m/ 5'10"/ ఎత్తు/ అందమైన వరునికి వధువు కావలెను. 7207233788 [H-801608]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: kcreddy43@gmail.com, Facebook.com/ kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/BS(USA) Job Hyd/1990/5'9"/ Handsome Boy/50L/yr/30Cr * B.Tech/ MBA/1991/5'10"/75L/yr/50Cr *Cont: K.C. Reddy -Hyd. Ph: 9347807015

Reddy/B.Tech/Good Business/Hyd/1990/ 5'10"/ 20L/PM/income /25Cr(Prop) *B.Tech (NIT)/ MBA (ISB)/ MBA (USA)/ 1993/6'/ 100 Cr. *Cont: K.C.Reddy-Hyd- Ph: 9849321309

Reddy/ B.Tech/ MS(USA)/Builder-Hyd/ 1988/5'11"/8L/M income/25Cr *MBA/ Business /1995/6'/150Cr. * Cont : K.C. Reddy-Hyd- Ph: 9347807015/9849321309

Reddy/BE (BITS)/MS / H1 / USA/Very Handsome Boy/1991/5'10"/210K/Rich Family. * Cont : K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/MBBS/PG/DM *1995/ 5'10"/ 400Cr *1996/6'/ 50Cr *1994/5'10"/75Cr *1993/ 5'10"/ 50"Cr *1993/5'11"/ 20Cr *1989 / 5'9"/ 30Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/IIT/IIM/B.Tech/MBA *1994/ 5'9"/ 30Cr/1Cr/yr *1994 / 5'11"/ 70L/yr/ 25Cr * 1992/ 5'9"/8.5L/yr *1996/5'7"/50L/yr/ 20 Cr. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309

Reddy/Good Business *B.Tech/MBA/ 1989/5'11"/500Cr *1991/5'11"/400Cr *1995/6'/ 100Cr *1994/5'11"/150Cr *1994/5'10"/100Cr. *Cont : K.C. Reddy - Hyd. Ph: 9347807015.

Reddy/Good Business/B.Tech/ 1995/ 5'10"/250Cr *1997/6'/400Cr *1994/ 5'11"/ 250Cr *1997/6'/ 150Cr *1990/6' / 1000Cr. * Cont: K.C. Reddy -Hyd. Ph: 9849321309

Reddy/B.Tech/MS/H1/USA * 1989/ 5'8"/ 200K *1991/ 5'11"/140K/ 200Cr * 1987/ 5'9"/150K/50Cr *1990/5'7"/ 120K/ 50Cr. *Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/B.Tech/MS/H1/USA/1996/ 5'11"/ 150K/50Cr *1997/5'9"/60Cr *1994/5'9"/ 120K/150Cr *1995/ 5'9"/110K/ 50Cr. * Cont. K.C.Reddy- Hyd-Ph: 9347807015

వరుడు కావలెను

Reddy/MBBS/1997/5'3"/20Cr * MS/ (Gyn)/1995/5'4"/7Cr * MD/ 1994/ 5'6"/ 100Cr *1998/ 5'9"/50Cr *1995/5'7"/10Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/ Divorcee *B.Tech / 1985/5'5"/ 400Cr *MBBS/MD/ 1994/5'5"/100Cr *1991/ 5'2"/ 40Cr *1986/5'6"/50Cr *1993/ 5'8"/ 40 Cr. *Cont:K.C.Reddy-Hyd-Ph: 9849321309

Reddy/B.Tech/MS/H1/USA *IIT/1996/ 5'7" *1997/5'5"/15Cr *1996/5'8"/15Cr *1997/ 5'4"/200K *1997/5'8"/12Cr *1990/ 5'8"/ 100 Cr. * Cont:K.C.Reddy-Hyd-Ph: 9347807015

Reddy/B.Tech/MS/H1/USA *1997/ 5'5"/ 60Cr *1989/5'6"/30Cr *1996/5'8"/100K *1996/5'3"/20 "Cr *1999 / 5'6"/ 200Cr. * Cont : K.C. Reddy -Hyd-Ph: 9849321309

Reddy/ USA - Doc * 1996 / 5'8"/40Cr *1996/ 5'2"/20Cr *1995/5'7"/ *1992/5'5"/ 50Cr *1992/5'4"/50Cr *1985/5'4"/50Cr. *Cont: K.C.Reddy-Hyd.Ph: 9347807015

Reddy/MBBS/PG/1998/5'9"/50Cr *1995/ 5'7"/15Cr *1996/5'8"/40Cr *1998/5'7"/ 50Cr *1990/5'10"/15Cr *1990/5'6"/100Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/MBBS/ PG/ DM/1995/5'5"/100Cr *1997/5'6"/500Cr *1994/5'6"/100Cr *1993/ 5'2"/ 20Cr *1998/5'6"/20Cr *1998/5'5"/25Cr. * Cont : K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/B.Tech / 1998/5'5"/ 100Cr *1996/ 5'4"/ 30Cr *1998/5'4"/40Cr *1995/5'3"/50Cr *1993 / 5'7"/ 100Cr * 1992/ 5'3½"/40Cr. * Cont. K.C.Reddy-Hyd. Ph: 9849321309

Reddy/B.Tech/1997/5'4"/ 150Cr *1995/ 5'8"/ 100Cr *1994/5'6"/100Cr *1995/ 5'7"/ 150Cr *1994/5'3"/400Cr *1999/5'8"/15Cr. * Cont : K.C.Reddy-Hyd-Ph: 9347807015

Reddy/B.Tech / SWE / 1999/5'7" / 100Cr *1997/5'6"/30Cr *1996/5'4"/30Cr *2000/ 5'4"/ 30Cr *2000/5'5"/100Cr. * Cont: K.C.Reddy-Hyd.Ph: 9347807015/9849321309 [D-545]

వడ్డెర: B.Tech/C.Govt/Customs Officer/ Revenue Dept/ 1 Lak P.M/ 5'10" ఎత్తు/ అందమైన వరునికి వధువు కావలెను. 7207233788. [H-801608]

డైరెక్ట్ కాంటాక్ట్: ఆర్యవైశ్య, 46Yrs/5'.5"/ బిజినెస్, జాబ్, 30Cr. స్థిరాస్తి గల ఏకైక అబ్బాయికి అందమైన అమ్మాయి కావలెను (నో బ్రోకర్స్). 7680872085, 9182161015. [T-3547]

Rayalaseema Sunni Muslim Parents Invite allaince for their Son 29 years MBBS Doctor Settled at Hyd. Looking for Suitable Match. Contact: 8074560519 [H-804850]

★

రెడ్డి/31yrs/5'8"/M.Tech (VLSI) SWE Job 13L PA. *32yrs/5'8"/B.Ed Govt. Job 80K PM. కాపు/27yrs/5'7"/M.Tech/ Govt. Job 50K PM వధువులు కావలెను. Ph: 8142334531 [HA-746]

పద్మశాలి/32yrs/5'6"/ B.Tech (ECE) SWE Job 23L PA. *35yrs/5'5"/M.S (CSE)/ SWE 9.5K (US Dollars) PM. బ్రాహ్మిణ also 1వ వధువులు కావలెను. Ph: 8142334531 [HA-746]

ఆర్యవైశ్య/40yrs/5'7"/ M.Tech Govt. Job 80K PA. రెడ్డి/38yrs/5'8"/MBA/ Govt. Job 50K PM. పద్మశాలి/42yrs/5'5"/ఇంటర్/బిజినెస్/60K PM 1వ, 2వ వధువులు కావలెను. Ph: 8142334531 [HA-746]

రెడ్డి/లేట్ మ్యారేజ్/34y/నెలకు లక్ష రూపాయల ఆదాయం. Hydలో సొంత ఇల్లు, కోట్ల ప్రాపర్టీ గల హైదరాబాద్ వరుడికి ట్రస్టీ తెలంగాణ వధువు కావలెను. డైవర్సీ /విడో OK కుల, కట్నం ప్రసక్తి లేదు. డైరెక్ట్ Ph: 7989079290 [H-801605]

వెలమ / 5'8"/ 33/ Diploma/ Fair/ తల్లి, తండ్రిలేని ఏకైక వరునికి OC లేక BC వధువు కావలెను. డైరెక్ట్ వాట్సప్ సెల్ : 8331961507 [K- 1185979]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి BE, MS, 29, 5' 11", Engineer, 170 K, 200 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, BE, MS, 36, 5' 11", Hyderabad, Handsome, Rich. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 6', Infosys, SWE, 25 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 6', Software Developer, 140 K, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి MBBS, 23, 5' 9", Doctor, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (NIT), MS, 26, 5' 6", SWE, H1, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS (USA), 29, 5' 7", SWE, 22 L P/A, Hyderabad, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 27, 5' 5", Manager, 200 K, 8 Crores, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, MS, 29, 5' 11", Sr. Cloud DevOps, 5 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, BE, 30, 5' 7", 40 Crores, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 27, 5' 7", PG Doctor, 30 Crores, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE (IIT), MBA (IIM), 35, 5' 10", 34 L P/A, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 25, 5' 4", Developer, 22 L P/A, 10 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 3", Product Manager, 150 K, 8 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 28, 5' 5", PG Doctor, Hyderabad, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BA, LLB, 27, 5' 4", Advocate, 15 Crores, Hyd, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818. [LETTER]

SC/35 / 5'6" / B.Tech(EEE) / Govt. Employee/Electricity Dept/ Hyderabad /13.5 Lakhs P/A/వెల్ సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9949919285 [HA-13648]

వరుడు కావలెను



రెడ్డి విడో: వయస్సు: 28, ఎత్తు: 5'4", కలర్ ఎరుపు రంగు గల అందమైన వధువుకి వరుడు కావలెను. ఇల్లరికం అయినా పరవాలేదు, సొంత వ్యాపారము కలదు (కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు). ఫోన్: 9515673252 [H-14276]

38yr/డైవర్సీ/ కుల పట్టింపులేదు/Govt. ఎంప్లాయ్ 1,75,000/- లక్షలు (PM), వెల్‌సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను. (పిల్లలు ఉన్నా Ok) సంప్ర: 9032445378 [H-804850]

రెడ్డి/42yr/ ఫెయిర్/కుల పట్టింపులేదు/Govt. ఎంప్లాయ్ 1.50 లక్షలు (PM), వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ 4 సొంత ఇల్లులు & బిజినెస్ కలిగిన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం Ok) సంప్ర: 9640133485 [H-804850]

35yrs/Govt. Emp., 2,50,000 pm, బాగా స్థిరపడిన 15 కోట్ల ప్రాపర్టీ కలిగిన అందమైన అమ్మాయికి వరుడు కావలెను. CNBR (Any Profession). సంప్ర: 9381696641 [H-804850]

కుల పట్టింపు లేదు/విడో/50Y/రిజిస్ట్రేషన్ & స్టాంప్స్ Dept 1LP/m/Own House/ 30 ఎ॥ ల్యాండ్/ కోట్ల ప్రాపర్టీ గల వెల్‌సెటిల్ అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ 9030842549 [H-799834]

రెడ్డి/విడో/50Y/Fair/Nellore/Govt Job/Own House Rents/ ఏ బాదరబందీలేని వెల్‌సెటిల్ అందమైన వధువుకు BC వరుడు కావలెను (పిల్లలున్నా OK) ఫోన్: 8519808423 [H-799834]

రాజులు/విడో/48Y/5'4"/MA B.Ed/Govt టీచర్ VRS Own Business. House. 80K P/m. Rents Well Settled. కోట్ల ప్రాపర్టీ గల వధువుకు BC ఇల్లరికం వరుడు కావలెను. (పిల్లలున్నా OK) ఫోన్: 7993631419 [H-799834]

సెకండ్ మ్యారేజ్/విడో/43Y/DTCP డిపార్ట్‌మెంట్ / 1L P/m/ సొంత అపార్ట్‌మెంట్/ 20 ఎ॥ ల్యాండ్/ కోట్ల ప్రాపర్టీ గల ఆర్థికంగా స్థిరపడిన వధువుకు కులప్రసక్తి లేని వరుడు కావలెను. ఫోన్ 9550283044 [H-799834]

రెడ్డి/విడో/60y/5'4"/ Fair/ రిటైర్డ్ పెన్షనర్/ సొంత ఇల్లు & రెంట్స్/ ఏ బాదరాబందీలేని సాంప్రదాయ కుటుంబానికి చెందిన వెల్‌సెటిల్డ్ ఒంటరి వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తిలేదు. Ph: 8297484478 [H-800471]

రెడ్డి/విడో/60y/5'3"/ Housewife/ 10 ఎకరాల పొలం/ సొంత ఇల్లు & మృదుస్వభావం గల వధువుకి వరుడు కావలెను. Ph: 9014716216 [H-800471]

రెడ్డి/కులపట్టింపులేదు/రెండవ పెళ్లి/ 55y విడో/సొంత ఇల్లు/రెంట్స్/పిల్లలు లేరు/సొంత ప్రాపర్టీ/ఎలాంటి బాదరాబందీలేని వధువుకు వరుడు కావలెను.(అర్జెంట్) (ఇల్లరికం Ok) నో బ్రోకర్స్. Ph: 7799083500 / 7386660643 [H-800471]

వైశ్య/60y/విడో/5'4"/ Govt. లెక్చరర్/ 80,000/- pm/ 2 సొంత ఇల్లు/ కోచింగ్ సెంటర్/1L pm పిల్లలులేని వధువుకి వరుడు కావలెను. కుల ప్రసక్తిలేదు. Ph: 8019357892 [H-800471]

రెడ్డి/57y/విడో/5'5"/ V.Fair/ Govt. టీచర్/ సొంత ఇల్లు & రెంట్స్/ 25 ఎకరాల మాగాణి/2L pm ఏ బాదరాబందీలేని వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తిలేదు. Ph: 9492718486 [H-800471]

కుల ప్రసక్తి లేదు/B.Tech/C.Govt. ఆఫీసర్ /ఇన్‌కమ్ ట్యాక్స్ Dept/50,000/-PM /5'3" ఎత్తు/27 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8897389698 [HA-14272]

రజక/B.Tech/C.Govt. Jr. Asst/ పోస్టల్ Dept/45,000/-PM /5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-14272]

క్రిస్టియన్ మాదిగ/B.Tech/C.Govt. క్లర్క్ & క్యాషియర్/SBI బ్యాంక్ / 35000/-PM/ 5'4"ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6305007091 [HA-14272]

రజక/B.Tech/C.Govt. క్లర్క్ & క్యాషియర్ /SBI బ్యాంక్ / 45000/-PM/ 5'4" ఎత్తు /24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-14272]

గౌడ/B.Tech / సాఫ్ట్‌వేర్ ఇంజనీర్/ Hyd / 50,000/-PM / 5'4"ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9989450693 [HA-14272]

రజక/B.Tech/C.Govt. బ్యాంక్ క్యాషియర్ / ఇండియన్ బ్యాంక్ / 38000/-PM/ 5'4" ఎత్తు /24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9515942275 [HA-14272]

బ్రాహ్మణ/24/5'3"/B.Sc *27/5'4"/MBA *30/ 5'3"/B.Sc *27/5'2"/ఇంటర్ *32/5'2" /ఇంటర్ వధువులకు వరులు కావలెను. జాబ్/ బిజినెస్ / పురోహితులకు త్వరగా కుదుర్చబడును. Ph: 7842635086 [HA-14275]

రెడ్డి/(కుల పట్టింపు లేదు)/26Y/5'4"/B.Tech /సిద్ధ స్థిరాస్తి కలిగి తండ్రి లేని ఏకైక వధువుకు మిడిల్‌క్లాస్ వరుడు కావలెను. మీ ఫోటోలు వాట్సాప్‌లో సెండ్ చెయ్యండి. Ph: 9885463158 [HA-14275]

క్రిస్టియన్ మాల/25/5'4"/ B.Tech/ C.Govt. డిప్యూటీ మేనేజర్/SBI బ్యాంక్/ 60,000/-PM అందమైన వధువుకి వరుడు కావలెను. Ph : 6309258463 [HA-14275]

యాదవ/B.Tech(సివిల్) /C.Govt. Asst. మేనేజర్/కెనరా బ్యాంక్/65000/-PM/ఏకైక కుమార్తె/5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9515755529 [HA-14275]

SC మాల & క్రిస్టియన్/B.Tech(EEE)/ C.Govt.డిప్యూటీ మేనేజర్ / SBI/ 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [HA-14275]

మున్నూరు కాపు/B.Tech(EEE)/ C. Govt.Asst. మేనేజర్/ SBI/ 65000/-PM/ 5'4"ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9912280929 [HA-14275]

మాదిగ హిందూ గుడ్ లుకింగ్/25/5'4"/ MBA/ గుడ్ జాబ్/వెల్ సెటిల్డ్ గుడ్ ఫ్యామిలీ గల వధువుకి వరుడు కావలెను. Ph: 8367619529 [H-14276]

యాదవ/గుడ్ లుకింగ్/కుల పట్టింపు లేదు/27/5'4"/MBA/50000/-pm/ గుడ్ ఫ్యామిలీ గల వధువుకి వరుడు కావలెను. ఫోన్: 8367619529 [H-14276]

కుల పట్టింపు లేదు/2వ పెళ్లి/ గుడ్ లుకింగ్/38/5'4"/PG/ గుడ్ జాబ్/ గుడ్ సాలరీ/వెల్ సెటిల్ ఫ్యామిలీ గల వధువుకి వరుడు కావలెను. 8367619529 [H-14276]

వయసు: 37 yrs/ ఎత్తు 5'5" గవర్నమెంటు జాబ్, 1.5 Lakhs జీతం కలిగిన అందమైన అమ్మాయికి వరుడు కావలెను. కుల పట్టింపు లేదు. పిల్లలున్నా OK. Ph: 8019954482. [H-14276]

రెడ్డి విడో (కుల, ఆస్తి ప్రసక్తి లేదు) A:30, H:5'5", Qly B.Com Own Shops, Agriculture land గల అందమైన వధువుకి వరుడు కావలెను. 1st or 2nd (ఇల్లరికం ఓకే) ఫోన్: 9912511231 [H-14276]

కుల పట్టింపు లేదు/21y&23y&25y&27y &29y &31y& 33y &35y & 37Y& 39Y& 40y&42y& 44y& 45y& 46y& 48y& 50y&52y &54y& 56y& 58y& 60y& 61y& 63y"మా సేవ" (Since 1998):PH/WA:9291503949. [H-14276]

క్రిస్టియన్ మాదిగ: B.Tech/Govt/Asst/ Exq/ Engineer/ Mission Bhagiratha Dept/ 16 Lak P.A/5'4"/ఎత్తు/25 సం॥/ అందమైన వధువుకు వరుడు కావలెను. 7207233788 [H-801608]

క్రిస్టియన్ మాల: B.Tech/NIT/C.Govt/ Excise/ Inspector/Customs Dept/1 lak P.m/5.5/ ఎత్తు/25 సం॥/ అందమైన వధువుకు వరుడు కావలెను.7207233788 [H-801608]

యాదవ్/ఎగ్రికాళ అప్పర్ మిడిల్/ 37/ 5'4" ఎత్తు / యం.ఫార్మసీ వధువుకి Hydలో జాబ్ కల్గి, లక్ష రూ. PM ఆపై ఆదాయం కలిగిన యాదవ్ వరుడు మాత్రమే కావలెను. డైరెక్ట్ పార్టీ ఫోన్: 9989597799 [H-801686]

★

కమ్మ/28yrs/5'5"/B.Tech (ECE) SWE Job 19L PA. రెడ్డి/26yrs/5'3"/BA.LLB/SWE Job 1L PM / అందమైన వధువులకు కెనడా/ USA/ NRI వరులు కావలెను. Ph: 8142445422 [HA-746]

వేదికలు



రజక వివాహవేదిక: (Estd-1994) డాక్టర్స్, ఇంజినీర్స్, Govt Jobs ABROAD సంబంధాలకై సంప్ర॥ కోట్ల శ్రీనివాస్ Ph: 8106303155, 9391265304 [H-804850]

వయసు, చిరునామా, ఉద్యోగం ధ్రువీకరించబడిన అన్ని వర్గాల వధూవరుల సంబంధాలకై www.Trustedmatrimony.in లో Reg. చేసుకోండి. 9966464141 (తక్కువ చార్జీలు). [HA-2382]

"శుభమస్తు" మ్యారేజ్ బ్యూరో TM Estd: 1995 గౌడ, ఈడిగ, శెట్టిబలిజ, 1st/2nd, లేట్/విడో సంబంధాలకై సం॥ లింగాల కాంప్లెక్స్ DSNR, HYD వ్యవస్థాపకులు : Late S.సారయ్య గౌడ్. సం॥ S.రాములు గౌడ్. 8790690309 [H-800467]

సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర: 8688006130 [H-799834]

క్రైస్తవ వివాహ పరిచయ వేదిక. ఏప్రిల్ 17, ఉ.10-సా.4 గం. వరకు సికింద్రాబాద్ YMCAలో ప్రొఫైల్స్ వాట్సాప్ చేయండి. 7330957771 www.christianholymatrimony.com [HA-97068]

Personal Service- అన్ని కులాలు, అన్ని జిల్లాలు సాఫ్ట్‌వేర్స్, డాక్టర్స్,అబ్రాడ్ మొదటి, రెండవ, లేట్ మ్యారేజ్‌లు తొందరగా చూడబడును. పూర్ణ మ్యాట్రిమని, తిరుపతి, 7093722724. [T-2925]

పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ.తెనాలి (గుంటూరు జిల్లా) వారి 13వ వివాహ పరిచయ వేదిక కార్యక్రమము 28.04.2024 ఆదివారము ఉ.9 గం.ల నుండి. 9963924665, 9849851322. [T-244]

Kamma, Kapu పెళ్లి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032712544 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14273]

Madiga - Mala పెళ్లి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14273]

Reddy పెళ్లి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032712544 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14273]

Brahmin, Padmashali పెళ్లి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032712544 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14273]

Christian పెళ్లి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14273]

★

కులప్రసక్తిలేని 1వ & 2వ, లేట్, విడో, డైవర్స్, పెన్షనర్స్ వెరిఫైడ్ ప్రొఫైల్స్‌తో అన్ని కులాలకు త్వరగా సంబంధాలు చూడబడును. SC మాల, మాదిగ స్పెషల్ సంబంధాలు కలవు. Ph:8142445422 [HA-746]


14/04/2024 బ్రాహ్మణ వధూ-వరుల స్వయంవరం (online)Free Registration bhavanimatrimony, Hyd. 9704656103/ (9533608887-Whatsapp No) [HA-785]

మాదిగలకు పెద్దపీట వేస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాజకీయంగా మాదిగలకు ఎలాంటి నష్టం కలగకుండా భవిష్యత్తులో పెద్దపీట వేసే బాధ్య త తనదని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ, గౌరవాధ్యక్షుడు సండ్రపల్లి వెంకటయ్యల ఆధ్వర్యంలోని కోర్ కమిటీ శనివారం సీఎంను కలిసింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మాదిగలకు రాజకీయంగా కీలక బాధ్యతలు అప్పగించే బాధ్యత తనదని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల వర్గీకరణ కోసం పూర్తి స్థాయిలో కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

ఎస్సీ వర్గీకరణపై సీఎంకు వినతి



సీఎం రేవంత్‌రెడ్డికి డప్పును బహూకరించిన మాదిగ సంఘాల నేతలు

బంజారాహిల్స్ (హైదరాబాద్): మాదిగల చిరకాల ఆకాంక్ష అయిన ఎస్సీ వర్గీకరణకు కృషి చేయాలంటూ టీఎమ్మార్పీ ఎస్,టీఎంహెచ్‌డీ సంఘాల ప్రతినిధులు శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ, టీఎమ్మార్పీఎస్ యువసేన అధ్యక్షుడు నల్ల శివమాదిగ, టీఎంహెచ్‌డీ వ్యవస్థాపక అధ్యక్షుడు జున్ను కనకరాజు మాదిగ నేతృత్వంలో మాదిగ సంఘాల నేతలు సీఎంను కలిసి మాదిగలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మాదిగల సంక్షేమం కోసం తాము రూపొందించిన 10 డిమాండ్ల పత్రాన్ని సీఎంకు అందజేశామని తెలిపారు.

ప్రమాదం ఎలా జరిగింది?

- ఎస్‌బీ ఆర్గానిక్స్ పేలుడు కేసులో లోతైన దర్యాప్తు
- డీఆర్‌డీఓ, ఐఐసీటీ సంస్థల సహకారం కోరిన పోలీసుశాఖ
- 40 చోట్ల రసాయన అవశేషాల శాంపిల్స్ సేకరించిన ఫోరెన్సిక్ విభాగం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఎస్‌బీ ఆర్గానిక్స్‌లో పదిరోజుల కిందట జరిగిన అగ్నిప్రమాద ఘటన కేసు దర్యాప్తులో ఆసక్తికర అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇది మంటల వ్యాప్తితో జరిగిన అగ్ని ప్రమాదం కాదని, పేలుడు వల్ల జరిగిన విస్ఫోటన మని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఈ పరిశ్రమలో పేలుడుకు పదార్థాల (ఎక్స్ ప్లోసివ్)కు సంబంధించిన ఉత్పత్తుల కార్యక లాపాలు జరిగినట్లు భావిస్తున్నారు. ఈ పరిశ్రమకు ఏ రకమైన ఉత్పత్తులు తయారు చేసుకునేందుకు అనుమతులు ఉన్నాయి.. ఇక్కడ ఏ ఉత్పత్తులకు సంబంధించిన కార్యకలాపాలు జరిగాయి.



ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమ శిథిలాలు (ఫైల్ ఫొటో)

అనే కోణంలో పరిశీలిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా చందాపూర్‌లో ఉన్న ఈ పరిశ్రమలో ఈనెల 3న జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో ఆరుగురు సజీవ దహనమైన విషయం విదితమే. సుమారు 17 మందికి తీవ్ర గాయాలు కాగా, మరో 20 మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రియాక్టర్ పేలిన ఘటనలో ఈ ఫ్యాక్టరీ పూర్తిగా శిథిలమైపోయింది. చుట్టు పక్కల ఉన్న భవనాలు కూడా దెబ్బతిన్నాయి. ఎక్స్‌ప్లోసివ్ (పేలుడు పదార్థాల)కు సంబంధించిన కార్యకలాపాలు ఈ ఫ్యాక్టరీలో జరిగాయనే దానిపై నిర్ధారణకు వచ్చారు.

డీఆర్‌డీవో సహకారం కోరిన పోలీసులు

ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టేందుకు పోలీసులు రక్షణశాఖకు సంబంధించిన డీఆర్‌డీఓ (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్) సహకారాన్ని కోరారు. ఈ మేరకు పోలీసుశాఖ డీఆర్‌డీఓకు లేఖ రాసింది. అలాగే ఈ ఘటనా స్థలాన్ని పరిశీలించేందుకు ఓ బృందాన్ని పంపాలని పోలీసులు ఐఐసీటీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ) సంస్థకు కూడా లేఖ రాశారు.

40 శాంపిల్స్ సేకరణ..

ఫ్యాక్టరీలో జరిగిన పేలుడు కారణంగా చెల్లాచెదురైన శిథిలాల నుంచి కెమికల్స్‌కు సంబంధించిన శాంపిల్స్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్ అధికారులు సేకరించారు. మొత్తం 40 చోట్ల ఈ శ్యాంపిల్స్‌ను సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్‌లో పరిశీలిస్తున్నారు. ఈ కేసులో లోతైన విచారణ జరుపుతున్నామని సంగారెడ్డి ఎస్పీ సీహెచ్.రూపేష్ 'సాక్షి' ప్రతినిధితో చెప్పారు.

బొగ్గు కార్మికులకు కనీస పెన్షన్ ఇకపై రూ. వెయ్యి

- కేంద్ర బొగ్గు శాఖ నోటిఫికేషన్
- ఇప్పటివరకు రూ. 250/350 మాత్రమే
- పెంచింది వెయ్యేనా.. అంటూ రిటైర్డ్ కార్మికుల అసంతృప్తి



సాక్షి, హైదరాబాద్: రిటైర్డ్ బొగ్గు గని కార్మికుల కనీస పెన్షన్ రూ.1000కి పెరిగింది. ఈ మేరకు 'ది కోల్ మైన్స్ పెన్షన్ స్కీమ్–1998'కి సవరణలను ప్రకటిస్తూ గత నెల 8న కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటి వరకు కొన్ని కేటగిరీల కార్మికులకు కనీస పెన్షన్ రూ.250 ఉండగా, మరికొన్ని కేటగిరీల వారికి రూ.350 ఉంది. పెరిగిన పెన్షన్ మార్చి 2024 నుంచి అమల్లోకి వచ్చింది. నామమాత్రంగా ఉన్న బొగ్గు గని కార్మికుల పెన్షన్‌ను పెంచాలని దేశ వ్యాప్తంగా ఉన్న పెన్షనర్స్ అసోసియేషన్లు సుదీర్ఘకాలంగా పోరాడుతున్నాయి. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిన ప్రస్తుత తరుణంలో కేవలం రూ.వెయ్యికి పెంచుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయం పట్ల రిటైర్డ్ కార్మికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పదవీ విరమణ చేసిన బొగ్గు ఉద్యోగుల కుటుంబాలు రూ.1000 పెన్షన్‌తో ఎలా జీవించాలని ప్రశ్నిస్తున్నారు. బొగ్గు మంత్రిత్వ శాఖలోని పెన్షన్ల సవరణ కమిటీ కేవలం రూ.వెయ్యి పెంచుతూ ఎలా సిఫార్సు చేస్తుందని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజు రాంచందర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. బొగ్గును వెలికితీసి దేశానికి వెలుగులు అందిస్తున్న బొగ్గు గని కార్మికులు రిటైర్మెంట్ తర్వాత తమ జీవితపు చరమాంకంలో తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా పెంచాలనీ, కరువు భత్యం సైతం చెల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

21న 'సమూహ గానం'

సెక్యులర్ రైటర్స్ ఫోరమ్ ప్రకటన

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 21న ఉదయం 9 నుంచి రాత్రి 9 దాకా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని దొడ్డి కొమురయ్య హాలులో ప్రజాస్వామిక, లౌకిక, రాజ్యాంగ విలువల పరి రక్షణ కోసం 178 మంది కవులు, వాగ్గేయకారులతో సమూహగానం నిర్వహిస్తు న్నట్టు సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరమ్ ప్రకటించింది. దేశ రాజ్యాంగం ప్రమాదంలో పడి, ప్రజాస్వామ్య వాదులు ఆందోళన చెందుతున్న సందర్భంగా రాజ్యాంగంతోపాటు దేశాన్ని రక్షించుకునే ప్రయత్నం జరుగుతోందని ఓ ప్రకటనలో పేర్కొంది. కొన్ని రాష్ట్రా ల్లోని పౌరసమాజం ఇప్పటికే ఆ పనిలో నిమగ్నం కాగా తెలుగు కవులు, వాగ్గేయకారులుగా తమ భావాలు ప్రకటించనున్నట్టు తెలిపింది. ప్రశ్నించే గొంతులను కాపాడుకోవడం వంటి ఎన్నో అంశాలపై కవిత్వం, పాటలతో సాహిత్యకారులుగా తమ వంతు కృషి చేయనున్నట్టు తెలియజేసింది. ప్రముఖ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత డా.కె.శివారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొననున్న ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో కవులు, కళాకారులు, వాగ్గేయకారులు పాల్గొంటారని తెలిపింది.




ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అదనపు ఫిట్‌మెంట్‌తోపాటు పెరిగిన పెన్షన్‌ను కూడా అందజేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ బోర్డు రిటైర్డ్ అసోసియేషన్ (రిజిస్టర్డ్ నం: 375), జేఎన్‌టీ ఆఫీస్ బేరర్లు శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. సీఎంను కలిసిన వారిలో అసోసియేషన్ నేతలు వీఎస్ సుందర్‌రావు, రఘురామరెడ్డి, కల్వల సత్యనారాయణరావు, వెంకట్ రెడ్డి, జనార్ధన్, విద్యాపతి రామచందర్ ఉన్నారు.



మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి ధన్యవాదాలు తెలిపిన వివిధ జిల్లాలకు చెందిన మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు. చిత్రంలో మంత్రి పొన్నం

ఓటుహక్కు వినియోగంపై అంబేడ్కర్ సూచనలు

శిరోధార్యం కావాలి: కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: ఓటుహక్కు ద్వారా పోరాడి రాజులవుతారో, అమ్ముడు పోయి బానిసలవుతారో మీరే నిర్ణయించుకోవాలి'అని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన సూచన ప్రజలందరికీ శిరోధార్యం కావాలని మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. అంబేడ్కర్ ఆశయాలు, సిద్ధాంతాలు ప్రాతిపదికగా కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం శ్రేయోరాజ్య స్థాపనకు అహర్నిశలు శ్రమిస్తున్నదని పేర్కొన్నారు. ఆదివారం భారత రాజ్యాంగ నిర్మాత, సంఘసంస్కర్త, ఆర్థికవేత్త, అపర మేధావి బాబా సాహెబ్ అంబేడ్కర్ 133వ జయంతి సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను శనివారం ఓ ప్రకటనలో కొనియాడారు.

లిక్కర్ స్కాంలోకి ఎలా వచ్చారు?

- ఎవరి ప్రోద్బలంతో అడుగులు వేశారు
- ఢిల్లీ మద్యం కేసులో ఎమ్మెల్సీ కవితను ప్రశ్నించిన సీబీఐ
- ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ పేరును ప్రస్తావిస్తూ ప్రశ్నలు
- రెండున్నర గంటలపాటు విచారించిన అధికారులు


సీబీఐ కార్యాలయం వద్ద కవిత భర్త అనిల్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై సీబీఐ ప్రశ్నల వర్షం కురిపించింది. అసలు ఈ లిక్కర్ స్కాంలోకి ఎవరి ప్రోద్బలంతో వచ్చారనే ప్రశ్నతో సీబీఐ శనివారం విచారణను ప్రారంభించింది. ఈ స్కాంలో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఇతర ఆప్ నేతలు, హైదరాబాద్‌కు చెందిన వ్యాపార వేత్త అరుణ్ పిళ్లై, పారిశ్రామిక వేత్త శరత్‌చంద్రారెడ్డి, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, సమీర్ మహేంద్రు, విజయ్‌నాయర్, దినేష్‌ల పాత్రపై, వీరికి కవితతో ఉన్న సంబంధాలు, ఆర్థిక లావాదేవీలపై కవితను విచారించింది. రూ.100 కోట్ల నగదు చేతులు మారిందని, దీన్ని గోవా ఎన్నికల్లో ఖర్చు చేశారని, ఎవరెవరు ఎంత ఇచ్చారు, ఎంత అందుకున్నారు అనే అంశాలను శుక్రవారం సీబీఐ కోర్టుకు తెలిపింది. వీటిపైనా శనివారం సీబీఐ కవితను ప్రశ్నించింది.

ఏ ఆఫర్ ఇస్తే ఒప్పుకున్నారు?

ఢిల్లీలోని సీబీఐ కార్యాలయంలో మహిళా అధికారి సమక్షంలో ముగ్గురు అధికారులు కవితను రెండున్నర గంటలపాటు విచారించారు. ఈ స్కాంలో మీరే కింగ్‌పిన్‌గా ఉన్నారని ఇప్పటికే పలువురు వాంగ్మూలం ఇచ్చిన విషయాన్ని కవితకు గుర్తు చేశారు. లిక్కర్ స్కాం విషయమై ముందుగా మిమ్మల్ని ఎవరు కలిశారు? ఏ ఆఫర్ ఇస్తే మీరు ఒప్పుకున్నారు? రూ.100 కోట్లకు సంబంధించి ఎవరెవర్ని ఏవిధంగా భాగస్వాముల్ని చేశారో చెప్పాలని ప్రశ్నించినట్లు సమాచారం. తాను ఎవర్నీ భాగస్వాముల్ని చేయలేదని, ఎవర్నీ భయపెట్టలేదని, ఎవరి నుంచి ముడుపులు అందుకోలేదని కవిత బదులిచ్చినట్లుగా తెలిసింది. లిక్కర్ స్కాంతో మీకు సంబంధం లేకపోతే వ్యాపారవేత్త శరత్‌చంద్రారెడ్డిని భయపెట్టాల్సిన అవసరమేంటని ప్రశ్నించినట్లు సమాచారం.

మొబైల్స్‌ను ఎందుకు ధ్వంసం చేశారు?

ఈ వ్యవహారంలో ఏ ఆధారాలు లభించకుండా జాగ్రత్తలు తీసుకున్న మీరు సమీర్ మహేంద్రుతో ఫేస్ టైమ్ ఆడియో కాల్ ద్వారా ఏం మాట్లాడారని సీబీఐ కవితను ప్రశ్నించినట్లు తెలిసింది. అదేవిధంగా కేజ్రీవాల్‌తో ఫేస్ టైమ్ ఆడియో కాల్ ద్వారా మాట్లాడారా? అంటూ ప్రశ్నించినట్లు సమాచారం. 'ఢిల్లీలోని ఒబెరాయ్ హోటల్లో అరుణ్ పిళ్లై, విజయ్‌నాయర్, దినేష్‌లను మీరు కలిసినట్లుగా దినేష్ ఆరోరా వాంగ్మూలంలో చెప్పాడు... ఆ సమయంలో మీరు వారిని కలిసి రూ.100 కోట్ల ముడుపుల విషయంపై చర్చించినట్లు తెలిసింది. కేజ్రీవాల్ నుంచి మీకు ఏదైనా సమాచారం వచ్చిందా? ఆప్ నేతలు ఎవరెవరు కేజ్రీవాల్ పేరును మీ వద్ద ప్రస్తావించారు? మీరు తప్పు చేయనట్టితే మొబైల్ ఫోన్లను ధ్వంసం చేయాల్సిన అవసరం ఏంటి' అంటూ సీబీఐ ప్రశ్నించినట్లు సమాచారం.

కవితతో.. భర్త, న్యాయవాది భేటీ

సీబీఐ విచారణ ముగిసిన తర్వాత కవితను సీబీఐ కార్యాలయంలో భర్త అనిల్, న్యాయవాది మోహిత్‌రావు, పీఏ శరత్ కలిశారు. సీబీఐ విచారించిన విషయాలపై అనిల్, మోహిత్‌రావు సుదీర్ఘంగా చర్చించారు. కవిత క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్న అనిల్.. ఆమెకు ధైర్యం చెప్పారు. న్యాయం దిశగా అడుగులు వేద్దామని భరోసా ఇచ్చారు. కవితను సోమవారం సీబీఐ కోర్టులో హాజరుపరచనున్న నేపథ్యంలో వాదించాల్సిన విషయాలపై మోహిత్‌రావు కవితతో చర్చించినట్లు తెలిసింది.

నిండుకుండ.. 30 ఏళ్లుగా అండ

ఎండిపోని భూదాన్‌పోచంపల్లి పెద్దచెరువు



భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పెద్ద చెరువు 30 ఏళ్లుగా నిండుకుండగా ఉంది. తీవ్ర వర్షాభావ పరిస్థితులున్నా.. ఈ చెరువు ఎప్పుడూ ఎండిపోలేదు. దివంగత ఎలిమినేటి మాధవరెడ్డి హయాంలో మూసీనది నుంచి పెద్దగూడెం, జూలూరు, కప్రాయిపల్లి, గౌస్‌కొండ, ముక్తాపూర్ గ్రామాల మీదుగా పోచంపల్లి వరకు కాలువను ఏర్పాటు చేయించారు. అప్పటి నుంచి మూసీ నుంచి కాలువ ద్వారా ఏడాది పొడవునా సాగునీరు వస్తుండటంతో చెరువు నిండి కళకళలాడుతోంది. చెరువు కింద సుమారు 500 మందికి పైగా రైతులు 800 ఎకరాలలో వరిసాగు చేస్తున్నారు. ఏటా వానాకాలం, యాసంగిలో రెండు పంటలు వరిసాగు చేస్తున్నారు. ఇక్కడి రైతులు 30 ఏళ్లుగా కరువు అనేది ఎరుగరు.

క్లుప్తంగా...

హిందూధర్మ పరిరక్షణే ధ్యేయం

విశాఖ శ్రీశారదా పీఠాధిపతి శ్రీస్వరూపానందేంద్ర


జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించిన శ్రీస్వరూపానందేంద్ర

బంజారాహిల్స్ (హైదరాబాద్): హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా విశాఖ శ్రీశారదా పీఠం నిరంతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తోందని విశాఖ శ్రీశారదా పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి స్పష్టం చేశారు. శ్రీశారదా పీఠం ఉత్తరాధికారి శ్రీస్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామితో కలిసి శనివారం ఆయన జూబ్లీహిల్స్‌లోని టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆయనకు ఆలయ ఈవో, అర్చకులు వేద మంత్రోచ్చరణల మధ్య పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర ముందుగా ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకున్నారు. అర్చకులు స్వామి వారి ప్రసాదాన్ని, శేష వస్త్రాన్ని ఆయనకు అందజేశారు. అనంతరం జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ తల్లి ఆలయానికి వెళ్లారు. తెలంగాణ దేవాదాయ, ధర్మాదాయ శాఖాధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీస్వరూపానందేంద్ర ఆశీర్వచనాలు అందజేశారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధి

సీఎం రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ 133వ జయంతి (ఏప్రిల్ 14వ తేదీ)ని పురస్కరించుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయన సేవలను స్మరించుకున్నారు. బడుగు, బలహీన వర్గాలు, మహిళల సాధికారతకు పాటుపడిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. దేశ భవిష్యత్తును ముందుగానే ఊహించి దార్శనికతతో రాజ్యాంగాన్ని రూపొందించిన అంబేడ్కర్ భావితరాలకు స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. ప్రజల హక్కుల కోసం పోరాడి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ కట్టుబడి ఉండాలని, ఆయన రూపొందించిన రాజ్యాంగమే తెలంగాణ రాష్ట్రానికి జీవం పోసిందని గుర్తు చేసుకున్నారు. ఆయన స్ఫూర్తితోనే ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి పాటు పడుతుందని అన్నారు. దళితుల అభ్యున్నతిలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్రం అంబేడ్కర్ పుణ్యమే: కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగంలో అంబేడ్కర్ పొందుపరిచిన ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిందని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర రావు తెలిపారు. అందుకే తెలంగాణ సచివాలయానికి డా బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయంగా పేరు పెట్టడంతో పాటు 125 అడుగులతో ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన విగ్రహాన్ని నెలకొల్పామని గుర్తు చేశారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సమ సమాజ నిర్మాణం కోసం అంబేడ్కర్ చేసిన కృషిని కేసీఆర్ స్మరించుకుంటూ ఓ ప్రకటన విడుదల చేశారు. దళిత బహుజన వర్గాల ప్రగతి కోసం తాము అమలు చేసిన పథకాలకు విఘాతం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందనీ, అవి కచ్చితంగా కొనసాగించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు.

అయోధ్యకు హైదరాబాద్ కడాయిలు

- శ్రీరామ నవమి నుంచి ప్రారంభించే అవకాశం


అయోధ్య రామాలయానికి అందజేయనున్న కడాయిలు

కంటోన్మెంట్ (హైదరాబాద్): అయోధ్య బాలరాముడి ప్రసాదాలను ఇకపై హైదరాబాదీ 'కడాయి'లోనే తయారు చేయనున్నారు. నగరానికి చెందిన నలుగురు దాతలు ఓల్డ్ సిటీలో ప్రత్యేకంగా తయారు చేయించిన ఏడు కడాయిలను శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు అందజేశారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని ఈ కడాయిల ద్వారా లడ్డూ, ఇతరత్రా ప్రసాదాలను తయారు చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నారు. ఏడు కడాయిలను ఇప్పటికే రోడ్డు మార్గం ద్వారా అయోధ్యకు తరలించారు.

లడ్డూ అందజేయడంతో...

పికెట్‌కు చెందిన శ్రీరామ్ కేటరింగ్ సర్వీసెస్ యజమాని నడిమింటి నాగభూషణంరెడ్డి, అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా నైవేద్యం లడ్డూతో పాటు, 1,265 కిలోల భారీ లడ్డూను ఆలయానికి సమర్పించారు. ఈ లడ్డూ నాణ్యత, రుచి బాగుండటంతో, వీటిని తయారు చేసే పద్ధతిని తెలియజేయడంతో పాటు అందుకు అవసరమైన కడాయిలను సైతం తమకు అందించాలని ట్రస్టు సభ్యులు నాగభూషణంరెడ్డిని కోరారు. దీంతో ఆయన తన మిత్రులు బి.ప్రేమ్‌కుమార్, నరేంద్రనాథ్, ఉమామహేశ్వర్‌ల సహకారంతో పాతబస్తీలో ఏడు ప్రత్యేకమైన కడాయిలను తయారు చేయించారు. బుధవారం వీటిని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు అందజేయడంతో పాటు లడ్డూ, ప్రసాదాల తయారీతో లాంఛనంగా ప్రారంభించనున్నారు.

మీ అందరినీ చంపేస్తాం

చర్లపల్లి జైలులో ఖైదీల హల్‌చల్

- వారికి వారే గాయపరుచుకొని ఆసుపత్రికి తరలించాలంటూ డిమాండ్
- లేదంటే చంపేస్తామంటూ జైలు సిబ్బందికి బెదిరింపులు
- మత్తు పదార్థాల కోసమే ఖైదీల డ్రామాలంటున్న జైలు అధికారులు
- తారస్థాయికి చేరిన ఖైదీల ఆగడాలు
- కఠినంగా వ్యవహరిస్తామంటున్న అధికారులు

కుషాయిగూడ: చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఖైదీలు హల్‌చల్ చేశారు. ఓ బ్యారక్‌లో ఉండే ఖైదీలు వారికి వారే గాయపరుచుకొని తమను ఆసుపత్రికి తరలించాలని డిమాండ్ చేస్తూ జైలు సిబ్బందిపై బెదిరింపులకు పాల్పడ్డారు. శుక్రవారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. జైలులోని మహానది బ్యారక్‌లో ఉండే ఇబ్రహీం, జాకీర్, జాయిద్, ఫరీద్‌తో పాటుగా మరో ఖైదీ.. మర్డర్, కిడ్నాప్, బెదిరింపుల వంటి కేసుల్లో నిందితులుగా ఉన్నారు. చంచల్‌గూడ జైలు నుంచి రెండు నెలల క్రితమే చర్లపల్లి జైలుకు వచ్చారు. శుక్రవారం రాత్రి సమయంలో ఒకే బ్యారక్‌లో ఉన్న వారంతా ఒకరినొకరు గాయపరుచుకొని నానా హంగామా చేయడం మొదలుపెట్టారు. తమను ఆసుపత్రికి తీసుకెళ్లాలంటూ జైలు సిబ్బందిని ఒత్తిడి చేశారు. విధుల్లో ఉన్న సిబ్బంది సమాచారంతో జైలు పర్యవేక్షణాధికారి, ఇతర అధికారులు అక్కడికి వెంటనే చేరుకున్నారు. తమను ఆసుపత్రికి తరలించకుంటే మీ అందరినీ చంపేస్తామంటూ ఖైదీలు ఏకంగా అధికారులనే బెదిరించడం మొదలుపెట్టారు. దీంతో జైలు అధికారులు తమదైన శైలిలో ఖైదీలను నియంత్రించి వేర్వేరు బ్యారక్‌లకు తరలించినట్లు తెలిసింది.

మత్తు పదార్థాలకు బానిసలై..

ఈ విషయంపై జైలు పర్యవేక్షణాధికారి సంతోష్‌కుమార్ రాయ్‌ను వివరణ కోరగా, జరిగిన ఘటన వాస్తవమేనన్నారు. వీరంతా గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలన్నారు. చంచల్‌గూడ జైల్‌లో కూడా ఇదే తరహాలో డ్రామాలు చేసి రెండు నెలల క్రితమే చర్లపల్లి జైల్‌కు వచ్చారని తెలిపారు. చిన్న చిన్న గాయాలు చేసుకుంటూ గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులకు తరలించాలని జైలు అధికారులపై ఒత్తిడి తీసుకురావడం.. అలా ఆసుపత్రులకు వెళ్లి వారికి కావాల్సిన ఆహారంతో పాటుగా మత్తు పదార్థాలను తెప్పించుకొని జల్సాలు చేయడం అలవాటుగా మారిందన్నారు. ఇది సరైన పద్ధతి కాదని పలుమార్లు కౌన్సెలింగ్ చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. చివరికి జైలు అధికారులనే బెదిరించే స్థాయికి వారి ఆగడాలు పెరిగిపోయాయన్నారు. వీటిని ఏ మాత్రం ఉపేక్షించేది లేదని ఇలాంటి ఖైదీల పట్ల కఠినంగానే వ్యవహరిస్తామని జైల్ పర్యవేక్షణాధికారి సంతోష్‌కుమార్ స్పష్టం చేశారు.

'సాక్షి' ఆధ్వర్యంలో ఈఏపీసెట్, నీట్ మాక్‌టెస్టులు

- ఈ నెల 27న నీట్.. 28న ఈఏపీసెట్



సాక్షి, ఎడ్యుకేషన్: ఎక్కువ మంది విద్యార్థుల లక్ష్యం ఇంజనీరింగ్ లేదా మెడిసిన్. అధికశాతం మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉజ్వల భవిష్యత్‌ను అందించే ఇంజనీరింగ్, మెడికల్ కోర్సుల్లో చేర్పించాలని కోరుకుంటున్నారు. అందుకు ఖర్చులకు వెనుకాడకుండా పిల్లలను కోచింగ్‌లో చేర్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్.. అలాగే తెలంగాణలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్ తదితర కోర్సుల్లో అడ్మిషన్ కల్పించే ఈఏపీసెట్‌కు లక్షలమంది విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు చేయూత నిచ్చేలా నిపుణుల ఆధ్వర్యంలో ఈఏపీసెట్, నీట్ పరీక్షలకు సాక్షి మీడియా మాక్‌టెస్టులు నిర్వహించనుంది. టెక్నాలజీ పార్ట్‌నర్ మై ర్యాంక్ వ్యవహరించనుంది. పరీక్షకు కొద్ది రోజుల ముందు వాస్తవ పరీక్షలాంటి వాతావరణంలో జరిగే సాక్షి మాక్ టెస్టులు రాయడం ద్వారా విద్యార్థులు తమ ప్రిపరేషన్ స్థాయిని అంచనా వేసుకుని, మరింత మెరుగుపరచుకోవచ్చు. ఆసక్తిగల అభ్యర్థులు https:// www.are naone.in/mock ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.250. రిజిస్ట్రేషన్‌కు ఏప్రిల్ 22 చివరి తేదీ. రిజిస్టర్ చేసుకున్న ఈమెయిల్‌కు పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్ నెంబర్ వస్తుంది. ఏప్రిల్ 27న నీట్, ఏప్రిల్ 28న ఈఏపీసెట్ అగ్రికల్చర్, ఇంజనీరింగ్ పరీక్షలుంటా యి. ఈ ఆన్‌లైన్ టెస్ట్ ఉదయం 6 నుంచి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. ఈ సమయంలో ఎప్పుడైనా రాసుకోవచ్చు. పరీక్షా సమయం 3 గంటలు. ఈ పరీక్షలను మీ హాల్ టికెట్ నెంబర్ (యూజర్ నేమ్), ఫోన్ నెంబర్ (పాస్‌వర్డ్)తో ఆ సమయంలో ఎప్పుడైనా లాగిన్ అయి రాసుకోవచ్చు. అలాగే పరీక్ష ముగిసిన వెంటనే మీ స్కోర్‌ను కూడా మీరు చూసుకోవచ్చు. మాక్ పరీక్షలను https://sakshimocktest.myrank.co.in వెబ్‌సైట్‌లో నిర్వహిస్తారు. టెస్ట్‌కి సంబంధించిన 'కీ'ని ఏప్రిల్ 30న ఇదే వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. పూర్తి వివరాలకు సంప్రదించాల్సిన నంబర్లు: 95055 14424, 96660 13544, 96665 72244.




వైశాఖీ సంబరం

అమీర్‌పేట గురుద్వారాలో శనివారం సిక్కుల సంప్రదాయ వైశాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి తలసాని తదితరులు హాజరై సిక్కు సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భారీ ప్రదర్శనలు నిర్వహించారు. -అమీర్‌పేట

ఈ నెల 20 నుంచి హెచ్‌సీఏ వేసవి శిక్షణ శిబిరాలు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నారు. నగరంలోని ఐదు కేంద్రాల్లో ఈ శిబిరాలను ఏర్పాటు చేశామని, ఇందులో చిన్నారులకు నెల రోజులపాటు ఉచితంగా క్రికెట్‌లో శిక్షణ ఇస్తామని హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్ మోహన్ రావు తెలిపారు. ప్రతి శిబిరంలో 80 నుంచి 100 మందికి అవకాశమిస్తామని... బాలురకు అండర్-14, అండర్-16, అండర్-19 వయో విభాగాల్లో... బాలికలకు అండర్-15, అండర్-19 వయో విభాగాల్లో శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశామని జగన్ మోహన్ రావు వివరించారు. ఆసక్తి గలవారు ఈనెల 15 నుంచి 18వ తేదీలోపు ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. హైదరాబాద్‌లోని ఐదు కేంద్రాల్లో (జింఖానా; మొబైల్: 90301 30346, ఫలక్‌నామా: 98852 95387; అంబర్‌పేట: 98665 82836; లాలాపేట: 99664 62667; మాదాపూర్: 80195 35679) శిబిరాలు నిర్వహిస్తారు. మరిన్ని వివరాల కోసం హెచ్‌సీఏ అధికారిక వెబ్‌సైట్ (http://www.hycricket.orf)ను సందర్శించి, తెలుసుకోవచ్చు.

'క్విక్' డెలివరీతో పోటీ

కిరాణా హైరానా

▶ మొదటి పేజీ తరువాయి

జొమాటో(బ్లింకిట్), ఇన్‌స్టా మార్ట్ (స్విగ్గీ) తదితరాలతో కిరాణా దుకాణాలకు పోటీ తప్పడం లేదు. నిమిషాల్లోనే డెలివరీ చేసే ఈ-కామర్స్ బిజినెస్ క్రమంగా దేశంలో పుంజుకుంటోంది. ప్రపంచవ్యాప్తంగా వేగంగా చోటుచేసుకుంటున్న మార్పుచేర్పుల్లో భాగంగా ఫాస్ట్ ఫుడ్ నుంచి ఫాస్ట్ ఇంటర్నెట్ వరకు.. ఇన్‌స్టంట్ మెసేజింగ్ నుంచి ఆన్-డిమాండ్ స్ట్రీమింగ్ వరకు వివిధరకాల వినియోగదారులు వేగవంతమైన సేవలు కోరుకుంటున్నారు. ఈ-కామర్స్, క్యూ-కామర్స్ ద్వారా కిరాణా వస్తువులు మొదలు ఎలక్ట్రానిక్ పరికరాలు, వస్తువులు, రెడిమేడ్ దుస్తులు, అత్యవసరమైన మందుల దాకా కొద్దినిమిషాల వ్యవధిలోనే డోర్ డెలివరీ కావాలని కస్టమర్లు ఆశిస్తున్నారు. దీంతో ఈ తరహా వేగవంతమైన డెలివరీ సిస్టమ్ అందిస్తున్న ఈ-కామర్స్ సంస్థల నుంచి ప్రధానంగా సంప్రదాయ కుటుంబపరమైన వ్యాపారంలో భాగంగా ఉన్న కిరాణా మర్చంట్స్, వ్యాపారులు తీవ్రమైన పోటీని ఎదుర్కోక తప్పడం లేదు.

సాంకేతికత సాయంతో సత్వరమే...


క్యూ-కామర్స్ ఆన్-డిమాండ్ విధాన వినియోగంతోపాటు కృత్రిమమేధ ఆధారంగా అల్గారిథమ్‌లు, ఇతర అత్యాధునిక సాంకేతికతలను ఉపయోగించడం ద్వారా అత్యంత వేగంగా వినియోగదారులకు ఆర్డర్లు చేరవేస్తున్నారు. స్థానిక మైక్రో-వేర్‌హౌస్‌లను ఉపయోగించడం ద్వారా రిటైలర్లు వేగంగా డెలివరీ చేయడంతోపాటు రవాణా ఖర్చులను తగ్గించేందుకు దోహదపడుతున్నారు. కస్టమర్ల నుంచి వచ్చే ఆర్డర్ల ప్రాసెసింగ్ వేగవంతం చేసి, లోటుపాట్లు, లోపాల తగ్గింపునకు ఈ విధానం రోబొటిక్‌లను కూడా ఉపయోగిస్తున్నాయి.

పోటీని తట్టుకునేలా 'కిరాణా' కొత్త ఆలోచనలు

దేశవ్యాప్తంగా ఉన్న 1.20 కోట్ల సంప్రదాయ కిరాణాస్టోర్‌లలో సగం దాకా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. దేశవ్యాప్తంగా క్యూ-కామర్స్ చురుగ్గా సాగుతున్న పది నగరాల్లో దాదాపు మూడోవంతు రిటైలర్ల వ్యాపారాలు 35 శాతం దాకా వీటి ద్వారా ప్రభావితమైనట్టు ఆన్‌లైన్ కమ్యూనిటీ నైబర్‌హుడ్ షాప్స్ కిరణ్‌క్లబ్ నివేదిక తేల్చింది. ప్రస్తుతానికి కిరాణా వ్యాపారాలపై క్యూ-కామర్స్ ప్రభావం పరిమితంగా ఉన్నా రానున్న రోజుల్లో ఇది పెరిగితే తట్టుకునేందుకు వీలుగా కిరాణా దుకాణదారులు కొత్త ఆలోచనలు చేస్తున్నారు. క్యూ-కామర్స్, ఇతర డెలివరీ యాప్‌లను నియంత్రించేలా సిద్ధమయ్యారు.

- కస్టమర్లకు ఉచిత హోండెలివరీ సౌకర్యం పెంచడం, ఎక్కువ మంది పనివారిని నియమించుకొని వేగంగా వినియోగదారుల ఇళ్లకు (గంటలోపే) వస్తువుల చేరవేత వంటివాటిపై దృష్టిపెడుతున్నాయి.
- మరికొందరు తమ పాత కస్టమర్లతో వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసుకొని కొత్త వస్తువులు, ఉత్పత్తులకు సంబంధించిన అప్‌డేట్స్ పంపిస్తూ ఆఫర్లు, డిస్కౌంట్లు వంటివి అందుబాటులోకి తెస్తున్నారు.
- వాట్సాప్‌పైనే కస్టమర్లకు కావాల్సిన వస్తువుల ఆర్డర్లు స్వీకరించి వ్యాపారం కాపాడుకునే ప్రయత్నాల్లో కిరాణా షాప్ యాజమానులు నిమగ్నమయ్యారు.
- క్యూ-కామర్స్ ద్వారా అందించలేని కొత్త కొత్త ఉత్పత్తులు, విభిన్నరకాల వస్తువులు, ఫ్లేవర్లు అందించేందుకు, వీటికి సంబంధించిన సమాచారం కస్టమర్లకు చేరవేసి వారిని ఆకర్షించే ప్రయత్నాల్లో నిమగ్నమవుతున్నారు.

టుడేస్ గ్రాఫిక్



170 రైల్వే స్టేషన్లలో 468 కూలర్లు

చల్లని తాగునీటికి ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్: వేసవిని దృష్టిలో పెట్టుకుని రైల్వే ప్రయాణికుల కోసం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈసారి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని, వడగాడ్పుల ప్రభావం కూడా తీవ్రంగా ఉంటుందన్న హెచ్చరికల నేపథ్యంలో ప్రయాణికులకు చల్లటి తాగునీరు నిరంతరం అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తోంది. దక్షిణ మధ్య రైల్వే జోన్ వ్యాప్తంగా 170 స్టేషన్లలో 468 చల్లటి తాగునీటిని అందించే కూలర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. అంతకుముందు నుంచి ఉన్న తాగునీటి వ్యవస్థలో లోపాలు లేకుండా నిరంతరం పర్యవేక్షించేందుకు ఏర్పాట్లు చేసింది. సరఫరా చేస్తున్న నీటి నాణ్యతను పరిశీలించేందుకు కూడా బృందాలను నియమించింది.

ఎలాంటి మధ్యంతర స్టే ఇవ్వలేం

వానరసేన దాఖలు చేసిన పిటిషన్‌లో హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఈ-వేలంలో దక్కించుకున్న భూమిలో ఇకపై ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా ఆదేశాలు జారీ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌లో ఎలాంటి మధ్యంతర స్టే ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే తుది తీర్పు మేరకు చర్యలు ఉంటాయంటూ విచారణను వాయిదా వేసింది. 'షేక్‌పేట్ గ్రామం జూబ్లీహిల్స్ సర్వే నంబర్ 403 పరిధిలోని 4 ఎకరాల 18 గుంటల దేవాదాయ భూమిని ప్రభుత్వం నిర్వహించిన ఈ-వేలంలో దక్కన్ ఇన్‌ఫ్రా దక్కించుకుంది. 2013 మార్కెట్ విలువ ప్రకారం 2021లో ఈ-వేలం నిర్వహించారు. దీంతో దాదాపు రూ.260 కోట్ల వరకు ప్రజాధనానికి నష్టం వాటిల్లింది. రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఈ వేలాన్ని రద్దు చేయాలి. అక్కడ పలు కంపెనీలు చేపట్టిన నిర్మాణాలను కూల్చివేసి ఆ స్థలంలో హనుమాన్ ఆలయం నిర్మించాలి. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేయాలి' అని కోరుతూ రాష్ట్రీయ వానరసేన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం విచారణ చేపట్టింది.

బిల్లుల కోసం.. స్కూల్ గదులకు తాళం

పనులకు డబ్బులు రాకపోవడంతో కాంట్రాక్టర్ నిరసన


పాఠశాలకు తాళాలు వేయడంతో వరండాలో కూర్చున్న విద్యార్థులు

మర్పల్లి: 'మన ఊరు- మన బడి'కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ స్కూల్ గదులకు తాళం వేసి నిరసన తెలిపారు. వికారాబాద్ జిల్లా కొత్లాపూర్ ఉన్నత పాఠశాల్లో శనివారం ఈ ఘటన జరిగింది. స్కూల్‌లో సమస్యల పరిష్కారం కోసం గతేడాది ప్రభుత్వం రూ.4.5 లక్షలు మంజూరు చేసింది. అప్పటి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) చైర్మన్ పాపయ్య పాఠశాలకు కంప్యూటర్లు సమకూర్చడంతో పాటు భవనం పైకప్పు ఫ్లోరింగ్, కిటికీలు, తలుపులు, విద్యుత్ సరఫరా వంటి పనులు పూర్తి చేయించారు. అయితే ఏడాది గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో పలుమార్లు కలెక్టర్, డీఈఓలకు లిఖిత పూర్వకంగా వినతిపత్రాలు అందజేశారు. దీనిపై స్పందించిన అధికారులు బిల్లులు చేసి ట్రెజరీకి పంపించారు. కానీ ఇప్పటివరకూ తన ఖాతాలో నగదు జమ కాలేదని ఆగ్రహించిన పాపయ్య శనివారం గంటపాటు స్కూల్ గదులకు తాళం వేసి నిరసన వ్యక్తంచేశారు. ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి పాపయ్యతో మాట్లాడారు. విద్యార్థులకు ఆటంకం కలగకుండా చూడాలని నచ్చజెప్పడంతో పాపయ్య తాళాలు తీశారు.

మన్యంలో ఇటుకల పండుగ సందడి


హుకుంపేట ప్రాంతంలో విల్లంబులతో వేటకు వెళుతున్న గిరిజనులు

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఏజెన్సీలో ఇటుకల పండుగ సందడి మొదలైంది. ఉగాది పండుగ తర్వాత నుంచి నెలరోజుల పాటు గ్రామాల్లో ఈ పండుగ సందడి ఉంటుంది. దీనిలో భాగంగా హుకుంపేట ప్రాంతంలో గిరిజన సంప్రదాయ విల్లంబులతో గిరిజనులు శనివారం అడవి జంతువుల వేటకు వెళ్లారు. తీసుకువచ్చిన మాంసంతో విందు జరుపుకోనున్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.